సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15 సంచిక: 123
బుధవారం 18-1-2023



'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'


హైదరాబాద్‌లో 'ఒక రోజు'
నేడు భారత్, న్యూజిలాండ్ తొలి వన్డే.. జోరుమీదున్న టీమిండియా - 12లో



మార్కెట్ బౌన్స్‌బ్యాక్
సెన్సెక్స్ 563 పాయింట్లు.. నిఫ్టీ 158 పాయింట్లు అప్ - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


గొంతు కోసినా..
బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థలను నియంత్రిస్తున్నా యని.. తన గొంతు కోసినా సరే, ఆర్‌ఎస్‌ఎస్ ఆఫీస్‌లోకి అడుగు పెట్టనని రాహుల్ చెప్పారు.
వివరాలు 6లో ▸


అంతర్జాతీయ ఉగ్రవాదిగా మక్కీ
భారత్ ప్రతిపాదన మేరకు లష్కరే తోయిబా డిప్యూటీ చీఫ్ అబ్దుల్ రెహ్మాన్ మక్కీని అంత ర్జాతీయ ఉగ్రవాదిగా 'ఐరాస' ప్రకటించింది.
వివరాలు 6లో ▸


చైనా జీడీపీ 3 శాతమే!
చైనా ఆర్థిక వ్యవస్థపై కరోనా తీవ్ర ప్రభావం చూపించింది. దీంతో 2022లో చైనా జీడీపీ వృద్ధి 3 శాతంగా నమోదైంది.
వివరాలు 13లో ▸


గుణపాఠాలు నేర్చుకున్నాం
భారత్‌తో యుద్ధాల తర్వాత గుణపాఠాలు నేర్చుకున్నామని.. కశ్మీర్‌పై నిజాయతీతో చర్చ లకు సిద్ధమని పాక్ ప్రధాని షరీఫ్ అన్నారు.
వివరాలు 6లో ▸

ఏది నిజం?

పూర్తవుతుంటే ఎందుకంత కుళ్లు?

- తండ్రి జలయజ్ఞం ఫలాలను రైతులకు అందించే దిశగా సీఎం వైఎస్ జగన్ అడుగులు
- కోవిడ్ విజృంభణతో 2020, 2021లలో ప్రాజెక్టుల పనులపై తీవ్ర ప్రభావం
- ప్రపంచ దేశాలతోపాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపైనా ప్రతికూల ప్రభావం
- అయినా సరే ప్రాజెక్టుల పనులకు సీఎం అధిక ప్రాధాన్యం
- పెట్టే ప్రతి పైసా రైతుకు ప్రతి ఫలం అందించేలా ప్రాజెక్టులపై వ్యయం.. గత 44 నెలలుగా ప్రాజెక్టుల పనులకు రూ.23,289 కోట్ల వ్యయం
- 1,03,692 ఎకరాలకు కొత్తగా నీరు; 4,84,500 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ
- నెల్లూరు, సంగం బ్యారేజీలను జాతికి అంకితం చేసిన సీఎం
- ప్రారంభోత్సవానికి సిద్ధంగా అవుకు రెండో సొరంగం
- ఈ ఏడాదే వెలిగొండ తొలి దశ, వంశధార, వంశధార–నాగావళి లింక్ పూర్తి చేసేలా అడుగులు

4 లో

ధారాళంగా ఇంగ్లిష్

ప్రభుత్వ స్కూళ్లల్లో మెరుగవుతున్న చదువులు.. సత్ఫలితాలనిస్తున్న సంస్కరణలు

- గణితంలో ఇంకాస్త బెటర్‌మెంట్ అవసరం
- డిసెంబర్ ఎఫ్ఏ పరీక్షలపై విద్యాశాఖ విశ్లేషణ
- ఎక్కువ మంది విద్యార్థులు ఏ, బీ+, బీ గ్రేడుల్లో
- టెన్త్ లెక్కల్లో ఏ+ విద్యార్థులు 10 శాతం పైనే
- ఐదు జిల్లాలపై ప్రత్యేక ధ్యాస అవసరం
- మూడున్నరేళ్లలో విద్యారంగంపై రూ.54,910.88 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: మూడున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విద్యారంగ సంస్కరణలు, ప్రోత్సాహ కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు, ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. ఆంగ్ల మాధ్యమం బోధనతో ఇంగ్లిష్‌లో విద్యార్థులు బాగా రాణిస్తున్నట్లు గణాంకాల సాక్షిగా వెల్లడైంది. పునాది స్థాయి నుంచి నాణ్యమైన బోధన ద్వారా విద్యార్థులను అత్యున్నతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫౌండేషనల్ విద్యను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కార్పొరేట్ విద్యాసంస్థలతో పోటీపడేలా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఆంగ్ల మాధ్యమాన్ని తీసుకొచ్చారు. మనబడి నాడు – నేడు ద్వారా చక్కటి వసతులతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పారు. తల్లిదండ్రులకు చదువులు భారం కాకుండా జగనన్న విద్యాకానుక ద్వారా ఆదుకుంటున్నారు. గోరుముద్ద ద్వారా రుచికరమైన, పౌష్టికాహారాన్ని అందజేస్తూ పిల్లల ఆరోగ్యానికి కూడా అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. చిక్కీలు, గుడ్లు లాంటి బలవర్థకమైన ఆహారాన్ని సమకూరుస్తున్నారు. కరోనా కారణంగా దాదాపు రెండేళ్లపాటు బడులు మూతబడ్డ సమయంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆన్‌లైన్, ఇతర మార్గాల ద్వారా

మిగతా 2వ పేజీలో ▶

బాల్య విద్యకు బలమైన పునాది

- సత్ఫలితాలు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సంస్కరణలు
- కేంద్ర ప్రభుత్వ తాజా పీజీఐలో లెవల్–2 స్థాయికి చేరిన ఏపీ

- వివరాలు 2లో

నడ్డాకు పొడిగింపు



జేపీ నడ్డా సారథ్యంలోనే లోక్‌సభ ఎన్నికలకు వెళ్లాలని బీజేపీ నిశ్చయించింది. పార్టీ అధ్యక్షుడిగా ఆయన పదవీకాలాన్ని 2024 జూన్ దాకా కొనసాగిస్తూ జాతీయ కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. నడ్డా నేతృత్వంలో చాలా రాష్ట్రాల్లో విజయం సాధించినట్లుగానే.. 2024లో కూడా మంచి మెజార్టీతో గెలుస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ధీమా వ్యక్తం చేశారు.

మోదీ శంఖారావం

- ఎన్నికలకు మరో 400 రోజులే
- టాప్ గేర్‌లోకి వెళ్లాల్సిన టైమొచ్చింది
- బీజేపీ శ్రేణులకు ప్రధాని మోదీ పిలుపు

6 లో

ఇతర రాష్ట్రాల్లోనూ పశు వైద్య రథాలు

ఆంధ్రప్రదేశ్ స్ఫూర్తితో జార్ఖండ్‌లోనూ అంబులెన్సుల సేవలు

- నెలాఖరులో ఛత్తీస్‌గఢ్‌లో ప్రారంభం
- పంజాబ్‌లో త్వరలో టెండర్లు.. అదేబాటలో మధ్యప్రదేశ్
- మూగ జీవాలకు ఇంటి వద్దే అత్యాధునిక వైద్య సేవలు
- ఏపీలో తొలి విడతగా 175 అంబులెన్సుల ఏర్పాటు.. ఈ నెలాఖరులో మరో 165 అందుబాటులోకి..

2 లో


ఛత్తీస్‌గఢ్‌లోని మొబైల్ అంబులేటరీ క్లినిక్

బీఆర్‌ఎస్ 'ప్రత్యామ్నాయ' సందేశం!

- ఖమ్మం సభ నుంచే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల సమర శంఖం
- జాతీయ రాజకీయాల దృష్టిని ఆకర్షించేలా వ్యూహం
- నలుగురు బీజేపీ వ్యతిరేక ముఖ్యమంత్రులు నేడు ఒకే వేదికపైకి
- హాజరుకానున్న ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్, కమ్యూనిస్టు పార్టీల జాతీయ నేతలు
- చేరికలు, విలీనాలపైనా ప్రకటనలు చేసే అవకాశం

10 లో


ఖమ్మంలోని బీఆర్‌ఎస్ సభ వేదిక

దావోస్‌కు వెళ్లకపోవటమూ తప్పేనా?

- ఆహ్వానం అందలేదంటూ పచ్చ మీడియా దుష్ప్రచారం
- దావోస్ సదస్సుకు ఆహ్వానిస్తూ నవంబర్ 25నే ముఖ్యమంత్రికి లేఖ
- ఇటీవలే వెళ్లి రావటం.. మార్చిలో విశాఖ సదస్సు నేపథ్యంలో వద్దనుకున్న సీఎం
- దీంతో వైఎస్ జగన్‌ను ఆహ్వానించనే లేదంటూ.. అదో ఘోరంలా ఎల్లో దుష్ప్రచారం

2 లో

'స్మార్ట్' ఉచ్చులో కౌమారం

- ఫోన్‌కు అతుక్కుపోతున్న బాలబాలికలు
- 13–17 ఏళ్ల వారిలో 28 శాతం మంది రోజుకు 6 గంటలకు పైగా ఫోన్‌లోనే
- అతివినియోగంతో దుష్ప్రభావాలు.. ఓ స్వచ్ఛంద సంస్థ సర్వేలో బహిర్గతం

5 లో

అదిగో 'కూర్మం'.. ప్రకృతితో మమేకం

- వివరాలు 10లో

క్లుప్తంగా...

20 వరకు రేషన్ పంపిణీ పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పీడీఎస్ ద్వారా బియ్యం పంపిణీని ఈ నెల 20వ తేదీ వరకు పొడిగిస్తున్నట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 85 శాతం పంపిణీ చేయగా, పండుగల దృష్ట్యా ప్రజలకు మరో మూడు రోజుల పాటు బియ్యంతోపాటు ఇతర సరుకులను తీసుకునే వెసులుబాటు కల్పించామని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఏడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు పీడీఎస్ బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నాయని తెలిపారు.

జ్యుడిషియల్ ప్రివ్యూకి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల టెండర్లు

సాక్షి, అమరావతి: వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు శ్రీకారం చుట్టింది. రూ.120.81 కోట్లతో పులివెందులలో అరటి, ఇతర పండ్ల ప్రాసెసింగ్ యూనిట్, రూ.294.92 కోట్లతో రాజంపేటలో ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ ప్రాసెసింగ్ యూనిట్, రూ.308.35 కోట్లతో సత్తెనపల్లిలో ఇంటిగ్రేటెడ్ స్పైసెస్ ప్రాసెసింగ్ యూనిట్, రూ.165.32 కోట్లతో మెట్టుపల్లెలో టమాటా ప్రాసెసింగ్ యూనిట్లను నిర్మించనుంది. ఇందుకు సంబంధించిన టెండర్లను పారదర్శకత కోసం మంగళవారం జ్యుడిషియల్ ప్రివ్యూకి ప్రభుత్వం పంపింది. రాష్ట్రంలో ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా సెకండరీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం విదితమే. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 2020–25అమలులో భాగంగా ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీని నోడల్ ఏజెన్సీగా నియమించింది. ఇది రాష్ట్రంలో ప్రాసెసింగ్ యూనిట్లు, ఫ్యాక్టరీలను నెలకొల్పేలా చర్యలు చేపట్టి రైతులకు కనీస మద్దతు ధర అందించేలా పని చేయనుంది.

రాష్ట్ర విద్యార్థులకు ఫౌండేషనల్ విద్య నుంచే బలమైన పునాదులు వేసేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ) 2020-21లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ స్కోర్ పాయింట్లను సాధించి లెవల్-2 స్థాయిని దక్కించుకుంది. లెర్నింగ్ అవుట్‌కమ్స్, నాణ్యత, యాక్సెస్, మౌలిక వసతులు, ఈక్విటీ, పరిపాలన, నిర్వహణ అంశాల్లో ఈ ప్రగతిని సాధించింది.

బాల్య విద్యకు బలమైన పునాది!



- సత్ఫలితాలు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సంస్కరణలు
- కేంద్ర ప్రభుత్వ తాజా పీజీఐలో లెవల్–2 స్థాయికి చేరిన రాష్ట్రం
- 3వ తరగతిలో లాంగ్వేజ్, మ్యాథ్స్‌ల్లో 20కి 20 స్కోర్
- 5వ తరగతిలో 20కి 18 సాధించిన విద్యార్థులు
- ఫౌండేషనల్ విద్యపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్లే ఈ ఫలితాలు
- మౌలిక సదుపాయాల కల్పనలో గణనీయ ప్రగతి
- పాలన, నిర్వహణ అంశాల్లోనూ 100 శాతం పురోగతి

పిల్లల్లో 3 నుంచి 6 ఏళ్లలోపు మెదడు అభివృద్ధి చెందుతుందని.. ఈ సమయంలో వారికి సరైన ఫౌండేషనల్ విద్యను అందించాల్సిన అవసరముందని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఫౌండేషనల్ విద్యకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇదే అంశాన్ని తర్వాత కేంద్ర ప్రభుత్వం కూడా నూతన విద్యావిధానంలో చేర్చింది. అంగన్‌వాడీ కేంద్రాలను సమీపంలోని పాఠశాలలతో అనుసంధానిస్తూ అక్కడి పిల్లలకు ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో ప్రత్యేక సిలబస్‌తో.. ఆకర్షణీయమైన చిత్రాలతో పుస్తకాలను కూడా తెచ్చింది. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని సైతం అందిస్తోంది. వీటన్నిటి ఫలితంగా విద్యార్థుల్లో అక్షర, అంకెల పరిజ్ఞానం, అభ్యసన సామర్థ్యాలు క్రమేణా మెరుగుపడుతున్నాయి. దీంతో గత ప్రభుత్వాల హయాంలో పీజీఐ ర్యాంకింగ్స్‌లో వెనుకంజలో ఉన్న రాష్ట్రం ఇప్పుడు లెవల్–2 స్థాయిని దక్కించుకుంది.

- సాక్షి, అమరావతి

ఫౌండేషనల్ విద్య బలోపేతంతోనే..

ముఖ్యంగా ఫౌండేషనల్ విద్య బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతోనే కింది స్థాయి తరగతుల్లో విద్యార్థులు మెరుగైన సామర్థ్యాలను అందిపుచ్చుకోగలుగుతున్నారని పీజీఐ నివేదిక స్పష్టం చేస్తోంది. పీజీఐ ప్రామాణికాల్లో మొదటి అంశమైన 'అవుట్‌కమ్స్, క్వాలిటీ'ల్లో ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లలోని 3వ తరగతి విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు మెరుగుపడ్డాయి. దీంతో ఆ కేటగిరీలో 20కి 20పాయింట్ల స్కోర్‌ను ఏపీ సాధించింది. అలాగే 3వ తరగతి మ్యాథ్స్‌లో కూడా 20కి 20 పాయింట్లు వచ్చాయి. 5వ తరగతిలోనూ భాష, మ్యాథ్స్‌ల్లో 20కి 18 పాయింట్లు దక్కాయి. 8వ తరగతిలో భాషలో 20కి 16, మ్యాథ్స్, సైన్స్, సోషల్ స్టడీస్‌ల్లో 14 చొప్పున పాయింట్లు వచ్చాయి.

పురోగతికి సాక్ష్యంగా పీజీఐ స్కోర్



పీజీఐకి ప్రామాణికంగా తీసుకొనే వివిధ అంశాల్లో ఏపీ గతంలో కంటే మెరుగైన అభివృద్ధిని సాధించింది. ఆయా అంశాల్లో రాష్ట్రం సాధించిన స్కోర్ పాయింట్లే ఇందుకు నిదర్శనం. ఆయా అంశాల్లో గరిష్ట పాయింట్ల వారీగా స్కోర్ చూస్తే లెర్నింగ్ అవుట్‌కమ్స్, నాణ్యతల్లో 180కి 154, యాక్సెస్‌లో 80కి గాను 77, మౌలిక వసతుల కల్పనలో 150కి 127, ఈక్విటీలో 230కి 210, పాలన, నిర్వహణల్లో 360కి 334 పాయింట్లను ఏపీ సాధించింది.

'యాక్సెస్'లోనూ మెరుగైన పాయింట్లు



ఇక రెండో ప్రామాణికమైన 'యాక్సెస్'కు సంబంధించి రిటెన్షన్ రేట్ (ఒక స్కూల్‌లో చేరిన విద్యార్థులు అక్కడ చివరి తరగతి వరకు కొనసాగడం)లో ఎలిమెంటరీ, ప్రైమరీ విభాగాల్లో 10కి 10, సెకండరీలో 10కి 9 స్కోర్ పాయింట్లను ఏపీ సాధించింది. అలాగే విద్యార్థులు డ్రాపవుట్ కాకుండా ఒక తరగతి నుంచి పై తరగతుల్లోకి వెళ్లడంలో ప్రైమరీ నుంచి అప్పర్ ప్రైమరీ విభాగంలో 10కి 10, అప్పర్ ప్రైమరీ నుంచి సెకండరీ విభాగంలో 10కి 10 పాయింట్లను దక్కించుకుంది. అలాగే 1–8 తరగతులకు సంబంధించి బడిబయట ఉన్న విద్యార్థులను గుర్తించి వారిని తిరిగి బడిలో చేర్పించే అంశంలో కూడా 10కి 10 పాయింట్లు సాధించింది.

మౌలిక సదుపాయాల్లోనూ ప్రగతి



మౌలిక సదుపాయాల విభాగంలో 12 అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. రాష్ట్రంలో నాడు–నేడు తొలిదశ కింద 15,715 స్కూళ్లను రూ.3,600 కోట్లతో అభివృద్ధి చేశారు. రెండో విడత కింద మిగిలిన స్కూళ్లలో పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద అందిస్తున్న సంగతి తెలిసిందే. మధ్యాహ్న భోజన పథకం అమలులో ఏపీ 10కి 10 పాయింట్లు సాధించింది. విద్యార్థులకు యూనిఫామ్ అందించడం, పాఠ్యపుస్తకాల సరఫరా, మంచినీటి సదుపాయం కల్పనలో 10కి 9 పాయింట్లను దక్కించుకుంది. సప్లిమెంటరీ మెటీరియల్‌ను సమకూర్చడంలో 20కి 20 పాయింట్లు, 11, 12 తరగతులకు వొకేషనల్ విద్య అందించడంలో 10కి 10 పాయింట్లు సాధించింది. పరిపాలన, నిర్వహణకు సంబంధించిన 32 అంశాల్లో కూడా అత్యధికమైన వాటిలో పూర్తి స్థాయి స్కోర్ పాయింట్లను రాష్ట్రం దక్కించుకుంది.

రేపటి నుంచి సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

- 19, 20, 21, 23, 24 తేదీల్లో ఐదు రోజులు నిర్వహణ
- ఫిబ్రవరిలో 7 నుంచి 10 వరకు మరో విడత
- రాష్ట్రంలో అప్‌డేట్ చేసుకోని వారు 80 లక్షల మంది..ప్రత్యేక క్యాంపులతో అప్‌డేట్‌కు చర్యలు

సాక్షి, అమరావతి: ఆధార్‌లో బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల్లో గురువారం నుంచి ఐదు రోజులపాటు ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించనుంది. ఈ నెల 19, 20, 21, 23, 24 తేదీల్లో ఆయా సచివాలయాలు, వాటి పరిధిలోని పాఠశాలల్లో ఈ క్యాంపులు నిర్వహిస్తారు. ఫిబ్రవరిలో 7 నుంచి 10 వ తేదీ వరకు నాలుగు రోజులపాటు మరోసారి ఈ క్యాంపులు నిర్వహిస్తారు. ఈ మేరకు గ్రామ వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ సాగిలి షన్‌మోహన్ మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, గ్రామ వార్డు సచివాలయాల శాఖ జిల్లాల ఇన్‌చార్జి అధికారులు, జిల్లాల విద్యా శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలందరూ ఈ క్యాంపుల ద్వారా ఆధార్ సేవలు పొందేలా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌లు తగిన ప్రచారం చేయాలని పేర్కొన్నారు. ప్రత్యేక క్యాంపుల రోజుల్లో సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లు పూర్తిగా ఆధార్ సేవల పైనే దృష్టి పెడతారు. ఆధార్ కార్డుల జారీ సంస్థ యూఐడీఏఐ ఇటీవల కొత్తగా తీసుకొచ్చిన నిబంధనల ప్రకారం పదేళ్లలో కనీసం ఒకసారి బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలి. ఇలా అప్‌డేట్ చేసుకోని వారు రాష్ట్రంలో ఇంకా 80 లక్షల మంది వరకు ఉన్నట్లు అధికారుల అంచనా. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఆధార్ అనుసంధానంతో అమలు చేస్తున్నారు. నవరత్నాలు పేరిట రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దాదాపు 35 సంక్షేమ పథకాలకూ ఆధార్ అనుసంధానంతో కూడిన బయోమెట్రిక్ విధానాన్ని అనుసరిస్తోంది. పారదర్శకత కోసం ప్రభుత్వ లబ్ధిని అందజేసే ముందు, అందజేసిన తర్వాత కూడా లబ్ధిదారుల నుంచి వలంటీర్లు బయోమెట్రిక్ తీసుకొంటున్నారు. బయోమెట్రిక్ వివరాల్లో ఇబ్బందులు రాకుండా ప్రత్యేక క్యాంపుల ద్వారా రాష్ట్ర ప్రజలందరి ఆధార్ బయోమెట్రిక్ వివరాలు అప్‌డేట్ చేస్తోంది.

దావోస్‌కు వెళ్లకపోవటమూ తప్పేనా?


Telugu Desam Party @JaiTDP · 58m
పెట్టుబడిదారులను ఆహ్వానించి, మన రాష్ట్రానికి ప్రఖ్యాత పరిశ్రమలను తీసుకొని వస్తే యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కానీ జగన్ రెడ్డి మొహం చూసి రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. (1/2)
దావోస్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు ఈ ఏడాది అందని ఆహ్వానం



ఏపీకి దావోస్ సదస్సుకు ఆహ్వానం రాలేదంటూ టీడీపీ సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారం


WORLD ECONOMIC FORUM

Børge Brende
President

The Hon. Y S Jagan Mohan Reddy
Chief Minister of Andhra Pradesh
Government of Andhra Pradesh
Secretariat Building
Velagapudi, 500022
India

25 November 2022
sgut/pso

Dear Chief Minister,

It is my honour to invite you to the World Economic Forum Annual Meeting 2023, which will take place in Davos-Klosters, Switzerland, from 16 to 20 January.

The Annual Meeting gathers top decision-makers in politics, business and civil society to work together to address the key issues on the global agenda and set the necessary priorities.

The multitude of present and possible future crises make the Annual Meeting 2023 particularly relevant.

Your focus on the equitable socio-economic development of the state and especially initiatives for the development of the less privileged is noteworthy. Participants at the Annual meeting would be keen to hear more about your priorities for the development of Andhra Pradesh.

The Forum will work closely with your office to ensure that your participation is of the greatest relevance to you and to Andhra Pradesh.

I truly look forward to engaging you in this effort and to welcoming you in Davos.

Yours sincerely,

దావోస్‌లో సదస్సుకు హాజరుకావాలని సీఎం వైఎస్ జగన్‌కు వరల్డ్ ఎకానమిక్ ఫోరం అధ్యక్షుడు బోర్గే బ్రెండే పంపిన లేఖ



సాక్షి, అమరావతి: దావోస్‌లో ఈ నెల 16న మొదలై... 20వ తేదీ వరకు జరగనున్న 'వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ 2023–వార్షిక సదస్సు'లో పాల్గొనాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఆహ్వానం అందలేదంటూ తెలుగుదేశం పార్టీ, దాని మిత్ర మీడియా చేస్తున్న ప్రచారం పచ్చి అబద్ధమని తేలిపోయింది. ఎందుకంటే ఈ సమ్మిట్‌లో పాల్గొనాలంటూ వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ అధ్యక్షుడు బోర్గే బ్రెండే స్వయంగా పంపిన లేఖను ముఖ్యమంత్రి కార్యాలయం మంగళవారం విడుదల చేసింది. పైపెచ్చు ఈ లేఖ సీఎం వైఎస్ జగన్ కార్యాలయానికి గత ఏడాది నవంబర్ 25నే అందింది. అయితే 6 నెలల కిందటే దావోస్ సదస్సుకు హాజరై ఉండటం... మరోవైపు నెలన్నర రోజుల్లో (మార్చి మొదటి వారంలో) విశాఖలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సుపై ఫోకస్ పెట్టడం వంటి కారణాల వల్ల ఈసారి దావోస్‌కు హాజరు కాకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ వాస్తవాలు సామాన్యులకు తెలియవనే ఉద్దేశంతో... గడిచిన పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని దావోస్‌కు పిలవకపోవటం ఇదే తొలిసారంటూ తెలుగుదేశం భారీ ఎత్తున దుష్ప్రచారానికి దిగింది. కాకపోతే ఇవేమీ... 'ఈనాడు' ఇతర ఎల్లో మీడియా చెప్పకపోతే జనానికి వాస్తవాలు తెలియని రోజులు కావు. అందుకే ఎల్లో ముఠా దుష్ప్రచారం ఆరంభమైన వెంటనే... దానికి ప్రతిస్పందనలు కూడా మొదలయ్యాయి. నిజానికి ఒకవేళ జగన్‌మోహన్ రెడ్డి కనక ఈసారి సదస్సుకు హాజరై ఉంటే... 'మొన్ననే 6 నెలల కిందటే కదా దావోస్‌కు వెళ్లింది. మళ్లీ ఇంతలోనే ఏం పెట్టుబడులు తెచ్చేస్తారు?' అనే రీతిలో కూడా తెలుగుదేశం, ఎల్లో మీడియా దుష్ప్రచారం మొదలెట్టేసేవంటూ వైఎస్సార్‌సీపీ వర్గాలు నవ్వుకోవటం విశేషం.

దావోస్ సదస్సుపై టీడీపీది దుష్ప్రచారం

- సదస్సుకు హాజరు కావాలని నవంబర్ 25నే ఆహ్వానం అందింది
- విశాఖలో పెట్టుబడుల సదస్సు ఏర్పాట్లు ఉండటం వల్లే వెళ్లలేకపోయాం
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మహారాణిపేట (విశాఖ దక్షిణ): దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆహ్వానం అందలేదంటూ టీడీపీ చేస్తున్న ప్రచారాన్ని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తీవ్రంగా ఖండించారు. టీడీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. విశాఖపట్నంలోని ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. దావోస్ సదస్సులో పాల్గొనాలంటూ నవంబర్ 25నే సీఎం వైఎస్ జగన్‌కు ఆహ్వానం అందిందన్నారు. దీనికి సంబంధించిన లేఖ ప్రతిని మంత్రి మీడియా ముందుంచారు. గతేడాది దావోస్ సదస్సుకు హాజరైన సీఎం జగన్ రాష్ట్రంలో వైద్య రంగంలో తెస్తున్న సంస్కరణల గురించి ప్రపంచ దేశాలకు తెలిసేలా చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి, గ్రీన్ ఎనర్జీ గురించి వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో సీఎం వివరించిన తీరుకు ప్రపంచ దేశాల పారిశ్రామికవేత్తలు ముగ్ధులయ్యారని చెప్పారు. మార్చిలో విశాఖలో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సుకు ప్రపంచంలోని పారిశ్రామిక దిగ్గజాలను ఆహ్వానించాలన్న కృతనిశ్చయంతో సీఎం వైఎస్ జగన్ ఉన్నారన్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉండటంతోనే దావోస్ వెళ్లలేదని స్పష్టం చేశారు.

చంద్రబాబు మ్యాటర్ వీక్.. పబ్లిసిటీ పీక్స్..

దావోస్ వెళ్లి తాను చాలా ఘనత సాధించానని చెప్పుకుంటున్న చంద్రబాబును ఆ సదస్సులో మాట్లాడమని నిర్వాహకులు ఎప్పుడైనా ఆహ్వానించారా అని అమర్‌నాథ్ ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఐటీ రంగంలో సంస్కరణలు తెచ్చింది రాజీవ్‌గాంధీ అని చెప్పారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీకి ఎన్.జనార్దన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో శంకుస్థాపన జరిగిందని గుర్తుచేశారు. ఇవన్నీ మర్చిపోయిన బాబు కంప్యూటర్‌ను తానే కనిపెట్టానని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబుకు మ్యాటర్ వీక్.. పబ్లిసిటీ పీక్స్ అంటూ ఎద్దేవా చేశారు.

ధారాళంగా ఇంగ్లిష్

▶ మొదటి పేజీ తరువాయి

పాఠాలను బోధించేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలతో చదువులు గాడిన పడ్డాయి.

ఫార్మేటివ్ అసెస్‌మెంట్‌తో..

గత ఏడాది డిసెంబర్‌లో ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఇంగ్లిష్, మేథమెటిక్స్‌లో 5, 8, 10 తరగతుల విద్యార్థుల పరిజ్ఞానాన్ని పాఠశాల విద్యాశాఖ విశ్లేషించింది. ఇంగ్లిష్ సబ్జెక్టులో మూడు తరగతుల్లోనూ విద్యార్థులు మంచి పురోగతిలో ఉన్నారు. గణితంలో 8, 9 తరగతుల్లో ఒకింత వెనుకబాటు ఉంది. ఎక్కువ మంది విద్యార్థులు ఏ, బీ+, బీ గ్రేడుల్లో నిలిచారు. 8, 10వ తరగతుల్లో లెక్కల్లో 'సీ' గ్రేడు విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. పదో తరగతి గణితంలో 10 శాతం మందికిపైగా విద్యార్థులు ఏ+ గ్రేడులో నిలిచారు. పల్నాడు, గుంటూరు జిల్లాలు మరింత మెరుగుపడాల్సి ఉంది. ఐదో తరగతి ఇంగ్లిష్‌లో 'సి' గ్రేడ్ మినహాయించి ఇతర గ్రేడ్లు సాధించిన వారు 76.16 శాతం మంది ఉండగా 8వ తరగతిలో 73.54 శాతం, 10వ తరగతిలో 79.56 శాతం మంది విద్యార్థులున్నారు. ఇక 5వ తరగతి గణితంలో 'సీ' కాకుండా ఇతర గ్రేడ్లను 84.24 శాతం మంది సాధించారు.

ఇంగ్లిష్‌లో తరగతుల వారీగా గ్రేడ్లు, విద్యార్థుల శాతం

గ్రేడు	5వ తరగతి	8వ తరగతి	10వ తరగతి
ఏ+	2.17	1.58	6.69
ఏ	21.81	21.04	29.99
బీ+	36.65	36.03	30.51
బీ	15.53	14.89	12.37
సీ	23.84	26.46	20.44

గణితంలో తరగతుల వారీగా గ్రేడ్లు, విద్యార్థుల శాతం

గ్రేడు	5వ తరగతి	8వ తరగతి	10వ తరగతి
ఏ+	8.95	0.98	10.87
ఏ	35.10	11.37	23.79
బీ+	30.11	28.81	21.79
బీ	10.08	15.82	11.31
సీ	15.76	43.02	32.24

సామర్థ్యాల మదింపు, స్లిప్ టెస్ట్..

50 మార్కులకు నిర్వహించిన ఈ పరీక్షల్లో 30 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రకారం కేటాయిస్తారు. మిగిలిన 20 మార్కులకు స్లిప్ టెస్ట్ నిర్వహించారు. గతంలో దీన్ని ఉపాధ్యాయులే నిర్వహించగా ఈదఫా పాఠశాల విద్యాశాఖ ఎస్సీఈఆర్టీ ద్వారా 20 మార్కులకు ప్రశ్నపత్రాన్ని రూపొందించి ఆయా స్కూళ్లకు పంపిణీ చేసింది. స్లిప్ టెస్టు మార్కుల ఆధారంగా విద్యార్థుల ప్రగతిని విశ్లేషించారు. 19–20 మార్కుల పరిధిని ఏ+ గ్రేడ్‌గా వర్గీకరించారు. 15–18 మార్కుల పరిధిని ఏ గ్రేడ్‌గా, 11–14 మార్కుల పరిధిని బీ+ గ్రేడ్‌గా, 9–10 మార్కుల పరిధిని బీ గ్రేడ్‌గా, 9 కన్నా తక్కువ మార్కులను సీ గ్రేడ్‌గా పరిగణించారు.

లెక్కలంటే భయం పోగొట్టేలా..



ప్రాథమిక పాఠశాలల నుంచి ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం వల్ల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరింది. సీఎం జగన్ నిర్ణయంతో ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులందరికీ ఆంగ్ల మాధ్యమం అందుబాటులోకి రావడమే కాకుండా నైపుణ్యాలను అందిపుచ్చుకుంటున్నారు. డిసెంబర్‌లో జరిగిన ఫార్మేటివ్ పరీక్షల్లో ఆంగ్లం సబ్జెక్టులో గతంలో కన్నా మెరుగైన ఫలితాలు సాధించడమే ఇందుకు తార్కాణం. గణితమంటే భయాన్ని పోగొట్టి మెరుగైన ఫలితాలు సాధించేందుకు పూర్వ ప్రాథమిక స్థాయి నుంచి న్యూమరసీని పెంపొందించాలి. ఇందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్లలో పూర్వ ప్రాథమిక విద్యకు శ్రీకారం చుట్టారు. గణితం బోధనను నిత్య జీవితానికి అనుసంధానించడం ద్వారా విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టవచ్చు. 8వ తరగతి విద్యార్థులకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (లిప్) పకడ్బందీగా అమలు చేయాలి. బైజూస్ విజువల్ కంటెంట్ సులభంగా గణిత సమస్యల అవగాహనకు తోడ్పడుతుంది. విద్యార్థులకు అందించే ఫ్లాష్ కార్డ్స్, ప్రాక్టీస్ టెస్టుల ద్వారా గణితంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు.

– మడితాటి నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, జిల్లా పరిషత్ హైస్కూలు, సంబేపల్లి, అన్నమయ్య జిల్లా

విద్యారంగ సంస్కరణలకు మూడున్నరేళ్లలో వ్యయం ఇలా

పథకం పేరు	లబ్ధి	అందించిన మొత్తం (రూ. కోట్లలో)
జగనన్న అమ్మ ఒడి	44,48,865	19,617.53
జగనన్న విద్యా దీవెన	24,74,544	9,051.57
జగనన్న వసతి దీవెన	18,77,863	3,349.57
జగనన్న విద్యా కానుక	47,32,065	2,368.33
8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు	5,18,740	688.00
జగనన్న గోరు ముద్ద	43,26,782	3,239.43
ఫేజ్ 1 'నాడు నేడు'	15,634 స్కూళ్లు	3,669.00
ఫేజ్ 2 'నాడు నేడు'	22344 స్కూళ్లు	8,000.00
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	34,19,875	4,895.45
స్వేచ్ఛ (శానిటరీ నాప్‌కిన్స్)	10,01,860	32.00
మొత్తం	--	54,910.88

ఇవి కాకుండా 17 మెడికల్ కాలేజీలు, ఒక ఫిషరీస్ యూనివర్సిటీ, ఒక ట్రైబల్ ఇంజనీరింగ్ కాలేజీకి చేస్తున్న వ్యయం అదనం

మూడున్నరేళ్లలో రూ.54,910.88 కోట్లు

గతంలో ఏ ప్రభుత్వమూ చేయని రీతిలో విద్యారంగం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూడున్నరేళ్లలో రూ.54,910.88 కోట్లు ఖర్చు చేసింది. జగనన్న అమ్మ ఒడి, విద్యాకానుక, మనబడి నాడు–నేడు, గోరుముద్ద, 4–10వ తరగతి చదివే 32 లక్షల మంది విద్యార్థులకు బైజూస్ పాఠ్యాంశాలు, 8వ తరగతి విద్యార్థులు, టీచర్లకు ఉచితంగా ట్యాబ్‌లు, ఇంగ్లిష్ మాధ్యమం, సీబీఎస్ఈ విధానం లాంటి కార్యక్రమాలను చేపట్టింది. డిజిటల్ విధానంలో పాఠ్యాంశాలు మరింత సులభంగా అర్థమయ్యేలా విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లు ప్రయోజనకరంగా మారాయి. ఇంటిదగ్గర ఆఫ్‌లైన్‌లో విద్యార్థులు పాఠాలు చదువుకొనేందుకు మార్గం సుగమమైంది.

ఐదు జిల్లాలు ఇంకాస్త మెరుగుపడాలి..

టెస్ట్ విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి ఇంగ్లిష్‌లో మెరుగు పడాల్సిన ఐదు జిల్లాల్లో పల్నాడు, అల్లూరి, ఏలూరు, అనంతపురం, బాపట్ల ఉన్నాయి. గణితంలో పల్నాడు, గుంటూరు, కాకినాడ, ఏలూరు, అనంతపురం జిల్లాలు వెనుక వరుసలో నిలిచాయి. 8వ తరగతి ఇంగ్లిష్‌లో పల్నాడు, అల్లూరి, గుంటూరు, కర్నూలు, ఎన్టీఆర్ జిల్లాలు, గణితంలో గుంటూరు, పల్నాడు, కాకినాడ, విశాఖపట్నం, బాపట్ల జిల్లాలు వెనుకబడ్డాయి. 5వ తరగతి ఇంగ్లిష్‌లో అల్లూరి, పల్నాడు, కర్నూలు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు మెరుగు పడాల్సి ఉంది.

ఇతర రాష్ట్రాల్లోనూ పశు వైద్యరథాలు

సాక్షి, అమరావతి: మూగ జీవాల ఆరోగ్య సంరక్షణకు సైతం అత్యంత ప్రాధాన్యమిస్తూ 108 అంబులెన్స్‌ల తరహాలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'మొబైల్ అంబులేటరీ క్లినిక్స్' ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. జార్ఖండ్‌లో ఇప్పటికే వీటిని అందుబాటులోకి తీసుకురాగా, ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెలాఖరు నాటికి సేవలందించనున్నాయి. పంజాబ్‌లో టెండర్లు పిలవగా మధ్యప్రదేశ్ ప్రభుత్వం కూడా అదే బాటలో అడుగులు వేస్తోంది.

వాహనాల్లో అత్యాధునిక సౌకర్యాలు

దేశంలోనే తొలిసారిగా రైతుల ముంగిటకు వెళ్లి మూగ జీవాలకు వైద్య సేవలందించే సంకల్పంతో నియోజకవర్గానికి ఒకటి చొప్పున తొలి విడతలో 175 వైఎస్సార్ సంచార పశు వైద్యసేవా రథాలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. అంబులెన్స్‌ల తయారీతో పాటు రెండేళ్ల పాటు నిర్వహణ కోసం రూ.133.13 కోట్లు ఖర్చు చేస్తోంది. గతేడాది మే 19న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీటి సేవలను ప్రారంభించి టోల్ ఫ్రీ నంబర్ 1962తో అనుసంధానించారు. ప్రత్యేకంగా రూ.7 కోట్లతో కాల్ సెంటర్ నెలకొల్పారు. మూగ జీవాలకు ప్రాథమిక వైద్య సేవలతో పాటు సన్నజీవాలు, పెంపుడు జంతువులు, పెరటి కోళ్లు, పక్షులకు చిన్నపాటి సర్జరీలు అక్కడే నిర్వహించేలా తీర్చిదిద్దారు. అంబులెన్స్‌లో మినీ ల్యాబ్ ఏర్పాటు చేశారు. వెయ్యి కిలోల బరువున్న జీవాలను సునాయాసంగా తరలించేందుకు వీలుగా హైడ్రాలిక్ జాక్ లిఫ్ట్ సౌకర్యం కల్పించారు. అన్ని రకాల వ్యాక్సిన్లు, మందులు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతి వాహనానికి డ్రైవర్ కమ్ అటెండర్‌తో పాటు ల్యాబ్ టెక్నీషియన్ కమ్ కాంపౌండర్, ఒక వైద్యుడిని నియమించారు.



ఏపీ తరహాలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం డిజైన్ చేసిన మొబైల్ అంబులేటరీ క్లినిక్ వాహనాలు

1.72 లక్షల మూగ జీవాలకు సేవలు

ఫోన్ కాల్ వచ్చిన అరగంటలోపే మూగ జీవాలకు వైద్యసేవలు అందిస్తూ అవసరమైన మందులను ఉచితంగా ఇస్తున్నారు. ఇప్పటివరకు 3.52లక్షల ఫోన్‌కాల్స్ రాగా, వాహనాలు 1.20లక్షల ట్రిప్పులు తిరిగాయి. 2,127 ఆర్బీకేల పరిధిలో 1.72లక్షల మూగ, సన్నజీవాలకు గత 8 నెలలుగా సేవలందిస్తున్నాయి. రెండో విడతలో రూ.119.18 కోట్లతో మరో 165 అంబులెన్స్‌లను ఈ నెలాఖరుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

సర్వత్రా ప్రశంసలు

అంబులెన్స్‌లలో సమకూర్చిన సౌకర్యాలు, అందిస్తున్న సేవలను జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, అధికారుల బృందాల నుంచి ప్రశంసలు వ్యక్తమయ్యాయి. ఇదే తరహాలో సంచార పశు వైద్య సేవలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ప్రత్యేకంగా మార్గదర్శకాలు జారీ చేసింది. లక్ష పశు సంపద ఉన్న ప్రాంతానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తే ఆర్థిక చేయూతనిస్తామని ప్రకటించడంతో పలు రాష్ట్రాలు ఏపీ బాట పట్టాయి. కేరళ, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పంజాబ్ రాష్ట్ర బృందాలు ఏపీలో పర్యటించి వీటి సేవలపై అధ్యయనం చేశాయి. మన రాష్ట్రంలో సమర్థంగా నిర్వహిస్తున్న ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఈఎంఆర్ఐ) గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థకే జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లో వాహనాల నిర్వహణ బాధ్యతలను అప్పగించారు.

సీఎం ఆలోచనలు స్ఫూర్తిదాయకం



సీఎం వైఎస్ జగన్ ఆలోచనల నుంచి పుట్టినవే మొబైల్ అంబులేటరీ క్లినిక్స్. మూగజీవాలకు సైతం నాణ్యమైన సేవలందించే లక్ష్యంతో తెచ్చిన వీటి సేవలను అందిపుచ్చుకునేందుకు పలు రాష్ట్రాలు పోటీపడుతుండడం గర్వ కారణం.

– డాక్టర్ సీదిరి అప్పలరాజు, పశుసంవర్ధక శాఖమంత్రి

పలు రాష్ట్రాలు సంప్రదిస్తున్నాయి..



ఏపీ తరహాలో అంబులెన్స్‌లు ప్రవేశపెట్టి నిర్వహణ బాధ్యతలు అప్పగించేందుకు పలు రాష్ట్రాలు సంప్రదిస్తున్నాయి. ఇప్పటికే జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ మాతో కలసి పని చేసేందుకు సిద్ధమయ్యాయి. మిగిలిన రాష్ట్రాలతో చర్చలు జరుగుతున్నాయి.

– ఎస్.రామకృష్ణవర్మ, ఈఎంఆర్ఐ ఆపరేషన్స్ ఏపీ స్టేట్ హెడ్

డ్రోన్ వ్యవ'సాయం'

- జిల్లాకు తొలిగా 91 డ్రోన్లు అందించేందుకు రంగం సిద్ధం
- ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఐదుగురు రైతులతో గ్రూపు ఏర్పాటు
- వారిలో ఒకరికి డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ



సాక్షి, రాజమహేంద్రవరం: అన్నదాతల రెక్కల కష్టాన్ని తగ్గించి, యాంత్రీకరణ ద్వారా వ్యవసాయ పనులను సులభతరం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోంది. ఇప్పటికే రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా రైతులకు అవసరమైన ట్రాక్టర్లు, రోటోవేటర్లు తదితర యంత్రాలను అందజేసింది. తాజాగా వైఎస్సార్ యంత్ర సేవ పథకం కింద మరో విప్లవాత్మక విధానానికి శ్రీకారం చుట్టింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న డ్రోన్లను రైతులకు అందించనుంది. ఈ మేరకు వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. డ్రోన్లు అందుబాటులోకి వస్తే వ్యవసాయ పనులు మరింత సులభతరం కానున్నాయి.

రాయితీపై..

జిల్లాలో 367 ఆర్‌బీకేలు ఉండగా.. తొలి దశలో ప్రతి మండలంలో మూడు ఆర్‌బీకేలకు డ్రోన్లు మంజూరు చేయనున్నారు. జిల్లాకు 91 డ్రోన్లు అవసరమని అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 30 దరఖాస్తులు అందినట్టు చెబుతున్నారు. డ్రోన్లను రైతులకు రాయితీపై అందజేస్తారు. డ్రోన్ పొందడానికి తొలుత ఐదుగురు రైతులు బృందంగా ఏర్పడాలి. వీరిలో ఒకరు తప్పనిసరిగా ఇంటర్మీడియెట్ వరకూ చదివి ఉండాలి. అతడికి డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ ఇస్తారు. డ్రోన్ ధర రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఉంటుంది. ఇందులో ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుంది. గ్రూపులోని ఎవరైనా సభ్యుడు అగ్రికల్చర్ లేదా హార్టికల్చర్ బీఎస్సీ చదివి ఉంటే 50 శాతం సబ్సిడీ వర్తింపజేస్తారు. మొత్తం డ్రోన్ ఖర్చులో ఆ గ్రూపు 10 శాతం భరిస్తే.. మిగిలిన 40 శాతం బ్యాంకు రుణంగా అందిస్తారు. అంతేకాకుండా ఆయా గ్రామాల్లో డ్రోన్లను అద్దెకు ఇచ్చే అవకాశం కూడా కల్పిస్తారు.

చీడపీడల నివారణకు దోహదం

పంటలపై చీడపీడలు దిగుబడిపై అత్యంత ప్రభావం చూపుతాయి. వీటి నివారణకు రైతులు క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తుంటారు. ఇందుకు ప్రత్యేకంగా కూలీలను కూడా ఏర్పాటు చేస్తారు. దీనివలన ఖర్చులు తడిసి మోపెడవడమే కాకుండా కూలీల కొరతతో రైతులకు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. పైగా గంటల తరబడి పిచికారీ చేయడం వలన అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఎక్కడో ఒకచోట రైతులు లేదా కూలీలు విష ప్రభావానికి గురవుతారు. ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉంటుంది. రైతుల ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం దీనికి పరిష్కారంగా కిసాన్ డ్రోన్లను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఫలితంగా కూలీల అవసరం లేకుండా ఏ పంటకైనా సులభంగా, నిర్ణీత కాలంలో క్రిమి సంహారక మందులు పిచికారీ చేసే వెసులుబాటు కలుగుతుంది. ఎత్తుగా పెరిగే జొన్న, మొక్కజొన్న, సజ్జ, పత్తి, మామిడి, జామ, అరటితో పాటు బురదలో ఉండే వరి పంటకు సైతం డ్రోన్ ద్వారా పురుగు మందులను సులభంగా పిచికారీ చేయవచ్చు.

డ్రోన్‌ల ప్రతిపాదనలివీ..

మండలం	అందించనున్న డ్రోన్లు	స్వీకరించిన ప్రతిపాదనలు
కొవ్వూరు	5	1
చాగల్లు	5	1
తాళ్లపూడి	5	1
నిడదవోలు	5	2
ఉండ్రాజవరం	5	1
పెరవలి	5	4
దేవరపల్లి	5	2
గోపాలపురం	6	2
నల్లజర్ల	5	1
సీతానగరం	6	3
కోరుకొండ	7	5
గోకవరం	6	3
రంగంపేట	5	4
రాజానగరం	6	1
రాజమహేంద్రవరం రూరల్	2	1
కడియం	4	4
అనపర్తి	3	1
బిక్కవోలు	6	4

యాంత్రీకరణకు సహకారం

తొలి దశలో జిల్లా వ్యాప్తంగా 91 డ్రోన్లు అవసరమని గుర్తించాం. ప్రతి మండలానికి మూడు ఆర్‌బీకేలను గుర్తించాం. అవసరమైన రైతుల నుంచి ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ మొదలుపెట్టాం. ప్రభుత్వ ఉద్దేశానికి అనుగుణంగా డ్రోన్లను రైతులకు ఇచ్చేందుకే మొదటి ప్రాధాన్యం ఇస్తున్నాం.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ అధికారి



'పది'మెట్లు ఎక్కేలా..

ఉత్తమ గ్రేడ్‌ల కోసం కసరత్తు
జెడ్పీ హైస్కూళ్లలో పిల్లలకు స్టడీ మెటీరియల్

- 'జగనన్న విద్యా భారతి' పేరుతో నేటి నుంచి పంపిణీ
- ఉమ్మడి 'తూర్పు'న 48,727 మందికి ప్రయోజనం



జగనన్న విద్యా భారతి స్టడీ మెటీరియల్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా.. 'జగనన్న విద్యా భారతి' పేరిట స్టడీ మెటీరియల్ పంపిణీ చేయాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ నిర్ణయించింది. తద్వారా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని టెన్త్ విద్యార్థులు ఉత్తమ గ్రేడ్‌లలో ఉత్తీర్ణులయ్యేలా తీర్చిదిద్దేందుకు నడుం బిగించింది. ఇప్పటికే జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ చేసింది. దీనికి కొనసాగింపుగా కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 48 వేల మందికి పైగా టెన్త్ విద్యార్థులకు మేలు చేకూర్చే బృహత్తర కార్యక్రమాన్ని జెడ్పీ చేపట్టింది.

ప్రతి విద్యార్థీ పదో తరగతిలో సాధించిన మార్కులు ఆధారంగానే ఉన్నత చదువులకు వెళ్తారు. పదో తరగతి ఫలితాల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఐదేళ్లుగా తొలి మూడింటిలో ఏదో ఒక స్థానం సాధిస్తూ వస్తోంది. కోవిడ్‌తో విద్యార్థులు రెండేళ్లుగా చదువుకు దూరమయ్యారు. అదే సమయంలో పదో తరగతి పరీక్షలు జరగకపోవడం, పాఠశాలలో మార్కుల ఆధారంగా గ్రేడు పాయింట్లు రావడం వంటి కారణాలతో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి తగ్గింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి పరీక్షల విధానాన్ని సమూలంగా ప్రక్షాళన చేసింది. బుక్‌లెట్‌ను అందుబాటులోకి తెచ్చి, ప్రతి పేపర్ స్కాన్ చేసేలా బార్‌కోడ్ విధానం ప్రవేశపెట్టింది. ప్రతి సెంటరులో నిఘా కెమెరాలు ఏర్పాటు చేసి మరింత భద్రతతో పరీక్షలు నిర్వహించనుంది. ఈ పరిస్థితుల్లో జెడ్పీ హైస్కూళ్లలో ప్రతి టెన్త్ విద్యార్థి విద్యా ప్రమాణాలనూ పెంచేందుకు వీలుగా 'జగనన్న విద్యా భారతి' స్టడీ మెటీరియల్ అందజేయాలని జిల్లా పరిషత్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆధ్వర్యాన సిబ్బంది చురుకుగా చేస్తున్నారు. ఈ స్టడీ మెటీరియల్ పంపిణీకి బుధవారం శ్రీకారం చుట్టనున్నారు.

నిపుణులైన అధ్యాపక బృందంతో..

ఎస్‌సీఈఆర్‌టీ గుర్తింపు పొందిన నిపుణులైన ప్రభుత్వ పాఠశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయులతో ఈ స్టడీ మెటీరియల్ రూపొందించారు. టెన్త్ విద్యార్థులను ఎ, బి, సి గ్రేడులుగా విభజించి ప్రస్తుతం తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లా పరీక్షల విభాగం, గుంటూరులో పదో తరగతి మెటీరియల్ రూపొందించిన ఉపాధ్యాయ బృందం సలహాలు తీసుకుని.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రతిభావంతులైన ఉపాధ్యాయులతో అన్ని సబ్జెక్టులకూ 'జగనన్న విద్యా భారతి' స్టడీ మెటీరియల్ రూపొందించారు. ప్రశ్నలు, జవాబులు, మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలతో సరళమైన విధానంలో దీనికి రూపకల్పన చేశారు. విద్యార్థులకు ఇట్టే అర్థమయ్యేలా తయారు చేశారు. ఈ మెటీరియల్‌ను ప్రతి ప్రభుత్వ పాఠశాలలోని టెన్త్ విద్యార్థికీ పూర్తి ఉచితంగా ఇవ్వనున్నారు. పరీక్షలకు ఇంకా రెండున్నర నెలల సమయం ఉన్నందున ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని, తద్వారా ఉమ్మడి జిల్లాను రాష్ట్రంలో నంబర్–1గా నిలపాలని జెడ్పీ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో విద్యార్థుల వివరాలు

జిల్లా	బాలురు	బాలికలు	మొత్తం
కాకినాడ	9,896	10,539	20,435
తూర్పు గోదావరి	4,475	4,708	9,183
అల్లూరి సీతారామరాజు	2,069	2,287	4,356
కోనసీమ	7,381	7,372	14,753
మొత్తం	23,821	24,906	48,727

విద్యార్థుల ప్రయోజనం కోసమే..



విద్యార్థులను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకే ఈ స్టడీ మెటీరియల్‌ను తయారు చేయించాం. రెండేళ్లుగా ఈ మెటీరియల్ ఇవ్వాలని అనుకున్నా కోవిడ్ కారణంగా అమలు చేయలేకపోయాం. కోవిడ్ నుంచి బయటపడి ఇప్పుడిప్పుడే పరిస్థితులు గాడిన పడుతున్నందున విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే సంకల్పంతోనే స్టడీ మెటీరియల్ తయారు చేయించాం.

– విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ చైర్మన్, ఉమ్మడి తూర్పు గోదావరి

స్టడీ మెటీరియల్ సిద్ధం



'జగనన్న విద్యా భారతి' స్టడీ మెటీరియల్‌ను బుధవారం జరిగే జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆవిష్కరించనున్నాం. దీనిని మండలాల్లో జెడ్పీటీసీ సభ్యుల ఆధ్వర్యాన పంపిణీ చేయాలని ఎంపీడీఓ, ఎంఈఓలను ఇప్పటికే ఆదేశించాం.

– ఎస్.సత్యనారాయణ, సీఈఓ, జిల్లా పరిషత్, కాకినాడ



పాతపంటల జాతరలో భాగంగా చిరు ధాన్యాలను ఎడ్ల బండ్లపై పెట్టుకొని ఊరేగిస్తూ రైతుల్లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆదాయం.. ఆరోగ్యం

మహిళల 'చిరు' యత్నం

జహీరాబాద్ ప్రాంతంలో చిరుధాన్యాలను పండిస్తున్న మహిళా రైతులు

- ఒక సంఘంగా ఏర్పడి సుమారు తొమ్మిది వేల ఎకరాల్లో సాగు
- వర్షాభావ పరిస్థితులను అధిగమిస్తూ ఎన్నో ఏళ్లుగా సాగు కొనసాగింపు
- తాము పండించిన పంటల్నే వినియోగిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్న వైనం
- తమ అవసరాలకు పోను మిగతా పంటల్ని విక్రయిస్తూ ఆదాయార్జన
- ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్న స్థానిక స్వచ్ఛంద సంస్థ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సామలు.. కొర్రలు.. అరికెలు.. ఊదలు.. జొన్నలు.. ఇలా పలు పాత పంటలు సేంద్రియ పద్ధతిలో సాగు చేయడమే కాకుండా వాటిని వినియోగిస్తూ తమతో పాటు తమ కుటుంబసభ్యుల ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు ఆ మహిళా రైతులు. అంతేకాదు వారి అవసరాలు పోను మిగతా ధాన్యాన్ని మంచి ధరకు అమ్ముకుంటూ లాభాలు ఆర్జించడంతో పాటు ఇతరులకు ఆరోగ్యాన్ని పంచుతున్నారు. చాలా ప్రాంతాల్లో ఈ పాత పంటల సాగు దాదాపు కనుమరుగైందనే చెప్పాలి. అయితే ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఇటీవలి కాలంలో చాలామంది తృణ ధాన్యాల వైపు మొగ్గు చూపుతుండటంతో.. కొద్ది సంవత్సరాలుగా కొన్ని ప్రాంతాల్లో మళ్లీ వీటి సాగు మొదలైంది. అయితే సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంత రైతులు మాత్రం ఏళ్ల తరబడి తృణ ధాన్యాల సాగును కొనసాగిస్తుండటం గమనార్హం.

ఒక సంఘం..3 వేలమంది సభ్యులు

జహీరాబాద్ ప్రాంతంలో సరైన సాగునీటి సౌకర్యం లేదు. వరుణుడు కరుణిస్తేనే పంటలు చేతికందుతాయి. ఈ ఎర్ర నేలల్లో ప్రస్తుతం సుమారు తొమ్మిది వేల ఎకరాల్లో చిన్న సన్నకారు రైతులు చిరుధాన్యాలను సాగు చేస్తున్నారు. అందరూ కలిసి ఒక సంఘంగా ఏర్పడి ఈ పంటలను పండిస్తున్నారు. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) అనే స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన గ్రూపుల్లో సుమారు మూడు వేల మంది మహిళా రైతులు సభ్యులుగా ఉన్నారు.

ఒక్క కరోనా మరణం లేదు

చిరుధాన్యాలను సాగు చేయడం ద్వారా రూ.లక్షల్లో లాభాలను గడించకపోయినప్పటికీ.. నిత్యం వాటినే వినియోగిస్తుండడంతో ఆ రైతులు ఆరోగ్యంగా ఉంటున్నారు. కరోనా మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని పొట్టనబెట్టుకుంది. కానీ ఈ చిరుధాన్యాలు వినియోగించిన రైతు కుటుంబంలో ఒక్క కరోనా మరణం కూడా జరగలేదని డీడీఎస్ ప్రతినిధులు పేర్కొంటున్నారు. మూడు వేవ్‌ల్లో అసలు ఈ మహమ్మారి బారిన పడిన రైతులే చాలా తక్కువని చెబుతున్నారు. రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు, ఇతరత్రా వ్యాధుల బారిన పడిన వారి సంఖ్య కూడా తక్కువేనని అంటున్నారు.

కొనసాగుతున్న జాతర

చిరుధాన్యాల ఆవశ్యకత.. పౌష్టికాహార భద్రత.. సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యతపై రైతుల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా గత 23 ఏళ్లుగా పాత పంటల జాతర జహీరాబాద్ ప్రాంతంలో కొనసాగుతోంది. సంక్రాంతి నుంచి మొదలుపెట్టి కనీసం రోజుకో గ్రామం చొప్పున నెల రోజుల పాటు సుమారు 40 గ్రామాల్లో ఈ జాతర సాగుతుంది. సుమారు 80 రకాల చిరుధాన్యాలను ఎడ్ల బండ్లపై ఆయా గ్రామాలకు తీసుకెళ్లి వాటి సాగు ప్రాధాన్యతను రైతులకు వివరిస్తూ ఆయా పంటల సాగును ప్రోత్సహిస్తుంటారు. డీడీఎస్ ఆధ్వర్యంలో జాతర కోసం ఏర్పాటైన ప్రత్యేక బృందం.. రసాయనాలు లేకుండా విత్తనాలు భద్ర పరుచుకోవడం, సేంద్రియ ఎరువుల తయారీ, భూసార పరీక్షల కోసం మట్టి నమూనాల సేకరణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కలిస్తుండటం విశేషం. జహీరాబాద్ కేంద్రంగా ఈ సంస్థ 35 గ్రామాల్లో రైతులను ప్రోత్సహిస్తోంది. జహీరాబాద్, మొగుడంపల్లి, ఝరాసంగం, న్యాల్‌కల్ తదితర మండలాల రైతులకు తృణధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తోంది. పండిన పంటలు రైతులు వినియోగించేలా వారిని చైతన్యం చేస్తోంది. మిగిలిన పంటలను మార్కెట్ ధర కంటే సుమారు పది శాతం ఎక్కువ ధరకు రైతుల వద్ద డీడీఎస్ కొనుగోలు చేస్తోంది.



మేం పండించిన సాయి జొన్నలనే తింటున్నం..



నాకు ఏడు ఎకరాలు ఉంది. టమాటా, మిర్చి వంటి కూరగాయల పంటలకు భూమి అనుకూలంగా ఉన్నప్పటికీ.. చిరుధాన్యాలను సాగు చేయాలనే ఉద్దేశంతో రెండు ఎకరాల్లో సాయి జొన్న పండిస్తున్న. కూరగాయల పంటలతో పాటు శనగలు, కందులు కూడా సాగు చేస్తున్నా. చిరుధాన్యాలు ఆరోగ్యానికి మంచివనే ఉద్దేశంతో మేం పండించిన సాయి జొన్నలనే ఎక్కువగా తింటాం. ఇవి తింటేనే మాకు ఆరోగ్యంగా అనిపిస్తుంది.

- గార్లపాటి నర్సింహులు, బర్దిపూర్, సంగారెడ్డి జిల్లా

ఐదు ఎకరాల్లో 20 రకాల పంటలు



మాకు ఐదు ఎకరాలుంది. వర్షం పడితేనే పంట పండుతుంది. నీటి సౌకర్యం లేదు. తొగర్లు, జొన్నలు, సామలు, కొర్రలు.. ఇట్లా 20 రకాల పంటలు వేస్తున్నాం. విత్తనాలు మావే.. కొనే అవసరం లేదు. మేమే సేంద్రియ ఎరువులను తయారు చేసుకుంటున్నాం. దీంతో పెట్టుబడి వ్యయం చాలా తక్కువగా ఉంటోంది.

- పర్మన్‌గారి నర్సమ్మ, మెటల్‌కుంట, సంగారెడ్డి జిల్లా

ఎంతో ఆరోగ్యంతో ఉంటున్నారు..



నెల రోజుల పాటు జరిగే పాతపంటల జాతరలో రైతులకు చిరుధాన్యాల సాగు ఆవశ్యకతను వివరిస్తున్నాం. వివిధ రకాల పంటలు సాగు చేయడం ద్వారా వాతావరణం అనుకూలించక ఒక పంట నష్టపోయినా.. మరో పంట చేతికందుతుంది. ఈ చిరుధాన్యాలను పండించడంతో పాటు వాటిని వినియోగిస్తే వచ్చే ఆరోగ్యపరమైన ప్రయోజనాలపై మహిళా రైతులను చైతన్యం చేస్తున్నాం. చిరు ధాన్యాలను వినియోగిస్తున్న రైతులు, వారి కుటుంబాల వారు ఎంతో ఆరోగ్యంగా ఉంటున్నారు.

- బూచనెల్లి చుక్కమ్మ, జాతర కోఆర్డినేటర్

పిల్లలను తాత ముత్తాతలతో విడదీయలేం

సాక్షి, హైదరాబాద్: 'తాత ముత్తాతలు, అమ్మమ్మ నానమ్మలు.. తమ మనవళ్లు, మనవరాళ్లను కలవకుండా ఉండలేరు. పిల్లలంటే తల్లిదండ్రులకే కాదు.. నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యలకు కూడా ప్రేమ, అభిమానం, వాత్సల్యం ఉంటుంది. పిల్లల ఎదుగుదలలో తాతముత్తాతల పాత్ర కూడా ముఖ్యమైనదే. పిల్లల సంరక్షణ అంటే ఒక్క డబ్బుతో ముడిపడిందే కాదు.. పలు దృక్కోణాల్లో చూడాలి. తండ్రి/తల్లి బిడ్డను జాగ్రత్తగా చూసుకోగలిగినంత మాత్రాన అది పూర్తిగా పరిగణించబడదు. జీవితంలో దగ్గరి వ్యక్తుల, తమకు ఇష్టమైన వారి జీవన విధానాన్ని అనుసరిస్తూ చిన్నారులు వ్యక్తిగా ఎదుగుతారు. ప్రతి బిడ్డ సంతోషకరమైన బాల్యానికి అర్హులు. తాత–తల్లిదండ్రుల ఉనికి నుంచి మనుమలు పొందే ప్రేమ, ఆప్యాయత, భద్రత నిస్సందేహంగా ముఖ్యమైనవి. వీటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి'అని ఓ కేసు విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మనవరాలిని చూసేందుకు తనకు అనుమతి ఇవ్వడం లేదని, ఇచ్చేలా ఆమె తండ్రిని ఆదేశించాలని కోరుతూ ఓ మహిళ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్ విచారణలో హైకోర్టు పై విధంగా వ్యాఖ్యానించింది.



తక్కువలోనే అతి ఎక్కువ సంతృప్తిని పొందే వ్యక్తి లోకంలోనే అత్యంత సంపన్నుడు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, జనవరి, 18

దేశం... ధనవంతుల భోజ్యం?

బలవంతుడిదే రాజ్యం అని లోకోక్తి. కానీ, ఇప్పుడు ధనవంతుడిదే రాజ్యం. ఈ సమకాలీన సామా జిక పరిస్థితి కళ్ళ ముందు కనిపిస్తున్నదే అయినా, తాజాగా లెక్కలతో సహా వెల్లడైంది. ప్రభుత్వేతర సంస్థ 'ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్' తన తాజా ప్రపంచ సంపద నివేదికలో ససాక్ష్యం గా కుండబద్దలు కొట్టింది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సు తొలి రోజు సోమవారం ఆక్స్‌ఫామ్ విడుదల చేసిన ఈ నివేదికలోని అంశాలు ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. కరోనా కాలం నుంచి ప్రపంచమంతటా ఆర్థిక అంతరాలు బాగా పెరిగాయన్న వాదన అక్షరాలా నిజ మని రుజువు చేస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమై, నిరుద్యోగం పెరిగిన వేళ ప్రపంచంలోనూ, భారత్‌లోనూ సంపద అంతా కొద్దిమం ది చేతుల్లోనే పోగుపడుతుండడం ఆందోళనకరం.

2020 నుంచి కొత్తగా సమకూరిన 42 లక్షల డాలర్లలో మూడింట రెండు వంతుల సంపద ప్రపంచంలోని ఒకే ఒక్క శాతం అపర కుబేరుల గుప్పెట్లో ఉంది. మిగతా ప్రపంచ జనాభా సం పాదించిన సొమ్ముకు ఇది దాదాపు రెట్టింపు అనే నిజం విస్మయపరుస్తుంది. మన దేశానికొస్తే అగ్రశ్రేణి ఒక్క శాతం మహా సంపన్నుల చేతిలోనే 2012 నుంచి 2021 మధ్య జరిగిన సంపద సృ ష్టిలో 40 శాతానికి పైగా చేరింది. ఇక, దేశ జనాభాలో అడుగున ఉన్నవారిలో సగం మంది వాటా మొత్తం 3 శాతమే. కరోనా వేళ ధనికులు మరింత ధనవంతులయ్యారు. కరోనాకు ముందు భారత్‌లో 102 మంది బిలి యనీర్లుంటే, ఇప్పుడు వారి సంఖ్య 166కు పెరిగింది. కరోనా నుం చి గత నవంబర్‌కు దేశంలో శత కోటీశ్వరుల సంపద 121 శాతం పెరిగింది. మరోమాటలో నిమిషానికి 2.5 కోట్ల వంతున, రోజుకు రూ. 3,068 కోట్లు వారి జేబులో చేరింది. కనివిని ఎరుగని ఈ తేడాలు కళ్ళు తిరిగేలా చేస్తున్నాయి.

అలాగే, సంపన్నుల కన్నా, పేద, మధ్యతరగతి వారిపైనే అధిక పన్ను భారం పడుతోందన్న మాట ఆగి, ఆలోచించాల్సిన విషయం. భారత్‌లో జీఎస్టీ ద్వారా వస్తున్న ఆదాయంలో 64 శాతం జనాభాలోని దిగువ సగం మంది నించి ప్రభుత్వం పిండుతున్నదే. అగ్రస్థానంలోని 10 శాతం ధనికుల ద్వారా వస్తున్నది 4 శాతమే అన్న మాట గమనార్హం. ఇవన్నీ సముద్రంలో నీటిబొట్లు. భారతదేశం శరవేగంతో కేవలం సంపన్నుల రాజ్యంగా రూపాంతరం చెందుతోందన్న అంచనా మరింత గుబులు రేపుతోంది. ధనికుల దేవిడీగా మారిన వ్యవస్థలో దళితులు, ఆదివాసీలు, ముస్లిమ్‌లు, మహిళలు, అసంఘటిత కార్మికుల లాంటి అణగారిన వర్గాల బాధలకు అం తమెక్కడ?

అర్ధాకలితో అలమటిస్తున్నవారికీ, మధ్యతరగతికీ మెతుకు విదల్చడానికి సందేహిస్తున్న పాలకులు జేబు నిండిన జనానికి మాత్రం గత బడ్జెట్‌లోనూ కార్పొరేట్ పన్నుల్లో తగ్గింపు, పన్ను మినహాయింపులు, ఇతర ప్రోత్సాహకాలు ఇవ్వడం విడ్డూరం. ధనికులకు పన్ను రాయితీలిస్తే, వారి సంపద క్రమంగా దిగువవారికి అందుతుందనేది ఓ భావన. అది వట్టి భ్రమ అని ఆక్స్‌ఫామ్ తేల్చేసింది. కొద్దిరోజుల్లో కొత్త బడ్జెట్ రానున్న వేళ పెరుగుతున్న ఆర్థిక అంతరాన్ని చక్కదిద్దడానికి సంపద పన్ను విధించాలంటోంది. పేద, గొప్ప తేడాలు ఇప్పుడు ఎంతగా పెరిగాయంటే, భారత్‌లో అగ్రస్థానంలో నిలిచిన తొలి 10 మంది కుబేరులపై 5 శాతం పన్ను వేసినా చాలు. దాంతో దేశంలో పిల్లలందరినీ మళ్ళీ బడి బాట పట్టించవచ్చు.

దేశంలోకెల్లా మహా సంపన్నుడైన గౌతమ్ అదానీ సంపద నిరుడు 2022లో 46 శాతం మేర పెరిగింది. దేశంలోని అగ్రశ్రేణి 100 మంది అపర కుబేరుల సమష్టి సంపద ఏకంగా 66 వేల కోట్ల డాలర్లకు చేరింది. అదానీ ఒక్కరికే 2017 – 2021 మధ్య చేకూరిన లబ్ధిపై 20 శాతం పన్ను వేస్తే, రూ. 1.79 లక్షల కోట్లు వస్తుంది. దాంతో దేశంలోని ప్రాథమిక పాఠశాల టీచర్లలో 50 లక్షల పైమందికి ఏడాదంతా ఉపాధినివ్వవచ్చని ఆక్స్‌ఫామ్ ఉవాచ. ఈ అంచనాలు తార్కికంగా బాగున్నా, ఆచరణాత్మకత, గత అనుభవాలను కూడా గమనించాలి. సంపద పన్ను సంగతే తీసుకుంటే, మనదేశంలో 1957లోనే దాన్ని ప్రవేశపెట్టారు. కానీ, భారీ ఎగవేతలతో లాభం లేకపోయింది. అసమానతలూ తగ్గలేదు. చివరకు, సంపద పన్ను వసూళ్ళతో పోలిస్తే, వాటి వసూలుకు అవుతున్న ఖర్చు ఎక్కువుందంటూ 2016–17 బడ్జెట్‌లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ దాన్ని ఎత్తేశారు. అందుకే, మళ్ళీ సంపద పన్ను విధింపు ఆలోచనపై సమగ్రంగా కసరత్తు అవసరం.


పన్నుల వ్యవస్థలో మార్పులు తేవాలి. కాకుంటే, భారత్ లాంటి దేశంలో మధ్యతరగతిని పక్కనపెడితే, మహా సంపన్నులపై ఏ పన్ను వేసినా, అడ్డదోవలో దాన్ని తప్పించుకొనే పనిలో ఉంటారనేది కాదనలేని వాస్తవం. కాబట్టి, భారీ పన్నుల ప్రతిపాదన కన్నా దేశ సామాజిక – ఆర్థిక విధానంలో వారిని భాగం చేయడం లాంటి ఆలోచనలు చేయాలి. విద్య, వైద్యం, ప్రాథమిక వసతి సౌకర్యాల కల్పనల్లో ఈ కుబేరుల సంపదను పెట్టేలా చూడాలి.

దారిద్ర్య నిర్మూలనకు కార్పొరేట్ అనుకూలత కన్నా సామాన్య ప్రజానుకూల విధానాలే శరణ్యం. స్త్రీ, పురుష వేతన వ్యత్యాసాన్నీ నివారించాలి. కార్పొరేట్ భారతావనిలో సీఈఓలు ఓ సగటు మధ్యశ్రేణి ఉద్యోగితో పోలిస్తే 241 రెట్ల (కరోనాకు ముందు ఇది 191 రెట్లు) ఎక్కువ జీతం సంపాదిస్తున్న వేళ... సత్వరం ఇలాంటి పలు దిద్దుబాటు చర్యలు అవసరం. గత 15 ఏళ్ళలో 41 కోట్లమందిని దారిద్ర్య రేఖకు ఎగువకు తెచ్చామని లెక్కలు చెప్పి, సంబరపడితే చాలదు. ఇప్పటికీ అధికశాతం పేదసాదలైన ఈ దేశంలో ఆర్థిక అంతరాలు సామాజిక సం క్షోభానికి దారి తీయక ముందే పాలకులు విధానపరమైన మార్పులు చేయడమే మార్గం.

మరపురాని కవిసమ్మేళనం

జనవరి 9, 10 తేదీల్లో ఢిల్లీలో జరిగిన సర్వభాషా కవిసమ్మేళనానికి హాజరు కావటం జీవితంలో మరచిపోలేని జ్ఞాపకం. ఏటా ఆలిండియా రేడియో – భారత ప్రభుత్వం గుర్తింపు పొందిన 22 భాషల నుంచి 23 మందిని (ఒక్క హిందీ భాష నుంచి మాత్రం ఇద్దరు) సెలెక్ట్ చేసి, ఏదో ఒక నగరంలో ఈ సమ్మేళనం ఏర్పాటు చేస్తుంది. ఈ సంవత్సరం ఢిల్లీలో నిర్వహించిన సర్వభాషా కవిసమ్మేళనానికి తెలుగు భాష నుంచి నా కవిత 'అమృతోపనిషత్' ఎన్నికైంది.

మొదటిరోజు (9వ తేదీ) ఢిల్లీ ఆకాశవాణి సమావేశ మందిరంలో రిహార్సల్స్ చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రసారభారతి ఉన్నతాధికారులు హాజరై ప్రతి కవినీ జ్ఞాపిక, శాలువాలతో సగౌరవంగా సత్కరించారు. రెండోరోజు (10వ తేదీ) తొలుత మూలభాషలో కవిత చదివించి, వెంటనే హిందీ అనువాదం వినిపించారు. ప్రతి కవినీ ఆహ్వానించే ముందు ఆ కవి గురించి హిందీలో పరిచయం చేశారు. నేను సాహిత్యంలో చేసిన కృషి, ప్రచురించిన పుస్తకాలు, చేస్తున్న ఉద్యో గంతో పాటు... మా నాన్న స్మృత్యర్థం స్థాపించిన 'మువ్వా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్' తరఫున నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి కూడా యాంకర్ స్వచ్ఛమైన హిందీలో చెప్పి నప్పుడు నా భావోద్వేగం తారస్థాయికి చేరుకుంది.



జ్ఞాపిక తీసుకుంటున్న ఎమ్వీ రామిరెడ్డి

ఆ పెద్ద హాలులో తెలుగు తెలిసిన ఒక్కరూ లేక పోయినా, నా మట్టుకు నేను సీరియస్‌గా కవితను (ఆలిండియా రేడియో రికార్డింగ్ కోసం) చదివాను. ఆ తర్వాత డాక్టర్ పుష్పాసింగ్ నా కవితకు హిందీ అనువాదం చదివినప్పుడు, మంచి స్పందన వచ్చింది. అయిదారు సార్లు 'వహ్వా వహ్వాలు' సభలో సందడి చేశాయి. ఆమె మంచి ఫ్రెండ్ అయ్యారు. ఈ అరుదైన సందర్భంలో అన్ని రాష్ట్రాల కవులతో పాటు ప్రత్యేకించి గోవా, ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధులను కలవటం ప్రత్యేక అనుభూతి. వారి అనుభవాల్ని గ్రహించటం సాహిత్యంలో సరికొత్త పాఠాలు నేర్చుకోవటమే. పంజాబీ కవి గురుతేజ్‌తో ఎక్కువ సమయం వెచ్చించే అవకాశం దొరికింది. ఇండో–పాక్ బోర్డర్‌లో ఓ కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సింగ్ అనేక విషయాలు నాతో పంచుకున్నారు. కశ్మీరీ కవి డాక్టర్ గులామ్ నబీ హలీమ్ చలాకీగా తిరుగుతూ అందరినీ అల్లుకుపోయాడు. ఈ ఇద్దరూ నా ఇతర కవితల ఆంగ్లానువాదాలు తమకు పం పమని, వాటిని తమ భాషల్లోకి తర్జుమా చేస్తామని అడిగారు. నేను వేదిక దిగగానే ఢిల్లీకి చెందిన మరో ముగ్గురు మహిళలు కూడా ఇదే అభ్యర్థన చేశారు. ఇవి నాకు సరికొత్త ద్వారాలు.

నా రూమ్మేట్ అయిన మరాఠీ కవి అనిల్ సబాలే, పక్క గదిలో దిగిన సంథాలీ కవి గొరు ముర్ము, పోలీస్ డిపార్ట్‌మెంటులో పనిచేసే మణిపురి కవి క్షేత్రి రాజన్ తదితరులతో ఎక్కువగా చర్చించే అవకాశం దొరికింది. నా సాహిత్యపు డైరీలో కొత్త మిత్రులు చేరారు. నా కవిత 21 భాష ల్లోకి తర్జుమా అవుతుందన్న సంతోషం మరింత కిక్కిచ్చే అంశం. ఈ సర్వ భాషా కవిసమ్మేళనంజనవరి 25వ తేదీ రాత్రి 10 గంటలకు అన్ని రేడియో స్టేషన్ల నుంచి ప్రసారమవుతుంది.

– ఎమ్వీ రామిరెడ్డి, రచయిత, మొబైల్: 98667 77870

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com

పూర్తవుతుంటే ఎందుకంత కుళ్లు?

ప్రాజెక్టులను ఏటీఎంలా వాడుకున్న బాబు ; సాక్షాత్తూ ప్రధాని మోదీయే స్వయంగా చెప్పిన వైనం

బాబు పాపాల్ని ప్రక్షాళన చేస్తూ.. పోలవరం పనుల్లో వేగం పెంచేలా చేసిన సీఎం వైఎస్ జగన్


- నిర్వాసితులకు పునరావాసం కల్పించి పులిచింతల, గండికోట, చిత్రావతి, సోమశిల, కండలేరు, గోరకల్లు, అవుకు రిజర్వాయర్లలో గరిష్ఠ నీటి నిల్వ
- 2019 నుంచి ప్రతి ఏటా సగటున కోటి ఎకరాలకు నీటి సరఫరా... ఇవేవీ గమనించనట్టే రామోజీ రాతలు
- జలయజ్ఞంలో 40 ప్రాజెక్టుల్లో మిగిలిన పనులను రూ.17,368 కోట్లతో పూర్తి చేస్తానని 2014లో చెప్పిన బాబు
- 2019 నాటికి దానికి రెండున్నరరెట్లు అధికంగా ఖర్చు పెట్టినా ఒక్క ప్రాజెక్టూ పూర్తి చేయని తీరు
- జీవో 22, జీవో 63లను అడ్డం పెట్టుకుని అంచనా వ్యయాన్ని పెంచేసి.. దోచుకున్న చంద్రబాబు
- ఆ డబ్బును దోచుకో–పం చుకో–తినుకో విధానంలో వాటాలు వేసుకున్న దుష్ట చతుష్టయం
- చివరకు కుప్పం బ్రాంచ్ కెనాల్‌లోనూ కమీషన్లు వసూలు చేసుకుని, చేతులెత్తేసిన వైనం
- ఇప్పుడు కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను పూర్తి చేయిస్తున్న సీఎం వైఎస్ జగన్



గండికోట రిజర్వాయర్



బ్రహ్మంసాగర్ రిజర్వాయరు



చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

అధికారంలో చంద్రబాబు తప్ప వేరెవరైనా ఉంటే..? ఆ ప్రభుత్వం చేసే మంచిపనులేవీ రామోజీరావుకు కనిపించవు. చంద్రబాబు గనక ఉంటే... ఆయనెంత దుర్మార్గం చేసినా అస్సలు కనిపించదు. అదే తన మార్కు పాత్రికేయమని ఆయన పదేపదే నిరూపిస్తున్నారు. మంగళవారం నాడు 'ప్రాజెక్టులకు పైసల్లేవు' అంటూ అచ్చేసిన కథనమూ అలాంటిదే. ఎందుకంటే చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పుడు కేవలం రూ.17,368 కోట్లతోనే 40 జలయజ్ఞం ప్రాజెక్టులను పూర్తి చేస్తానని ప్రకటించారు. అంతకు రెండున్నర రెట్లు అధికంగా ఖర్చు చేసినా ఒక్క ప్రాజెక్టూ పూర్తి చేయలేకపోయారు. ఒక్క ఎకరాకూ కొత్తగా నీళ్లందించలేకపోయారు. కానీ రామోజీరావు ఎప్పుడూ దీన్ని ప్రశ్నించలేదు. ఎందుకంటే అప్పుడు డీపీటీ (దోచుకో- పంచుకో- తినుకో) పద్ధతిలో బాబు దోచుకున్నదాంట్లో తన వాటా భేషుగ్గా అందేసింది. కానీ ఇప్పుడు అలాంటిదేమీ లేదు. ఖర్చుపెట్టే ప్రతి పైసాకూ తగ్గ ప్రతిఫలం రైతుకు దక్కాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆలోచిస్తున్నారు. అది బాబుకే కాదు. ఎల్లో ముఠాలో ఎవ్వరికీ సుతరామూ నచ్చటం లేదు. అందుకే ఈ రాతలు. అసలీ రాతల్లో నిజమెంత? కొంతైనా ఉందా? చూద్దాం...

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక నీటిపారుదల ప్రాజెక్టుల పనుల్లో టీడీపీ ప్రభుత్వ అవినీతిని ప్రక్షాళన చేసి.. జ్యుడిషియల్ ప్రివ్యూ, రివర్స్ టెండరింగ్ ద్వారా పారదర్శకత తెచ్చారు. రివర్స్ టెండరింగ్ ద్వారా పోలవరంలో ఏకంగా రూ.865 కోట్లు ఆదా చేశారు. అన్ని ప్రాజెక్టుల్లోనూ రివర్స్ టెండరింగ్ వల్ల రూ.2,090 కోట్లు ఆదా అయింది. కానీ కరోనా మహమ్మారి విజృంభణతో రెండేళ్ల ప్రాజెక్టుల పనులపై ప్రతికూల ప్రభావం పడింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలతోపాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితీ దెబ్బతింది. అయినా సరే.. నీటిపారుదల రంగానికి అత్యధిక ప్రాధాన్య మిస్తూ.. పెట్టే ప్రతి పైసా ప్రతిఫలం రైతులకు దక్కేలా ప్రణాళికాయుతంగా సీఎం వైఎస్ జగన్ ప్రాజెక్టులను పూర్తి చేయిస్తున్నారు. ఇప్పటిదాకా రూ.23,289 కోట్లను ప్రాజెక్టుల పనులకు ఖర్చు చేసి.. కొత్తగా 1,03,692 ఎకరాలకు సాగునీరు అం దించారు. 4,84,500 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారు. 2019, 2020, 2021, 2022లలో ప్రతి ఏటా ఖరీఫ్, రబీలలో కోటి ఎకరాల చొప్పున ఆయకట్టుకు నీళ్లందించి చరిత్ర సృష్టించారు.

ఏది నిజం?

కాకపోతే ఇవేవీ రామోజీ కళ్లకు కన్పించవు. ఎం దుకంటే.. అధికారంలో ఉన్నది వైఎస్ జగన్ కాబట్టి!. తమ డీపీటీకి అడ్డుకట్ట పడింది కాబట్టి!!.

మహోజ్వల ఘట్టం కన్పించలేదా?

పెన్నా డెల్టాకు జీవనాడుల్లాంటి మేకపాటి గౌతమ్ రెడ్డి సంగం, నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి నెల్లూరు బ్యారేజ్ పనులను దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టారు. 2014–19 మధ్య అధికారంలో ఉన్న చంద్రబాబు వాటిని పూర్తి చేయలేకపోయారు. వైఎస్ జగన్ వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించి గత సెప్టెంబరు 6న జాతికి అంకితం చేశారు. తండ్రి చేపట్టిన రెండు బ్యారేజ్‌లను తనయుడు పూర్తి చేసి, జాతికి అంకితం చేయడం నీటిపారుదల రంగ చరిత్రలో మహోజ్వల ఘట్ట మని రైతులు, నిపుణులు ప్రశంసించారు. కానీ.. ఇది రామోజీకి కన్పించకపోవడం దురదృష్టకరం.

కళ్లుండి చూడలేకపోతే ఎలా..?

- గాలేరు–నగరి సుజల స్రవంతి పథకంలో అం తర్భాగమైన అవుకు రెండో సొరంగంలో 160 మీటర్ల పొడవున ఫాల్ట్ జోన్‌లో ఐదేళ్లపాటు పనులు చేయలేక చంద్రబాబు చేతులెత్తేశారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆ సొరం గాన్ని పూర్తి చేయించారు. శ్రీశైలానికి వరద వచ్చిన వెంటనే ప్రస్తుత డిజైన్ మేరకు గాలేరు –నగరి సుజల స్రవంతి వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కులను గండికోట రిజర్వా యర్‌కు తరలించడానికి సిద్ధమయ్యారు.
- వెలిగొండ ప్రాజెక్టును ఇదిగో అదిగో అని ఐదేళ్లూ దాటవేసిన చరిత్ర చంద్రబాబుది. కానీ.. వైఎస్ జగన్ వెలిగొండపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఇప్పటికే మొదటి సొరంగాన్ని పూర్తి చేయించారు. రెండో సొరంగం పనులు వేగం గా సాగుతున్నాయి. నల్లమలసాగర్ నిర్వాసితు లకు పునరావాసం కల్పించి.. ఈ ఏడాదే వెలిగొండ తొలి దశ ద్వారా కృష్ణా జలాలను తరలించి దుర్భిక్ష ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాలను సుభిక్షం చేయడానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టనున్నారు.
- కర్నూల్ జిల్లాలో పశ్చిమ ప్రాంతంలోని 9 దుర్భిక్ష మండలాల్లో 10,130 ఎకరాలకు నీళ్లం దించేందుకు హంద్రీ–నీవా నుంచి 1.238 టీఎంసీలను ఎత్తిపోసే పథకం పనులను రూ. 180.67 కోట్లను ఖర్చు చేసి, దాదాపుగా పూర్తి చేశారు.
- అత్యంత వెనుకబడ్డ శ్రీకాకుళం జిల్లాను సుభిక్షం చేయడమే లక్ష్యంగా వంశధార స్టేజ్–2 ఫేజ్–2లో మిగిలిన పనులతోపాటు వం శధార–నాగావళి అనుసంధానాన్ని ఈ ఏడాదే పూర్తి చేసి, జాతికి అంకితం చేసే దిశగా పనుల్లో వేగం పెంచారు. వంశధార ఫలాలను పూర్తి స్థాయిలో అందించడానికి హిరమండలం ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టారు. జలయజ్ఞంలో చేపట్టిన తారకరామతీర్థసాగరం, తోటపల్లి, మహేంద్రతనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్, హం ద్రీ–నీవా, గాలేరు–నగరి తదితర ప్రాజెక్టుల పనుల్లోనూ వేగం పెంచారు. మరి శరవేగంగా పూర్తవుతోన్న ఈ ప్రాజెక్టులను కళ్లుండి చూడ లేకపోతే ఎలా రామోజీరావు గారూ?

బాబు పాపం వల్లే పోలవరం పనుల్లో జాప్యం..

గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించేలా కాఫర్ డ్యామ్‌లు, అప్రోచ్ చానల్, స్పిల్ వే, స్పిల్ చానల్, పైలట్ చానల్‌లను పూర్తి చేయకుండా చం ద్రబాబు.. ఎర్త్ కమ్ రాక్ ఫిల్(ఈసీఆర్ఎఫ్) డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించారు. 2019, జూన్‌లో గోదావరికి వచ్చిన వరదలు కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా అధిక ఉధృతితో ప్రవహిం చడం వల్ల డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక కోతకు గురైంది. కోతకు గురైన ప్రదేశాన్ని యథా స్థితికి తెచ్చి... డయాఫ్రమ్ వాల్‌ను సరిదిద్దాకనే ప్రధాన డ్యామ్ పనులు చేయాలి. చంద్రబాబు ఈ పాపానికి పాల్పడకపోయి ఉంటే.. ఈ పాటికి సీఎం వైఎస్ జగన్ పోలవరాన్ని పూర్తి చేసి ఉండేవారు. బాబు చేసిన తప్పులను సరిదిద్దడానికి కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ)తో పాటు జాతీయ స్థాయి లో అనేక మంది నిపుణులను సంప్రతిస్తూనే... స్పిల్ వే, స్పిల్ చానల్, అప్రోచ్ చానల్, పైలట్ ఛానల్, ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసి, 2021, జూన్ 11న గోదావరి ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లించారు. ఈ నెలాఖరుకు దిగువ కాఫర్ డ్యామ్ పూర్తి కానుంది. సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్‌ల మేరకు డయాఫ్రమ్‌వాల్‌ను సరిదిద్ది.. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ చేపట్టి, శరవేగంగా పూర్తి చేసే దిశగా సీఎం వైఎస్ జగన్ అడుగులు వేస్తున్నారు.

నిర్వాసితులకు పునరావాసం.. జలాశయాల్లో గరిష్ట నిల్వ

- కృష్ణా డెల్టాకు జీవనాడి వంటి పులిచింతల ప్రాజెక్టులో 2019, మే వరకూ ఎన్నడూ గరిష్ట స్థాయిలో నీటిని నిల్వ చేయలేదు. నిర్వాసితు లకు పునరావాసం కల్పించకపోవడం, తెలం గాణకు పరిహారం చెల్లించకపోవడమే అందుకు కారణం. కమీషన్లు రావనే ఉద్దేశంతో చం ద్రబాబు ఆ పనులు చేయలేదు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్వాసితులకు పునరావాసం కల్పించి, తెలంగాణకు పరి హారం చెల్లించి 2019, ఆగస్టులోనే పులిచిం తలలో గరిష్ఠ స్థాయిలో 45.77 టీఎంసీలను నిల్వ చేశారు. కృష్ణా డెల్టాలో రెండో పంటకూ నీళ్లందించడానికి మార్గం సుగమం చేశారు.
- బ్రహ్మంసాగర్ రిజర్వాయరు గరిష్ఠ సామర్థ్యం 17.85 టీఎంసీలు. కానీ మట్టికట్టలో నిర్మాణ లోపాల వల్ల లీకేజీలు ఉండటంతో నిల్వ సామర్థ్యం నాలుగైదు టీఎంసీలకు పడిపోయిం ది. 2014 నుంచి 2019 వరకూ ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న చంద్రబాబు... ఎన్నడూ లీకేజీలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేయలేదు. రాయలసీమను సస్యశ్యామలం చేద్దామనే ఆలోచనే రాలేదు. ఆ నాలుగైదు టీఎంసీలతోనే నెట్టుకొచ్చేశారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక... యుద్ధప్రాతిపదికన బ్రహ్మంసాగర్ మట్టికట్టలో లీకేజీలున్న చోట రూ.వంద కోట్లతో డయాఫ్రమ్ వాల్‌ను నిర్మిం చారు. లీకేజీలకు అడ్డుకట్ట వేసి ఏకంగా 17.85 టీఎంసీలను నిల్వ చేసి... ఆయకట్టు చివరి భూములక్కూడా నీళ్లిచ్చారు.
- గండికోట రిజర్వాయర్ గరిష్ఠ సామర్థ్యం 26.85 టీఎంసీలు. కానీ 2014 నుంచి 2019 మధ్య నిర్వాసితులకు పునరావాసం కల్పిం చకపోవడంతో ఐదారు టీఎంసీలు కూడా నిల్వ చేయలేని దుస్థితి ఉండేది. పునరావాసం గురిం చి బాబు ఆలోచించనే లేదు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక రూ.వెయ్యి కోట్లతో నిర్వాసితులకు పునరావాసం కల్పించారు. గత రెండేళ్లుగా గరిష్టంగా నీటిని నిల్వ చేస్తున్నారు. ఇప్పుడు కూడా రిజర్వాయర్‌లో 26.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది.
- చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(సీబీఆర్) గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 10 టీఎంసీలు. కానీ 2014 నుంచి 2019 మధ్య చంద్రబాబు నిర్వాసితులకు పునరావాసం కల్పించలేదు. ఫలితంగా నాలుగైదు టీఎంసీలను కూడా నిల్వ చేయలేని పరిస్థితి. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక రూ.600 కోట్లతో నిర్వాసితులకు పునరావాసం కల్పించారు. రెండేళ్లుగా సీబీఆర్‌లో గరిష్ఠ స్థాయిలో నీటిని నిల్వ చేస్తున్నారు. ప్రస్తుతం సీబీఆర్‌లో 9.6 టీఎం సీలు నిల్వ ఉన్నాయి.
- నిర్వాసితులకు పునరావాసం కల్పించడం ద్వారా సోమశిల, కండలేరు, గోరకల్లు, అవుకు రిజర్వాయర్లలో 2019, సెప్టెంబరు నాటికే గరిష్ఠ స్థాయిలో నీటిని నిల్వచేశారు. ఇలాంటి వాస్తవాలను రాస్తే సీఎం వైఎస్ జగన్ ప్రజలకు చేస్తున్న మేలు బయటపడుతుందని... అబద్ధా లు రాయటానికే అలవాటు పడ్డారు రామోజీరావు!!

ఇదీ... బాబు అడ్డగోలు దోపిడీ..

- పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి మినహా జలయజ్ఞం కింద చేపట్టిన 40 ప్రాజెక్టులను పూర్తి చేయడానికి రూ.17,368 కోట్లు అవసరమని 2014, జూలై 8న నీటిపారుదల ప్రాజెక్టులపై విడుదల చేసిన శ్వేతపత్రంలో నాటి సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.
- 2014, జూన్ 8 నుంచి 2019, మే 29 వరకూ నీటిపారుదల ప్రాజెక్టులపై రూ.68,293 కోట్లు ఖర్చు చేసినట్లు టీడీపీ చెబుతోంది. కానీ ఇందులో నీరు–చెట్టు పథకానికి, పోలవరానికి పెట్టిన వ్యయాన్ని మినహాయిస్తే ప్రాజెక్టులపై రూ. 45,393 కోట్లు ఖర్చుపెట్టింది. కానీ.. ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. కొత్తగా ఒక్క ఎకరాకూ నీళ్లందించలేదు.



- దీనికి ప్రధాన కారణం... జీవో 22, జీవో 63లను అడ్డంపెట్టుకుని అంచనా వ్యయాలను భారీగా పెంచేశారు. కాం ట్రాక్టర్లతో కలిసి ఖజానాను దోచుకున్నారు చంద్రబాబు.
- ఈ దోపిడీ రామోజీకి కమ్మగా కన్పించింది. ఎందుకంటే దోపిడీ చేసిన సొమ్మును ఈ ఎల్లో ముఠా మొత్తం దోచుకో.. పంచుకో.. తినుకో పద్ధతిలో పంచేసుకున్నారు కాబట్టి.
- ఇక నీరు–చెట్టు కింద టీడీపీ కార్యకర్తలు పనులు చేయకుండానే చేసినట్లు చూపించి రూ.10 వేల కోట్లకుపైగా లాగేశారు.
- పోలవరం ప్రాజెక్టుపై టీడీపీ సర్కార్ రూ.10,584 కోట్లు ఖర్చు పెడితే.. అం దులో రూ.పది వేల కోట్లకుపైగా కేంద్రం రీయింబర్స్ చేసింది. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే కుడి, ఎడమ కాలువ ద్వారా గ్రావిటీపై నీళ్లందించవచ్చు. కానీ.. కుడి కాలువ ద్వారా నీళ్లందించడానికి రూ.1,900 కోట్లతో పట్టిసీమ ఎత్తిపోతల, ఎడమ కాలువ ద్వారా నీళ్లందించడానికి పురుషోత్తపట్నం ఎత్తిపోతలను చేపట్టిన చంద్రబాబు.. ఆ రెండు ప్రాజెక్టు పనులను ఒకే కాంట్రాక్టర్‌కు ఇచ్చి.. భారీ కమీషన్లు కొట్టేశారు. ఎలాంటి అనుమతి లేకుండా చేపట్టిన ఈ రెండు ఎత్తిపోతలకు సంబం ధించి జాతీయ హరిత ట్రిబ్యునల్ రూ.250 కోట్లను ప్రభుత్వానికి జరిమానాగా విధిస్తే.. దానిపై సుప్రీం కోర్టులో పోరాటం చేయాల్సి వస్తోం ది. 2019 నుంచి ఆ రెండు ఎత్తిపోతల పథకాల నుంచి ఒక్క చుక్క నీటిని కూడా తోడలేదు. అం టే.. వాటిపై వ్యయం చేసిన రూ.3800 కోట్ల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరే కదా? ఇలాంటి కఠిన వాస్తవాలను 'ఈనాడు' పత్రిక ఎందుకు రాయదు?
- చివరకు కుప్పం నియోజకవర్గానికి నీళ్లందిం చే కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను రూ.477 కోట్లతో ప్రారంభించి.. ఆ తర్వాత వ్యయాన్ని రూ.622 కోట్లకు పెంచి.. అస్మదీయ కాంట్రాక్టర్‌తో కలిసి సులువైన మట్టి పనులు చేసి, కమీషన్లు వసూలు చేసుకుని చంద్రబాబు చేతులు దులుపుకుం టే.. ఇప్పుడు ఆ పనులను సీఎం వైఎస్ జగన్ పూర్తి చేయించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇలాంటి చంద్రబాబు దరిద్రపు మోసాలేవీ రామోజీకి కనిపించకపోవటమే ఈ రాష్ట్రం దురదృష్టం.

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆకలి రాజ్యాలు



ఆహార సంక్షోభం కారణంగా పాకిస్థాన్ అంతటా తొక్కిస లాటలు జరుగుతున్నాయి. దేశ వ్యాప్తంగా గోధుమ పిండి కొరత తీవ్రంగా ఉంది. 121 దేశాల 'గ్లోబల్ హంగర్ ఇండెక్స్' లో పాకిస్థాన్ 99వ ర్యాంకులో ఉంది. విశేషం ఏమి టంటే ఇండియాలో ఆ దుస్థితి లేనప్పటికీ ఇండియా పాక్ కంటే కూడా అధ్వాన్నంగా 107వ ర్యాంకులో ఉంది!

– అభిషేక్, కాలమిస్ట్

ద్వేషపూరిత వ్యాఖ్యానాలు



ప్రజల మధ్య విభజన సృష్టించే యాంకర్‌లను టీవీ చానళ్లు ప్రోత్సహించ కూడదు. తమ మనసులో ఉన్నది మాట్లాడే హక్కు తమకు లేదని యాంకర్లు గ్రహించాలి. ఈ మాటలు నేను అంటున్నవి కాదు. జస్టిస్ జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్నలతో కూడిన ధర్మాసనం వ్యక్తం చేసిన అభిప్రాయాలు.

– అరీబ్ ఉద్దీన్, అడ్వొకేట్

అంతకంటే ఎక్కువగా



స్వామి వివేకానందను మనం భారతదేశ ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి కారకుడిగా కీర్తిస్తున్నాం మంచిదే కానీ, అంతకంటే ముఖ్యంగా ఆయన మన విజ్ఞాన శాస్త్ర అభివృద్ధికి నాంది పలికిన సంగతిని మర్చిపోతున్నాం. నికోలా టెస్లా, సత్యేంద్రనాథ్ బోస్ వంటి వారికి శాస్త్రవేత్తగా ఆయన స్ఫూర్తిని ఇచ్చారు.

– ఆనంద్ రంగనాథన్, సంపాదకుడు

తీరని వడ్డీలు



ఆర్థిక సంక్షోభం పేదల్ని, మధ్య తరగతి వారిని తమ అవసరాల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించేందుకు పురికొల్పు తోంది. అప్పు తీర్చలేనప్పుడు వడ్డీ వ్యాపారులు వీళ్ల ఆస్తులను స్వాధీనం చేసుకోవడమో, వీళ్లే ఆత్మహత్య చేసుకోవడమో జరుగుతోంది. దేశంలోని ప్రతి గ్రామంలోనూ ఈ పరిస్థితి ఉంది. రెండు వైపులా పోలీసుల నిఘా తప్పనిసరి.

– మహేశ్ లంగ, జర్నలిస్ట్


వైఎస్సార్ జిల్లా పుల్లారెడ్డిపేటలో పాల్గొన్న ప్రజలతో మమేకమవుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


బాపట్ల జిల్లా బేతపూడిలో సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

గడప గడపకు మన ప్రభుత్వం


చిత్తూరు జిల్లా శెట్టేరిలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

క్లుప్తంగా...

ఏనుగుల దాడిలో రైతు మృతి

భామిని: ఏనుగుల దాడిలో రైతు మృతి చెందిన ఘటన పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం తాలాడలో జరిగింది. కనుమ పండుగను పురస్కరించుకుని సోమవారం గ్రామంలో సందడి నెలకొంది. అకస్మాత్తుగా ఏనుగుల గుంపు రోడ్డుపైకి వచ్చి గందరగోళం సృష్టించింది. రైతు గోపిశెట్టి చిన్నారావు(53) పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. స్థానికులు వెంటనే రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారావు మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య రవణమ్మ, ఇద్దరు కుమారులున్నారు.

పార్టీ ఆదేశిస్తే పవన్‌పై పోటీచేస్తా

- రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 స్థానాల్లో విజయం సాధిస్తుంది
- రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ


మాట్లాడుతున్న అలీ

నగరి(చిత్తూరు జిల్లా): వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశిస్తే పవన్‌కళ్యాణ్‌పై పోటీచేస్తానని రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ చెప్పారు. అదే సమయంలో పార్టీ నిర్ణయిస్తే 175 నియోజకవర్గాల్లో ఎక్కడి నుంచి అయినా పోటీకి తాను సిద్ధమని తెలిపారు. నగరి పట్టణంలో మంగళవారం జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలీ మీడియాతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో 175 స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలుపొందడం ఖాయమన్నారు. పవన్‌కళ్యాణ్ 'రణస్థలం యువశక్తి' సభలో చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సాధారణమని అన్నారు. సినిమాలు వేరు, రాజకీయాలు వేరని పేర్కొన్నారు. అయితే, ఎవరు మేలు చేస్తారో ప్రజలకు తెలుసునని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి రోజాను పవన్‌కళ్యాణ్ అతి విలువైన డైమండ్‌తో పోల్చారన్నారు. తన సొంత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందరికీ మంచిచేస్తున్న రోజమ్మ నిజంగా కోహినూర్ డైమండే అని అలీ అన్నారు.

పట్టాలు తప్పిన ప్యాసింజర్ రైలు

- ప్రయాణికులు సురక్షితం

అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా): కేకేలైన్‌లో మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు ప్యాసింజర్ రైలుకు పెనుప్రమాదం తప్పింది. ఒక బోగీ పట్టాలు తప్పడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మండలంలోని కేకేలైన్ శివలింగపురం రైల్వే స్టేషన్‌యార్డులోని 45వ కిలోమీటరు వద్ద విశాఖపట్నం నుంచి కిరండూల్ వెళుతున్న ప్యాసింజర్ రైలు పట్టాలు క్రాస్ అవుతుండగా, రైలులోని ఒక బోగీ ట్రాలీ పట్టాలు తప్పింది. దీంతో లోకోపైలట్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. బోగీలో ప్రయాణిస్తున్న వారంతా సురక్షితంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న రైల్వే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి చేరుకుని పనులను పర్యవేక్షించారు. పట్టాలు తప్పిన బోగీని విడిచిపెట్టి మిగతా బోగీలతో కిరండూల్ ప్యాసింజర్‌ను మధ్యాహ్నం పంపించారు. కేకేలైన్‌లో యథావిధిగా రైళ్ల రాకపోకలు కొనసాగాయి.

నేడు ఎన్టీఆర్ పురస్కారాల ప్రదానం


కరపత్రాలను ఆవిష్కరించిన డాక్టర్ లక్ష్మీప్రసాద్

అల్లిపురం (విశాఖ దక్షిణ): లోక్‌నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిరిపురం, వుడా చిల్డ్రన్ ఎరీనాలో బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి ఎన్టీఆర్ పురస్కారాల ప్రదానం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతిఏటా ఆయన వర్ధంతి రోజున ఈ పురస్కారాలను ప్రదానం చేస్తామని చెప్పారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడుతూ 18 ఏళ్లుగా ఎన్టీఆర్ వర్ధంతి రోజున సాహిత్య పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. ఈ ఏడాది ప్రత్యేక పురస్కారం కింద రూ.2లక్షలు బహుమతి వేమూరి బలరామ్ (స్వాతి)కు అందజేయనున్నట్టు తెలిపారు. ప్రముఖ సినీ దర్శకుడు కె.రాఘవేంద్రరావు, నటులు జయప్రద, జయసుధలకు ఎన్టీఆర్ శతజయంతి పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. లోక్‌నాయక్ ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారాలు డాక్టర్ కూచిభొట్ల ఆనంద్, కోనేరు సత్యనారాయణ, గన్ని భాస్కరరావుకు అందజేయనున్నట్లు తెలిపారు.

స్మార్ట్ ఉచ్చులో కౌమారం

13-17 ఏళ్ల వారిలో 28 శాతం మంది రోజుకు 6 గంటలకు పైగా ఫోన్‌లోనే

సాక్షి, అమరావతి: స్మార్ట్ ఫోన్‌కు విద్యార్థి దశలోని బాలబాలికలు బానిసలుగా మారిపోతున్నారు. డిజిటల్ పరికరాలపై గంటల కొద్దీ గడుపుతూ సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. 13–17 ఏళ్ల వారిలో 28 శాతం మంది రోజుకు 6 గంటలకు పైగా ఫోన్‌లోనే గడిపేస్తున్నారని సర్వేల్లో బహిర్గతమైంది. వీరు భౌతికంగా సమాజంతో కంటే సోషల్ మీడియా ప్రపంచంలో ఎక్కువగా బతికేస్తున్నారు. ఫలితంగా తరగతుల్లో పాఠాలు వింటున్నప్పుడు, అసైన్‌మెంట్లు, ఇతర పనులు చేస్తున్నప్పుడు ఏకాగ్రత లోపించి ఇబ్బంది పడుతున్నట్టు ఢిల్లీలోని పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియాలో కమ్యూనిటీ మెడిసిన్ స్పెషలిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజజీవితంలో స్నేహితులు, కుటుంబ సభ్యులతో గడపడం కంటే సోషల్ మీడియాలో పరిచయస్తులనే ఎక్కువగా ఇష్టపడుతుండటాన్ని ప్రస్తావిస్తూ.. ఇది సామాజిక సంబంధాలపై ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు. మరోవైపు కామన్ సెన్స్ మీడియా అనే స్వచ్ఛంద సంస్థ ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో ఆన్‌లైన్ పోర్నోగ్రఫీలోకి యువత అనుకోకుండా జారిపోతున్నారని వెల్లడించింది. 1,350 మంది యుక్త వయస్కులు పాల్గొన్న సర్వేలో 58 శాతం మంది అనుకోకుండా అశ్లీల వీడియోలను వీక్షిస్తున్నట్లు వెల్లడైంది.

నాలుగింట ఒక వంతు..

కౌమార దశలో (13–17 ఏళ్ల) ఉన్న పిల్లలు నాలుగింట ఒక వంతుకు పైగా రోజుకు ఆరు గంటలు దాటి స్మార్ట్ ఫోన్‌కే అతుక్కుపోతున్నారు. ఈ విషయంలో 2019లో జరిగిన సర్వేలో 15 శాతం మంది పిల్లలు స్మార్ట్‌ఫోన్ వదలట్లేదని అప్పట్లో తల్లిదండ్రులు చెబితే.. ఇప్పుడు ఆ సంఖ్య భారీగా పెరగడంపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆ స్వచ్ఛంద సంస్థ 9,633 మంది తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలను సేకరించింది.

సోషల్ మీడియా ద్వారానే..

ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడే టీనేజర్లకు ఆ గేమ్స్ ఆడే స్నేహితుల ద్వారా అశ్లీలత పరిచయం అవుతున్నట్టు సర్వేలో తేలింది. ఇందులో ఇంకా విస్తుగొలిపే విషయం ఏంటంటే.. 13 ఏళ్లలోపు వారిలో 50 శాతం మంది అలా పోర్న్ వీడియోలకు పరిచయం అవుతున్నట్లు సర్వే పేర్కొనడం. అయితే.. సోషల్ మీడియా, రీల్స్ ద్వారా ఎక్కువ మంది పోర్న్‌కు ఆకర్షితులు అవుతున్నారు. 44 శాతం మంది ఆన్‌లైన్ వెబ్‌సైట్లు, 4 శాతం మంది యూట్యూబ్ స్ట్రీమింగ్, 34 శాతం మంది సబ్‌స్క్రిప్షన్ సైట్‌లు, లైవ్ స్ట్రీమింగ్ ద్వారా అశ్లీలతను చూస్తున్నారు. ఈ క్రమంలోనే సోషల్ మీడియా వినియోగ ప్రారంభ వయసును 13 నుంచి 15కు పెంచాలని నిపుణులు సూచిస్తున్నారు. చాలా మంది 10 ఏళ్ల లోపు చిన్నారులు కూడా సొంతంగా సోషల్ మీడియా ఖాతాలు కలిగి ఉన్నారని, నిబంధనలు ఎక్కడ అమలవుతున్నాయని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. దేశంలో కొత్త ఐటీ రూల్స్ 2021 ప్రకారం అనేక అశ్లీల వెబ్‌సైట్‌లపై నిషేధం ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో అడ్డుకట్ట పడకపోవడం కూడా యువత పెడదారి పట్టడానికి కారణం అవుతోందని విమర్శిస్తున్నారు.



రోజులో కౌమార పిల్లల స్మార్ట్ ఫోన్ వినియోగం ఇలా..

గంటలు	శాతం
6కు పైగా	28
3-6	34
1-3	16
గంట లోపు	6
అప్పుడప్పుడు	4
చెప్పలేం	12

అంజూను మర్చిపోలేం

- తెనాలిలో ఇంటర్ చదివిన నేపాల్ విమాన కోపైలట్
- ప్రమాదంలో మరణించడంతో షాక్‌కు గురైన సహ విద్యార్థులు


అంజూ (ఫైల్)

తెనాలి: నేపాల్‌లోని పొఖారాలో జరిగిన విమాన ప్రమాదంలో కోపైలట్ అంజూ ఖతివాడ మరణించడంతో.. తెనాలిలోని ఆమె సహ విద్యార్థులు షాక్‌కు గురయ్యారు. నేపాల్‌లోని విరాట్ నగర్‌కు చెందిన అంజూ 1995లో తెనాలిలోని వివేకానంద జూనియర్ కాలేజీలో ఇంటర్ విద్యాభ్యాసం చేశారు. ఆ బ్యాచ్‌లో నేపాలీలు మొత్తం 125 మంది వరకు ఉన్నారని.. అందులో అంజూ అందరితో కలివిడిగా.. చదువులో చురుగ్గా ఉండేదని వివేకానంద విద్యాసంస్థల సిబ్బంది చెప్పారు. బైపీసీలో చేరిన అంజూ 72 శాతం మార్కులు సాధించిందని.. వాట్సాప్ గ్రూప్ ద్వారా అందరితో టచ్‌లో ఉండేదని ఆమె సహ విద్యార్థి లింగం మకుటం శివకుమార్ చెప్పారు. ఆమె భర్త కూడా పైలట్ అని.. ఓ విమాన ప్రమాదంలో మరణించారని పేర్కొన్నారు. బీమా డబ్బుతో అంజూ పైలట్ శిక్షణ తీసుకుందని చెప్పారు. 6,400 గంటలకు పైగా విమానం నడిపిన అంజూ ఇలా ప్రమాదంలో మరణించడాన్ని నమ్మలేకపోతున్నామన్నారు. అంజూను ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. కాగా, అంజూ మృతి పట్ల వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ సంతాపం తెలిపారు..

మల్లన్న హుండీ ఆదాయం రూ.3.57 కోట్లు


భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న దేవస్థాన సిబ్బంది, శివసేవకులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం ఉభయ దేవాలయాల్లోని హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. నగదు రూపంలో రూ.3,57,81,068 వచ్చినట్లు దేవస్థానం ఈవో ఎస్.లవన్న తెలిపారు. గత 28 రోజులలో భక్తులు ఈ కానుకలను సమర్పించారని పేర్కొన్నారు. నగదుతో పాటు 103 గ్రాములకు పైగా బంగారం, 7 కేజీల 520 గ్రాముల వెండి లభించిందన్నారు. అలాగే యూఎస్‌ఏ డాలర్లు–243, యూఏఈ దిర్హమ్స్–220, సింగపూర్ డాలర్లు–61, ఆస్ట్రేలియా డాలర్లు–175, కెనడా డాలర్లు–20, యూరో–150, ఇంగ్లాండ్ పౌండ్స్–25 తదితర విదేశీ కరెన్సీ వచ్చిందని తెలిపారు.

శాస్త్రోక్తంగా యాగ పూర్ణాహుతి

శ్రీశైలంలో నిర్వహిస్తున్న సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం యాగ పూర్ణాహుతి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు విశేష పూజలు జరిపారు. యాగశాలలో చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించి పూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూల స్నానం, మహదాశీర్వచనం చేశారు. చండీశ్వరస్వామికి సరస్వి పుష్కరిణిలో అవభృథస్నానం నిర్వహించారు. ఆలయ ధ్వజస్తంభంపై ఆవిష్కరింపజేసిన ధ్వజపటం అవరోహణ చేశారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు బుధవారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు అశ్వవాహనసేవ, పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ జరిపిస్తారు. ఆయా ఉత్సవాలతో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

అమరావతిని అడవిలా మార్చిన బాబు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: తాను అధికారంలో ఉండగా.. మూడు పంటలు పండే భూములు లాక్కున్న చంద్రబాబు అమరావతి ప్రాంతాన్ని అడవిలా మార్చాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. అదిచాలక బాబు అధికారంలో ఉంటే ఇక్కడ ప్రపంచ స్థాయి రాజధాని చేసేవాడంటూ ఎల్లోమీడియాలో తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 842వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో మంగళవారం పలువురు ప్రసంగించారు. తాత్కాలికంగా కట్టిన నాలుగైదు నిర్మాణాలు, అరకొర రహదారులు మినహా బాబు అమరావతిలో చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ మతిభ్రమించి మాట్లాడుతున్నాడని, ప్యాకేజీలు తీసుకుని చంద్రబాబు కోసం పాకులాడుతుండటం సిగ్గుచేటన్నారు. ఏపీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మంత్రి పదవులు, నామినేటెడ్ పదవుల్లో 50 శాతానికి పైగా సీట్లు కేటాయిస్తున్న సీఎం జగనన్నకు బహుజనులు జీవితాంతం రుణపడి ఉంటారన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు, బొలిమేర శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కథనాలతో బురదజల్లితే ఊరుకోను

ఆంధ్రజ్యోతి, ఈనాడుపై మంత్రి ఉషశ్రీ చరణ్ ఆగ్రహం

- సర్వే నం.229లో 70.45 ఎకరాలు సుజలాన్ కంపెనీవే
- నాపై కావాలనే అసత్య కథనాలు
- ఆ రెండు పత్రికలు, ఉన్నం మారుతి చౌదరిపై కోర్టుకెళ్తా


టీడీపీ హయాంలో జరిగిన దోపిడీపై పత్రికల్లో వచ్చిన కథనాలను చూపుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

కళ్యాణదుర్గం: తప్పుడు కథనాలతో తనపై బురద చల్లితే ఊరుకోనని, అసత్య ప్రచారం చేస్తున్న వారిపై కోర్టుకెళ్తానని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ చెప్పారు. తనపై అసత్య కథనాలు ప్రచురించిన ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు, టీడీపీ నాయకులపై మంగళవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ మహిళ రాష్ట్ర మంత్రిగా ఉండటాన్ని ఓర్వలేక పోతున్నారన్నారు. తాను రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని చెబుతున్న సర్వే నంబర్ 229లోని 70.45 ఎకరాల భూమి సుజలాన్ కంపెనీదేనని తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖ రికార్డుల్లోనూ అదే ఉందన్నారు. ఆ భూమి తన పేరునో, తన భర్త పేరునో లేదని, ఇప్పటికీ సుజలాన్ కంపెనీ పేరునే ఉందని స్పష్టంచేశారు. చట్టప్రకారమే భూములు కొన్నామని, ఆ కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌ను అడిగితే వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. తాను ఎమ్మెల్యే కాకముందే స్థలం కొన్నానని చెప్పారు. తన పరువుకు భంగం కలిగించిన ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రికలు, వాటి వెనుక ఉండి తప్పుడు కథనాలు రాయించిన ఉన్నం మారుతి చౌదరిపై న్యాయ పోరాటం చేస్తానని చెప్పారు. 2014లో, ఇప్పుడు టీడీపీ నేతల ఆస్తులెంతో చెప్పగలరా అని అన్నారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి ఉమామహేశ్వరనాయుడు మోటార్లు పెట్టి సొంత తోటకు నీటిని పంప్ చేయలేదా అని ప్రశ్నించారు. లక్ష్మమ్మ అనే మహిళకు ఆయన డబ్బులు ఎగ్గొట్టిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఉన్నం మారుతి డెంటల్ డాక్టర్ కాదని, మెంటల్ డాక్టర్ అని అన్నారు. లారీ యజమానులు, రైల్వే కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని టీడీపీ అధినేతే మారుతి గురించి చెప్పారన్నారు. మారుతి తమ్ముడు ఉదయ్ చౌదరిపైన అక్రమ సారాయి రవాణా కేసు ఉందన్నారు.

తాను మంత్రి హోదాలో తొలిసారి కళ్యాణదుర్గం వస్తే.. ఓ చిన్నారి మరణానికి తానే కారణమంటూ రాద్ధాంతం చేశారని అన్నారు. జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప సీసీ ఫుటేజీలతో వాస్తవాన్ని చూపించడంతో వాళ్ల నోళ్లు మూతపడ్డాయన్నారు. సుబేదారు చెరువు భూముల్లో టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ గోవిందప్ప, ఇతరుల పేరున స్థలం ఉందని, తానే చెరువును కబ్జా చేశానని రాశారని చెప్పారు. చెరువు పక్కనే టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి కుటుంబం భూములు ఉన్నా.. ఆ పత్రికలకు కనబడలేదన్నారు. రూ.200 కోట్ల అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పాలని సీపీఐ, సీపీఎం నాయకులను ప్రశ్నించారు. ఉన్నం కుమారులు వేసిన లేఅవుట్‌లో మున్సిపాలిటీకి ఇవ్వాల్సిన భూమి ఇచ్చారా అని ప్రశ్నించారు. సీపీఎం సంజీవయ్య గారికి అది ఎందుకు కనిపించలేదని, ఏమైనా ప్యాకేజీ ముట్టిందా అని అన్నారు. కళ్యాణదుర్గంలో టీడీపీ నాయకుల లే అవుట్‌లలో పన్ను వసూలు చేయిస్తానని, మున్సిపాలిటీకి దక్కాల్సిన స్థలాన్ని ఇప్పిస్తానని చెప్పారు.

రాయదుర్గం పీఎస్‌లో నిందితుడి ఆత్మహత్య

- లుంగీతో ఫ్యానుకు ఉరివేసుకున్న గొర్రెల దొంగ
- అర్బన్ సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు, హోంగార్డు సస్పెన్షన్
- మృతుడిపై జిల్లాలో, ఇతర రాష్ట్రాల్లోనూ కేసులు


జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప

రాయదుర్గం/అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం జిల్లా రాయదుర్గం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం అర్ధరాత్రి గొర్రెల దొంగ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని పైతోట వద్ద ఆదివారం అర్ధరాత్రి ఆత్మకూరు మండలం సనపకు చెందిన కురబ రామాంజనేయులు (అలియాస్) అంజి (28), శ్రీనివాసులు స్థానిక రైతు మధు పొలంలో ఉన్న పొట్టేళ్లను చోరీ చేస్తూ స్థానికులకు పట్టుబడ్డారు. వారిని చితకబాదిన స్థానికులు అర్బన్ పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. వారిద్దరినీ విచారణ నిమిత్తం కోర్టుకు హాజరు పరచకుండా పోలీసు స్టేషన్‌లోనే ఉంచారు. సోమవారం రాత్రి రామాంజనేయులును కంప్యూటర్ గదిలో ఉంచగా, అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో లుంగీతో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. బెంచి పడిన శబ్దం విన్న పోలీసులు వెంటనే ఆ గదిలోకి వెళ్లి, అతన్ని కిందకి దించి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికే అతను చనిపోయాడు. విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప, డీఎస్పీ బీ శ్రీనివాసులు పోలీసు స్టేషన్‌కు చేరుకుని విచారణ చేపట్టారు. ఈ ఘటనలో సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఎస్పీ తెలిపారు. నిందితులను లాకప్‌లో కాకుండా కంప్యూటర్ గదిలో పెట్టడం, సరైన పర్యవేక్షణ ఉంచకపోవడాన్ని ఎస్పీ తీవ్రంగా పరిగణించారు. ఈ మేరకు డీఐజీకి సమాచారం పంపామన్నారు. విచారణ నిమిత్తం మాత్రమే వెంటనే కోర్టుకు హాజరు పరచలేదని వెల్లడించారు. రామాంజనేయులుపై జిల్లాలో 17 చోరీ కేసులు, ఇతర రాష్ట్రాల్లోనూ మరో 13 కేసులు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో సీఐ శ్రీనివాసులు, నిందితుల పర్యవేక్షణకు నియమించిన కానిస్టేబుల్ గంగన్న, సెంట్రీ డ్యూటీ కానిస్టేబుల్ మధుబాబు, హోంగార్డు రమేష్‌లను సస్పెండ్ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఘటనపై కళ్యాణదుర్గం ఆర్డీవో నిశాంత్‌రెడ్డి విచారణ చేపట్టారు. రామాంజనేయులు ఉరి వేసుకోవడం వల్లే మృతి చెందినట్లు పోస్టుమార్టం నిర్వహించిన హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

పోలీసుల ప్రమేయం ఉండదు : భార్య మమత

రామాంజనేయులు తండ్రి ప్రభాకర్, భార్య మమత, కుమారుడు కౌసిక్‌లతో పాటు వారి బంధువులను రాయదుర్గం ఆస్పత్రి వద్ద ఆర్డీవో, డీఎస్పీ విచారించారు. తన భర్త తరచూ చోరీలకు పాల్పడుతుండడంతో తాను పుట్టింట్లోనే ఉంటున్నట్లు భార్య మమత చెప్పారు. చోరీలు మానుకోవాలని, లేదంటే తామే ఆత్మహత్య చేసుకుంటామని ఇటీవల గట్టిగా మందలించామన్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకునే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని, ఇందులో పోలీసుల ప్రమేయం ఉండదని వెల్లడించారు.

దేశవ్యాప్తంగా బీఎస్‌ఎన్‌ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా


ధర్నాలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు, పెన్షనర్లు

డాబాగార్డెన్స్: పెన్షన్ రివిజన్ వెంటనే చేపట్టాలని కోరుతూ అఖిల భారత బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏఐ బీఎస్‌ఎన్‌ఎల్ పీడబ్ల్యూఏ) ఆధ్వర్యంలో మంగళవారం దేశవ్యాప్తంగా ధర్నా నిర్వహించారు. విశాఖలోని డాబాగార్డెన్స్‌లో ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్ పీజీఎం కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఎంఆర్ పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ..పెన్షన్ రివిజన్ కోసం కేంద్ర నాయకత్వం దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను రూపొందించినట్లు చెప్పారు. అందులో భాగంగా జనవరి 17,18 తేదీల్లో, ఫిబ్రవరి 8న ఢిల్లీలోని సంచార్ భవన్‌తో సహా దేశంలోని అన్ని సీసీఏ ప్రధాన కార్యాలయాల వద్ద ధర్నాలు, ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెన్షన్ రివిజన్ చేపట్టాలని లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా కార్యదర్శి కే.సోమసుందరరావు మాట్లాడుతూ..2017 జనవరికి ముందు ,ఆ తరువాత పదవీ విరమణ చేసిన వారందరికీ ఐడీఏ పే స్కేల్ ప్రకారం పెన్షన్ రివైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ సర్కిల్ ఉపాధ్యక్షుడు దేముళ్లు, సర్కిల్ సహాయ కార్యదర్శి కేవీడీ స్వామి, అధిక సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

బొగ్గు సమకూర్చుకోండి

- లేకపోతే విద్యుత్ కోతలు తప్పవని హెచ్చరించిన కేంద్రం

సాక్షి, అమరావతి: విద్యుత్ వినియోగం ఈ ఏడాది భారీగా పెరగనుందని, ఆ మేరకు సన్నద్ధం కావాలని రాష్ట్రాలకు కేంద్రం హెచ్చరికలు జారీచేసింది. 2015తో పోలిస్తే 2030కల్లా ఇళ్లల్లో సగటు విద్యుత్తు వినియోగం 1.5 నుంచి 2.5 రెట్లు పెరగనుందని, అంటే ఏటా 5 నుంచి 7.8 శాతం విద్యుత్ వినియోగం పెరుగుతుందని తెలిపింది. ఈ నేపథ్యంలో విద్యుత్తును జాగ్రత్తగా వాడుకోవడంపైన, విద్యుత్ ఆదాపైన వినియోగదారులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించింది. ముఖ్యంగా ఈ ఏడాది ఏర్పడే విద్యుత్ డిమాండ్‌ను అందుకోవడం కోసం ఉత్పత్తికి అవసరమయ్యే బొగ్గును సమకూర్చుకోవాలని రాష్ట్రాలకు కేంద్ర విద్యుత్‌శాఖ దిశా నిర్దేశం చేసింది. ఇందుకోసం ఇప్పుడు వినియోగిస్తున్న బొగ్గుకు దాదాపు 40 శాతం నుంచి 50 శాతం అదనంగా సమకూర్చుకోవాలని సూచించింది. విదేశీ బొగ్గును ఆరుశాతం దిగుమతి చేసుకుని స్వదేశీ బొగ్గుతో కలిపి వాడుకోవాలని చెప్పింది. మరో తొమ్మిది నెలలు ఇలా చేయకతప్పదని, లేదంటే వచ్చే ఏప్రిల్–డిసెంబర్ మధ్య విద్యుత్ కోతల నుంచి తప్పించుకోవడం అసాధ్యమని స్పష్టం చేసింది.

ర్యాక్‌లు పెంచకపోతే ఎలా..

దేశంలోని మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో 70 శాతం థర్మల్ నుంచే వస్తోంది. 2021 అక్టోబర్‌లో మన దేశంలో తీవ్ర బొగ్గు కొరత ఏర్పడింది. థర్మల్ కేంద్రాలకు బొగ్గు లేకపోవడంతో విద్యుత్ కోతలు తప్పలేదు. అలాంటి సమయంలో కూడా మన రాష్ట్రంలో అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేసి ప్రజలకు అందించారు. అయితే రాష్ట్రంలో ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధి వేగవంతమవడంతో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరుగుతోంది. ప్రభుత్వం పారిశ్రామికీకరణతోపాటు, గ్రామాల అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేకదృష్టి సారించినందున రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 2017–18 లో 50,077 మిలియన్ యూనిట్లు ఉండగా 2021–22లో 60,943 మిలియన్ యూనిట్లకు చేరింది. అంటే 21.6 శాతం మేర విద్యుత్ డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది మార్చి నాటికి విద్యుత్ డిమాండ్ రోజుకు 250 మిలియన్ యూనిట్లకు చేరుకుంటుందని ఇంధన శాఖ అంచనా వేస్తోంది. ప్రస్తుత వినియోగంలో 69.44 మిలియన్ యూనిట్లు ఏపీ జెన్‌కో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచే వస్తోంది. వీటీపీఎస్‌లో 45,422 మెట్రిక్ టన్నులు, ఆర్టీపీపీలో 44,585 మెట్రిక్ టన్నులు, కృష్ణపట్నంలో 1,23,044 మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు న్నాయి. ఇవి రెండురోజుల నుంచి ఆరురోజుల వరకు విద్యుత్ ఉత్పత్తికి సరిపోతాయి. కేంద్రం చెప్పినట్టు బొగ్గు నిల్వలు పెంచుకోవాలంటే ఇప్పుడిస్తున్న 14 రైల్వే ర్యాక్‌లు సరిపోవడం లేదని ఏపీజెన్‌కో చెబుతోంది. మరో ఆరు ర్యా క్‌లు పెంచాలని కోరుతోంది. అప్పుడే మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి, సింగరేణి కాలరీస్ నుంచి బొగ్గును త్వరితగతిన, అధికంగా రవాణా చేసుకోగలుగుతామని పేర్కొంటోంది.

యుద్ధాలతో గుణపాఠాలు నేర్చుకున్నాం

పాక్ ప్రధాని షహబాజ్ వ్యాఖ్యలు
భారత్‌తో చర్చలకు సిద్ధమని ప్రకటన



ఇస్లామాబాద్: భారత్‌తో మూడు యుద్ధాల అనంతరం గుణపాఠాలు నేర్చుకున్నామని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అంగీకరించారు. ''భారత్‌తో మూడు యుద్ధాలు చేశాం. సాధించిందేమీ లేదు. పైగా పేదరికం, వేదన, నిరుద్యోగం వచ్చి మీదపడ్డాయి. యుద్ధాలతో గుణపాఠాలు నేర్చుకున్నాం. ఇకమీదటైనా శాంతిమయ జీవనం కొనసాగిస్తాం. తరాలుగా కొనసాగుతున్న సమస్యలకు చెక్ పెడదాం. బాంబులు, మందుగుండు సామగ్రి కోసం అమూల్యమైన సహజ వనరులను దుర్వినియోగం చేయడం ఆపేద్దాం. దశాబ్దాలుగా ఘర్షణలకు, యుద్ధాలకు కారణమైన కశ్మీర్ వంటి కీలకాంశాలపై భారత్‌తో నిజాయతీతో చర్చలకు సిద్ధం'' అని అల్ అరేబియా ఛానెల్ ఇంటర్వ్యూలో అన్నారు. యూఏఈ మధ్యవర్తిత్వంలో చర్చలు జరిపితే బాగుంటుందన్నారు. 'ప్రధాని మోదీజీకి నా సందేశం ఒక్కటే. పాకిస్తాన్, ఇండియా పొరుగుదేశాలుగా జీవించాల్సిందే. సంఘర్షణల మధ్య సమయాన్ని, సహజ వనరులను వృథా చేయడం దండగ. శాంతి సామరస్యాలతో పురోగమిద్దాం' అన్నారు.

క్లుప్తంగా...

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని బుద్గాంలోని కోర్టు భవన సముదాయం సమీపంలో మంగళవారం ఎదురుకాల్పుల ఘటనలో ఇద్దరు లష్కరే తోయిబా ఉగ్రవాదులు హతమయ్యారు. గతవారం మగమ్ ఏరియాలో కార్డన్ సెర్చ్‌లో వీరిద్దరూ తప్పించుకున్నారని పోలీసులు చెప్పారు. వారి నుంచి ఏకే రైఫిల్, పిస్టల్ స్వాధీనం చేసుకున్నారు.

దావూద్‌కు మళ్లీ పెళ్లి

ముంబై: అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంకు రెండో పెళ్లి చేసుకున్నాడట! ఒక కేసు విచారణ సందర్భంగా ఎన్ఐఏ అధికారులకు అతని మేనల్లుడు అలీ షా పార్కర్ ఈ మేరకు వెల్లడించారు. ''దావూద్‌కు నలుగురు సోదరులు, నలుగురు అక్కాచెల్లెళ్లు. మొదటి భార్య పేరు మెజబిన్. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. ఇద్దరు కుమార్తెలకు పెళ్లయింది. కుటుంబసభ్యులతో కలిసి దావూద్ కరాచీలో ఉంటున్నాడు. ఇటీవలే డిఫెన్స్ ఏరియాలోని రహీం ఫాకీకి మారాడు. మొదటి భార్యను ఆరు నెలల క్రితం దుబాయ్‌లో కలిశాం. ఆమె నా భార్యకు తరచూ వాట్సాప్ కాల్స్ చేస్తుంది. ఆమెకు విడాకులిచ్చానని అబద్ధం చెప్పి ఓ పాకిస్తానీ పఠాన్ మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు'' అని చెప్పాడు.

'ఢిల్లీ' నిందితునికి బెయిల్

న్యూఢిల్లీ: ఢిల్లీలో అంజలి(20)అనే యువతిని కారుతో ఢీకొట్టి 12 కిలోమీటర్లు లాక్కెళ్లిన కేసు నిందితుల్లో ఒకరైన అశుతోష్ భరద్వాజ్‌కు మంగళవారం కోర్టు బెయిలిచ్చింది. ఈ కేసులో ఆరుగురు నిందితులపై తాజాగా హత్యాభియోగం మోపినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. నేరం రుజువైతే మరణ శిక్ష లేదా జీవిత ఖైదు, జరిమానా విధించే అవకాశముంది.

కారును ఢీకొట్టి.. వృద్ధుడిని ఈడ్చుకెళ్లి..!

శివాజీనగర: నిలిపి ఉన్న కారును స్కూటర్‌తో ఢీకొట్టిన ఓ వ్యక్తి, ఆపేందుకు యత్నించిన వృద్ధ డ్రైవర్‌ను కిలోమీటర్ దూరం ఈడ్చుకెళ్లాడు. బెంగళూరులోని మగడి రోడ్డులో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేసే సాహిల్(22) స్కూటర్‌పై రాంగ్‌రూట్లో వెళ్తూ మాగడి రోడ్డు టోల్ గేట్ వద్ద నిలిపి ఉన్న బొలెరో వాహనాన్ని ఢీకొన్నాడు. బొలెరో వాహనదారు ముత్తప్ప, ఆ యువకున్ని ప్రశ్నించగా పరారయ్యేందుకు యత్నించాడు. ముత్తప్ప స్కూటర్‌ను పట్టుకోగా అలాగే కిలోమీటర్ దూరం ఈడ్చుకెళ్లాడు. ఆటో డ్రైవర్లు, ఇతరులు వేరే వాహనంలో వెంటాడి స్కూటరిస్టును అడ్డుకుని చితకబాదారు. నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు.

చక్కెర స్థాయిలను సహజంగా నియంత్రించే... కృత్రిమ క్లోమం

తొలి పరీక్ష ఇప్పటికే విజయవంతం • త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం



లండన్: టైప్–2 మధుమేహులకు ఇది నిజంగా శుభవార్తే! ప్రపంచవ్యాప్తంగా మధుమేహం బారిన పడుతున్న వారి సంఖ్య బాగా పెరుగుతోంది. భారత్‌లోనైతే 2019 నాటికి ఏకంగా 7.7 కోట్ల మంది దీని బారిన పడ్డారు. 2045 కల్లా వీరి సంఖ్య 13.4 కోట్లకు పెరుగుతుందని అంచనా. ఈ నేపథ్యంలో ఒంట్లో చక్కెర మోతాదులను ఆరోగ్యకరమైన స్థాయిలో ఉంచేందుకు దోహదపడే కృత్రిమ క్లోమాన్ని కేంబ్రిడ్జి వర్సిటీలోని వెల్‌కమ్–ఎంఆర్‌సీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటబాలిక్ సైన్స్ పరిశోధకులు తాజాగా అభివృద్ధి చేశారు. దీన్నిప్పటికే విజయవంతంగా పరీక్షించి చూశారు కూడా! టైప్–2 డయాబెటిస్‌తో బాధపడుతున్న వారికి ఇది వరప్రసాదమేనని వారు చెబుతున్నారు. కామ్‌ఏపీఎస్ హెచ్‌ఎక్స్‌గా పిలిచే దీంట్లో గ్లూకోజ్ మానిటర్, ఇన్సులిన్ పంపు ఉంటాయి. ఇది యాప్ సాయంతో పని చేస్తుంది. చక్కెర స్థాయి సరైన విధంగా కొనసాగాలంటే ఎప్పుడు ఎంత ఇన్సులిన్ అవసరమో అంచనా వేసి చెబుతుంది. ''ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇన్సులిన్ ఇంజక్షన్లు తదితరాలతో బ్లడ్ షుగర్ లెవెల్స్‌ను సరిగా మెయింటెయిన్ చేయడం టైప్ 2 డయాబెటిస్ రోగుల్లో చాలామందికి సమస్యగా మారింది. అలాంటి వారికి ఈ కృత్రిమ క్లోమం సురక్షితమైన, మెరుగైన ప్రత్యామ్నాయం. దీని టెక్నాలజీ చాలా సులువైనది. కనుక ఇంట్లో సురక్షితంగా వాడుకోవచ్చు'' అని అధ్యయనానికి సారథ్యం వహించిన చార్లొటీ బౌటన్ తెలిపారు. దీని వివరాలు జర్నల్ నేచర్ మెడిసిన్‌లో పబ్లిషయ్యాయి.

ఇలా చేశారు...

కామ్‌ఏపీఎస్ హెచ్‌ఎక్స్‌ను తొలుత 26 మంది టైప్–2 డయాబెటిస్ రోగులపై ప్రయోగాత్మకంగా వాడి చూశారు. వీరిని రెండు గ్రూపులుగా చేశారు. తొలి గ్రూపు 8 వారాల పాటు కృత్రిమ క్లోమాన్ని వాడి తర్వాత రోజువారీ ఇన్సులిన్ ఇంజక్షన్ల వంటి పద్ధతులకు మారింది. రెండో గ్రూప్ ఇందుకు సరిగ్గా వ్యతిరేకంగా తొలుత రోజువారీ ఇన్సులిన్ ఇంజక్షన్ల వంటివి వాడి అనంతరం 8 వారాల పాటు కృత్రిమ క్లోమాన్ని ఉపయోగించింది. రెండు గ్రూపుల్లోనూ కృత్రిమ క్లోమాన్ని వాడినప్పుడు రోగుల్లో సగటు చక్కెర స్థాయిలు 3 ఎంఎంఓఎల్/ఎల్ మేరకు పడిపోయినట్టు గుర్తించారు. అంతేగాక రక్తంలో హిమోగ్లోబిన్ చక్కెరతో కలిసినప్పుడు వృద్ధి చెందే గ్లైకేటెడ్ హిమోగ్లోబిన్ (హెచ్‌బీఏ1సీ) అణువుల మోతాదు కూడా తగ్గినట్టు తేలింది. ఇన్సులిన్ ఇంజక్షన్లతో నానా రకాల సైడ్ ఎఫెక్టులున్న నేపథ్యంలో కృత్రిమ క్లోమం చాలా మెరుగైన ప్రత్యామ్నాయం కాగలదని కేంబ్రిడ్జి వర్సిటీకి చెందిన డాక్టర్ ఐదీన్ డాలీ అభిప్రాయపడ్డారు. ''ఇన్సులిన్ థెరపీ వల్ల బ్లడ్ షుగర్ స్థాయిలు ప్రమాదకరంగా పడిపోయే రిస్కు తరచూ తలెత్తుతుంది. కనుక వాటిని విస్తృతంగా వాడే పరిస్థితి లేదు. కానీ మా ప్రయోగాల్లో కృత్రిమ క్లోమం వాడిన ఒక్క రోగిలోనూ బ్లడ్ షుగర్ లెవెల్స్ ఉండాల్సినంత కంటే మరీ తక్కువకు పడిపోలేదు. ఇది చాలా గొప్ప విషయం'' అని ఆయన వివరించారు. వాణిజ్యపరంగా రోగులకు దీన్ని మార్కెట్లో అందుబాటులోకి తెచ్చే ముందు మరింత విస్తృతంగా ప్రయోగాలు జరిపేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

మోదీ శంఖారావం

ఎన్నికలకు మరో 400 రోజులే
- టాప్ గేర్లోకి వెళ్లాల్సిన టైమొచ్చింది
- బీజేపీ నేతలకు, శ్రేణులకు పిలుపు
- కార్యకర్తలుగా సరిహద్దు యువత
- గత ప్రభుత్వాల అవినీతి గురించి యువతకు అర్థమయేలా చెప్పండి
- 9 రాష్ట్రాల ఎన్నికల్లో నెగ్గి తీరాలి
- బీజేపీ జాతీయ కార్యవర్గ భేటీలో ప్రధాని దిశానిర్దేశం
- అతి విశ్వాసం వద్దని హెచ్చరిక



న్యూఢిల్లీ: ఏడాదిన్నర ముందే ప్రధాని మోదీ ఎన్నికల శంఖం పూరించారు. ''లోక్‌సభ ఎన్నికలు కేవలం 400 రోజుల దూరంలోనే ఉన్నాయి. ఇక టాప్ గేర్లో దూసుకెళ్లాల్సిన సమయం వచ్చేసింది. చరిత్ర సృష్టిద్దాం పదండి'' అంటూ బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశ రాజధానిలో జరుగుతున్న బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో చివరి రోజైన మంగళవారం కీలకాంశాలపై లోతైన చర్చ జరిగింది. ఈ ఏడాది 9 రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై అన్ని రాష్ట్రాల నుంచి హాజరైన 350 మంది బీజేపీ అగ్ర నేతలు, కేంద్ర మంత్రులు, సీఎంలు కూలంకషంగా చర్చించారు. చివరగా మోదీ కీలకోపన్యాసం చేశారు. భావి కార్యాచరణపై నేతలు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. 9 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు కీలకమైన 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. అతి విశ్వాసానికి ఎక్కడా చోటివ్వొద్దని హెచ్చరించారు. ''బోహ్రాలు, పాస్మాండాలు, సిక్కులు... ఇలా సమాజంలోని ప్రతి వర్గానికీ చేరువ కండి. ఎన్నికల లబ్ధి గురించి ఆలోచించకుండా వారి సంక్షేమం కోసం పాటుపడండి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింతగా ప్రజల వద్దకు తీసుకెళ్లండి. అన్నిచోట్లా, ముఖ్యంగా సరిహద్దు గ్రామాల్లో ముమ్మరంగా ప్రత్యేక కార్యక్రమాలు, మోర్చాలు నిర్వహించండి. అక్కడి ప్రజలకు మరింత చేరువ కండి. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను కూడా అక్కడికీ చేరవేయండి. సరిహద్దు గ్రామాల యువతను బీజేపీ కార్యకర్తలుగా తీర్చిదిద్దండి. తద్వారా అక్కడా పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయండి. 18–25 ఏళ్ల యువతకు దేశ రాజకీయ చరిత్ర తెలియదు. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన విచ్చలవిడి అవినీతి, తప్పిదాలు తెలియవు. వీటన్నింటిపైనా వారికి అవగాహన కల్పించండి. అంతటి దుష్పరిపాలనను బీజేపీ ఎలా సుపరిపాలనగా మార్చి చూపించిందో యువతలో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి'' అని సూచించారు. ''రానున్నది మన దేశానికి అత్యుత్తమ సమయం. వచ్చే పాతికేళ్ల అమృత కాలాన్ని కర్తవ్య కాలంగా మార్చుకుని కష్టపడితేనే దేశాన్ని ముందుకు తీసుకెళ్లగలం. ప్రజలకు సేవ చేసేందుకు అన్ని విధాలుగా కష్టపడదాం'' అన్నారు. ''అతి విశ్వాసానికి పోతే ప్రతికూల ఫలితాలు తప్పవు. 1998లో మధ్యప్రదేశ్‌లో దిగ్విజయ్‌సింగ్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉన్నా బీజేపీ కేవలం అతి విశ్వాసం వల్లే ఓడింది. కాబట్టి జాగ్రత్తగా ఉందాం'' అంటూ నేతలను హెచ్చరించారు. మోదీ ప్రసంగం స్ఫూర్తిదాయకంగా మాత్రమే గాక సరికొత్త దిశానిర్దేశం చేసేదిగా సాగిందని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పేర్కొన్నారు. ప్రసంగ విశేషాలను ఆయన మీడియాకు వెల్లడించారు. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' సాకారానికి కృషి చేయాల్సిందిగా బీజేపీ కార్యకర్తలకు మోదీ పిలుపునిచ్చారు. పార్టీ కంటే దేశానికి ప్రాధాన్యమిస్తూ రాజకీయ నాయకునిగా గాక రాజనీతిజ్ఞుడిగా ఆయన ప్రసంగం సాగింది'' అని ఫడ్నవీస్ చెప్పారు.

ధర్తీ బచావో...

పర్యావరణ పరిరక్షణకు నడుం బిగిద్దామని బీజేపీ శ్రేణులకు మోదీ పిలుపునిచ్చారు. ''బేటీ పఢావో మాదిరిగా ధర్తీ బచావో (భూమిని కాపాడండి) ఉద్యమానికి శ్రీకారం చుడదాం. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించుకుందాం. కాశీ–తమిళ సంగమం తరహాలో భిన్న సంస్కృతులను, ప్రాంతాలను కలిపే వారధిగా పార్టీని తీర్చిదిద్దుకుందాం'' అని సూచించారు.

సినిమాలపై అనవసర వ్యాఖ్యలొద్దు: మోదీ

సినిమాలు తదితర అంశాలపై అనవసర ప్రకటనలకు, వివాదాస్పద వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని బీజేపీ నేతలను, శ్రేణులను మోదీ ఆదేశించారు. ''ఏదో సినిమా గురించి మనవాళ్లలో ఎవరో ఏదో అంటారు. టీవీల్లో, మీడియాలో రోజంతా అదే వస్తుంది. అభివృద్ధి అజెండా తదితర అసలు విషయాలన్నీ పక్కకు పోతాయి. అందుకే అనవసర వ్యాఖ్యలేవీ చేయకండి'' అని కరాఖండిగా చెప్పినట్టు సమాచారం. షారుఖ్‌ఖాన్ నటించిన పఠాన్ సినిమాలో కాషాయాన్ని కించపరిచారంటూ దాని బహిష్కరణకు నరోత్తం మిశ్రా, రామ్ కదమ్ తదితర బీజేపీ నేతలు, మంత్రులు బహిరంగంగా పిలుపునివ్వడం, దానిపై విమర్శలు చెలరేగడం తెలిసిందే.

నడ్డాకు పొడిగింపు

- 2024 జూన్ దాకా ఆయనే బీజేపీ చీఫ్
- లోక్‌సభ ఎన్నికల్లో బంపర్ మెజారిటీ: అమిత్ షా

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల పోరు సమీపిస్తుండటంతో అస్త్రశస్త్రాలకు అధికార బీజేపీ పదును పెట్టుకుంటోంది. అందులో భాగంగా జగత్‌ప్రకాశ్ నడ్డా సారథ్యంలోనే ఎన్నికలకు వెళ్లాలని నిశ్చయించింది. పార్టీ అధ్యక్షునిగా ఆయన పదవీకాలాన్ని 2024 జూన్ దాకా కొనసాగిస్తూ బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మీడియాకు ఈ విషయం వెల్లడించారు. ''రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, నేను నడ్డా పేరును ప్రతిపాదించాం. పార్టీ కార్యవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది'' అని వివరించారు. పార్టీ అభ్యున్నతికి నడ్డా చిత్తశుద్ధితో పాటుపడ్డారంటూ ప్రశంసించారు. ''నడ్డా నేతృత్వంలో చాలా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాం. 120 ఉప ఎన్నికలు జరిగితే 73 చోట్ల నెగ్గాం. ఇవే కాదు, కరోనా వేళ పేదలకు ఆహారం, నిత్యావసరాలు, ఆస్పత్రుల్లో చికిత్స, మందులు తదితరాలు అందజేశాం. అదే బాటలో సాగుతూ 2024 లోక్‌సభ ఎన్నికల్లో మోదీ, నడ్డా సారథ్యంలో 2019 కంటే కూడా మెరుగైన ఫలితాలు సాధిస్తాం. మూడింట రెండొంతులకు పైగా మెజారిటీ సాధించి తీరతాం'' అంటూ షా ధీమా వెలిబుచ్చారు. 2019 లోక్‌సభ ఎన్నికల ముందు కూడా అప్పటి అధ్యక్షుడు అమిత్ షా పదవీ కాలాన్ని ఇలాగే పొడిగించడం తెలిసిందే. నడ్డా పదవీకాలం పొడిగింపుకు బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఇప్పటికే ఆమోదం తెలిపింది. తనపై నమ్మకముంచినందుకు ప్రధాని మోదీకి, జాతీయ కార్యవర్గ సభ్యులందరికీ నడ్డా కృతజ్ఞతలు తెలిపారు. మోదీ నాయకత్వంలో మూడింట రెండొంతులకు పైగా మెజారిటీ సాధించుకుందామంటూ ట్వీట్ చేశారు. కరోనా కారణంగా బీజేపీ సంస్థాగత ఎన్నికలు సకాలంలో జరగలేదు. కనీసం 55 శాతం రాష్ట్రాల్లో అవి జరిగిన తర్వాతే మూడేళ్ల పదవీ కాలానికి పూర్తిస్థాయి బాధ్యతలతో అధ్యక్షుని ఎన్నిక జరుగుతుందని అమిత్ షా గుర్తు చేశారు. ఈ ప్రక్రియ బహుశా వచ్చే లోక్‌సభ ఎన్నికల అనంతరం మొదలయ్యే అవకాశముంది. బీజేపీ నియమావళి ప్రకారం పార్టీ అధ్యక్షునిగా ఎవరైనా వరుసగా రెండుసార్లకు మించి కొనసాగడానికి వీల్లేదు.

మోదీని ప్రస్తుతిస్తూ తీర్మానం

ప్రధానిగా మోదీ సారథ్యంలో భారత్ ప్రపంచంలో ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందంటూ బీజేపీ జాతీయ కార్యవర్గం ప్రశంసించింది. ఈ మేరకు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రవేశపెట్టిన సామాజిక ఆర్థిక తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మీడియాకు ఈ మేరకు వెల్లడించారు. ప్రజల అవసరాలన్నింటినీ తీరుస్తూ సంతృప్త స్థాయి పాలనతో దూసుకెళ్తున్నామన్నారు. ''అయోధ్యలో రామమందిరం ఎప్పుడు నిర్మిస్తారో చెప్పండంటూ విపక్షాలు బీజేపీని ఎద్దేవా చేసేవి. మోదీ సారథ్యంలో నిర్మాణం మొదలు పెట్టడమే గాక ఇప్పుడు మందిర ప్రారంభ తేదీనీ ప్రకటించేశాం. ఇందుకు మోదీకి కార్యవర్గ భేటీ కృతజ్ఞతలు తెలిపింది'' అన్నారు. ఎనిమిదిన్నరేళ్ల పాలనలో బీజేపీ సాధించిన విజయాలను వివరించారు.

మృదుభాషికి పెను సవాలు

62 ఏళ్ల జేపీ నడ్డా స్వరాష్ట్రం హిమాచల్‌ప్రదేశ్ అయినా తండ్రి పట్నా వర్సిటీలో ప్రొఫెసర్ కావడంతో ఆయన పుట్టిందీ పెరిగిందీ బిహార్లోనే. మృదుభాషి అయిన నడ్డా లో ప్రొఫైల్లో ఉంటూ మోదీ, అమిత్ షా నీడన పని చేసుకోవడానికి ఇష్టపడతారు. ఆరెస్సెస్ విద్యార్థి విభాగమైన ఏబీవీపీ ద్వారా ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. 1991లో బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడయ్యారు. ఆ సమయంలో అమిత్ షా కూడా బీజేవైఎం నేతగా ఉండేవారు! 1993లో హిమాచల్‌లో విపక్ష నేతగా ఎన్నికయ్యారు. 1998లో రాష్ట్ర మంత్రి అయ్యారు. 2010లో నితిన్ గడ్కరీ అధ్యక్షునిగా ఉండగా జాతీయ ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి పొందారు. చివరికి 2020 జనవరి 20న బీజేపీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. ఆరెస్సెస్‌తో పాటు మోదీతోనూ సత్సంబంధాలుండటం ఆయనకు కలిసొచ్చింది. 2023లో కర్నాటక, రాజస్తాన్, మధ్యప్రదేశ్‌తో పాటు కీలకమైన పశ్చిమబెంగాల్, తెలంగాణల్లో పార్టీని గెలుపు బాటన నడపడం నడ్డా ముందున్న పెద్ద సవాలు!

అంతర్జాతీయ ఉగ్రవాదిగా మక్కీ

- ప్రకటించిన ఐరాస భద్రతా మండలి
- ఫలించిన భారత దౌత్యం



ఐక్యరాజ్య సమితి: పాకిస్తాన్ కేంద్రంగా భారత్‌పైకి ఉగ్రమూకలను ఉసిగొల్పుతున్న లష్కరే తోయిబా ఉగ్రసంస్థకు మరో ఎదురుదెబ్బ తగిలింది. దాని డెప్యూటీ చీఫ్ అబ్దుల్ రెహ్మాన్ మక్కీ(68)ని గ్లోబల్ టెర్రరిస్ట్‌గా ప్రకటించాలంటూ భారత్, అమెరికా చేసిన ప్రతిపాదనకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి పచ్చజెండా ఊపింది. ఆయనను బ్లాక్‌లిస్ట్‌లో చేరుస్తున్నట్లు మండలి సోమవారం ప్రకటించింది. దీంతో పాక్‌తో అంటకాగుతున్న మరో ఉగ్రమూక కీలక నేతను అంతర్జాతీయంగా ఆర్థిక కార్యకలాపాలు జరపకుండా నిరోధించడంలో ఐరాసలో భారత్ నెరిపిన దౌత్యం ఫలించింది. గ్లోబల్ టెర్రరిస్ట్‌గా ముద్రపడిన వ్యక్తుల ఆస్తుల స్వాధీనం, బ్యాంకింగ్, ఆర్థిక, ఆయుధాల కార్యకలాపాలకు అడ్డుకట్టపడుతుంది. ప్రస్తుతం లష్కరే తోయిబా రాజకీయ వ్యవహారాల విభాగం చీఫ్‌గా ఉన్న మక్కీ.. ఆ ఉగ్రసంస్థ చీఫ్ హఫీజ్ ముహమ్మద్ సయీద్‌కు అత్యంత సమీప బంధువు. మక్కీ గతంలో లష్కరే తోయిబాలో వివిధ విభాగాల్లో పనిచేశాడు. ఆ సంస్థకు అంతర్జాతీయంగా నిధులు సమకూర్చే పనిలో బిజీగా ఉండేవాడు. ఉగ్రవాదం కోసం నిధుల సేకరణ, యువతను ఉగ్రవాదంవైపునకు ఆకర్షించడం, భారత్‌పై దాడి, ముఖ్యంగా జమ్మూకశ్మీర్‌లో హింస, ఉగ్రదాడులకు తెగబడటం వంటివి పాల్పడినందుకు గ్లోబల్ టెర్రరిస్ట్‌గా ప్రకటించినట్లు ఐరాస పేర్కొంది. ఇన్నాళ్లూ ఇతడిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడానికి ఒప్పుకోని చైనా చివర్లో అందుకు సమ్మతించడం గమనార్హం. ఐరాస చర్యను భారత్ స్వాగతించింది. ఇంకా పొంచి ఉన్న ఉగ్రముప్పును ఎదుర్కోవడంలో, పరిస్థితి సద్దుమణిగేలా చేయడంలో ఇలాంటి చర్యలు అక్కరకొస్తాయని వ్యాఖ్యానించింది. ఉగ్రవాదంపై పోరును భారత్ ఇకమీదటా కొనసాగిస్తుందని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందం బాగ్చీ స్పష్టంచేశారు. జైషే మొహమ్మద్ చీఫ్ మసూద్ అజహర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటింపజేయడంలో 2019లో భారత్ సఫలీకృతమైంది.

గొంతు కోసినా ఆరెస్సెస్ ఆఫీసులో అడుగు పెట్టను: రాహుల్

వరుణ్ భావజాలాన్ని అంగీకరించలేను

హోషియార్‌పూర్: ''బీజేపీ, ఆరెస్సెస్ దేశంలో అన్ని వ్యవస్థలనూ చెరబట్టాయి. వాటిని పూర్తిగా నియంత్రిస్తున్నాయి'' అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దుయ్యబట్టారు. ఇప్పుడు న్యాయ వ్యవస్థను, కేంద్ర ఎన్నికల సంఘాన్ని కూడా తీవ్ర ఒత్తిడికి లోను చేస్తున్నాయని ఆరోపించారు. పంజాబ్‌లో జోడో యాత్రలో ఉన్న ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. తన గొంతు కోసినా సరే, జీవితంలో ఎన్నడూ ఆరెస్సెస్ కార్యాలయంలోకి అడుగు కూడా పెట్టబోనన్నారు. రాహుల్ సోదరుడు, బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీ కాంగ్రెస్‌లో చేరతారన్న వార్తల నేపథ్యంలో, ఆయన్ను అక్కున చేర్చుకుంటారా అని ప్రశ్నించగా, ''వరుణ్‌ను కలుస్తా. కౌగిలించుకుంటా. కానీ ఆయన భావజాలాన్ని ఆమోదించలేను'' అని బదులిచ్చారు.

రాహుల్‌కేసి దూసుకొచ్చిన యువకుడు

జోడో యాత్రలో ఓ యువకుడు రాహుల్‌ను కౌగిలించుకునేందుకు ఆయనకేసి వేగంగా దూసుకొచ్చాడు. కాంగ్రెస్ నేతలు అతన్ని అడ్డుకున్నారు. ఇది అత్యుత్సాహమే తప్ప భద్రతా వైఫల్యమేమీ కాదని రాహుల్ అన్నారు.





బ్రిటిష్ బాబులకు భారతీయ విందు

అరటాకుల్లో భోంచేస్తున్న వీరంతా బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ కార్యాలయ సిబ్బంది. సంక్రాంతి సందర్భంగా తన అధికార నివాసం 10, డౌనింగ్ స్ట్రీట్‌లో వారికిలా భారతీయ సంప్రదాయ పద్ధతిలో విందు ఇచ్చారాయన.

మద్యానికి బానిసైన కిమ్

ఆరోగ్యంపై బెంగతో ఏడుస్తున్న ఉత్తర కొరియా అధినేత!

సియోల్: రోజంతా మద్యం తాగడం వంటి అనారోగ్యకర ఆహార అలవాట్ల కారణంగా ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ ఆరోగ్యం దెబ్బతిన్నదని వార్తలు వస్తున్నాయి. ఇటీవలే 39వ బర్త్‌డే జరుపుకున్న కిమ్‌కు.. వయస్సు మీదపడుతుందనే బెంగ ఎక్కువైనట్లుగా ఉందని దక్షిణకొరియా రాజధాని సియోల్‌లో ఉంటున్న ఉత్తర కొరియా విద్యావేత్త డాక్టర్ చొయ్ జిన్‌వూక్ అంటున్నారు. ఒంటరితనంతో బాధపడుతున్న కిమ్ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, అతిగా తాగి ఏడుస్తూ కాలం గడుపుతున్నారని చెబుతున్నారు. అనారోగ్య వివరాలు ఎక్కడ బయటకు పొక్కుతాయో అనే భయంతో కిమ్ పర్యటనల సమయంలో సొంత టాయిలెట్‌ను కూడా తీసుకెళ్తున్నారని చెబుతున్నారు. తాగుడు తగ్గించి, రోజూ సమయం వ్యాయామం చేయాలని భార్య, వైద్యులు సలహాలిచ్చినా పట్టించుకోవడం లేదని మిర్రర్ పత్రిక కథనం పేర్కొంది.

చైనాలో జనాభా తగ్గింది!

1961 తర్వాత ఇదే తొలిసారి

బీజింగ్: జన చైనాలో జనాభా కాస్త తగ్గింది. అక్కడ జనాభా సంఖ్య తగ్గుముఖం పట్టడం 1961 ఏడాది తర్వాత ఇదే తొలిసారి! 2021 ఏడాది జనాభా లెక్కలతో పోలిస్తే 2022ఏడాదిలో జనాభా 8,50,000 తగ్గిందని నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ తాజాగా వెల్లడించింది. 2022 ఏడాదిలో చైనా జనాభా 141.18 కోట్లు అని నేషనల్ బ్యూరో లెక్క తేల్చింది. జననాల వృద్ధిరేటు తగ్గడమే ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే అంచనావేసిన దానికంటే ముందుగానే చైనాను దాటేసి భారత్ ప్రపంచంలోనే అత్యంత అధిక జనాభాగల దేశంగా అవతరించనుంది. చైనా ఆర్థిక వృద్ధి రేటు దాదాపు 3 శాతంగా నమోదైన ఈ తరుణంలో జనసంఖ్య సైతం వెనకడుగు వేస్తోంది. గత ఐదు దశాబ్దాల్లో చైనాలో ఇంతటి అత్యల్ప వృద్ధిరేటు నమోదవడం ఇది రెండోసారి. ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక, జనాభా విభాగం 2022 అంచనాల ప్రకారం ఈ ఏడాదిలోనే చైనాను భారత్ జనసంఖ్యలో అధిగమించనుంది. 2050కల్లా భారత్ 166.8 కోట్ల మందితో కిటకిటలాడనుంది. 131.7 కోట్లతో చైనా రెండోస్థానానికి పడిపోనుంది.



- 2022లో చైనాలో 95.6 లక్షల మంది జన్మించారు. 2021లో 1.062 కోట్ల మంది జన్మించారు. 2021లో 7.52 శాతమున్న జననాల రేటు 2022లో 6.77 శాతానికి పడిపోయింది.
- చైనాలో 72.20 కోట్ల మంది పురుషులు, 68.96 కోట్ల మంది స్త్రీలు ఉన్నారు. ముున్న 16– 59 ఏళ్ల వయసు వారు 87.56 కోట్ల మంది ఉన్నారు.
- దేశ జనాభాలో సీనియర్ సిటిజన్లు 62 శాతం.
- 60 ఏళ్లు పైబడిన వృద్ధుల జనాభా 28 కోట్లు దాటింది. జనాభాలో వీరు 19.8 శాతం.
- ఒకప్పుడు వ్యవసాయ ఆధారిత దేశమైన చైనా ఇప్పుడు ప్రపంచ ఉత్పత్తుల కేంద్రంగా ఎదిగింది. దీంతో పరిశ్రమల్లో పనిచేసేందుకు జనం పట్టణాల బాటపట్టారు. దీంతో పట్టణాల్లో నివసిస్తున్న వారి సంఖ్య 92.07 కోట్లకు ఎగబాకింది.

మెరుపులనే దారి మళ్లించారు!

- పిడుగుల రక్షణ వ్యవస్థలో మేలిమలుపు!
- భారీ నిర్మాణాలకు ఇక పూర్తిస్థాయి రక్షణ



పారిస్: మెరుపంటేనే వేగానికి పెట్టింది పేరు. వేగానికి అత్యుత్తమ ఉపమానం కూడా. మెరుపు వేగం గంటకు ఏకంగా 4.3 లక్షల కిలోమీటర్ల దాకా ఉంటుంది. మెరుపుల ఫలితంగా విను వీధిలో మన కంటికి కనిపించే కాంతులైతే నిజంగా కాంతి వేగంతోనే (సెకను 3 లక్షల కిలోమీటర్లు) దూసుకెళ్తాయి. అలాంటి మెరుపులను దారి మళ్లించగలిగితే? ఫ్రెంచి పరిశోధకులు తాజాగా అలాంటి ఘనతే సాధించారు!! అతి శక్తిమంతమైన లేజర్ కిరణాల ద్వారా వాటి దారిని విజయవంతంగా మార్చగలిగారు. పిడుగుపాటు బారినుంచి రక్షించే వ్యవస్థల్లో ఇది విప్లవాత్మక మార్పులు తేగలదని భావిస్తున్నారు. మెరుపును అనుసరిస్తూ వచ్చి పడే పిడుగుల వల్ల భవనాలు, సమాచార వ్యవస్థ, విద్యుత్ ఉపకరణాలు, సరఫరా లైన్లు దెబ్బ తిని ఏటా వందలాది కోట్ల డాలర్ల మేరకు నష్టం వాటిల్లడమే గాక వేలాది మంది ప్రాణాలు కోల్పోతుండటం తెలిసిందే. ఈ టెక్నాలజీని మరింతగా అభివృద్ధి చేయగలిగితే దీని సాయంతో విమానాశ్రయాలు, భారీ విద్యుత్కేంద్రాలు, ఉపగ్రహాల లాంచింగ్ ప్యాడ్ల వంటి భారీ నిర్మాణాలకు పిడుగుపాట్ల నుంచి పూర్తిస్థాయి రక్షణ కల్పించవచ్చని చెబుతున్నారు. ఫ్రాన్స్‌లోని ఎకోల్ పాలిటెక్నిక్స్ లేబొరేటరీ ఆఫ్ అప్లైడ్ ఆప్టిక్స్‌కు చెందిన పరిశోధకులు అత్యంత శక్తిమంతమైన లేజర్ పరికరాల సాయంతో ఈ ప్రయోగానికి పూనుకున్నారు. ఇందుకోసం ఏకంగా మూడు టన్నుల బరువు, కారు పరిమాణమున్న లేజర్ పరికరాన్ని ఈశాన్య స్విట్జర్లాండ్‌లోని శాంటిస్ పర్వత శిఖరంపై 2,500 మీటర్ల ఎత్తున ఏర్పాటు చేశారు. దానిద్వారా సెకనుకు ఏకంగా 1,000కి పైగా అతి శక్తిమంతమైన కిరణాలను ఆకాశంలో మెరుపులకేసి పంపించారు. తొలి ప్రయత్నంలోనే వాటి దారిని 160 అడుగుల దాకా మళ్లించగలిగారు. రెండు హైస్పీడ్ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల ద్వారా దీన్ని గుర్తించారు. ''అతి శక్తిమంతమైన లేజర్ కిరణాలను ఆకాశంలోకి పంపినప్పుడు శక్తిమంతమైన కాంతితో కూడిన ఫిలమెంట్లు ఏర్పడతాయి. అవి గాలిలోని నైట్రోజన్, ఆక్సిజన్ అణువులను అయానీకరిస్తాయి. ఈ చర్య ఫలితంగా స్వేచ్ఛగా కదలాగే ఎలక్ట్రాన్లు విడుదలవుతాయి. ప్లాస్మాగా పిలిచే ఈ అయానీకరణ చెందిన గాలి ఎలక్ట్రాన్ల వాహకంగా పని చేస్తుంది'' అంటూ ఈ టెక్నాలజీ పని చేసే తీరును డిపార్ట్‌మెంట్ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్‌కు చెందిన ప్రొఫెసర్ జీన్ పియరీ వూల్ఫ్ వివరించారు. నిజానికి ఈ కాన్సెప్టును తొలుత 1970ల్లోనే ప్రతిపాదించినా ఇప్పటిదాకా ల్యాబుల్లోనే ప్రయోగించి చూశారు. బయటి వాతావరణంలో ప్రయోగం జరపడం ఇదే తొలిసారి. ఈ పరిశోధన ఫలితాలు జర్నల్ నేచర్ ఫోటానిక్స్‌లో పబ్లిషయ్యాయి. వీటి సాయంతో పిడుగుపాటు నుంచి కాపాడే వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులు తేగల హై పవర్ లేజర్ టెక్నాలజీని అభివృద్ధి చేసే పనిలో సైంటిస్టులు బిజీగా ఉన్నారు!

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం : 18 : జనవరి : 2023



చదువే రక్ష

రాత్రివేళ రోడ్డు పక్కన మొబైల్ సాయంతో హోం వర్కు చేసుకుంటున్న చిన్నారులు. బెంగళూరు జేపీ నగరలో బాలల విద్యాతృష్ణ ఇది

పాదచారి పారాహుషార్

సిలికాన్ సిటీ రోడ్లు ఎంత రద్దీగా ఉంటాయో తెలియనిది కాదు. నగరవాసుల జీవితం ఎక్కువభాగం రోడ్లపై గడిచిపోతుందంటే అతిశయోక్తి కాదు. ఈ వాహన పద్మవ్యూహంలో పాదచారులు సమిధలవుతున్నారు. రోడ్డు దాటే కంగారులో రెప్పపాటు సమయంలో ప్రమాదం కాటేస్తోంది.

- నగరంలో రహదార్లు దాటడం కష్టమే
- నాలుగేళ్లలో 907 మంది మృతి



రోడ్డు దాటే సమయంలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి



బెంగళూరులో కూడళ్లను దాటడం పెద్ద సవాల్

సాక్షి, బెంగళూరు: రోడ్డు ప్రమాదాల్లో బెంగళూరు నగరంలో జాతీయస్థాయిలో టాప్‌-3లో ఉంటోంది. ఈ ప్రమాదాల్లో ఏ పాపం తెలియని, రోడ్డు పక్కన నడుచుకుంటూ, రోడ్డు దాటుతూ వెళ్లే పాదచారులు ఎక్కువమంది ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకరంగా ఉంది. ఉద్యాననగరిలో గత నాలుగేళ్లలో మొత్తం 907 మంది పాదచారులు మృత్యువాత పడ్డారు. విపరీతమైన వాహన రద్దీ, అతివేగం, సరైన ట్రాఫిక్ హెచ్చరిక బోర్డులు లేకపోవడం వంటి కారణాల వల్ల వాహనాల కింద పాదచారులు నలిగిపోతున్నారు. ప్రపంచ వనరుల సంస్థ (డబ్ల్యూఆర్‌వో), ఇండియా అనే ఎన్‌జీవో నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం తేలింది. గత మూడు నాలుగేళ్లతో పోలిస్తే నగరంలో పాదచారుల మరణాల సంఖ్య కొంచెం తగ్గుముఖం పట్టడం ఉపశమనం కలిగించేదిగా ఉంది. 2017లో 276 మంది, 2018లో 270 మంది, 2019లో 257 మంది, 2020లో 98 మంది పాదచారులు విగతజీవులయ్యారు.

వృద్ధులు అధికం

- రోడ్డు ప్రమాద మృతుల్లో రోడ్డు దాటుతుండగా సుమారు 60 శాతం మంది వాహనాలు ఢీకొని మరణించినవారే.
- ఇదే కారణంతో 2017లో 169 మంది, 2018లో 164, 2019లో 153, 2020లో 58 మంది పాదచారులు రోడ్డు దాటుతూ మృత్యుఒడికి చేరారు.
- ఇందులో మొత్తం 185 మంది వయోవృద్ధులు కూడా ఉన్నారు. 40–60 ఏళ్ల మధ్య వయసున్న వారు మరో 128 మంది ఉన్నారు.
- రోడ్డు ప్రమాదాల్లో గాయడిన వారిలో కూడా 88 శాతం మంది రోడ్డు దాటుతూనే ప్రమాదానికి గురయ్యారు.

మెజెస్టిక్ టెర్మినల్, కేఆర్ మార్కెట్.. ఈ ప్రాంతాలు చాలా డేంజర్

- రోడ్డు క్రాసింగ్ ద్వారా కూడా చాలా మంది మృత్యువాతపడ్డారు. అతివేగంగా వచ్చిన వాహనాలు క్రాసింగ్ సమయంలో పాదచారులను ఢీకొట్టడంతో ప్రాణనష్టం సంభవిస్తోంది.
- ఈ తరహా ప్రమాదాలు ఎక్కువగా రాత్రి ఏడు గంటల నుంచి పది గంటల మధ్య జరిగాయి. 28.4 శాతం మరణాలు ఈ పీక్ అవర్‌లో జరిగినవే కావడం గమనార్హం.
- మెజెస్టిక్ టెర్మినల్, కేఆర్ మార్కెట్, ఔటర్ రింగ్ రోడ్డు, బళ్లారి రోడ్డు, హోసూరు రోడ్డు మార్గాల్లోని హాట్‌స్పాట్లలో రోడ్డు దాటుతూ పాదచారులు ఎక్కువగా మరణించారు.
- ఇందులో మరింత అత్యధికంగా మెజెస్టిక్, కేఆర్ మార్కెట్ బస్ టెర్మినల్స్ వద్ద జరిగాయి.

స్కైవాక్‌లు ఉపయోగించాలి

ఐటీ సిటీలో రోడ్లు దాటేందుకు స్కైవాక్‌లు నిర్మించినప్పటికీ ప్రజలు వాటిని ఉపయోగించడం తక్కువే. సులభంగా వెళ్లాలనే హడావుడిలో రోడ్డు దాటడం, వాహనదారులు కూడా త్వరగా గమ్యం చేరాలని దూసుకురావడం వల్ల ఢీకొనడం జరుగుతోంది. సరైన ప్రాంతాల్లో స్కైవాక్‌లు లేకపోవడం, అవి కూడా అధ్వాన్నంగా ఉండడం ప్రజలు ఉపయోగించడం తక్కువగా ఉంటోంది. స్కై వాక్‌ల ఉపయోగాన్ని పెంచితే ప్రమాదాలు బాగా తగ్గే అవకాశముంది.



వాహన రద్దీ వల్ల పాదచారులకు ఇబ్బందులు

న్యూస్‌రీల్

కలుషితాహారంతో 108 మంది విద్యార్థులకు అస్వస్థత



చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

శివమొగ్గ: శివమొగ్గ తాలూకాలోని మేలిన హొసన్‌వాడిలో ఉన్న మొరార్జీ వసతి పాఠశాలలో ఆహారం కలుషితమై 108 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. సోమవారం రాత్రి భోజనం తిన్న వెంటనే పెద్దసంఖ్యలో విద్యార్థులకు వాంతులు, విరేచనాలు మొదలు కావడంతో వారిని శివమొగ్గ మెగ్గాన్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్నామని, ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. ఆహారంలో ఏదో పదార్థం కలిసినందు వల్ల ఫుడ్ పాయిజన్ అయి ఉంటుందని చెప్పారు. శివమొగ్గ గ్రామీణ ఎమ్మెల్యే కే.బీ.అశోక్ నాయక్, కలెక్టర్ ఆర్.సెల్వమణీ, జడ్పీ సీఈఓ ప్రకాశ్‌లు ఆస్పత్రికి వచ్చి బాలల గురించి తెలుసుకున్నారు.

ప్రధాని మోదీతో యడ్డి భేటీ

శివాజీనగర: దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీని మాజీ సీఎం బీ.ఎస్.యడియూరప్ప భేటీ అయ్యారు. ఇది మర్యాదపూర్వకమైన భేటీ అని చెబుతున్నప్పటికీ ఇటీవల యడియూరప్పకు ప్రాధాన్యం తగ్గిందని వార్తలు వస్తూ, ఆయన మోదీ రాష్ట్ర పర్యటనకు దూరంగా ఉండిపోయిన తరుణంలో జరగడం విశేషం. శివమొగ్గలో ప్రారంభానికి సిద్ధమైన విమానాశ్రయం, ఇతర పథకాల ప్రారంభానికి మోదీని ఆహ్వానించారని తెలిసింది. సుమారు 10 నిమిషాలకు పైగా ఈ భేటీ సాగింది.

వాహనం ఢీకొని మెట్రో కార్మికుడు మృతి

బనశంకరి: మెట్రో పనులు మరో ప్రాణాన్ని బలిగొన్నాయి. బాణసవాడి ఔటర్ రింగ్ రోడ్డులో మదర్‌వుడ్ ఆసుపత్రి వద్ద మంగళవారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన జరిగింది. విధుల్లో ఉన్న మెట్రో కార్మికుడు, బిహార్‌కు చెందిన గుడ్డు మాంజీ (27)ని టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో మృత్యువాత పడ్డాడు. వేకువజామున 4.20 సమయంలో బ్యారికేడ్ అమర్చుకుని గుడ్డు మాంజీ పారిశుధ్య పనులు చేస్తున్నాడు. ఈ సమయంలో హొరమావు అండర్‌పాస్ వైపు నుంచి హెబ్బాళకు వాయువేగంగా వెళుతున్న టాటా ఏస్ వాహనం బ్యారికేడ్‌ను, ఆపై గుడ్డు మాంజీని ఢీకొంది. అతనికి తల, వెన్నెముక, నడుముకు తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా చనిపోయినట్లు డీసీపీ కళా కృష్ణస్వామి తెలిపారు. బాణసవాడిపోలీసులు వాహన డ్రైవరును అరెస్ట్‌చేశారు.

కుక్కర్‌బాంబు క్షతగాత్రుడు పూజారి డిశ్చార్జ్

శివాజీనగర: మంగళూరులో కుక్కర్ బాంబు పేలుడులో తీవ్ర గాయాల పాలైన ఆటోడ్రైవర్ పురుషోత్తమ్ పూజారి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. కొన్నినెలల కిందట అనుమానిత ఉగ్రవాది షారిఖ్ మంగళూరులో పూజారి ఆటోలో కుక్కర్‌బాంబును తీసుకెళ్తుండగా అది పేలడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడడం తెలిసిందే. పూజారి ఇప్పటివరకూ ఆస్పత్రిలోనే ఉన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒక సంవత్సరం విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు చెప్పారు. ప్రతిరోజు చికిత్సకు ఆసుపత్రికి వెళ్లి రావాలని వైద్యులు తెలిపారన్నారు.
తన కుమార్తె ఈఎస్‌ఐ ద్వారా వైద్యం చేయించిందని, కుటుంబ నిర్వహణ చాలా కష్టంగా ఉందని వాపోయారు. కుమార్తెకు పెళ్లి నిశ్చయమైందని, రాష్ట్ర ప్రభుత్వం తన వైద్యానికి సహాయం చేస్తుందని జిల్లా అధికారులు, బీజేపీ నాయకులు భరోసానిచ్చారు, అయితే ఇంతవరకు ఎలాంటి పరిహారం ఇప్పించలేదని ఆవేదన చెందారు. కొన్ని సంఘ సంస్థలు చేసిన సహాయంతో ఇల్లు నెట్టుకొస్తున్నట్లు తెలిపారు. ఇంటి మరమ్మతుల కోసం గురు బెళదింగళ ట్రస్ట్ ద్వారా సహాయం లభించిందని తెలిపారు.





పువ్వుల పిలుపు
పుష్ప లోగిళ్లు నేత్రానందం కలిగించనున్నాయి. బెంగళూరు లాల్‌బాగ్ ఉద్యానంలో గణతంత్ర ఫల పుష్ప ప్రదర్శనకు జరుగుతున్న ఏర్పాట్లు

మెట్రో ఇంజినీర్ల నిర్లక్ష్యమే..

- పిల్లర్ కూలిపోవడానికి అదే కారణం
- ఐఐఎస్‌సీ నిపుణుడు వెల్లడి



శివాజీనగర: మెట్రో పిల్లర్ కూలిపోయి తల్లీ బిడ్డ ప్రాణాలు కోల్పోవడానికి ఇంజినీర్ల నిర్లక్ష్యమే కారణమని నిర్ధారణ అయిందని బెంగళూరులోని భారతీయ విజ్ఞాన సంస్థ (ఐఐఎస్‌సీ) శాస్త్రవేత్త డాక్టర్ చంద్రకిషన్ తెలిపారు. ఇటీవల హెణ్ణూరు వద్ద నిర్మాణంలోని మెట్రో పిల్లర్ కూలిపోయి తేజస్విని అనే టెక్కీ, ఆమె చిన్నారి కొడుకు దుర్మరణం చెందడం తెలిసిందే. ప్రమాద కారణాలపై ఐఐఎస్‌సీ విచారణ సాగిస్తోంది.

పిల్లర్‌కు సపోర్టు లేదు

ప్రమాదం గురించి తాము ఇప్పటికి 80 శాతం సాంకేతిక తనిఖీ చేశాం, ఇందులో ఇంజినీర్ల వైఫల్యమే ప్రధాన కారణమని తెలిసిందన్నారు. మరో మూడు నాలుగు రోజుల్లో ఐఐఎస్‌సీ నిపుణుల విచారణ నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. మెట్రో పిల్లర్ కూలిపోవడానికి కారణం ఎక్కువ ఎత్తుతో పిల్లర్‌ను నిర్మించడమేనని అన్నారు. నిర్మాణ స్థలంలో మట్టి, స్తంభం పరికరాలను పరీక్షించాం, 18 అడుగుల ఎత్తైన పిల్లర్ విషయంలో నిర్లక్ష్యం వహించారని పేర్కొన్నారు. అంత ఎత్తైన స్తంభానికి సరైన సపోర్ట్ ఇవ్వడంలో ఇంజినీర్లు విఫలం కావడమే ప్రమాదానికి ప్రధాన కారణమని ఆయన స్పష్టం చేశారు.

స్యాంట్రో రవిపై సీఐడీ దర్యాప్తు షురూ

- మైసూరుకు వచ్చిన తనిఖీ బృందం

మైసూరు: వ్యభిచారం చేయించడం, అధికారుల బదిలీల దందా, మహిళపైన అత్యాచారం, లైంగిక వేధింపులు.. ఇలా అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న స్యాంట్రో రవి కేసులపై మంగళవారం నుంచి సీఐడీ విచారణకు నాంది పలికింది. అతనిపై భారీ ఎత్తున ఆరోపణలు రావడంతో ఈ కేసులను తనిఖీని రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించడం తెలిసిందే. దాంతో సిఐడి అధికారులు మైసూరు నగర పోలీస్ కమిషనర్ కార్యాలయానికి వచ్చారు. సీఐడీ డీఎస్పీ పి.నరసింమూర్తి పోలీస్ కమిషనర్ రమేష్‌ను కలిసి స్యాంట్రో రవి పైన ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. తరువాత విజయనగర పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదులు, విచారణ వివరాలను సేకరించారు. విచారణ కోసం స్యాంట్రో రవిని తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టులో అర్జీ వేస్తామని సిఐడి అధికారులు తెలిపారు.

రవిపై భార్య ఫిర్యాదు

మైసూరు లోని దేవరాజు పోలీస్ స్టేషన్‌లో స్యాంట్రో రవిపైన అతని భార్య ఫిర్యాదుచేసింది. 2022 సెప్టెంబర్ 22వ తేదీన నేను దేవరాజు మార్కెట్‌కు వెళ్లగా నా స్కూటర్‌ను రవి, ప్రకాశ్ ఇద్దరు కలిసి ఢీకొట్టి నా చెక్‌బుక్‌ను ఎత్తుకెళ్లి దుర్వినియోగం చేశారన్నారు. ఈ మేరకు పోలీసులు మరో కేసు నమోదు చేశారు.

బాధితురాలు- నిందితుని పెళ్లి..కేసు కొట్టివేతకు ఆదేశం

బనశంకరి: అత్యాచార బాధితురాలిని నిందితుడే పెళ్లి చేసుకున్నాడు. కానీ కేసును కొనసాగించడాన్ని ప్రశ్నిస్తూ ఆ జంట హైకోర్టులో కేసు వేయగా కేసును రద్దు చేశారు. వివరాలు.. బెంగళూరుకి చెందిన యువతి 2022లో పుట్టినరోజు సందర్భంగా ఇంటికి పిలిపించి మద్యం సేవించి తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని ఆరోపించింది. పోలీసులు నిందితున్ని అరెస్టు చేసి అత్యాచారం, బెదిరింపు కేసు నమోదుచేశారు. తరువాత ఇద్దరూ రాజీకి వచ్చి వివాహం చేసుకున్నారు. కానీ పోలీసులు తన భర్తను అరెస్టుచేసి జైలుకు పంపించారని, పెళ్లి చేసుకున్నందున కేసును రద్దుచేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి.. బాధితురాలికి ఎలాంటి ఇబ్బందిలేకుండా చూసుకోవాలని సూచిస్తూ కేసును రద్దు చేయాలని ఆదేశించారు.

సరిహద్దుల్లోనే మరాఠా నేతల అడ్డగింత

- బెళగావిలో ఎంఈఎస్ ప్రదర్శన



యశవంతపుర: మహారాష్ట్రతో సరిహద్దు వివాదం నేపథ్యంలో బెళగావిలో జరిగే కార్యక్రమాల్లో మరాఠా నేతలు పాల్గొనకుండా రాష్ట్రం చర్యలు తీసుకుంటోంది. మంగళవారం బెళగావిలో మహారాష్ట్ర ఏకీకరణ సమితిచే సంస్మరణ దినోత్సవంను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో మహారాష్ట్ర మంత్రి చంద్రకాంత్ పాటిల్, శంభురాజ్ దేశాయి, ఎంపీ ధైర్యశీల మానెలు పాల్గొనవలసి ఉండగా జిల్లా కలెక్టర్ నితేశ్ పాటిల్ వారు బెళగావి నగరంలోకి రాకూడదని నిషేధాజ్ఞలు విధించారు. ఆ నాయకులు వస్తుండగా పోలీసులు సరిహద్దుల్లోనే నిలిపేశారు.

మహారాష్ట్రలో కలపాలని డిమాండ్

మంగళవారం ఎంఈఎస్ కార్యకర్తలు బెళగావి, ఖానాపుర, నిప్పాణి, బీదర్, భాల్కి, కారవార ప్రాంతాలను మహారాష్ట్రలోకి విలీనం చేయాలని బెళగావిలో ప్రదర్శన చేశారు. ఈ ఆందోళనల్లో చనిపోయినవారిని స్మరిస్తూ ఊరేగింపు నిర్వహించారు. మరాఠా నాయకులను అడ్డుకోవడం తగదని, బెళగావిని మహారాష్ట్రలోకి విలీనం చేసేవరకు పోరాటం చేస్తామని తెలిపారు.

నేటి నుంచి సుత్తూరు జాతర



అలంకరణలో సుత్తూరు మఠం



అన్నదాసోహ కోసం బియ్యం, సరుకులు

- రోజుకు 2 లక్షల మందికి అన్నదానం

మైసూరు: మైసూరు జిల్లాలోని నంజనగూడు తాలూకాలో ఉన్న ప్రఖ్యాత సుత్తూరు క్షేత్రంలో బుధవారం నుంచి శివరాత్రీశ్వర శివయోగి స్వామీజీ జాతర మహోత్సవం ప్రారంభం కానుంది. వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తుండగా, వారికి మూడు పూటలా ఆహారం కోసం భారీమొత్తంలో ఆహార సామగ్రిని సిద్ధం చేశారు. శివరాత్రి దేశికేంద్ర స్వామి అన్న దాసోహ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆరురోజుల పాటు జరిగే ఈ జాతరకు రోజూ 2 లక్షల మందికిపైగా రావచ్చని అంచనా వేశారు. వారందరికీ అన్న ప్రసాదం సిద్ధం చేస్తున్నట్లు స్వామి తెలిపారు. 30 నుంచి 35 చోట్ల అన్నదానం సాగుతుంది. ఇందుకోసం రాయచూరు జిల్లా నుంచి 2 వేల క్వింటాళ్ల బియ్యం, భారీమొత్తంలో నూనె, బెల్లం, పప్పులు, కూరగాయలను తెప్పించారు.







పట్టుకోండి చూద్దాం
మంగళవారం ధార్వాడలో ఒక వ్యక్తి సెల్ టవర్ ఎక్కి హంగామా చేసిన దృశ్యం. తనను పోలీసులు వేధిస్తున్నారంటూ ఆ వ్యక్తి సెల్ టవర్ ఎక్కాడు. ఇంతలో పోలీసులు, ఫైర్ సిబ్బంది కూడా టవర్ ఎక్కి అతన్ని కిందకు తీసుకొచ్చారు

బేగూరు సౌందర్యం





మంగళవారం ఉదయం పొగమంచు అందాల్లో బెంగళూరులోని బేగూరు చెరువు అందాలు. కాగా చెరువులో పిచ్చిమొక్కలు పెరిగిపోతున్నాయి

నారీమణుల వర్ణ చాతుర్యం

- ఆకట్టుకునే కలర్స్ ఆఫ్ కన్నడ చిత్రలేఖనాలు



బసవేశ్వరుని చిత్రంతో చిత్రకారిణి



చిత్రకారులతో గవర్నర్ గెహ్లోట్



పురంధరదాసు చిత్రలేఖనం

బనశంకరి: కలర్స్ ఆఫ్ కన్నడ పేరిట ఏర్పాటు చేసిన చిత్రలేఖన ప్రదర్శన నగరవాసులకు కనువిందు చేస్తోంది. కుమారకృప రోడ్డు చిత్రకళా పరిషత్‌లో 8 మంది వర్ధమాన మహిళా చిత్రకారులతో ఈ ప్రదర్శన ఏర్పాటైంది. మంగళవారం రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ ప్రారంభించారు. కర్ణాటక సంస్కృతి, కళలను ఇతివృత్తంగా చేసుకుని చిత్రకారిణులు గీసిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటాయి. రాష్ట్రానికి ప్రతీకలుగా నిలిచే బసవణ్ణ, కువెంపు, మైసూరు ప్యాలెస్, పురంధరదాసు తదితర పెయింటింగ్స్‌ను ఇక్కడ చూడవచ్చు. వీసీ సీమా, ప్రియాజ మన్నత్, లక్ష్మీ సునంద్, దివ్య పచ్చిపులుసు, సింధూరాణి, సుగంధి ప్రభాగరన్, టీబీ మను తదితర చిత్రకారిణులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శన 22 వ తేదీ వరకు జరుగుతుంది.

క్లుప్తంగా

శారద విద్యా సంస్థకు రూ.లక్ష విరాళం



సంస్థకు విరాళాన్ని అందిస్తున్న దృశ్యం

గంగావతి: శారద విద్యా సంస్థకు శ్రీరామనగర్ జీపీ మాజీ సభ్యులు, గ్రామ ప్రముఖులు సంటిరాజు విద్యానగర్‌కు వెళ్లి రూ.లక్ష నగదు విరాళాన్ని సంస్థకు అందజేశారు. సంస్థ అధ్యక్షులు టీవీ సత్యనారాయణ, కార్యదర్శి కళ్యాణం జానకీరాంలకు సంటిరాజు ఈ విరాళాన్ని సంక్రాంతి పండుగ పర్వదినాన అందజేశారు. సంస్థ కార్యదర్శి కళ్యాణం జానకీరాం మాట్లాడుతూ సంస్థ తెలుగు పాఠశాలను స్థాపించి అర్ధ శతాబ్దం పూర్తయి వేడుకలను జరుపుకుంటున్న శుభ సందర్భంగా సంటిరాజు లాంటి దాతలు సంస్థకు ఆర్థిక సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ తెలుగు పాఠశాలను ప్రారంభం నుంచి నేటి వరకు దాతల సహాయంతో నడుపుతున్నామన్నారు. ఈ పాఠశాలలో లక్షలాది తెలుగు విద్యార్థులకు విద్యాబోధనను అందించిన ఏకైక పాఠశాల అన్నారు.

ఉత్తుత్తి హామీలిస్తే సీట్లు పడిపోతాయి

శివాజీనగర: కాంగ్రెస్ ప్రజలకు ఉత్తుత్తి హామీలిస్తే వెళితే 78 నుంచి 50 స్థానాలకే పరిమితం అవుతుందని జేడీఎస్ రాష్ట్రాధ్యక్షుడు సీఎం ఇబ్రహీం అన్నారు. మంగళవారం నగరంలో కాంగ్రెస్ ప్రకటించిన గృహలక్ష్మీ పథకం గురించి మాట్లాడుతూ ప్రజలకు టోపీ వేసే పని కాంగ్రెస్ చేస్తోంది. ఉత్తరప్రదేశ్‌లో వెళ్లి ప్రచారం చేశారు, అక్కడ జరిగిందేమిటి అని ప్రియాంక గాంధీని విమర్శించారు. రైతుల గురించి ప్రియాంక గాంధీ మాట్లాడలేదు. రైతుల గురించి ఆమెకు తెలియదు అన్నారు. సిటీలో కుక్క ఉన్న ఎయిర్ కండిషన్ రూమ్‌కు కరెంట్ ఉంది. రైతుల పంపుసెట్‌లకు కరెంటు లేదని ధ్వజమెత్తారు.

బీజేపీని మళ్లీ గెలిపించాలి



మాట్లాడుతున్న అల్లళ్లి వీరేష్

కంప్లి: వచ్చే ఎన్నికల్లో బీజేపీని మళ్లీ అధికారంలో తెచ్చేందుకు కార్యకర్తలు శ్రమించాలని బీజేపీ క్షేత్ర అధ్యక్షులు అల్లళ్లి వీరేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభకు అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో ఉభయకేంద్రాల సాధనలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. ఇంటి గోడలపై స్టిక్కర్లు అంటించడం, గోడలపై రాతల ద్వారా ప్రచారం చేపట్టాలన్నారు. క్షేత్రంలో మొబైల్ ద్వారా సభ్యత్వానికి 50 వేల వరకు లక్ష్యం ఉండగా మొబైల్ నెంబర్ 8000090009కు మిస్డ్ కాల్ ద్వారా సభ్యత్వ లక్ష్యం సాధించాలన్నారు. జిల్లా అధ్యక్షులు మురారిగౌడ, పదాధికారులు అడివయ్యస్వామి, రామకృష్ణ, జీ.సుధాకర్, తిప్పేస్వామి, కే.హావణ్ణ, పీ.బ్రహ్మయ్య, ఎన్.పురుషోత్తం, బీ.సిద్దప్ప, సుదర్శన్‌రెడ్డి, జీ.రామణ్ణ, సీఆర్.హనుమంత, జీ.లింగనగౌడ, కొడిదల రాజు, ఎన్.రామాంజనేయులు, బీ.దేవేంద్ర పాల్గొన్నారు.

క్లబ్ ఏర్పాటుకు హైకోర్టు ఓకే

శివాజీనగర: నగరంలో చారిత్రక భవనాల్లో ఒకటైన బాలబ్రూయి అతిథి గృహంలో కాన్స్టిట్యూషన్ క్లబ్ (రాజ్యాంగపు క్లబ్) స్థాపనకు రాష్ట్ర హైకోర్టు అనుమతించింది. మెట్రో రైలు మార్గం పనులతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం చెట్లను నరికివేయడాన్ని ప్రశ్నిస్తూ దత్తాత్రేయ దేవుడు అనే వ్యక్తి హైకోర్టులో పిల్ వేశారు. విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరాళె, అశోక్ ఎస్.కిణగి ఉన్న డివిజన్ బెంచ్, బాలబ్రూయి భవనం, పురాతన చెట్లకు హాని కలగకుండా క్లబ్ స్థాపన చేయవచ్చని ఆదేశించింది. పురాతన చెట్లకు, బాలబ్రూయి భవనానికి ఎలాంటి హాని కలగదని ప్రభుత్వ న్యాయవాది పేర్కొన్నారు.

కాంగ్రెస్‌వి ఎన్నికల హామీలు

- మాజీ సీఎం కుమారస్వామి



సాక్షి,బళ్లారి: పంచరత్న యాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ స్పందన లభిస్తోందని మాజీ సీఎం కుమారస్వామి పేర్కొన్నారు. ఆయన మంగళవారం విజయపుర జిల్లా అఫురఘేడ గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో జేడీఎస్ సొంతంగా అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ తీరుపై మండిపడ్డారు. ఎన్నికలు వస్తున్నాయనే ఆ పార్టీ ఉచిత విద్యుత్, గృహలక్ష్మీ వంటి పథకాలను పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

బీజేపీ సంస్కృతి ఏంటో తేటతెల్లమైంది

హుబ్లీ: ఎమ్మెల్యే తిప్పారెడ్డి ఆడియో యావత్ రాష్ట్రానికి బీజేపీ సంస్కృతి ఎటువంటిదో తేటతెల్లం చేసిందని, 40–50 శాతం ప్రభుత్వం అని వారిలో వారే ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారని మాజీ సీఎం కుమారస్వామి ఎద్దేవా చేశారు. నగర విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

బళ్లారి ఉత్సవానికి భారీ ఏర్పాట్లు

- 6 నుంచి 8 నిమిషాల గగనవిహారానికి రూ.3500ల ధర
- బళ్లారి బైస్కైకి అధిక ధర ఖరారుపై ప్రజల్లో అసంతృప్తి



బళ్లారి బైస్కై కోసం సిద్ధమైన హెలికాప్టర్(ఫైల్)

సాక్షి,బళ్లారి: ఉమ్మడి బళ్లారి జిల్లా నుంచి విజయనగర జిల్లాను విభజించడంతో కొత్త జిల్లా పరిధిలోకి హొసపేటెతో సహా ప్రపంచ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న హంపీ కూడా చేరటంతో హంపీ ఉత్సవాల తరహాలో బళ్లారి ఖ్యాతిని ఇనుమడింపజేసేందుకు ప్రభుత్వం మన సంస్కృతి, వారసత్వాలకు అద్దం పట్టేలా బళ్లారి ఉత్సవాల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 21, 22వ తేదీల్లో రెండు రోజుల పాటు బళ్లారి ఉత్సవాల నిర్వహణకు వేదికలను సిద్ధం చేస్తోంది. నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మైదానంలో బళ్లారి రాఘవ పేరుతో వేదిక ఏర్పాటు చేసి అందులో రెండు రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. బళ్లారి ఉత్సవాన్ని సీఎం బసవరాజ్ బొమ్మై ప్రారంభించనుండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. బళ్లారి రాఘవ వేదికతో పాటు చారిత్రాత్మక, మహిమాన్వితమైన కోట మల్లేశ్వర ఆలయ ప్రాంగణంలో జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిర వేదిక ఏర్పాటు చేసి అందులో రెండు రోజులు పాటు బళ్లారి జిల్లా చారిత్రాత్మకతను గురించి తెలియజేయడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు. జానపద నృత్యాలు, సినీ గీతాల ఆలాపన, హాస్యగోష్ఠి, సుగమ సంగీత, ప్రకృతి రెడ్డితో గీతాలాపన, హిందూస్థానీ సంగీతం, హరికథ, బుర్రకథ, భరతనాట్యం, బయలాటలు, డ్యాన్స్‌లతో పాటు ఎన్నో వినోదాన్ని పంచే కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఉత్సవాల విజయవంతానికి అన్ని ఏర్పాట్లు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీరాములు, సిటీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి, జిల్లాధికారి పవన్‌కుమార్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని బళ్లారి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా హంపీ ఉత్సవాల్లో మూడు రోజుల పాటు హంపీ బైస్కై ఏర్పాటు చేసిన విధంగా బళ్లారి జిల్లా చారిత్రాత్మక ప్రాంతాలను ఆకాశంలో నుంచి వీక్షించేందుకు బళ్లారి బైస్కైని సిద్ధం చేశారు. బళ్లారి ఉత్సవాలు 21, 22వ తేదీల్లో రెండు రోజుల పాటు జరగనుండగా ముందుగా ఈనెల 19వ తేదీ నుంచి బళ్లారి బైస్కైని హెలికాప్టర్ ద్వారా వీక్షించేందుకు 6 నుంచి 8 నిమిషాల వరకు ఆకాశంలో హెలికాప్టర్ ద్వారా విహరించి చారిత్రాత్మకమైన బళ్లారి కోట, మించేరి కొండ, తుమటి, బళ్లారి నగరం మొత్తం పైనుంచి వీక్షించేందుకు రూ.3500ల ధర నిర్ణయించడంతో సామాన్యులకు హెలికాప్టర్ ఎక్కడానికి వీలు లేకుండా ధర నిర్ణయించారనే విమర్శలు వస్తున్నాయి. నగర శివార్లలోని కొళగల్లు రోడ్డులో విమానాశ్రయం నుంచి హంపీ బైస్కైని హెలికాప్టర్ ద్వారా వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

సీడీలు బీజేపీ సర్కారులో ఎక్కువే

- స్పీకర్ హొరట్టి అసంతృప్తి



మాట్లాడుతున్న స్పీకర్ బసవరాజ్ హొరట్టి

హుబ్లీ: సీడీలు వివిధ పార్టీల్లో ఉన్నా బీజేపీ సర్కారులో కాస్త ఎక్కువేనని విధాన పరిషత్ స్పీకర్ బసవరాజ్ హొరట్టి తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్ని ప్రభుత్వాల్లోనూ సీడీ రాజకీయాలు ఉన్నా ప్రస్తుత ప్రభుత్వంలో ఎక్కువేనని ఆవేదన వ్యక్తం చేశారు. తిప్పారెడ్డి ఆడియోకు సంబంధించి ఆయన పైవిధంగా స్పందించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు ఇలా నడుచుకోవడం సరికాదన్నారు. ఉపాధ్యాయులు తదితరుల ఒత్తిడి మేరకు తాను బీజేపీలో చేరాను. పార్టీ ఫిరాయించినందుకు తనకేమీ ఇబ్బంది లేదు. జేడీఎస్ నేతలకు నచ్చచెప్పే తాను బీజేపీలో చేరానని, ఓ స్పీకర్‌గా ఎవరిపైనా నిందలు వేయబోనన్నారు.

వేడుకగా సిద్ధలింగ శివాచార్య జయంత్యుత్సవం



జయంతిలో ప్రసంగిస్తున్న స్వామీజీ

బళ్లారి రూరల్: ఉజ్జయిని జగద్గురు సిద్ధలింగ శివాచార్య సేవా సమితి బసవేశ్వరనగర్‌లో మంగళవారం ఉజ్జయిని సద్ధర్మ సింహాసనాధీశ్వర సిద్ధలింగ శివాచార్యుల 78వ జయంతి ముగింపు వేడుక జరిగింది. జయంతికి విచ్చేసిన భక్తులను ఉజ్జయిని సిద్ధలింగ రాజదేశి కేంద్ర శివాచార్యులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు, వీరశైవ ధర్మ గురువులు, సమాజ ప్రముఖులు పాల్గొన్నారు.

కుం.వీ.కు సిద్ధ తోటేంద్ర అవార్డు



కుంబార వీరభద్రప్ప

రాయచూరు రూరల్: జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, ప్రముఖ సీనియర్ సాహితీవేత్త కుంబార వీరభద్రప్పకు సిద్ధ తోటేంద్ర అవార్డును ప్రకటించారు. మంగళవారం కలబుర్గి జిల్లా నాలవార కోరి సిద్దేశ్వర మఠం ఆధ్వర్యంలో ఏటా ఇచ్చే అవార్డును ఈఏడాది కుంబార వీరభద్రప్పకు అందించారు. గడినాడు ప్రాంతంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన వీరభద్రప్ప సాహిత్య రంగానికి చేసిన సేవలను గుర్తించి మఠం ఈ అవార్డును ప్రకటించింది.

పేదలకు హక్కుపత్రాల పంపిణీ

రాయచూరు రూరల్: పేద వృద్ధులకు అన్ని విధాలుగా సహాయం చేయాలని జాయింట్ కలెక్టర్ రజనీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో 125 మంది పేద వృద్ధులకు హక్కుపత్రాలను అందించి ఆయన మాట్లాడారు. పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించి వారికి న్యాయం చేకూర్చారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ల సంఘం సంచాలకుడు పవన్ పాటిల్, అధికారులున్నారు.

ప్లాస్టిక్ తయారీ ఫ్యాక్టరీలపై దాడి

- రూ.లక్షలాది విలువ చేసే ప్లాస్టిక్ స్వాధీనం



ప్లాస్టిక్ తయారీ కంపెనీలపై దాడి చేస్తున్న దృశ్యం

సాక్షి, బళ్లారి: నగరంలో నియమాలకు వ్యతిరేకంగా ప్లాస్టిక్ కవర్లు, బ్యాగులు తయారు చేస్తున్న ప్లాస్టిక్ తయారీ ఫ్యాక్టరీలపై దాడులు జరిగాయి. మంగళవారం మహానగర పాలికె ఆరోగ్య స్థాయి సమితి అధ్యక్షుడు రామాంజినేయులు, పాలికె కార్పొరేటర్ ముండ్లూరు ప్రభంజన్ కుమార్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు, ఇంజినీర్లు దాడులు చేసి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్లాస్టిక్ తయారు చేస్తున్న ఫ్యాక్టరీలపై దాడులు చేసి రూ.లక్షలాది విలువ చేసే ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకుని రూ.3 లక్షలు జరిమానా విధించారు. నగర శివార్లలోని పారిశ్రామికవాడలో పాలిమర్, పాటిల్ అనే ప్లాస్టిక్ తయారీ ఫ్యాక్టరీలపై దాడులు చేసి, పరిశీలించిన తర్వాత 40 మైక్రాన్ల కంటే తక్కువ ప్రమాణం ఉన్న ప్లాస్టిక్‌ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బ తీసే ప్లాస్టిక్ తయారీ ఫ్యాక్టరీలపై దాడులు చేసి జరిమానా విధించామన్నారు. తీరు ఇలాగే కొనసాగిస్తే ఆయా ఫ్యాక్టరీలను సీజ్ చేసేందుకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. పలు అంగళ్లలో ప్లాస్టిక్ విక్రయాలపై దాడి చేసి సోదాలు చేశారు.

ఇంట్లోకి చొరబడి యువతి హత్య



కెంప గ్రామంలో మరణించిన యువతి మృతదేహం తరలింపు

యశవంతపుర/ బనశంకరి: యువతిని హత్య చేసిన ఘటన మంగళవారం దక్షిణకన్నడ జిల్లా పుత్తూరు తాలూకా ముండూరు గ్రామం కెంపలో జరిగింది. గిరిజ అనే మహిళ కూతురు జయశ్రీ (23) ని స్థానిక యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి చొరబడి ఇష్టం వచ్చినట్లు కత్తితో పొడిచి పారిపోయాడు. తీవ్రగాయాలైన జయశ్రీ కేకలు వేయటంతో తల్లి గమనించి ఆస్పత్రికి తరలిస్తుండగానే మరణించింది. సంప్య గ్రామాంతర పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. ప్రేమ వ్యవహారమే కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

బెంగళూరులో మరో యువతి...

మంగళవారం యలహంక పరిధిలోని దిబ్బూరు వద్ద గల ప్రైవేటు లేఔట్‌లో ఎవరో దుండగులు గుర్తు తెలియని యువతిని గొంతుకోసి హత్య చేశారు. యువతి శవాన్ని చూసిన స్థానికులు రాజానుకుంటె పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకుని హతురాలు, హంతకుల ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు.

1న మహిళల హక్కులపై సమరశంఖం

గంగావతి రూరల్: మహిళలు అన్నింటిలోను సమానం అంటారు. దేశంలో 52 శాతం మహిళలున్నా కానీ నేడు అన్ని రంగాల్లో వంచితులవుతున్నారని రాష్ట్ర ఎఐఎంఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఎస్.శోభ అన్నారు. ఆమె మంగళవారం నగరంలోని పత్రికా భవనంలో విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి 1న బెంగళూరు ఫ్రీడం పార్కులో మహిళా హక్కులతోపాటు విద్య, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని బృహత్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా మహిళామణులు తరలి రావాలని పిలుపు నిచ్చారు. సమావేశానికి ముఖ్య అతిథిగా సీనియర్ సాహితీవేత్త, నాడోజ ప్రొఫెసర్ బరగూరు రామచంద్రప్ప, ప్రసంగీకులుగా రాష్ట్ర ఏఐఎంఎస్‌ఎస్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ సుధా కామత్, రాష్ట్ర అధ్యక్షురాలు బి.ఆర్.అపర్ణ పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి, తాలూకా ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ మంజుల పాల్గొన్నారు.

ఎయిమ్స్ కోసం రాస్తారోకో



రాయచూరు రూరల్: ఎయిమ్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ వద్ద పోరాట సమితి ఆందోళన చేపట్టింది. ఆందోళనకారులు మాట్లాడుతూ సీఎం బొమ్మై రాయచూరుకు ఎయిమ్స్‌ను మంజూరు చేస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు కూడా ఈ విషయంలో మౌనం దాల్చారని దుయ్యబట్టారు. అనంతరం వినతి పత్రం సమర్పించారు. అంతకుముందు మహాత్మగాంధీ స్టేడియం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళనకారులు అరగంట సేపు రాస్తారోకో చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

దోపిడీ దొంగల అరెస్ట్



పట్టుబడిన దొంగలతో పోలీసులు

గంగావతి: కొప్పళలో గవిసిద్దేశ్వర జాతర సందర్భంగా హుడా గ్రామానికి చెందిన దొడ్డబసమ్మ తాళిబొట్టును దోపిడీ చేసిన దొంగలను పట్టుకొని వారి నుంచి రూ.2.20 లక్షల విలువ చేసే 50 గ్రాముల సరాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 7న కేసు నమోదు చేసుకొని నిందితులను బంధించి బంగారాన్ని రికవరీ చేసిన ఎస్ఐ అమరేశ్, సిబ్బందిని జిల్లా ఎస్పీ అరుణాంశుగిరి అభినందించారు.

కోడిపందెంరాయుళ్లపై పోలీసు దాడులు

కారటగి తాలూకాలోని బసవన్నక్యాంప్ సమీపంలో కోడి పందేలు ఆడుతున్న వారిపై కారటగి పోలీసులు దాడి చేసి రెండు కోళ్లు, 7 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కోడిపందెంరాయుళ్లు పోలీసుల రాకను గమనించి పరారయ్యారు. కోళ్లను, బైక్‌లను ట్రాక్టర్‌లోకి ఎక్కించి తమ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కారటగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

రాష్ట్రాభివృద్ధే నా ప్రధాన లక్ష్యం

- గాలి జనార్దనరెడ్డి



కార్యక్రమానికి వస్తున్న జనార్దనరెడ్డి

బాగేపల్లి: అన్ని జాతి, మతాలను కలుపుకొని రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే తన ముందున్న లక్ష్యమని, కళ్యాణ రాజ్య ప్రగతి పార్టీ అధ్యక్షుడు గాలి జనార్దనరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి బాగేపల్లి తాలూకాలోని పరగోడు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కొత్తకోటె గ్రామంలో అయ్యప్ప స్వామి పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2004, 2008 ఎన్నికల్లో బాగేపల్లి నియోజకవర్గానికి వచ్చి నటుడు సాయికుమార్‌కు మద్దతుగా ప్రచారం చేశానని, కానీ అతి తక్కువ ఓట్ల తేడాతో సాయికుమార్ ఓడిపోయారని చెప్పారు. తాను గతంలో మంత్రిగా ఉన్నప్పుడు బాగేపల్లి అభివృద్ధికి కృషిచేశానని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో తమ బలం ఎక్కడ ఎక్కువగా ఉంటుందో అక్కడ పార్టీ అభ్యర్థులు తప్పకుండా బరిలో ఉంటారని అన్నారు.

కేఆర్‌పీపీ జిల్లాధ్యక్షుడుగా రాజశేఖరగౌడ

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో ఇటీవల ఆవిర్భవించిన కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ(కేఆర్‌పీపీ) బళ్లారి జిల్లాధ్యక్షుడుగా బీజేపీ సీనియర్ నాయకుడు, వీరశైవ విద్యావర్ధక సంఘం ప్రముఖులు గోనాళ్ రాజశేఖరగౌడ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం కేఆర్‌పీపీ వ్యవస్థాపకుడు గాలి జనార్దనరెడ్డి బెంగళూరులో ఆయనకు జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు.

మలబార్ హెరిటేజ్ నగల ప్రదర్శన



సాక్షి, బెంగళూరు: మలబార్ గోల్డ్ – డైమండ్స్ సంస్థ ఆధ్వర్యంలో హెరిటేజ్ జ్యూవెలరీ షో నగరంలో విజయవంతంగా కొనసాగుతోంది. ఈ నెల 14న బెంగళూరు ఎంజీ రోడ్డులోని సంస్థ షోరూమ్‌లో బంగారం, వజ్రాలు, విలువైన రత్నాల ఆభరణాల ప్రత్యేక ప్రదర్శన, విక్రయం ఆరంభమైంది. అందమైన డిజైన్లతో కూడిన బంగారు, వజ్రాభరణాలు ఇక్కడ కొలువుతీరాయి. ఈ నెల 22 వరకూ కొనసాగుతుంది. ఈ షో ఎంతో మంది నగరవాసులు ఆభరణాలను మన్నికైన ధరల్లో కొనుగోలు చేస్తున్నారు.

కోలారు వార్తలు...

ప్రజా సంక్షేమంపై రాహుల్‌కు నమ్మకం లేదు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నేతలు

శ్రీనివాసపురం : రాహుల్ గాంధీకి ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై విశ్వాసం లేదని, కేవలం ప్రచారం కోసం యాత్రలు చేస్తున్నారు కానీ దేశం, ప్రజా సంక్షేమం ఎంతమాత్రం పట్టదని హాసన ఎంపీ, జేడీఎస్ నాయకుడు ప్రజ్వల్ రేవణ్ణ ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని వెంకటేశ్వర కళ్యాణ మంటపంలో జేడీఎస్ యువ గర్జన సమావేశాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కోలారును అభివృద్ధి చేస్తానంటూ కోలారుకు వస్తున్నారు. అయితే అతని వల్ల ఏదీ సాధ్యం కాదు. కోలారు నుంచి ఆయన ఎన్నిక కావడం కలలో మాటేనన్నారు. కుమారస్వామి అధికారంలోకి వచ్చిన తరువాత చెప్పిన విధంగా రైతులు, స్త్రీ శక్తి సంఘాల రుణాలు మాఫీ తప్పకుండా చేస్తారన్నారు. జిల్లాకు శాశ్వత నీటిపారుదల సౌలభ్యాలను కల్పిస్తారన్నారు. పాడి రైతుల, పట్టు ఉత్పత్తిదారుల సమస్యలను పరిష్కరిస్తారన్నారు. రైతులకు 8 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తారన్నారు. కాంగ్రెస్ అధికార అవధిలో రైతుల ఆత్మహత్యలు అధికం అయ్యాయి. రైతు సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లనే రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సి వచ్చిందన్నారు. జేడీఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత శ్రీనివాసపురం నుంచి ఎన్నికైన జి కె వెంకటశివారెడ్డిని మంత్రిని చేస్తారన్నారు. కార్యక్రమంలో జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు, శ్రీనివాసపురం అసెంబ్లీ అభ్యర్థి జి కె వెంకటశివారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తూపల్లి ఆర్ చౌడరెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు వక్కలేరి రాము తదితరులు పాల్గొన్నారు.

శ్రీగంధం దుంగల స్వాధీనం

కోలారు : పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న శ్రీగంధం దుంగలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకుని నిందితుడు బాలాజీ నుంచి 100 కిలోల శ్రీగంధం, కారును స్వాధీనం చేసుకున్నారు. కోలారు ఉప వలయ అటవీశాఖ అధికారి మంజునాథ్ నేతృత్వంలోని అటవీ సిబ్బంది ఖచ్చిత సమాచారం మేరకు దాడి జరిపిన సిబ్బంది అనుమానాస్పదంగా వెళుతున్న కారును అడ్డగించి పరిశీలించగా కారులో శ్రీగంధం దుంగలు కనిపించాయి. నిందితుడిని చిత్తూరు జిల్లా కుప్పం తాలూకా కుంగుందికి చెందిన బాలాజీగా అటవీ అధికారులు గుర్తించారు. నిందితుడు బాలాజీని అటవీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

పాడి రైతులకు దాణా అందజేత

మాలూరు : పట్టణంలోని 11వ వార్డులో పాడి రైతుల అనుకూలం కోసం మంగళవారం పురసభ నుంచి పిండి, బూసా పంపిణీ చేశారు. రైతులకు పశు ఆహారం పంపిణీ చేసి పురసభ సభ్యుడు ఎం.వి.వేమన మాట్లాడుతూ పాడి పశువులు కలిగిన రైతులు దాణాను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పురసభ మాజీ అధ్యక్షుడు సీపీ నాగరాజ్, తబల నారాయణప్ప, ఆశ్రయ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎం బి నంజుండప్ప, ఏపీఎంసీ నాగప్ప పాల్గొన్నారు.

పెచ్చులూడిన పాఠశాల పైకప్పు

- విద్యార్థులకు తప్పిన ప్రాణాపాయం



పెచ్చులూడిన పైకప్పు, కిందపడిన పెచ్చులు

కోలారు : పాఠశాలలో విద్యార్థులు ఉన్న సమయంలో పాఠశాల పైకప్పు పెచ్చులు ఊడి కింద పడిన ఘటన నగరంలోని గాంధీనగర కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చోటు చేసుకుంది. పాఠశాలలో విద్యార్థులు ఉన్న సమయంలో పాఠశాల పైకప్పు పెచ్చులు విద్యార్థులపై ఊడి పడ్డాయి. అదృష్ట వశాత్తు విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందిన వెంటనే విద్యాశాఖ అధికారులు పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. పూర్తిగా అధ్వాన స్థితిలో ఉన్న పాఠశాల భవనానికి మరమ్మతులు చేయాలని లేదా కొత్త గదులను నిర్మించాలని స్థానికులు, తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

బీజీఎంఎల్ సమస్యను పరిష్కరిస్తాం

కేజీఎఫ్ : రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో జేడీఎస్ పూర్తి మెజార్టీతో అధికారంలోకి రాగానే గత 23 ఏళ్లుగా పరిష్కారం కాని బీజీఎంఎల్ సమస్యను ముఖ్యమంత్రిగా కుమారస్వామి పరిష్కరిస్తారని జేడీఎస్ ఆశావహ అభ్యర్థి డాక్టర్ రమేష్‌బాబు తెలిపారు. సోమవారం రాత్రి కేఎస్‌జేఎస్‌డబ్ల్యూ బ్లాక్‌లో నిర్వహించిన సంగీత రసమంజరిలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజా సేవ చేయాలనే సంకల్పంతో తాను ఐఏఎస్ ఉద్యోగాన్ని కూడా వదిలి వచ్చానన్నారు. తనకు ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా ఎలా అందించాలో తెలుసని, ఒక్క అవకాశం ఇస్తే ప్రజా సేవ చేసి చూపిస్తానన్నారు. కుమారస్వామి తెచ్చిన పంచరత్న పథకాల అమలుతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి శ్రమిస్తానన్నారు. స్థానిక నాయకులు నటరాజ్, శేషుబాబు, ఆర్ముగం, శ్రీహరి పాల్గొన్నారు.

విద్యతోనే స్త్రీ పురుష సమానత్వం

కోలారు : విద్యతోనే స్త్రీ, పురుష సమానత్వం సాధ్యమని ఎమ్మెల్యే కె శ్రీనివాసగౌడ తెలిపారు. మంగళవారం టి.చెన్నయ్య రంగమందిరంలో మలబార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులకు రూ.1.35 కోట్ల విద్యార్థి వేతన పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి యుగంలో బాలికల విద్యాభ్యాసానికి తల్లిదండ్రులు ప్రాధాన్యతనిస్తుండడం, ట్రస్టు 1400 మంది విద్యార్థులకు ఉపకార వేతనం అందిస్తుండడం హర్షణీయమన్నారు. మలబార్ గోల్డ్ కంపెనీ మేనేజర్ సంతోష్ మాట్లాడుతూ పేదలను గుర్తించి వారి పిల్లల విద్యాభ్యాసానికి సంస్థ సహకారం అందిస్తోందన్నారు. వేరే రాష్ట్రాల్లో సుమారు రూ.9 కోట్లతో 18 వేల మంది విద్యార్థులకు కంపెనీ ఉపకార వేతనాన్ని చెల్లిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోవిందరాజులు, కసాప మాజీ అధ్యక్షుడు నాగానంద కెంపరాజ్ పాల్గొన్నారు.

వన్ యూనిఫాంకు రాష్ట్రం సమ్మతి

బనశంకరి: వన్‌నేషన్– వన్ యూనిఫాం ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దేశమంతటా పోలీసులకు ఒకే మాదిరి యూనిఫాం ఉండాలన్న కేంద్ర ప్రతిపాదనకు రాష్ట్ర హోంశాఖ సమ్మతించింది. దీనిపై కేంద్రం అన్ని రాష్ట్రాల అభిప్రాయాలనూ అడుగుతోంది.

రేపు యాదగిరి జిల్లాలో ప్రధాని పర్యటన



సభా వేదిక స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

రాయచూరు రూరల్ : యాదగిరి జిల్లాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 19న పర్యటిస్తున్నట్లు జిల్లాధికారి స్నేహల్ పేర్కొన్నారు. మంగళవారం యాదగిరి కలెక్టరేట్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. నారాయణపుర ఎడమ కాలువ విస్తరణ, ఆధునీకరణ పనులకు శ్రీకారం చుడతారన్నారు. కలబుర్గి, విజయపుర, యాదగిరి జిల్లాల్లో 560 గ్రామాల్లో 3.34 లక్షల మంది రైతులకు నీటిపారుదల సౌకర్యం, భారత్ మాల పథకంలో నింబాళ నుంచి సింగనోడి వరకు 65.5 కి.మీ. మేర ఆరు లైన్ల రహదారి నిర్మాణానికి రూ.200 కోట్లు, బహు గ్రామ తాగునీటి పథకంలో 710 గ్రామాలకు, మూడు నగరాలకు నీరందించడానికి రూ.2054 కోట్లు ఖర్చు అవుతాయన్నారు.

సభాస్థలి పరిశీలన

జిల్లాలో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో మంగళవారం హుణసిగి తాలూకా కొడేకల్ వద్ద ఏర్పాటు చేసిన సభాస్థలిని జిల్లాధికారి స్నేహల్ పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ వేదమూర్తి, జెడ్పీ సీఈఓ అమరేష్ నాయక్, డీహెచ్ఓ హిరేగౌడర్‌లున్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యం

- మాజీ సీఎం సిద్ధరామయ్య



ప్రారంభిస్తున్న డీకే.శివకుమార్ తదితరులు

హొసపేటె: అఖండ జిల్లాలోని అన్ని క్షేత్రాలు ఈ సారి కాంగ్రెస్ కైవసం కావాలని, కాంగ్రెస్‌తోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అని మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. మంగళవారం పునీత్‌రాజ్‌కుమార్ క్రీడా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాధ్వని బస్సు యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 22 జిల్లాల్లో ప్రజల సమస్యలను తెలుసుకోవడమే ప్రజాధ్వని యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో అధికార బీజేపీ ప్రభుత్వంలో అవినీతి తాండవం ఆడుతోందన్నారు. ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు 40 శాతం కమీషన్‌ను తీసుకొనేందుకు పరిమితమయ్యారని ఆరోపించారు. ప్రజల కష్టాలను, అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. మంచినీటిని అందించలేని ఆనంద్‌సింగ్ వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేపీసీసీ అధ్యక్షులు డీకే.శివకుమార్, బీకే హరిప్రసాద్, ఈశ్వరఖండ్రె, రణదీప్‌సింగ్ సుర్జేవాలా, ఎమ్మెల్యేలు భీమానాయక్, గణేష్, పీటీ.పరమేశ్వర నాయక్, ఈ.తుకారాం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దోపిడీ దొంగ అరెస్ట్

మైసూరు: మైసూరు జిలా సరగూరు పట్టణంలో సరగురు వర్తక మండలి ఉపాధ్యక్షుడు ఎస్.వి.గోపాల్ ఇంటిలో జరిగిన దోపిడీ ఘటనలో దొంగ పట్టుబడ్డాడు. ఎస్.ఎస్. మంజునాథ్ అలియాస్ తరకారి మంజు అనే దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ ఫైనాన్స్ సంస్థలో తాకట్టు పెట్టిన బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు.

చైన్‌స్నాచింగ్

మైసూరు: మైసూరు నగరంలోని నేతాజీ నగరలో చైన్‌స్నాచింగ్ చోటుచేసుకుంది. ప్రభావతి అనే మహిళ తన మనుమరాళ్లతో కలిసి దుకాణానికి వెళ్లి తిరిగి కాలినడకన వస్తుండగా బైక్‌లో వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని 35 గ్రాముల బంగారు గొలుసు లాక్కొని ఉడాయించారు. బాధితురాలు కేకలు వేసినా ఫలితం లేకపోయింది. కేసు దర్యాప్తులో ఉంది.

యత్నాళ్‌కు మద్దతుగా నిలుస్తాం

శివాజీనగర: ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్‌కు బీజేపీ పార్లమెంటరీ బోర్డు నుంచి ఎలాంటి నోటీస్ రాలేదని బసవజయమృత్యుంజయ స్వామి తెలిపారు. మంగళవారం నగరంలోని ఫ్రీడం పార్క్‌లో మాట్లాడిన బసవ జయమృత్యుంజయ స్వామి... యత్నాళ్‌కు నోటీస్ ఇస్తే ఆయనకు మద్దతుగా తమ సముదాయం నిలుస్తుందన్నారు. పంచమసాలి సముదాయానికి 2ఏ రిజర్వేషన్ కోసం రెండేళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు.

బాయిలర్ పేలి ఒకరి మృతి

మైసూరు: బాయిలర్ పేలి క్యాటరింగ్ యజమాని మృతి చెందగా ఒక కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. నంజనగూడులోని పారిశ్రామిక వాడలో మంజు(45) అనే వ్యక్తి ఒక షెడ్ ఏర్పాటు చేసి అన్నపూర్ణ పేరుతో క్యాటరింగ్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం వంటలు తయారు చేసే సమయంలో బాయిలర్ భారీ శబ్దంతో పేలిపోయింది. అక్కడే ఉన్న మంజు అక్కడికక్కడే మృతి చెందగా సహాయకుడు ప్రతాప్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని ఆస్పత్రికి తరలించారు. నంజనగూడు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మళ్లీ కుంగిన రోడ్డు



గుంత ఏర్పడిన స్థలం వద్ద మరమ్మతు చేపడుతున్న బీడబ్ల్యూ ఎస్ఎస్‌బీ సిబ్బంది

బనశంకరి: బెంగళూరు నగరంలో మరో ప్రాంతంలో భూమికుంగి గుంత ఏర్పడింది. మహాలక్ష్మీలేఔట్ మెయిన్‌రోడ్డులో రెండురోజులక్రితం రోడ్డుకు తారువేశారు. పైప్‌లైన్‌కు సమీపంలో రోడ్డు కుంగిపోయి గుంత ఏర్పడింది. మంగళవారం ఉదయం భారీ వాహనాలు సంచరించడంతో మూడున్నర అడుగుల లోతు గుంత ఏర్పడింది. బీడబ్ల్యూ ఎస్ఎస్ బీ సిబ్బంది ఆ గుంతను పూడ్చివేసే పనులు చేపట్టారు.

బైకును ఢీకొన్న క్యాంటర్ వాహనం

- ఇద్దరు స్నేహితుల మృతి



మృతులు రవి, వికాస్

బనశంకరి: వాయి వేగంతో దూసుకొచ్చిన క్యాంటర్ వాహనం మృత్యుశకటమై ఇద్దరు స్నేహితులను బలితీసుకుంది. ఈఘటన బ్యాడరహళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మాగడి తాలూకా తూబినగెరె నివాసులైన రవి(22), వికాస్(20) స్నేహితులు. సుంకదకట్టెలో నివాసం ఉంటూ కారు షోరూమ్‌లో పనిచేస్తున్నారు. వీరిద్దరూ బైక్‌లో దొడ్డగొల్లరహట్టికి వెళ్లి రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి బయలుదేరారు. మాగడిరోడ్డు అంజనానగర బస్టాప్ వద్ద వాయువేగంగా వచ్చిన క్యాంటర్‌వాహనం ఢీకొంది. కిందపడిన ఇద్దరిపై వాహనం దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డారు. ప్రైవేటు ఆస్పత్రికి తలించగా చికిత్స పొందుతూ ఇద్దరూ మృతిచెందారు. ఈఘటనపై బ్యాడరహళ్లి పోలీసులు కేసు నమోదుచేసుకుని మృతదేహాలను శవపరీక్షల నిమిత్తం విక్టోరియా ఆసుపత్రికి తరలించారు.

మిమ్స్‌లో రోగులకు వైద్యం అందడం లేదు




సమస్యలపై మాట్లాడుతున్న సభ్యుడు

మండ్య : మండ్యలోని మిమ్స్‌లో రోగులకు సరైన వైద్యం అందడం లేదని నగరసభ సభ్యులు మండిపడ్డారు. మంగళవారం నగరసభ అధ్యక్షుడు మంజు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ ప్రసూతి వార్డులో కనీస సదుపాయాలు లేవన్నారు. ఎంఆర్ఐ స్కానింగ్ రిపోర్టు సమయానికి ఇవ్వడం లేదని, ఔషధాల కోసం బయటకి పంపుతున్నారన్నారు. ఆస్పత్రిలో వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. అనంతరం నగరంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు.

వ్యక్తిని ఈడ్చుకెళ్లిన స్కూటరిస్టు

- బెంగళూరులో అమానుషం





బొలెరో వాహనదారుడితో స్కూటరిస్టు వాగ్వాదం, వాహనదారుడిని ఈడ్చుకెళ్తున్న స్కూటరిస్టు

సాక్షి,బెంగళూరు/శివాజీనగర: బెంగళూరు నగరంలో అమానుష ఘటన జరిగింది. రాంగ్‌రూట్‌లో వచ్చి బొలెరోను ఢీకొన్న స్కూటరిస్టు.. వ్యక్తిని ఒకటిన్నర కిలోమీటర్ మేర ఈడ్చుకొని వెళ్లాడు. జనం ఆగ్రహం చెంది ఆ స్కూటరిస్టుకు దేహశుద్ధి చేశారు. బెంగళూరులోని మాగడి టోల్‌గేట్ సమీపంలో ఓ వృద్ధుడు బొలెరో వాహనాన్ని నిలిపి ఉంచగా స్కూటరిస్టు అడ్డదిడ్డంగా వచ్చి ఢీకొట్టాడు. ఇదేమని ప్రశ్నించగా స్కూటరిస్టు గొడవపడి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో వాహనదారుడు స్కూటర్ సీటువెనుక కడ్డీని గట్టిగా పట్టుకొని ఆపేందుకు యత్నించగా స్కూటరిస్టు వేగం పెంచాడు. అయినప్పటికీ వాహనదారుడు కడ్డీని వదల్లేదు. స్కూటరిస్టు ఒకటిన్నర కిలోమీటర్ మేర ఈడ్చుకుంటూ హొసహళ్లి మెట్రో స్టేషన్ వరకు వెళ్లాడు. ఆటో డ్రైవర్లు, ఇత వాహనదారులు వెంటాడి స్కూటరిస్టును ఆపి దేహశుద్ధి చేశారు. విజయనగర పోలీసులు చేరుకొని స్కూటరిస్టును అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన వాహనదారుడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకెళ్లారు. కాగా స్కూటరిస్టు నాయండహళ్లి కాలనీకి చెందిన సుహేల్ (22)గా గుర్తించారు. మెడికల్ సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అతని దురంహకారం వల్లే..

'నాది విజయపుర అయినప్పటికీ 54 ఏళ్లుగా బెంగళూరులోనే ఉంటున్నా. సుహేల్ వెనుక నుంచి వచ్చి నా బొలేరో వాహనాన్ని ఢీ కొట్టాడు. ఆ సమయంలో అతడు మొబైల్‌లో మాట్లాడుతున్నాడు. అప్పుడే అతడు క్షమాపణ చెప్పి ఉంటే వదిలేసేవాడిని. కానీ దురంహకారంగా ప్రవర్తించాడు. పారిపోయేందుకు ప్రయత్నించగా బైక్‌ను పట్టుకున్నా. అయినా అతను ఆగకుండా లాక్కుని వెళ్లాడు. అక్కడున్న ఒకరిద్దరు యువకులు అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ తర్వాత ఒక ఆటో డ్రైవర్ అతడిని అడ్డగించి పట్టుకున్నాడు' అని బొలెరో డ్రైవర్ ముత్తప్ప పేర్కొన్నారు.

వాహనాన్ని ఢీ కొట్టింది నిజం..

'వాహనాన్ని ఢీ కొట్టింది నిజం. నా బైక్‌కు కూడా డ్యామేజ్ అయింది. నేను రాంగ్ రూట్‌లో రాలేదు. ప్రజలు, చుట్టూ ఉన్న వారు కొడతారేమో అని భయంతో పారిపోయాను. నేను బైక్‌ను నడుపుతున్నప్పుడు ఆ వేగానికి అతడు వాహనాన్ని వదిలేస్తాడనుకున్నా. అయితే అతడు గట్టిగా బైక్‌ను పట్టుకుని వదల్లేదు. నేను భయంతో అలాగే వెళ్లాను. ఆ సమయంలో నేను నాయండనహళ్లిలోని నా ఇంటికి వెళుతున్నా'

– పోలీసు స్టేషన్‌లో సుహేల్ వివరణ

కలబురిగి బంద్ విజయవంతం

- కదం తొక్కిన అన్నదాతలు



డిపోకు పరిమితమైన బస్సులు



ఆందోళన చేస్తున్న రైతులు

యశవంతపుర: అతివృష్టి, అనావృష్టి వల్ల నష్టపోయిన వరి, కంది, పత్తి, జొన్న తదితర పంటలకు తక్షణం పరిహారం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిర్వహించిన కలబురిగి బంద్ విజయవంతమైంది. ఉదయం ఐదు గంటల నుంచి రైతులు రోడ్లపైకి వచ్చారు. దీంతో 11 గంటల వరకు అంగళ్లు మూత పడ్డాయి. బస్సుల రాకపోకలు నిలిచిపోయి కలబురిగి బస్టాండు బోసిపోయింది. దీంతో జన జీవనానికి పాక్షికంగా అంతరాయం ఏర్పడింది. సేడం ఎమ్మెల్యే రాజ్‌కుమార్ పాటిల్ మాట్లాడుతూ జిల్లా వ్యావ్యాప్తంగా చీడపీడలతో 70 వేల హెక్టార్లలో కందికి నష్టం జరిగిందన్నారు. ఈనెల 19న కలబురిగికి వస్తున్న ప్రధాని నరేంద్రమోదీ.. రైతులకు పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రక్తస్రావంతో బాలింత మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు, దళిత నేతల ధర్నా



ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న మృతురాలు మౌనిక బంధువులు, దళిత సంఘాల నేతలు

శిడ్లఘట్ట: బాలింత మృతి చెందగా ఇందుకు ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బంధువులు, దళిత సంఘాల నాయకులు ఆస్పత్రి ముందు ధర్నా నిర్వహించారు. వివరాలు.. అబ్లూడు గ్రామానికి చెది మధు భార్య మౌనిక(18) కాన్పు కోసం ఈ నెల 14న ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. ఈక్రమంలో ఆమె ఈనెల 15న ఆడపిల్లకు జన్మ ఇచ్చింది. అయితే తీవ్ర రక్తస్రావం కావడంతో మౌనికను చిక్కబళ్లాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. దీంతో బంధువులు మృతదేహాన్ని శిడ్లఘట్ట ఆస్పత్రికి తీసుకొచ్చి ధర్నాకు దిగారు. రక్తస్రావమైనా వైద్యులు పట్టించుకోలేదని, పైగా చివరి నిమిషంలో చిక్కబళ్లాపురం పంపారని, దీంతో ఆమె మృతి చెందినట్లు మండిపడ్డారు.

పకడ్బందీగా చెత్త సంస్కరణ

బనశంకరి: చెత్త వర్గీకరణ, చెత్త సంస్కరణపై ప్రజల్లో జాగృతి తీసుకురావాలని విశ్రాంత న్యాయమూర్తి, ఎన్‌జీటీ రాష్ట్రస్థాయి సమితి అధ్యక్షుడు సుబాష్ బీ. ఆడి అన్నారు. చెత్త నిర్వహణపై క్యాపిటల్ హోటల్‌లో జరిగిన సదస్సులో బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. కొత్తగా లేఔట్ల నిర్మాణానికి ఆమోదించే సమయంలో 5 శాతం స్థలాన్ని పొడిచెత్త నిర్వహణకు కేటాయించాలన్నారు. రాష్ట్ర కాలుష్యనియంత్రణ మండలి కార్యదర్శి శ్రీనివాసులు, పొడిచెత్త విభాగ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ హరీశ్‌కుమార్ పాల్గొన్నారు.

పశువుల కొట్టాలు దగ్ధం

గౌరిబిదనూరు: అనఘట్టనహళ్లిలో రత్నమ్మ, గంగమ్మకు చెందిన పశువుల కొట్టాలు సోమవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. దుస్తులు, ధాన్యం, నగదు కాలి బూడిదైంది. ఆవులు, గేదెలు గాయపడ్డాయి. ఎమ్మెల్యే శివశంకరరెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. పక్కా గృహాలు మంజూరు చేయాలని, ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

పౌరకార్మికుల సేవలు అపారం



పౌరకార్మికులకు నిత్యావసరకిట్లు వితరణ చేస్తున్న ఎస్ఆర్.రమేశ్, శశికళ, తిప్పేస్వామి

బనశంకరి: పౌరకార్మికుల సేవలు అపారమని బెంగళూరు దక్షిణజిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎస్ఆర్.రమేశ్ అన్నారు. జయనగర నియోజకవర్గంలోని శాలిని మైదానంలో మంగళవారం ఎస్.ఆర్.రమేష్, బీబీఎంప కాంట్రాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో పౌర కార్మికులతో సంక్రాంతి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 2500 మంది పౌరకార్మికులకు నిత్యావసరవస్తువుల కిట్లు అందజేసి ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందజేశారు. మాజీ బీబీఎంపీ సభ్యురాలు శశికళ, పోతణ్ణ, శ్రీరాములు, శ్రీనివాస్‌హుచ్చయ్య పాల్గొన్నారు.

కరెంటు కోతలపై భగ్గుమన్న రైతు సంఘాలు



నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

గౌరిబిదనూరు: వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ కోతలు విధిస్తున్న బెస్కాం తీరుపై రైతు సంఘాలు భగ్గుమన్నాయి. ఈమేరకు మధుగిరి రోడ్డులో ఉన్న బెస్కాం కార్యాలయం ముందు కర్ణాటక రైతుసంఘం, హసిరుసేనె నాయకులు సోమవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి లాయర్ ఎంఆర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇంకా పంటలు చేతికందకనే విద్యుత్ కోతలు మొదలయ్యాయన్నారు. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పగలు 7 గంటలు రాత్రి గంట పాటు తప్పని సరిగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండు చేశారు. రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు గుండాపురం లోకేశగౌడ ప్రసంగిస్తూ ఫ్యాక్టరీలకు నిరంతరాయంగా సరఫరా చేస్తూ వ్యవసాయ కనెక్షన్లకు వచ్చేసరిగాకి కోతలు విధిస్తున్నారని మండిపడ్డారు. రాగులు, జొన్నలు, కందులు తదితర పంటలకు నష్టం జరుగుతోందన్నారు. ఇప్పటికైనా స్పందించి వ్యవసాయ మోటర్లకు నిర్దేశించిన మేరకు విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బెస్కాం ఏఈఈకి వినతిపత్రం అందజేశారు.

దేవుని ఊరేగింపుపై పార్టీల రగడ

- గ్రామంలో నిషేధాజ్ఞలు

తుమకూరు: తుమకూరు తాలూకాలోని హెబ్బూరు దగ్గర లింగాపుర గ్రామంలో సోమవారం రాత్రి శని మహాత్ముని ఊరేగింపులో జేడీఎస్, బీజేపీ కార్యకర్తలు గొడవపడ్డారు. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి నిషేధాజ్ఞలు అమలు చేశారు. మొదట తాము పూజలు చేసి ఊరేగింపు చేస్తామని, మాకు ఉత్సవమూర్తులను ఇవ్వాలని బీజేపి కార్యకర్తల కోరగా, ఇందుకు జేడీఎస్ కార్యకర్తలు ఒప్పుకోలేదు. గ్రామ ప్రజలందరూ కలిసి పూజించి తరువాత కలిసి ఊరేగింపు చేయడం ఆనవాయితీ అని చెప్పారు. దీంతో రెండు గుంపుల మధ్య రగడ ఆరంభమైంది. హెబ్బూరు పోలీసులు వచ్చి వారికి నచ్చ చెప్పే ప్రయత్నం చేసినా ఎవరూ మెట్టు దిగలేదు. అర్ధరాత్రి 2 గంటల వరకు చర్చలు జరిగినా పట్టు విడవకపోవడంతో పోలీసులు ఎవరికీ అనుమతి ఇచ్చేది లేదని ఊరేగింపును నిలిపివేశారు. అల్లర్లు జరగకుండా నిషేధాజ్ఞలను విధించారు.

కొత్త కారు వేగానికి ఒకరు బలి

యశవంతపుర: కారు ఢీకొని బైకిస్టు మృతి చెందిన ఘటన బెంగళూరు విజయనగర ట్రాఫిక్ లీసుస్టేషన్ పరిధిలోని బసవేశ్వరనగరలో జరిగింది. బసవేశ్వరనగరకు చెందిన ఓ వ్యక్తి కొత్తగా కారు కొన్నాడు. సోమవారం సాయంత్రం గుడికి వెళ్లి పూజలు చేయించి ఇంటికి వెళ్తుండగా అతి వేగంతో అదుపు తప్పి బైక్‌పై వెళ్తున్న బొగ్గరామ్ నాగరాజ్(61) అనే వ్యక్తిని ఢీకొన్నాడు. తలకు బలమైన గాయాలు కావడంతో నాగరాజును మణిపాల్ ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు.

చెట్టుకు ఉరివేసుకోబోయి కింద పడి మృతి

యశవంతపుర: కుటుంబ కలహాలతో చెట్టుకు ఉరివేసుకునేందుకు యత్నించిన యువకుడు కిందపడి మృతి చెందాడు. ఈ ఘటన దొడ్డబళ్లాపుర పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. కరేనహళ్లి నివాసి నాగేంద్రప్రసాద్(19) మగ్గం నేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం కుటుంబసభ్యులతో గొడవపడ్డాడు. అదేరోజు రాత్రి ఉరి పట్టణంలోని భగత్‌సింగ్ మైదానం వెనుక ప్రభుత్వ పాఠశాల అవరణంలోకి వెళ్లి పంచెతో చెట్టుకు ఉరి వేసుకునేందుకు యత్నించి జారి కింద పడ్డాడు. తలకు బలమైన గాయలు కావటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వేశ్యావాటిక నిర్వహిస్తున్న సినీ నటుడి అరెస్ట్



నటుడు మంజునాథ్(ఫైల్)

యశవంతపుర: వ్యభిచారం నిర్వహిస్తున్న కన్నడ నటుడు మంజునాథ్ అలియాజ్ సంజును బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఏడాది క్రితం విడుదలైన న్యూరాన్ సినిమాలో మంజునాథ్ నటించారు. వేశ్యవాటిక నిర్వహిస్తూ యాప్ ద్వారా విటులను రప్పించేవాడు. పోలీసులు దాడి చేసి మంజునాథ్‌ను అరెస్ట్ చేశారు.

లారీ దగ్ధం



కాలిపోతున్న సిమెంట్ లారీ

యశవంతపుర: సిమెంట్‌లోడ్‌తో బాగలకోట నుంచి మంగళూరుకు వెళ్తున్న లారీ మంగళవారం ఉదయం ఉత్తరకన్నడ జిల్లా యల్లాపుర తాలూకా అరబైల్ జాతీయ రహదారి 63లో ఘాట్ దిగుతుండగా ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. డ్రైవర్, క్లీనర్ కిందకు దిగగానే వాహనంతోపాటు సిమెంటు కూడా మంటల్లో కాలిపోయింది. సైలెన్సర్ వేడితో మంటలు వ్యాపించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్

- బైకిస్టు దుర్మరణం



అభిషేక్(ఫైల్)

మండ్య : టిప్పర్ ఢీకొని బైకిస్టు మృతి చెందిన సంఘటన జిల్లాలోని మద్దూరు వద్ద చోటు చేసుకుంది. బెంగళూరులో జ్యూస్ వ్యాపారం చేసుకునే అభిషేక్(25) బైక్‌పై మైసూరు వెళ్లి తిరిగి వస్తుండగా మద్దూరులో మైసూరు –బెంగళూర జాతీయ రహదారిలో టిప్పర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అభిషేక్ అక్కడికక్కడే మృతి చెందాడు.

వేతనాల్ని సవరించాలి

మైసూరు: రాష్ట్రంలో ఉన్న అన్ని విశ్వవిద్యాలయాల్లో వేతన సవరణ చేసినట్లుగానే మైసూరు వర్సిటీలోనూ అతిథి ఉపన్యాసకుల వేతనాలను సవరించాలని ఎమ్మెల్సీ మరి తిబ్బేగౌడ కోరారు. మంగళవారం నగరంలో మీడియాతో మాట్లాడారు. మైసూరు వర్సిటీలో అతిథి ఉపన్యాసకుల అనేక సమస్యలు పెండింగ్ ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కారం చేయాలన్నారు. ఉన్నత విద్యా శాఖ మంత్రి స్పందించాలని కోరారు.

చిక్కలో దట్టంగా పొగమంచు తెరలు

రైల్వే స్టేషన్‌లో పొగ మంచు



చిక్కబళ్లాపురం: చలికాలం ఎటుచూసినా సత్తా చూపుతోంది. గజగజ వణికిస్తున్న చలితో పొద్దెక్కేవరకూ ఎవరూ బయటకు రావడం లేదు. దీనికి తోడు దట్టమైన పొగమంచు అలముకొంటోంది. ఫలితంగా రహదార్లలో దారి కనిపించక ప్రమాదాలూ జరుగుతున్నాయి. వాకింగ్ చేసేవారు, స్కూలు, కాలేజుకు వెళ్లే విద్యార్థులు సైతం పొగమంచుతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. చిక్క పరిసరాల్లో నిత్యం పొగమంచు ఆవరిస్తోంది. రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో ఆవరించిన పొగమంచును చిత్రంలో చూడవచ్చు.

హోసూరు వార్తలు..

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

కెలమంగలం: అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో కూలి కార్మికుడు పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్నాడు. వివరాలు... కెలమంగలం సమీపంలోని నీలగిరి గ్రామానికి చెందిన మదన గిరియప్ప(40)కి తాగుడు అలవాటుండేది. కొన్నిరోజుల క్రితం అనారోగ్యానికి గురైన ఇతనికి బంధువులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. ఫలితం లేకపోవడంతో గత 7వ తేదీ పురుగుల మందు తాగడంతో అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు అతన్ని సేలం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. కెలమంగలం పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ ఢీకొని బెంగళూరు మహిళ....

హోసూరు: మేల్‌మరువత్తూరు ఓంశక్తి దేవాలయానికెళ్లి దర్శనం ముగించుకొని ఊరికెళ్తున్న భక్తురాలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన సింగారపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు బెంగళూరుకు చెందిన సావిత్రమ్మ (52) ఓంశక్తి మాల వేసుకొని మేల్‌మరువత్తూరుకు వెళ్లింది. అమ్మవారిని దర్శించుకొని కర్ణాటక ఆర్టీసీ బస్సులో తిరుగు ప్రయాణమైంది. సింగారపేట సమీపంలోని సాసనూరు వద్ద బస్సు డ్రైవర్ బస్సును ఆపడంతో ప్రయాణికులు కిందకు దిగారు. సావిత్రమ్మ రోడ్డుకు అవతల ఉన్న దుకాణానికెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొట్టింది. సావిత్రమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స కోసం ఊత్తంగేరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందింది. సింగారపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

బస్టాండ్‌లో వ్యక్తి మృతదేహం



వ్యక్తి మృతదేహం

క్రిష్ణగిరి: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కొత్త బస్టాండులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండగా మంగళవారం ఉదయం ప్రయాణికులు గుర్తించి క్రిష్ణగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని మృతుడు ఏ ప్రాంతవాసి అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారులకు అభినందనలు

హోసూరు: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం అందుకొన్న క్రీడాకారులను మంగళవారం హోసూరు మేయర్ ఎస్ఏ సత్య అభినందించారు. జనవరి 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు పంజాబ్‌లో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో 14, 17, 19 ఏళ్ల విభాగాల్లో హోసూరు చెందిన క్రీడాకారులు పాల్గొని బంగారు పతకాలను పొందారు. హోసూరు పేరును నిలబెట్టడం హర్షదాయకమని మేయర్ అభినందించారు.

ఘనంగా ఎంజీఆర్ జయంత్యుత్సవాలు



రాయకోట రోడ్డు కూడలిలో ఎంజీఆర్ చిత్రపటానికి పి.బాలక్రిష్ణారెడ్డి నివాళులు



డెంకణీకోట డిపో వద్ద జయంతి వేడుకలు

హోసూరు, క్రిష్ణగిరి, కెలమంగలం: ప్రసిద్ధ సినీ నటుడు, అన్నా డీఎంకే పార్టీ వ్యవస్థాపకుడు, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎంజిఆర్ 106వ జయంతి ఉత్సవాలను మంగళవారం క్రిష్ణగిరి జిల్లా వ్యాప్తంగా అన్నాడీఎంకే నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. హోసూరు– బాగలూరు రోడ్డులోని అన్నాడీఎంకే కార్యాలయం వద్ద క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి పి. బాలక్రిష్ణారెడ్డి అధ్యక్షతన ఎంజిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయకోట రోడ్డు కూడలిలోని ఎంజీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎంజీఆర్ చేసిన సేవలను మాజీ మంత్రి ప్రజలకు వివరించారు. బాగలూరులో జిల్లా కౌన్సిలర్ ఆర్.కే. రవికుమార్ అధ్యక్షతన జయంత్యుత్సవాలను నిర్వహించారు.

డెంకణీకోటలో

తాలూకా కేంద్రం డెంకణీకోటలో పార్టీ నాయకుడు జయరామన్ అధ్యక్షత అన్నాడీఎంకే నాయకులు, కార్యకర్తలు పాత బస్టాండులో ఎంజిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ప్రజలకు అన్నదానం చేశారు. ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు నివాళులు అర్పించారు.

చోరీకి వచ్చి దొరికిన దొంగలు

హోసూరు: ముగ్గురు దొంగలను మత్తిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు తేని జిల్లాకు చెందిన నాగరాజ్ (38) హోసూరు 9వ వార్డు శివకుమార్ నగర్‌లో కుటుంబంతో కలిసి నివాసముంటూ ప్రైవేట్ పరిశ్రమలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సంక్రాంతికి ఊరికెళ్లారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నాగరాజ్ ఇంటి తాళాలు పగులగొట్టి చొరబడ్డారు. శబ్దం విన్న స్థానికులు మత్తిగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సావిత్రి నేతృత్వంలో పోలీసులు చేరుకొని దొంగలను పట్టుకున్నారు. నిందితులు కెలమంగలం జీవానగర్‌కు చెందిన మురుగన్ (38), ఎస్. ముదుగానపల్లికి చెందిన సంతోష్‌కుమార్ (26), యారబ్ (26) అని తెలిసింది. వీరిని అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు.

63 మందికి భూమి మంజూరు

బాగేపల్లి: బాగేపల్లి పట్టణంలో ఉన్న తాలూకాఫీసులో ఎమ్మెల్యే ఎస్.ఎన్. సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 63 మంది భూమిలేని రైతులకు 163 ఎకరాల భూమిని మంజూరుచేశారు. అధికారులు పకడ్బందీగా తనిఖీ చేసి అర్హులకు భూమిని మంజూరు చేశారని ఎమ్మెల్యే చెప్పారు.

సమావేశంలో తహసీల్దార్ వై.రవి, సమితి సభ్యులు వై.రామచంద్ర, నిర్మలమ్మ, గోపాల్ పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

మండ్య: హలగూరు సమీపంలోని గ్రామదేవతపుర గ్రామంలో పోలీసులు తనిఖీలు చేశారు. చెన్నబసప్ప (61) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని ఇంటి వెనుక పెంచుతున్న గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు.

ఉత్సాహంగా జల్లికట్టు

పరుగులు తీస్తున్న వృషభాలు





వృషభాలను నిలువరిస్తున్న యువకులు

క్రిష్ణగిరి: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సూళగిరి తాలూకా ఆరుపల్లి గ్రామంలో సోమవారం జల్లికట్టు క్రీడను ఉత్సాహంగా నిర్వహించారు. డీఎంకే యువజన విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసన్ జల్లికట్టును ప్రారంభించగా వివిధ ప్రాంతాలనుంచి 300కిగా ఎద్దులను తీసుకొచ్చి పరుగెత్తించారు. జల్లికట్టు వీరులు ఉత్సాహంగా పాల్గొని వృషభాలను నిలువరించారు.

క్లుప్తంగా...

ఆర్టీసీకి సంక్రాంతి బొనాంజా
పండుగకు ముందు ప్రత్యేక బస్సులతో రూ.141 కోట్ల రాబడి

సాక్షి, అమరావతి: సంక్రాంతి పండుగ సమయంలో కేవలం సాధారణ చార్జీలతోనే రాష్ట్ర ప్రజా రవాణా విభాగం(ఆర్టీసీ) రికార్డు స్థాయిలో రాబడి సాధించింది. పండుగకు ముందు నడిపిన ప్రత్యేక బస్సులతో ఆర్టీసీ రూ.141 కోట్లు ఆర్జించింది. అనేక ఏళ్ల పాటు ఆర్టీసీ సంక్రాంతి, దసరా సీజన్లలో నడిపే ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అదనపు చార్జీలు వసూలు చేసింది. 2022 దసరా నుంచి ఆ విధానానికి ముగింపు పలికింది. సాధారణ చార్జీలతోనే గతేడాది దసరా ప్రత్యేక బస్సులను నిర్వహించింది. అదేవిధంగా ఇప్పుడు సంక్రాంతి ప్రత్యేక బస్సులను కూడా సాధారణ చార్జీలతోనే నడిపింది. సంక్రాంతి పండుగకు ముందు అంటే జనవరి 6 నుంచి 14 వరకు 3,120 ప్రత్యేక బస్సులను సాధారణ చార్జీలతో నిర్వహించగా రూ.141 కోట్ల రాబడి వచ్చింది. గతేడాది కంటే ఈసారి రూ.34 కోట్లు అధిక రాబడి రావడం విశేషం. కాగా, ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక చర్యలు తీసుకుంది. అడ్వాన్స్ బుకింగ్ సదుపాయం కల్పించింది. ఒకేసారి రానూపోనూ టికెట్లు బుక్ చేసుకునేవారికి 10 శాతం రాయితీ ప్రకటించింది. హైదరాబాద్ నుంచే ప్రత్యేకంగా 1,483 బస్సులు నిర్వహించింది. దాంతో ఆర్టీసీ సర్వీసుల పట్ల ప్రయాణికులు అత్యధిక ఆదరణ చూపించారు.

పెద్దిరెడ్డి కాన్వాయ్ ప్రమాదంలో కుట్రకోణం
కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు

సాక్షి, అమరావతి: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రయాణిస్తున్న కాన్వాయ్ రోడ్డు ప్రమాదానికి గురికావడం వెనుక కుట్ర కోణం దాగి ఉందని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి అనుమానం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై విచారణ కమిషన్ వేసి నిజనిర్ధారణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తన ప్రయోజనాల కోసం చంద్రబాబు చేసే నీచ రాజకీయాలు, హత్యా రాజకీయాలు రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. చదువుకునే రోజుల నుంచి పెద్దిరెడ్డిని ఎదుర్కోలేని చంద్రబాబు ప్రతిసారి కుట్రలు చేసేవాడని ఆరోపించారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పాలనను ప్రజలకు వివరించి వారి నుంచి విశేష ఆదరణ పొందుతున్న పెద్దిరెడ్డిని ప్రత్యక్షంగా ఎదుర్కోలేక కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. పవన్ కళ్యాణ్ ఏ మీటింగ్ పెట్టినా తాను సీఎం అవుతానని చెప్పడంలేదని, బాబును సీఎం చేయడానికే తాపత్రయ పడుతున్నట్టు అర్థమవుతోందన్నారు.

24న రాజకీయ స్పష్టత
బీజేపీ ఏపీ అధ్యక్షుడు సోము వీర్రాజు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అన్ని రాజకీయ అంశాలను పార్టీ పెద్దలకు చెప్పామని బీజేపీ ఏపీ అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు పూర్తయిన తర్వాత మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 24న భీమవరంలో జరగనున్న పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాజకీయ స్పష్టత ఇస్తామని చెప్పారు. ఏపీ, తెలంగాణల్లో ఎలా వ్యవహరించాలో పార్టీ నేతలు స్పష్టంగా చెప్పారన్నారు. కుటుంబ పార్టీలకు వ్యతిరేకంగా పోరాటమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ 400 రోజుల్లో ఎన్నికలకు ఎలా వెళ్లాలనే దానిపై చర్చ జరిగిందన్నారు.

జీవో నంబర్ 1పై స్టే తగదు
హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ సుప్రీంకోర్టుకు ఏపీ ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ: నియంత్రణ లేని రాజకీయ ర్యాలీలతో అమాయక ప్రజలు మృతిచెందకుండా ఉండేలా తీసుకొచ్చిన జీవో నంబర్ 1పై హైకోర్టు స్టే విధించడాన్ని సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు వెకేషన్ బెంచ్‌కు ఈ జీవోపై విచారించే అవకాశం లేదని, సంక్రాంతి సెలవుల నేపథ్యంలో హైకోర్టు నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా విచారణ సాగిందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 12.1.23న ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఈ పిటిషన్ దాఖలు చేసింది. 'పోలీసు చట్టం సెక్షన్ 30కి విరుద్ధంగా జీవో నంబర్ 1 ఉందంటూ ఏపీ హైకోర్టు ఈ నెల 23 వరకు జీవోను తాత్కాలికంగా నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాజకీయ పార్టీల బహిరంగ రోడ్‌షోలు, రాజకీయ ర్యాలీల కారణంగా పలువురు మృతిచెందారు. 28.12.22న ఓ రాజకీయ పార్టీ రోడ్‌షో కారణంగా నెల్లూరు జిల్లా కందుకూరులో ఎనిమిది మంది మృతి చెందారు. దీంతో పోలీసుల అనుమతి తప్పనిసరి చేస్తూ జీవోను తీసుకొచ్చాం. దీనిపై ప్రతివాది రామకృష్ణ ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. సంక్రాంతి వెకేషన్ బెంచ్ ఈ జీవోపై 12.1.23న స్టే విధించింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టులో హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేస్తున్నాం. వెకేషన్ బెంచ్ ఈ తరహా పిటిషన్ విచారించతగదు. ఎందుకంటే పాలసీ, పరిపాలన విధమైన పిటిషన్లు వెకేషన్ బెంచ్ విచారించదు అని హైకోర్టు ఈ నెల 5న నోటిఫికేషన్ కూడా ఇచ్చింది. జీవో కూడా పాలనపరమైన అంశానికి సంబంధించినదే. ఒకవేళ జీవోపై స్టే కొనసాగితే నియంత్రణ లేని రాజకీయ ర్యాలీల కారణంగా పలువురు మృతిచెందే అవకాశం ఉంది. హైకోర్టు విధించిన స్టేను ఎత్తివేయండి..' అని ఏపీ ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ ఆన్ రికార్డ్స్ మెహఫూజ్ నజ్కీ మంగళవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ప్రకృతి ఒడిలో వైదిక గ్రామం




హైటెక్ యుగంలో ప్రాచీన జీవన విధానం

- అక్కడ రాజు.. కూలీ ఉండరు
- పరమాత్మకు చేరువయ్యే వికాస మార్గం అక్కడ సాక్షాత్కారం
- సనాతన ధార్మిక జీవన విధానం వారి సొంతం
- ప్రకృతి ఒడిలో సహజసిద్ధ జీవితం
- ఒత్తిడి, టెక్నాలజీకి దూరంగా జీవనం

అక్కడ సెల్‌ఫోన్ నోటిఫికేషన్లు.. రింగ్‌టోన్ సౌండ్లు వినిపించవు.. టీవీలూ కనిపించవు. కానీ.. సకల చరాచర సృష్టిలో జీవులు ఉద్భవించడం నుంచి.. అస్తమించడం వరకూ విశ్వ సమాచారమంతా అక్కడి వారికి తెలుసు. మిక్సీలు.. వాషింగ్ మెషిన్లు వంటి హంగులేవీ కనిపించవు. కానీ.. పనులన్నీ చకచకా సాగిపోతాయి. అక్కడ విద్యుత్ లేదు. కానీ.. ఆ గ్రామస్తుల ఆలోచనల్లో చైతన్య కాంతి ప్రసరిస్తుంటుంది. అక్కడ వ్యాపారులు, కొనుగోలుదారులు ఎవరూ ఉండరు. అక్కడ రాజు.. కూలీ అనే వాళ్లెవరూ ఉండరు. అందరూ కూడు, గుడ్డ ప్రకృతి నుంచే పొందుతారు. తాము పండించిన వడ్లను దంచుకోగా వచ్చిన బియ్యాన్ని వండుకుతింటారు. కావాల్సిన దుస్తుల్ని సైతం స్వయంగా నేసుకుంటారు. అక్కడి ఇళ్లు కూడా గానుగలో ఆడించిన సున్నంతో వారు స్వయంగా కట్టుకున్నవే. ఇలా ఎన్నో.. ఎన్నెన్నో ప్రత్యేకతలకు నెలవైన ఆ ఊరి పేరు కూర్మ. శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలం అంతకాపల్లి కొండల మధ్య కొలువై ఉండే ఆ గ్రామంలోకి అడుగు పెడితే...

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/హిరమండలం: చుట్టూ పచ్చని కొండలు.. అందమైన ప్రకృతి. అంతేకాదు!!. ఆధునిక పద్ధతులకు దూరంగా.. సనాతన ధర్మమే వేదంగా.. ఆధ్యాత్మిక చింతనలో గడుపుతున్నారు కూర్మ గ్రామం కూడా అక్కడే ఉంది. స్వచ్ఛమైన, పురాతన గ్రామీణ భారతీయ జీవన శైలిని అనుసరిస్తూ.. అదే మానవాళికి శ్రేయస్కరమని చాటి చెప్పే ప్రయత్నం చేస్తున్నారు ఈ గ్రామస్తులు. ఒత్తిళ్లతో కూడిన ఆధునిక యాంత్రిక యుగంలోనూ సనాతన ధార్మిక జీవన విధానాన్ని ఎలా సాగించవచ్చో చూపిస్తున్నారు.



ఇదే కూర్మ గ్రామం

శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి 60 కిలోమీటర్ల దూరంలో హిరమండలం మండల పరిధిలోని అంతకాపల్లి సమీపంలో కొండల మధ్య సరికొత్తగా కొలువుదీరిన గ్రామమే కూర్మ. ప్రాచీన భారతీయ గ్రామీణ జీవన విధానం, సంప్రదాయాలు, పద్ధతులు, ఆహారపు అలవాట్లు, కట్టుబొట్టు, వృత్తులు.. తదితరాలన్నీ ఇక్కడ దర్శనమిస్తున్నాయి. 2018లో అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) సంస్థాపకాచార్యులైన భక్తి వేదాంత స్వామి ప్రభుపాదులు, వారి శిష్యులు ఈ గ్రామాన్ని నిర్మించారు. మొదట్లో కొద్దిమందితో ప్రారంభమైన కూర్మ గ్రామంలో ప్రస్తుతం 12 కుటుంబాలు.. 16 మంది గురుకుల విద్యార్థులు, ఆరుగురు బ్రహ్మచారులతో కలిసి 56 మంది ఉంటున్నారు. వీరంతా ఉన్నత చదువులు, పెద్ద ఉద్యోగాలతో సంపన్నశ్రేణి జీవనాన్ని అనుభవించినవారే. కానీ.. జీవిత పరమార్థం ఇది కాదని భావించిన వారంతా అన్వేషణలో భాగంగా సరికొత్త జీవన విధానాన్ని ఇక్కడ అనుసరిస్తున్నారు. చాలామంది రూ.లక్షల్లో జీతాలిచ్చే కొలువులు వదులుకుని వచ్చేశారు. మెకానికల్ ఇంజనీరింగ్ చేసిన త్రిభంగా నందదాస్, బీటెక్ చదివిన రాధాకృష్ణ చరణ్‌దాస్, రాధ గిరిదర్ దాస్, బీకాం చేసిన మదన్‌మోహన్ గిరిధర్ దాస్, కృష్ణ ప్రేమ్‌దాస్, పీహెచ్‌డీ చేసిన జయ హరిదాస్ వంటి చాలా మంది... కార్లు, బంగ్లాలు వదిలి కుటుంబ సమేతంగా ఇక్కడకు వచ్చి నివాసం ఉంటున్నారు.



శ్రీకాకుళం జిల్లా హిరమండలంలోని కూర్మ గ్రామం విశేషాలేంటంటే...

పర్యాటక గ్రామంగా..

జిల్లాలో ప్రస్తుతం అతి ఎక్కువగా పర్యాటకులు సందర్శిస్తున్న గ్రామంగా కూర్మ రికార్డులోకి ఎక్కింది.



ప్రసాదం స్వీకరిస్తున్న ప్రభువులు

గ్రామం గురించి తెలుసుకున్న ఎంతోమంది ఇక్కడికొచ్చి వీరి పద్ధతులను తెలుసుకుంటున్నారు. తమ పిల్లలకు కూడా వాటిని నేర్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. కొందరు ఇక్కడే ఉండిపోవాలని భావిస్తున్నారు కూడా. ఇక్కడ కృష్ణతత్వం, వేదం, భారతీయ సంస్కృతి సంప్రదాయాలు నేర్చుకోవడానికి విదేశీయులు సైతం వస్తున్నారు. రష్యా నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఇక్కడే ఉండిపోవటం విశేషం.

60 ఎకరాల్లో గ్రామాన్ని నిర్మించి..

ఇక్కడున్న వారంతా ఒడిషా, హైదరాబాద్, కడప, గుజరాత్ తదితర ప్రాంతాల నుంచి వచ్చినవారే. తెలంగాణ రాష్ట్రం యాదగిరిగుట్టలో ఇలాంటి గ్రామాన్ని నిర్మిద్దామని భావించారు. అక్కడ భూములకు సాగునీటి సదుపాయం లేక, సేంద్రియ పంటలు పండే పరిస్థితులు లేకపోవడం వల్ల ఇక్కడ 60 ఎకరాలు కొనుగోలు చేసి కూర్మ గ్రామాన్ని నిర్మించారు. గుజరాత్‌లోని నంద, పంజాబ్‌లోని బద్రికాశ్రమం, తమిళనాడులో పంచవటి, మధ్యప్రదేశ్‌లో భక్తి గ్రామాలు ఈ కూర్మ లాంటివే. కొత్తగా ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో చెక్ రిపబ్లిక్, హంగేరి దేశాల్లోనూ వీటిని ఏర్పాటు చేశారు. సరళ జీవనం, ఉన్నత చింతనం ఈ గ్రామంలో జీవించే ప్రజలు ఆచరించే ప్రత్యేకత. నిత్యావసరాలైన ఆహారం, దుస్తులు ప్రకృతి సేద్యం ద్వారా పొందుతున్నారు. రసాయనాలు లేని వ్యవసాయం చేస్తూ తమకు సరిపడా కూరగాయలు పండిస్తున్నారు. కావాల్సిన వరిని సాగు చేయటమే కాక... దుస్తులును కూడా మగ్గంపై నేసుకుంటున్నారు.

ఇళ్లు కూడా వారే కట్టారు

ఇసుక, సున్నం, బెల్లం, మినుములు, కరక్కాయ, మెంతులు మిశ్రమంగా చేసి.. గానుగలో ఆడించి గుగ్గిలం మరగబెట్టిన మిశ్రమంతో స్వయంగా వారే ఇళ్లు కట్టుకున్నారు. ఇప్పటివరకు 13 ఇళ్లు, 4 వసతి గృహాలు, వర్ణాశ్రమ కళాశాల నిర్మించుకున్నారు. నిర్మాణంలో సిమెంట్, ఇనుము ఎక్కడా వాడలేదు. కుంకుడుకాయ రసంతో దుస్తులు ఉతుకుతారు. ప్రకృతి నుంచి లభించే పదార్థాలనే ఉపయోగిస్తున్నారు. కరెంటు వాడరు. సెల్‌ఫోన్లు లేవు. ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు, మిక్సీలు వంటివేవీ లేవు. ఇళ్లల్లో కనీసం లైట్లు, ఫ్యాన్లు కూడా లేవు. విద్యార్థులు తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, హిందీలో అనర్గళంగా మాట్లాడతారు. తెల్లవారుజామున 4.30 గంటలకే దైవానికి హారతి ఇవ్వడంతో వీరి దినచర్య ప్రారంభమవుతుంది. ఉదయం భజన, ప్రసాదం తర్వాత రోజువారీ పనులకు వెళతారు. వ్యవసాయం, ఇళ్ల నిర్మాణం, ధర్మ ప్రచారంలో గ్రామస్తులు మమేకమవుతారు. సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇక్కడి గురుకులంలో విద్యార్థులకు ఉచిత చదువుతోపాటు సకల శాస్త్రాలను, వైదిక శాస్త్ర ఆధారిత విద్యా విధానం, ఆత్మ నిగ్రహం



క్రమశిక్షణ, సత్ప్రవర్తన, శాస్త్ర అధ్యయనంతోపాటు వ్యవసాయం, చేతి వృత్తులు, తల్లిదండ్రులకు, గురువుకు సేవ చేయడం వంటివి నేర్పుతారు.

జీవనశైలికి పూర్వ వైభవం



పూర్వం భారత జీవన విధానంలో సుస్థిర జీవనాన్ని ఆధ్యాత్మికతతో గడిపేవారు. సంతోషం, సంతృప్తితో జీవించేవారు. యాంత్రీకరణ, రసాయనిక, ఆధునిక విధానం వచ్చాక మనిషిలో సంతోషం, సంతృప్తితో పాటు ఆధ్యాత్మికత, ఆయుష్షు తగ్గుతూ వస్తున్నాయి. ఈ విధానంలో మార్పులు తెచ్చేందుకు... 'భారత జీవన శైలి'లో పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాం

– నితాయ నిమాయ్ దాస్, కూర్మ గ్రామ నివాసి

ఆచరణలో చూపిస్తున్నాం



భగవద్గీత ధర్మప్రచార బోధనలే కాకుండా ఆనాటి జీవన విధానాన్ని ఆచరిస్తున్నాం. సరళ జీవనానికి ఎటువంటి టెక్నాలజీ అవసరం లేదని నిరూపిస్తూ ఆధ్యాత్మిక, ధర్మ ప్రచారం, వ్యవసాయ, గో ఆధారిత జీవన విధానాన్ని ఆచరణలో చూపిస్తున్నాం.

– త్రిభంగానంద్ దాస్, కూర్మ గ్రామ నివాసి

భగవంతుని సేవతోనే సంతృప్తి



భగవంతుని సేవతోనే సంతృప్తి చెందగలుగుతాం. కూర్మ గ్రామంలోని ప్రతి ఒక్కరూ రోజుకు ఆరు గంటల పాటు వ్యవసాయ, గో ఆధారిత సేవలు చేస్తూ మిగిలిన సమయం మొత్తం భగవంతుని సేవలో మమేకమవుతాం. శరీరం తాత్కాలికం. ఆత్మ మాత్రమే శాశ్వతం. ఆత్మను సంతోషపెట్టాలంటే భగవంతుని సేవలో ఉండాలని నమ్ముతూ, ఆచరిస్తూ జీవిస్తున్నాం.

– గౌర గోపాల్‌దాస్, కూర్మ గ్రామ నివాసి

విద్యుత్ చార్జీలపై రేపటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

- మూడు రోజులు వర్చువల్‌గా నిర్వహణ
- సర్కిల్, డివిజన్ కార్యాలయాల నుంచి వినియోగదారుల హాజరుకు అవకాశం
- వెబ్ లింక్ ద్వారా ప్రజలు వీక్షించేందుకు ఏర్పాట్లు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీఎండీ సంతోషరావు

సాక్షి, అమరావతి: విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ఈ నెల 19వ తేదీ నుంచి మూడు రోజులు వర్చువల్ పద్ధతిలో ప్రజాభిప్రాయ సేకరణ (బహిరంగ విచారణ) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి తెలిపారు. ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు మంగళవారం ఏపీఈఆర్సీ ఆధ్వర్యంలో నమూనా ప్రజాభిప్రాయ సేకరణ (మాక్ డ్రిల్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డి మాట్లాడుతూ మూడు రోజులపాటు జరగనున్న బహిరంగ విచారణలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిస్కం సీఎండీలకు సూచించారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల అధికారులు విశాఖపట్నం నుంచి పాల్గొంటారని చెప్పారు. గత రెండేళ్ల మాదిరిగానే ఈసారి కూడా రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల్లోని సమీప విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం(ఎస్ఈ ఆఫీస్), డివిజన్ కార్యాలయాల (ఈఈ ఆఫీస్) నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వినియోగదారులు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చని వివరించారు. ఎక్కువ మంది వినియోగదారులు పాల్గొనేలా విద్యుత్ సిబ్బందితో ప్రచారం చేయాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించేందుకు వీలుగా https://ncubestreamings.com/ apercpublichearing వెబ్ లింక్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు ఆయన తెలిపారు. మాక్ డ్రిల్‌లో ఏపీఈఆర్సీ సభ్యుడు ఠాకూర్ రాంసింగ్, సెక్రటరీ కె.రాజబాపయ్య, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మజనార్దనరెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు, మూడు డిస్కంల డైరెక్టర్లు, ఎస్ఈలు, ఈఈలు పాల్గొన్నారు.

ఫిబ్రవరికి 980 ఆలయాల నిర్మాణం పూర్తి

- టీటీడీ శ్రీవాణి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మాణం
- పనుల పురోగతిని సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి కొట్టు



సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) శ్రీవాణి ట్రస్టు నిధులతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 980 ఆలయాల నిర్మాణాన్ని ఫిబ్రవరి నాటికి పూర్తిచేయాలని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి దేవదాయ శాఖ అన్ని జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాల వారీగా మంజూరు చేసిన ఆలయాలు, వాటి నిర్మాణ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పలు గ్రామాల్లో 980 ఆలయాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పనులను సకాలంలో పూర్తిచేసేందుకు కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండా శాఖ అధికారులకే వీటి నిర్మాణ పనుల బాధ్యతను అప్పగించినట్లు చెప్పారు. అధికారులు తరచుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఆలయాల నిర్మాణ పనులను పర్యవేక్షిస్తుండాలని, ఎప్పటికప్పుడు వాటి పురోగతి కనిపించే విధంగా సెల్ఫీలు దిగి ఉన్నతాధికారులకు పంపాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో మంజూరు చేసిన ఆలయాలు సుదూర ప్రాంతాల్లో ఉండటం వల్ల వాటి పర్యవేక్షణ కష్టతరంగా ఉందని అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనికి మంత్రి స్పందిస్తూ 15 లేదా 20 ఆలయాలకు ఒక ఏఈని నియమించుకుని నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

విజయవాడ దుర్గగుడి వద్ద మల్టీలెవల్ పార్కింగ్ భవనం

విజయవాడ దుర్గగుడి సమగ్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తుదిదశకు చేరుకుందని అధికారులు చెప్పారు. మాస్టర్ ప్లాన్‌లో అన్నదాన భవనం, మల్టీ లెవల్ పార్కింగ్ భవనం, క్యూ కాంప్లెక్సు, లడ్డూ పోటు భవనం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించి స్పష్టమైన అంచనాలతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక ఉండాలని మంత్రి సూచించారు. దుర్గగుడి వద్ద రూ.70 కోట్ల అంచనాతో జరుగుతున్న పలు పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఇన్‌చార్జి హరిజవహర్‌లాల్, సీఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో భగ్గుమన్న వర్గపోరు

- కత్తులతో పరస్పర దాడులు
- నలుగురికి తీవ్ర గాయాలు
- పెదన–గుడివాడ హైవే పక్కన ఘటన



గాయపడిన కొఠారి మల్లిబాబు, అశోక్

పెదన: కృష్ణా జిల్లా పెదన మండలం నడుపూరులో జనసేన పార్టీ శ్రేణుల మధ్య వర్గ పోరు భగ్గుమంది. గ్రామంలోని కోళ్లఫారం వద్ద జనసేన పార్టీకి చెందిన రెండు వర్గాలు కత్తులతో, కర్రలతో మంగళవారం దాడికి తెగబడ్డాయి. పెదన–గుడివాడ హైవే పక్కనే ఈ ఘటన చోటుచేసుకోవడంతో ప్రయాణికులు భీతిల్లారు. సినిమాల్లోని పోరాట సన్నివేశాలను తలపించేలా సమ్మెట బాబు వర్గం కత్తులతో దాడులకు తెగబడటంతో యడ్లపల్లి రామసుధీర్ వర్గం హడలిపోయింది. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచీ పెదన నియోజకవర్గంలో ఆ పార్టీ శ్రేణులు యడ్లపల్లి రామసుధీర్, సమ్మెట బాబు వర్గాలుగా విడిపోయి వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రెండు వర్గాలు ఎక్కడైనా తారసపడితే పరస్పరం హెచ్చరికలు చేసుకోవడం పరిపాటిగా మారింది. తాజాగా సమ్మెట బాబు వర్గానికి చెందిన వ్యక్తులు రామసుధీర్ వర్గంపై కత్తులు, కర్రలతో దాడి చేయడంతో ఆ వర్గానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

అనుచిత పోస్టింగ్‌ల వల్లే వివాదం!

రెండు వర్గాల వారు వాట్సాప్ గ్రూపుల్లో అసభ్య పదజాలంతో పోస్టింగ్‌లు పెట్టడం వల్లే ఈ దాడులు చేసుకున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పోలీసుల కథనం ప్రకారం.. నడుపూరు గ్రామానికి చెందిన సింగంశెట్టి అశోక్‌కుమార్(35) గుడివాడ రోడ్డులో కోళ్లఫారం నడుపుతున్నాడు. మంగళవారం అశోక్‌కుమార్, కొఠారి మల్లిబాబు (35), మద్దాల పవన్(28)లతో పాటు మరో ముగ్గురు కోళ్లఫారం వద్ద ఉండగా.. సమ్మెట బాబు వర్గానికి చెందిన బత్తిన హరిరామ్, మెట్టా గణపతి, కనపర్తి వెంకన్న, సమ్మెట శివనాగప్రసాద్, పినిశెట్టి భరత్ శివశంకర్, దాసరి సుబ్రహ్మణ్యం, ముద్దినేని రామకృష్ణ కలిసి అక్కడకు వచ్చారు. వాట్సాప్‌లో పెట్టిన పోస్టింగ్‌ల విషయమై రెండు వర్గాల మధ్య చెలరేగిన వివాదం ఘర్షణకు దారి తీసింది. దీంతో రెండు వర్గాలు కత్తులు, తాటి మట్టలు, కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. అశోక్‌కుమార్ తోపాటు కొఠారి మల్లిబాబు, మద్దాల పవన్ అనే వారు కత్తిపోట్లకు గురయ్యారు. మరో వ్యక్తికి కర్ర దెబ్బలు తగిలాయి. నలుగురినీ మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పెదన పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలంగాణ

బీఆర్‌ఎస్ 'ప్రత్యామ్నాయ' సందేశం!

ఖమ్మం నుంచి సాక్షి ప్రతినిధి: ఖమ్మం వేదికగా జాతీయ రాజకీయాల్లో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్)కి బలమైన పునాదులు వేయాలని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు భావిస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఖమ్మంలో బుధవారం భారీ బహిరంగ సభను నిర్వహించనున్న సంగతి తెలిసిందే. సీఎం కేసీఆర్‌తో పాటు మరో ముగ్గురు ముఖ్యమంత్రులు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు పార్టీలకు చెందిన జాతీయ నేతలు వేదిక పంచుకోనున్నారు. జాతీయ స్థాయిలో బీజేపీ, కాంగ్రెస్‌లకు బీఆర్‌ఎస్ పార్టీ ప్రత్యామ్నాయంగా మారుతుందని చెబుతూ వస్తున్న కేసీఆర్.. ఖమ్మంలో మరింత బలంగా ఈ సందేశాన్ని ఇవ్వనున్నారు. ప్రత్యామ్నాయ కూటమి ఏర్పాటు, దానిని నడిపే శక్తి బీఆర్‌ఎస్‌కు ఉందనే సంకేతాలను ఈ సభ ద్వారా కేసీఆర్ ఇచ్చే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్‌ఎస్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన నాయకుల చేరికలు, పార్టీల విలీనానికి సంబంధించిన ప్రకటన కూడా ఇక్కడ చేస్తారని సమాచారం. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ సత్తా చాటేలా భారీ జన సమీకరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నలుగురు సీఎంలు తొలిసారిగా..

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన ఎనిమిదేళ్లలో తొలిసారిగా ఖమ్మంలో విపక్ష పార్టీలకు చెందిన నలుగురు ముఖ్యమంత్రులు ఒకే వేదికను పంచుకోనున్నారు. మూడేళ్లుగా విపక్ష పార్టీలకు చెందిన పలువురు ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, కేజ్రీవాల్, భగవంత్‌మాన్, నవీన్ పట్నాయక్, స్టాలిన్, పినరయి విజయన్, హేమంత్ సొరేన్‌తో పాటు శరద్‌పవార్, శంకర్‌సింగ్ వాఘేలా, అఖిలేశ్ యాదవ్, గిరిధర్ గొమాంగో, థాక్రే లాంటి పలువురు మాజీ సీఎంలతో కేసీఆర్ భేటీ అవుతూ వస్తున్నారు. తాజాగా ఖమ్మం బహిరంగ సభకు కేజ్రీవాల్, భగవంత్ మాన్, పినరయి విజయన్, మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్‌ను రప్పిస్తున్నారు. జాతీయ స్థాయిలో బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా తృతీయ కూటమి ఏర్పాటుపై కేసీఆర్ ఇప్పటి వరకు స్పష్టమైన ప్రకటన చేయలేదు. అయితే బుధవారం జరిగే సభ ద్వారా ఈ మేరకు సంకేతాలు ఇచ్చే అవకాశముందని అంటున్నారు. సుమారు ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు పార్టీ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏడాది చివర్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది ఆరంభంలో పార్లమెంటు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. ఖమ్మం సభ నుంచే కేసీఆర్ సమరశంఖం పూరించే అవకాశముందని అంటున్నారు.

త్వరలో 'రెరా'కు పూర్తిస్థాయి కమిటీ

చైర్‌పర్సన్, సభ్యుల కోసం నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: స్థిరాస్తి లావాదేవీలను క్రమబద్ధీకరించేందుకు ఏర్పాటైన 'రెరా'కు త్వరలో పూర్తి స్థాయి కమిటీని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాలుగున్నరేళ్ల క్రితం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో న్యాయబద్ధమైన 'రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ' (రెరా)లను ఏర్పాటు చేశారు. ఈ సంస్థకు కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి హోదా స్థాయి అధికారి చైర్మన్‌గా వ్యవహరించాల్సి ఉంటుంది. ఇద్దరు పూర్తిస్థాయి సభ్యులు ఉంటారు. అయితే 'రెరా'కు ఇప్పటి వరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సోమేశ్‌కుమార్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. రెరాకు వచ్చే దరఖాస్తుల పరిశీలన, అనుమతులు అన్నీ ఆయన నేతృత్వంలోనే సాగేవి. కాగా రియల్ వెంచర్లు, ఫ్లాట్ల నిర్మాణంలో 'రెరా' నిబంధనలకు తిలోదకాలిచ్చి పలు సంస్థలు, రియల్ వ్యాపారులు దందా సాగిస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో 'రెరా'కు పూర్తి స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ పురపాలక శాఖ ఆసక్తి, అర్హత గల వారి నుంచి చైర్‌పర్సన్, ఇద్దరు సభ్యుల నియామకానికి దరఖాస్తును ఆహ్వానించింది. ఫిబ్రవరి 17వ తేదీలోగా దరఖాస్తులు దాఖలు చేసుకోవాలని కోరింది. రెరా వెబ్‌సైట్‌లో వివరాలన్నీ ఉన్నాయి.

19న దక్షిణ భారత కవుల సమ్మేళనం

సాక్షి, హైదరాబాద్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా ఈనెల 19న హైదరాబాద్‌లో దక్షిణ భారత కవుల సమ్మేళనం నిర్వహించనున్నారు. ప్రముఖ తెలుగు కవి, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రొఫెసర్ కె.శివారెడ్డి ఈ సమావేశాన్ని ప్రారంభిస్తారు. ప్రముఖ మలయాళ కవి ప్రభావర్మ, ప్రముఖ తెలుగు కవి నందిని సిధారెడ్డి కవితా పఠన సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు. ఐదు దక్షిణ భారత రాష్ట్రాల నుంచి 8 భాషలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మొత్తం 18 మంది కవులు ఈ సమ్మేళనంలో పాల్గొంటారు. కవులు 'స్వేచ్ఛపై పద్యాలు', 'ప్రేమ, ప్రకృతిపై పద్యాలు', 'ఆశ, ఆకాంక్షపై కవితలు' అనే మూడు విభాగాలలో కవితలను వినిపించనున్నారు.

ఆదిలాబాద్‌లో అమిత్‌షా బహిరంగసభ

ఆదిలాబాద్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా 28న కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జోడేఘాట్‌ను సందర్శించనున్నట్లు ఎంపీ సోయం బాపురావ్ వెల్లడించారు. ఆదిలాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల నాయకులతో మంగళవారం కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. 28న ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో అమిత్‌షా పర్యటన ఉంటుందని తెలిపారు. మంచిర్యాలలో బూత్‌స్థాయి కార్యకర్తలతో ఆ రోజు సమావేశమవుతారని చెప్పారు. జోడేఘాట్ సందర్శన అనంతరం బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అయితే ఎక్కడ నిర్వహించాలనే విషయం ఇంకా నిర్ణయించలేదని పేర్కొన్నారు.

పిల్లలు ఎలా ఉండాలి?
వికసించే పువ్వుల్లా ఉండాలి.
సంతోషానికి చిరునామాలా ఉండాలి.
ఆందోళన అంటే ఏమిటో తెలియకుండా పెరగాలి.
స్కూల్ బ్యాగ్‌లో భవిష్యత్తును నింపుకెళ్లిన పిల్లలు...
అదే స్కూల్ బ్యాగ్‌లో భయాన్ని పోగుచేసుకుని వస్తే...
తల్లిదండ్రులు అప్పుడేం చేయాలి?
పిల్లలను దగ్గరకు తీసుకోవాలి...
చేతల్లో ధైర్యాన్నివ్వాలి.
ఆనందాల రెక్కలను విరిచేసే
దుష్టశక్తుల బారి నుంచి కాపాడాలి.
పువ్వుల్లా పరిమళించడానికి
కావల్సినంత భరోసా కల్పించాలి.


ప్రతీకాత్మక చిత్రం

పిల్లలు... పరిమళించాలి

స్కూల్‌లో అందరు పిల్లలూ ఒకేలా చేరుతారు. స్నేహానికి చిరునామాల్లా, ఉత్సాహంగా ఉంటారు. కొందరు అదే ఉత్సాహాన్ని కొనసాగిస్తుంటే, మరికొందరు మాత్రం వెనుక పడుతుంటారు. స్వతహాగా ఉండే ఐక్యూ లెవెల్స్ పరిమితులకు లోబడి చదువులో వెనుకబడడం కాదిది. ఉత్సాహంగా ఉంటే పిల్లలు కూడా నిరుత్సాహంగా మారి అన్నింటిలోనూ వెనుకబడుతుంటారు. ఆ వెనుకబాటు వెనుక వాళ్లను వెనుక పడేటట్లు చేసిన కారణం ఏదో ఉండే ఉంటుంది. ఎందుకు బిడియపడుతున్నారో, ఎందుకు తమను తాము ఒంటరిని చేసుకున్నారో బయటకు తెలియదు. ఆ పిల్లల ప్రవర్తనలో అనారోగ్యకరమైన మార్పు మొదలవుతుంది. అది క్రమంగా మొండితనానికి, ధిక్కారతకు దారి తీస్తుంటుంది. స్కూల్ డైరీలో 'డిస్ ఒబీడియెంట్, ప్రాబ్లమాటిక్ బిహేవియర్ అనే పదాలతో పేరెంట్స్‌కి పిలుపు వస్తుంది. ఆ పరిస్థితి పేరెంట్స్‌కి ఊహించని శరాఘాతం. ఎలా రియాక్ట్ అవ్వాలో తెలియని అయోమయంలో, కొంత అపరాధ భావానికి లోనయ్యి, ఓవర్‌గా రియాక్ట్ అవుతూ పిల్లలను దోషులుగా నిలబెడుతుంటారు. ఈ పరిస్థితిని జాగ్రత్తగా సరిదిద్దకపోతే పిల్లలు ధిక్కారతను అలాగే కొనసాగిస్తారు. ఈ సిచ్యుయేషన్‌ని సున్నితంగా డీల్ చేయడానికి కొన్ని సూచనలు చేశారు క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ సుదర్శిని.

బాధించే పిల్లల మీదా శ్రద్ధ పెట్టాలి!

పిల్లల్లో స్వతహాగానే ఒకరికొకరు సహకరించుకునే తత్వం ఉంటుంది. అలాంటిది టీచర్ ఒక టాస్క్ ఇచ్చినప్పుడు ఆ సమాచారాన్ని కొందరికి తెలియచేసి, వాళ్లకు కోపం ఉన్న పిల్లలకు సమాచారం చేరనివ్వరు. ఆ టాస్క్‌లో ఫెయిల్ అవ్వాలనే దురుద్దేశంతో ఇలాంటి పని చేస్తారు. ఇది ఏ రకంగానూ పిల్లలను వెనకేసుకు రాదగిన విషయం కాదని పేరెంట్స్ గ్రహించాలి. బాధితులవుతున్న పిల్లల పేరెంట్స్ అయితే విషయం తెలియగానే స్పందించి తమ బిడ్డను కాపాడుకుంటారు. కానీ బాధించే పిల్లల తల్లిదండ్రులు కొన్ని సందర్భాల్లో తేలిగ్గా తీసుకునే అవకాశం ఉంది. ఇది ఆ పిల్లలకు, సమాజానికి కూడా చాలా ప్రమాదకరం.



– డాక్టర్ సుదర్శిని రెడ్డి సబ్బెళ్ల,
క్లినికల్ సైకాలజిస్ట్,
జీజీహెచ్, కాకినాడ, ఆంధ్రప్రదేశ్

పిల్లలు అద్దం వంటి వాళ్లు

"పిల్లల్లో చురుకుదనం తగ్గడం, ఎప్పుడూ డల్‌గా ఉండడం, నిద్రలో ఉలిక్కి పడడం వంటివి కనిపిస్తుంటాయి. పిల్లల మనసులో చెలరేగిన అనేక ఆందోళనలు, భయాలు, అవమానం, అపరాధ భావం వంటి అనేక సమస్యలను వ్యక్తం చేసే లక్షణాలివి. ఈ లక్షణాలను గమనించిన తర్వాత ఇక ఆలస్యం చేయకూడదు. తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు దగ్గర కూర్చుని పిల్లలను మాటల్లో పెట్టాలి. నేరుగా 'ఎందుకిలా ఉన్నావని' అడిగితే సమాధానం రాదు. స్కూలు గురించి, ఫ్రెండ్స్ గురించి కదిపితే వాళ్లే ఒక్కొక్కటీ చెప్పడం మొదలుపెడతారు. ఆ చెప్పిన కబుర్లలోనే కారణాలు ఉంటాయి. స్కూల్లో తోటి విద్యార్థులు బాడీ షేమింగ్, బుల్లీయింగ్, ఫిజికల్–ఎమోషనల్ అబ్యూజ్ చేస్తున్నట్లు, భయపెడుతున్నట్లు, బెదిరిస్తున్నట్లు అనిపిస్తే ఆ విషయాన్ని నిర్ధారించుకోవడానికి పిల్లలను ఒకటికి రెండుసార్లు గద్దించి అడగడం ఏ మాత్రం సరి కాదు. పిల్లలు మరింతగా బిగుసుకుపోతారు, కాబట్టి వాళ్ల క్లాస్ టీచర్ దృష్టికి తీసుకు వెళ్లాలి. అయితే ఇక్కడ మన పిల్లల్ని అబ్యూజ్ చేస్తున్న పిల్లలను దోషులుగా, నేరస్థులుగా చూడవద్దు. వాళ్లూ పసిపిల్లలేనని మర్చిపోవద్దు. అయితే వాళ్లు ఆరోగ్యకరంగా పెరగడం లేదని అర్థం. ఎందుకంటే... పిల్లలు తాము దేనిని తీసుకుంటారో దానినే డెలివర్ చేస్తారు. అమ్మానాన్నలు మరెవరినో ఉద్దేశించి 'వాళ్ల ఎత్తుపళ్ల గురించో, నడక తీరు మీదనో, దేహం లావు– సన్నం, పొడవు, పొట్టి వంటి విషయాల్లో కామెంట్స్ చేసి నవ్వుతూ ఉంటే' పిల్లలకు అదే అలవాటవుతుంది. పిల్లలు వాళ్లు చూసిన దాన్ని స్కూల్లో తోటి పిల్లల మీద ప్రదర్శిస్తారు. నిజానికి ఎదుటి వాళ్లను అనుకరిస్తూ గేలి చేయడం, లోపాలను ఎత్తి చూపుతూ ఎగతాళి చేయడం అనేది అభద్రతలో ఉంటూ, ఆత్మవిశ్వాసం లేని వాళ్లు చేసే పని. ఆ పని ఇంట్లో పేరెంట్స్ చేస్తుంటే పిల్లలకు అలవడుతుంది. బాల్యంలో ఇలాంటి బీజాలు పడితే ఇక అలాంటి వాళ్లు జీవితాంతం ఏదో ఒక సందర్భంలో ఈ లక్షణాలను బహిర్గతం చేస్తూనే ఉంటారు. జీవితంలో ప్రతి రిలేషన్‌షిప్‌కీ విఘాతం కలిగించుకుంటూ ఉంటారు. కాబట్టి చిన్నప్పుడే సరిదిద్దాలి.

బొమ్మల్లో వ్యక్తమవుతుంది

పిల్లలు మూడీగా ఉంటున్నట్లు గమనిస్తే వాళ్లను డ్రాయింగ్, క్లేతో బొమ్మలు చేయడంలో ఎంగేజ్ చేయాలి. ఇది మంచి స్ట్రెస్ బస్టర్ మాత్రమే కాదు, చక్కటి పరిష్కారమార్గం కూడా. బొమ్మలు వేయడం, బొమ్మలు చేయడం ఒత్తిడికి అవుట్‌లెట్‌లా పని చేస్తుంది. మాటల్లో చెప్పలేని విషయాలు బొమ్మల్లో వ్యక్తమవుతాయి. ఆ బొమ్మల్లోని పాత్రలు... పిల్లల్లో దాగి ఉన్న కోపాన్ని, ఇష్టాన్ని, అయిష్టాన్ని, భయాన్ని, బాధించే గుణాన్ని కూడా ప్రతిబింబిస్తుంటాయి. పిల్లల మానసిక సంఘర్షణకు అద్దం పడతాయి. పిల్లల మనసు చదవడానికి ఆ బొమ్మలు ఉపయోగపడతాయి. బాధించే పిల్లలు, బాధితులయ్యే పిల్లలను అధ్యయనం చేయడానికి కూడా ఇదే సరైన మార్గం. బిహేవియరల్ ప్రాబ్లెమ్స్‌తో మా దగ్గరకు తీసుకువచ్చిన పిల్లలకు మేమిచ్చే మొదటి టాస్క్ కూడా అదే. తల్లిదండ్రులకు సూచన ఏమిటంటే... పిల్లలు డల్‌గా ఉంటే ఉపేక్షించవద్దు, అలాగే మీ పిల్లల మీద టీచర్ నుంచి కంప్లయింట్ వస్తే ఆవేశపడవద్దు. టీచర్ ఒక సూచన చేశారంటే ఆ సూచన వెనుక బలమైన కారణం ఉండి తీరుతుందని గ్రహించాలి. టీచర్‌లు కూడా పిల్లల కాండక్ట్ మీద డిజ్ ఒబీడియెన్స్, బిహేవియరల్ ప్రాబ్లమ్స్' అని రాసే ముందు వాళ్ల పేరెంట్స్‌కు అర్థమయ్యేలా వివరించి చెప్పగలగాలి. ఎందుకంటే పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దగలిగేది పేరెంట్స్– టీచర్స్ మధ్య సమన్వయం ఉన్నప్పుడే సాధ్యమవుతుంది" అని వివరించారు డాక్టర్ సుదర్శిని. పిల్లల మనసు సున్నితం. పువ్వులాంటి పిల్లలు పువ్వుల్లానే పెరగాలి. వారి భవిష్యత్తు సుమపరిమళాలతో వికసించాలి.

– వాకా మంజులారెడ్డి

కిచెన్‌టిప్స్



● పూరీలు బాగా పొంగినట్టు రావాలంటే గోధుమపిండిలో కొద్దిగా బొంబాయి రవ్వ కలపాలి. లేదా బియ్యంప్పిండి కలిపినా మంచి ఫలితమే కనిపిస్తుంది.



● మొదటగా వేసిన దోశె పెనానికి అతుక్కుపోయి రాదు. దోశె వేసే ముందు పెనంపై వంకాయ లేదా ఉల్లిపాయ ముక్కతో రుద్దితే సులువుగా వచ్చేస్తుంది.

యువతరానికి 'వ్యాయామం' దగ్గరి చుట్టం అనే విషయం తెలియనిదేమీ కాదు. అయితే ఎప్పుడూ ఒకేరకమైన వ్యాయామాల కంటే ఫిట్‌నెస్ ట్రెండ్‌ను అనుసరిస్తూ కొత్త కొత్త వ్యాయామాలు చేయడానికి ఇష్టపడుతున్నారు. పాత వర్కవుట్లు కూడా కొత్తగా పరిచయమవుతున్నాయి.



12-3-30

కొత్త సంవత్సరం సరికొత్త వర్కవుట్స్

యూత్ పల్స్

'కొత్త సంవత్సరం ఈ వర్కవుట్స్ చేయాలి' అని యూత్ అనుకున్నవాటిలో '12-3-30' అగ్రస్థానంలో ఉంది. ఈ టాప్ ఫిట్‌నెస్ ట్రెండ్‌ను ఫాలో కావడానికి ప్రపంచవ్యాప్తంగా యువతరం ఇష్టపడుతుంది. హెల్త్ అండ్ బ్యూటీ ఇన్‌ఫ్లూయెన్సర్ లారెన్ గిరాల్డో రూపొందించిన ఈ 30 నిమిషాల వర్కవుట్ స్టైల్ సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయింది. '12-3-30' (12 పర్సంట్ ఇన్‌క్లైన్, 3.0 స్పీడ్, వాక్ ఫర్ 30 మినిట్స్) అనేది ట్రెడ్‌మిల్‌కు సంబంధించిన సెట్టింగ్స్‌ను సూచిస్తుంది.

'రోజుకు 30 నిమిషాల పాటు వ్యాయామం తప్పనిసరిగా చేయాలి...అని మా అమ్మమ్మ చెబుతుండేది. బయట మార్నింగ్ వాక్, ఈవెనింగ్ వాక్‌లు పెద్దగా చేసే అలవాటు లేదు. ట్రెడ్‌మిల్‌పై ఎక్కువ టైమ్ ఉండడం ఇబ్బందిగా ఉండేది. దీంతో ట్రెడ్‌మిల్‌పై 12-3-30 రూపంలో సెట్టింగ్స్ చేసుకున్నాను. ఇది మంచి ఫలితం ఇచ్చింది. పదమూడు కిలోల బరువు తగ్గాను' అంటుంది లారెన్.

'12-3-30' తరువాత స్థానంలో క్రాస్‌ఫిట్ ఉంది. 2000 సంవత్సరంలో కాలిఫోర్నియాలో పుట్టిన వర్కవుట్ ఇది. కొవ్వు తగ్గడానికి, కండరాల దృఢత్వానికి ఉపయోగపడే వర్కవుట్. ఆ తరువాత స్థానంలో '75 సాఫ్ట్' ఉంది. నాలుగు నిబంధనల ఆధారంగా రూపొందించిన ఈ వ్యాయామాన్ని రోజుకు 45 నిమిషాలతో, 75 రోజుల పాటు చేయాల్సి ఉంటుంది.

'రేడియో టైసో' అనేది జపాన్‌లో అబాలగోపాలానికి సుపరిచితమైన వ్యాయామం. వందసంవత్సరాల చరిత్ర ఉన్న ఈ వ్యాయామానికి ఇప్పటికీ ఆదరణ ఉంది. 'రేడియో టైసో' ఇప్పుడు మన యువతరాన్ని కూడా ఆకట్టుకుంటోంది. ఒక కొత్త వర్కవుట్‌ను ఇష్టపడి ఉత్సాహంగా చేయడమే కాదు దానికి సంబంధించిన పరిమితులు కూడా అర్థం చేసుకుంటుంది యువతరం. ఉదాహరణకు...12-3-30

ఈ టఫ్ కార్డియో వర్కవుట్‌ని ప్రతిరోజూ చేయాల్సిన అవసరం లేదు, ఒకేసారి కాకుండా జీరో ఇన్‌క్లైన్‌తో ప్రారంభించి లక్ష్యాన్ని పెంచుకుంటూ పోవాలి, ఇది చేస్తున్నప్పుడు ఇయర్‌ఫోన్‌లు ధరిస్తే ఏకాగ్రత దెబ్బతిని చేయాల్సిన దానికంటే ఎక్కువసేపు వ్యాయామం చేసి అలసటకు గురవుతారు...నిపుణులు చెప్పే ఇలాంటి సలహాలపై యూత్ ఆసక్తి ప్రదర్శిస్తోంది.

'ఫిట్‌నెస్‌కు సంబంధించిన కొత్త ట్రెండ్స్‌ను ఫాలో కావడం ఇష్టమేగానీ గుడ్డిగా అనుసరించడం ఇష్టం ఉండదు. కచ్చితంగా నిపుణుల సలహాలు తీసుకుంటాను' అంటోంది బెంగళూరుకు చెందిన ఎంబీయే స్టూడెంట్ కావ్య. వర్కవుట్స్ చేయడానికి కొత్తవాళ్లకు అనుకూలమైన బాటిల్‌రోప్ (రెండు చేతులతో, రెండు తాళ్లు పట్టుకొని పైకి కిందికి ఊపుతూ చేసే ఈ వర్కవుట్ వల్ల రక్తప్రసరణ సరిగ్గా జరగడం, కొవ్వు కరగడం లాంటి ఉపయోగాలు ఉన్నాయి)తో వ్యాయామ ప్రపంచంలోకి అడుగుపెట్టిన కావ్య ఇప్పుడు 12-3-30పై ఆసక్తి ప్రదర్శిస్తుంది.

2022 'ఇయర్ ఆఫ్ సాఫ్ట్ ఎక్సర్‌సైజ్'గా పేరు తెచ్చుకుంది. ఈ కొత్త సంవత్సరం మాత్రం హార్డర్, ఫాస్టర్, స్ట్రాంగర్ ఎక్సర్‌సైజ్‌లకు వేదిక కాబోతుందని ఫిట్‌నెస్ నిపుణులు చెబుతున్నారు.

సినిమా


● సమంత

మేం గెలుస్తాం

సమంతకు 'మయోసైటిస్'.. పూనమ్ కౌర్‌కి 'ఫైబ్రోమయాల్జియా'.. ఇది అందరికీ తెలిసిన విషయమే. మంగళవారం నాడు మమతా మోహన్‌దాస్ తాను చర్మ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు సోషల్ మీడియా ద్వారా షేర్ చేశారు. 'ఈ కష్టాన్నీ దాటేస్తాను' అనే నమ్మకాన్ని వ్యక్తపరిచారామె. ఇక సమంత తన అనారోగ్యం గురించి చెప్పినప్పుడు 'నాలానే ఎంతోమంది పోరాడుతున్నారు. మేం గెలుస్తాం' అన్నారు. ఇదే ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తపరిచిన పూనమ్, మమతా.. ఈ మధ్యకాలంలో తమ అనారోగ్యం గురించి పేర్కొన్న కొందరు తారల గురించి తెలుసుకుందాం.


● మమతా మోహన్‌దాస్

గత ఏడాది అక్టోబర్‌లో సమంత తాను మయోసైటిస్ వ్యాధి (ఎక్కువ పని చేయలేకపోవడం, కండరాల నొప్పి, త్వరగా అలసిపోవడం వంటివి)తో బాధపడుతున్నట్లు ప్రకటించారు. ఆస్పత్రి బెడ్‌పై ఉండి ఆమె 'యశోద' సినిమాకి డబ్బింగ్ చెప్పారు కూడా. "జీవితంలో మంచి రోజులతో పాటు చెడ్డ రోజులు కూడా ఉంటాయి. ఈ పరిస్థితుల్లో (మయోసైటిస్‌ని ఉద్దేశించి) ఇంకొక్క అడుగు కూడా ముందుకు వేయలేనేమో అనిపించింది. కానీ వెనక్కి తిరిగి చూసుకుంటే ఇంతదూరం వచ్చానా అనిపించింది. అందుకే పోరాడతా. నాలానే చాలా మంది పోరాడుతున్నారు. మేం గెలుస్తాం" అని పేర్కొన్నారు సమంత. ఇక సమంత తనకు మయోసైటిస్ అని ప్రకటించిన తర్వాత పియా బాజ్‌పాయ్ ('రంగం' సినిమా ఫేమ్) కూడా గతంలో తాను ఇదే వ్యాధితో బాధపడ్డాననే విషయాన్ని బయట పెట్టారు. అయితే ఇంట్లోవాళ్లు భయపడతారని తనకు మయోసైటిస్ అనే విషయాన్ని చెప్పలేదన్నారు పియా. కుటుంబ సభ్యులతో ఢిల్లీలో ఉంటున్న పియా వ్యాధి చికిత్స నిమిత్తం ముంబైలో ఉన్నారు. ఇంట్లోవాళ్లకు తెలియకుండా చికిత్స చేయించుకుని, కోలుకున్నాక చెప్పానని పియా పేర్కొన్నారు. ఇటీవల 'లాస్ట్' అనే హిందీ చిత్రంలో నటించారామె. ఇక సమంత తన అనారోగ్యం విషయం బయటపెట్టిన రెండు నెలలకు డిసెంబర్‌లో పూనమ్ కౌర్ తనకు 'ఫైబ్రోమయాల్జియా' అనే విషయాన్ని బయట పెట్టారు. కండరాల నొప్పి, అలసట, నిద్రలేమితో ఈ వ్యాధి బాధపెడుతుంటుంది. రెండేళ్లుగా ఈ వ్యాధితో తాను బాధపడుతున్నట్లు తెలిపారు పూనమ్. కేరళలో ఆయుర్వేద చికిత్స మొదలుపెట్టిన ఆమె త్వరలోనే కోలుకుంటానని ఈ వ్యాధి గురించి ప్రకటించినప్పుడు తెలిపారు. మరోవైపు గత ఏడాది నవంబర్‌లో బాలీవుడ్ హీరోయిన్ ఫాతిమా సనా షేక్ తాను 'ఎపిలెప్సీ' (మూర్ఛ రోగం)తో బాధపడుతున్నట్లు తెలిపారు. అయితే తన వ్యాధి విషయాన్ని ఇప్పటివరకూ గోప్యంగా ఉంచడానికి కారణం ఇతరులు తనను బలహీనురాలు అనుకోకూడదని, ఒకవేళ అందరికీ తెలిస్తే తనకు పని ఇవ్వడానికి వెనకాడతారనే భయాలే అని పేర్కొన్నారు ఫాతిమా. కానీ ఇప్పుడు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే తన విషయం బయటపెట్టానని స్పష్టం చేశారు. "నేను షూటింగ్ చేస్తున్నప్పుడు మా యూనిట్‌లో ఒకరికి మూర్ఛ వచ్చింది. నేను ఆ వ్యక్తికి సహాయం చేశాను. నాకలా జరిగినప్పుడు ఇతరుల సహాయం కావాలి. అయితే ఇదేం తప్పు కాదు... దాచేయడానికి. అందుకే చెప్పాలనుకున్నాను. నా నిర్మాతలకు నా పరిస్థితి చెబుతుంటాను. లొకేషన్‌లో నాకు మూర్ఛ వచ్చిన సందర్భాలున్నాయి. ఆ టైమ్‌లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ముందే చెప్పడం హెల్ప్ అయింది" అన్నారు ఫాతిమా. ఆమిర్ ఖాన్ కూతురుగా 'దంగల్'లో ఫాతిమా మల్ల యోధురాలుగా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఈ చిత్రం తనకు మంచి పేరు తెచ్చింది. ఆ తర్వాత నుంచి వరుసగా సినిమాలు చేస్తూ బిజీగా ఉంటున్నారు ఫాతిమా. ఇక 2010లో మమతా మోహన్‌దాస్ కేన్సర్ బారిన పడ్డారు. ఆ విషయాన్ని బాహాటంగా చెప్పి, ధైర్యంగా చికిత్స చేయించుకున్నారామె. కేన్సర్‌పై అవగాహన కలిగించడానికి పలు విషయాలను పంచుకున్నారు కూడా. అయితే 2013లో మళ్లీ కేన్సర్ అని తెలిసినప్పుడూ ఆత్మవిశ్వాసం కోల్పోకుండా చికిత్స చేయించుకుని, కోలుకున్నారు. ఇప్పుడు మంగళవారం (17.01.) నాడు తాను చర్మ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని పంచుకున్నారు మమతా మోహన్‌దాస్. 'విటిలిగో' అనే చర్మ వ్యాధి సోకిందని పేర్కొన్నారామె. చర్మంపై మచ్చలు, చర్మం రంగు మారడం ఈ వ్యాధి లక్షణాలన్నారు. ఇంకా "ప్రియమైన సూర్యుడా.. ఇంతకుముందు ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడు నిన్ను హత్తుకోవాలనుకుంటున్నాను. నా చర్మం రంగుని కోల్పోతున్నాను. నువ్వు ఉదయించక ముందే నీకోసం నేను నిద్రలేచి పొగమంచులో నీ తొలి కిరణాన్ని చూడటానికి వేచి చూస్తున్నాను. నీ వెచ్చదనాన్నంతా నాకు ఇచ్చెయ్. ఎందుకంటే నాకు అది ఎంతో మేలు చేస్తుంది. అందుకే నీకెప్పటికీ రుణపడి ఉంటాను" అని మమతా మోహన్‌దాస్ సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. 'మీరు పెద్దవే దాటి వచ్చారు. ఇది చిన్న విషయం. ఇందులోంచీ బయటపడతారు' అని ఫ్యాన్స్ పోస్ట్ చేశారు.


● పూనమ్ కౌర్


● ఫాతిమా సనా

అనారోగ్యం అనే విషయాన్ని బయటపెట్టడానికి ధైర్యం కావాలి. దాన్ని ఎదుర్కొని, కోలుకోవడానికి ఇంకా ధైర్యం కావాలి. ఈ చాలెంజ్‌లో 'గెలుపు ఖాయం' అని నమ్మడంతో పాటు ఇతరులకు స్ఫూర్తిగా నిలిచిన ఈ స్టార్స్ నిజమైన 'స్టార్స్'.


● పియా బాజ్‌పాయ్

హైదరాబాద్‌లో కోల్‌కతా!


● చిరంజీవి

హైదరాబాద్‌లో కోల్‌కతా ఏంటీ అనుకుంటున్నారా! చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బోళా శంకర్' కోసం హైదరాబాద్‌లో కోల్‌కతా సెట్ వేశారు. మెహర్ రమేశ్ దర్శకత్వంలో క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న చిత్రం ఇది. హైదరాబాద్‌లో తీర్చిదిద్దిన కోల్‌కతా సెట్‌లో ఈ చిత్రం కొత్త షెడ్యూల్ మంగళవారం ప్రారంభం అయింది. ఈ సెట్‌లో చిత్రంలోని ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారని టాక్. "మాసివ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బోళా శంకర్'. చిరంజీవిని స్టైలిష్, మాస్ క్యారెక్టర్‌లో అద్భుతంగా చూపిస్తున్నారు మెహర్ రమేశ్. ఇందులో చిరంజీవి సోదరిగా కీర్తీ సురేష్, తమన్నా కథానాయికగా నటిస్తున్నారు" అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిశోర్ గరికిపాటి, సంగీతం: మహతి స్వరసాగర్, కెమెరా: డడ్లీ.

ఏక్ ఖాకీ.. సౌ సైతాన్స్!


● టబు

అజయ్ దేవగన్ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'భోలా'. అజయ్ దేవగన్ ఫిలిమ్స్, టీ–సిరీస్ ఫిలిమ్స్, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్, డ్రీమ్ వారియర్ పిక్చర్స్‌పై అజయ్ దేవగన్, భూషణ్ కుమార్, కృషణ్ కుమార్, ఎస్ఆర్ ప్రకాశ్ బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో టబు కీలక పాత్ర చేస్తున్నారు. ఆమె చేస్తున్న పోలీస్ ఆఫీసర్ లుక్‌ని అజయ్ దేవగన్ తన సోషల్ మీడియాలో షేర్ చేసి, 'ఏక్ ఖాకీ.. సౌ సైతాన్స్'(ఒక పోలీసు.. వంద మంది దెయ్యాలు) అంటూ రాసుకొచ్చారు. పోలీస్ డ్రెస్, చేతిలో గన్‌తో టబు పవర్‌ఫుల్‌గా, స్టైలిష్‌గా కనిపించారు. కార్తీ నటించిన 'ఖైదీ' చిత్రానికి హిందీ రీమేక్‌గా 'భోలా' తెరకెక్కుతోంది. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రం మార్చి 30న విడుదల కానుంది.

నీది కాని చోటే లేనే లేదు


● ధనుష్

ధనుష్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'సార్' (తెలుగు), 'వాత్తి' (తమిళం). సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సాయి సౌజన్యతో కలిసి సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఆడ ఉంది నీవే ఈడ ఉంది నీవే.. నీది కాని చోటే లేనే లేదు బంజారా...' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను మంగళవారం విడుదల చేశారు. ఈ పాటకు సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి పాడారు. "జీవితం వెనుక ఉన్న వేదాంతాన్ని, జనన మరణాల మధ్య ఉన్న బతుకు బాట, దాని పరమార్థాన్ని ఈ పాటలో చెప్పే ప్రయత్నం చేశాం" అన్నారు సుద్దాల అశోక్ తేజ. "విద్యా వ్యవస్థ తీరు తెన్నులపై హీరో సాగించే జర్నీ, అందులోని సమస్యలు, ఘటనల సమాహారమే మా సినిమా" అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: జె. యువరాజ్.

సూపర్ హీరో

'శుక్ర, మాటరాని మౌనమిది' వంటి చిత్రాల దర్శకుడు సుకు పూర్వాజ్ తెరకెక్కిస్తున్న మూడో సినిమా 'ఏ మాస్టర్ పీస్'. అరవింద్ కృష్ణ, 'బిగ్ బాస్' ఫేమ్ ఆషు రెడ్డి, స్నేహా గుప్తా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సినిమా బండి ప్రొడక్షన్స్ పతాకంపై శ్రీకాంత్ కండ్రేగుల నిర్మిస్తున్న ఈ సినిమా నుంచి హీరో లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. శ్రీకాంత్ కండ్రేగుల మాట్లాడుతూ– "సూపర్ హీరో నేపథ్యంలో రూపొందనున్న చిత్రం 'ఏ మాస్టర్ పీస్'. పిల్లలకు ఇష్టమైన సూపర్ హీరోను తెలుగు ప్రేక్షకులకు కూడా పరిచయం చేస్తూ రాజీపడకుండా నిర్మించనున్నాం. ఈ నెల 26 నుండి ఫిబ్రవరి 10 వరకు అరకులో మొదటి షెడ్యూల్, ఫిబ్రవరి 18 నుండి మార్చి 30 వరకు రెండవ షెడ్యూల్ చిత్రీకరిస్తాం. ఏప్రిల్ 2 నుండి ఏప్రిల్ 10 వరకు కులూమనాలిలో జరిపే షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తవుతుంది" అన్నారు.


● అరవింద్



భారత మహిళల హాకీ జట్టు జోరు

దక్షిణాఫ్రికా జట్టుతో నాలుగు మ్యాచ్‌ల ద్వైపాక్షిక సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన రెండో మ్యాచ్‌లో టీమిండియా 7–0 గోల్స్ తేడాతో నెగ్గింది. వందన రెండు గోల్స్ సాధించగా... ఉదిత, వైష్ణవి, రాణి రాంపాల్, సంగీత, నవనీత్ కౌర్ తలా ఒక గోల్ చేశారు. గోల్‌కీపర్ సవితా పూనియా కెప్టెన్సీలోని భారత జట్టు సోమవారం జరిగిన తొలి మ్యాచ్‌లో 5–1తో విజయం సాధించింది.



హర్లీ స్థానంలో యశశ్రీ

హైదరాబాద్ టీనేజ్ క్రికెటర్ సొప్పదండి యశశ్రీకి అండర్‌–19 టి20 ప్రపంచకప్‌లో ఆడే అవకాశం లభించింది. ప్రస్తుతం ఈ మెగా టోర్నీ దక్షిణాఫ్రికాలో జరుగుతోంది. అయితే భారత జట్టుకు ఎంపికైన హర్లీ గాలా గాయంతో టోర్నీకి దూరమైంది. దీంతో మెగా టోర్నీ సన్నాహక సిరీస్ ఆడేందుకు వెళ్లి అక్కడే ఉన్న యశశ్రీతో ఆమె స్థానాన్ని భర్తీ చేయాలనుకున్నారు. యశశ్రీ ఎంపికను ఐసీసీ టెక్నికల్ కమిటీ కూడా ఆమోదం తెలిపింది. ఈ టోర్నీలో నేడు జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌తో తలపడుతుంది.

హైదరాబాద్‌లో ‘ఒక రోజు’...

ఆదివారం శ్రీలంకతో సిరీస్ ముగిసింది... బుధవారం మళ్లీ కొత్త వన్డే సిరీస్ మొదలు... ప్రత్యర్థి మారిందే తప్ప భారత్‌కు సంబంధించి ఇది కొనసాగింపు మాత్రమే... వన్డే వరల్డ్‌కప్ దారిలో తమ అస్త్రశస్త్రాల గురించి పరీక్షించుకునేందుకు రోహిత్ శర్మ బృందానికి ఇది మరో అవకాశం... బంగ్లాదేశ్ గడ్డపై ఓటమి, ఆపై శ్రీలంకపై క్లీన్‌స్వీప్ తర్వాత న్యూజిలాండ్ సవాల్ ఎదురుగా నిలిచింది. మరోవైపు విలియమ్సన్, సౌతీలు లేక కివీస్ కాస్త బలహీనంగా మారింది. నాలుగేళ్ల విరామం తర్వాత భాగ్యనగరం అభిమానులకు వన్డే క్రికెట్ భాగ్యం కలగడం విశేషం.

- నేడు భారత్, న్యూజిలాండ్ తొలి వన్డే
- జోరు మీదున్న టీమిండియా
- ఆత్మవిశ్వాసంతో కివీస్
- మధ్యాహ్నం గం.1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌–1లో ప్రత్యక్ష ప్రసారం


ఇషాన్, భరత్


రోహిత్

సాక్షి, హైదరాబాద్: సొంతగడ్డపై మరో సిరీస్ విజయంపై దృష్టి పెట్టిన భారత జట్టు తొలి సమరానికి సిద్ధమైంది. నగరంలోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియం నేడు భారత్, న్యూజిలాండ్ మధ్య మొదటి వన్డేకు వేదిక కానుంది. లంకపై భారీ విజయం తర్వాత అదే జోరులో మరో సిరీస్ గెలుచుకునేందుకు భారత్ ముందు మంచి అవకాశం ఉంది. కివీస్‌కు సంబంధించి వన్డే వరల్డ్‌కప్ కోసం తిరిగి వచ్చే ముందు భారత్‌లో పరిస్థితులు అంచనా వేసేందుకు ఈ టూర్ ఉపయోగపడవచ్చు.

మార్పులతో...

ఆదివారం జరిగిన మ్యాచ్‌తో పోలిస్తే తుది జట్టులో మార్పులు ఖాయం. లంకతో మూడో వన్డే ఆడిన కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్ వ్యక్తిగత కారణాలతో సిరీస్ నుంచి తప్పుకోగా, శ్రేయస్ అయ్యర్ వెన్నునొప్పితో మొత్తం సిరీస్‌కే దూరమయ్యాడు. రాహుల్ స్థానంలో కీపర్‌గా ఇషాన్ కిషన్ మిడిలార్డర్‌లో ఆడతాడని కెప్టెన్ రోహిత్ స్పష్టం చేశాడు. గత మ్యాచ్‌లో హార్దిక్‌కు బదులుగా సూర్యకుమార్ ఆడగా, ఇప్పుడు శ్రేయస్ తప్పుకోవడంతో వీరిద్దరు టీమ్‌లో ఉండటం ఖాయమైంది. టాపార్డర్ దుర్భేద్యంగా ఉండటంతో కివీస్‌కు కష్టాలు తప్పవు. కోహ్లి అద్భుతమైన ఫామ్, గిల్ జోరుకు తోడు రోహిత్ తనదైన శైలిలో చెలరేగితే టీమ్‌కు ఎదురుండదు. ముగ్గురు పేసర్లతో భారత్ బరిలోకి దిగనుంది. రెండో స్పిన్నర్‌గా చహల్, కుల్దీప్ మధ్య పోటీ ఉంది. వన్డే టీమ్‌లోకి ఎంపికైనా... ఆంధ్ర కీపర్ కోన శ్రీకర్ (కేఎస్) భరత్‌కు అప్పుడే అవకాశం లభించకపోవచ్చు.

విలియమ్సన్ లేకుండా...

న్యూజిలాండ్ జట్టులో ఒక్కో ఆటగాడిని చూస్తే పెద్ద


లాథమ్

ఘనతలు కనిపించవు. కానీ జట్టుగా మాత్రం సమష్టితత్వంతో ఎంతటి కఠిన ప్రత్యర్థిపైనైనా పైచేయి సాధించగలదు. పాకిస్తాన్‌లో వన్డే సిరీస్ నెగ్గిన ఉత్సాహంతో ఉన్న జట్టు భారత్‌కు చేరుకుంది. ఇద్దరు ప్రధాన ఆటగాళ్లు విలియమ్సన్, సౌతీ ఈ సిరీస్ నుంచి విశ్రాంతి తీసుకోవడంతో టీమ్‌లో అనుభవం తక్కువగా కనిపిస్తోంది. ఎక్కువ భాగం ఆటగాళ్లు భారత గడ్డపై ఎప్పుడూ ఆడనివారే. స్పిన్‌ను సమర్థంగా ఆడగల కెప్టెన్ టామ్ లాథమ్‌పై జట్టు బ్యాటింగ్ ప్రధానంగా ఆధారపడి ఉంది. అయితే స్పిన్నర్ ఇష్ సోధి గాయంతో ఈ మ్యాచ్‌కు దూరం కావడం జట్టును కొంత బలహీనపర్చింది. ఫెర్గూసన్, డౌగ్ బ్రేస్‌వెల్ తమ పేస్‌తో భారత్‌ను ఇబ్బంది పెట్టగలరు.

పిచ్, వాతావరణం

హైదరాబాద్ మొదటి నుంచి బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్. ప్రధాన బ్యాటర్లంతా ప్రతీసారి పరుగులు సాధించారు. అయితే పేస్‌తో పోలిస్తే స్పిన్ బౌలింగ్ కాస్త ఎక్కువ ప్రభావం చూపించగలదు. మ్యాచ్ రోజు నగరంలో ఎలాంటి వర్ష సూచన లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), గిల్, కోహ్లి, సూర్యకుమార్, ఇషాన్ కిషన్, హార్దిక్, సుందర్, కుల్దీప్ యాదవ్, షమీ, సిరాజ్, ఉమ్రాన్.

న్యూజిలాండ్: లాథమ్ (కెప్టెన్), అలెన్, కాన్వే, చాప్‌మన్, మిచెల్, ఫిలిప్స్, మైకేల్ బ్రేస్‌వెల్, సాన్‌ట్నర్, ఫెర్గూసన్, డౌగ్ బ్రేస్‌వెల్.

55 ఇప్పటి వరకు భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మొత్తం 113 వన్డేలు జరిగాయి. ఇందులో భారత్ 55 మ్యాచ్‌ల్లో గెలుపొందగా... 50 మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ విజయం సాధించింది. ఒక మ్యాచ్ ‘టై’ కాగా... ఏడు మ్యాచ్‌లు రద్దయ్యాయి.

సింధు ఇంటికి... సైనా ముందుకు

- భారత స్టార్ షట్లర్లకు మిశ్రమ ఫలితాలు
- ఇండియా ఓపెన్ టోర్నీ


సైనా


సింధు

న్యూఢిల్లీ: ఈ ఏడాది వరుసగా రెండో అంతర్జాతీయ టోర్నీలోనూ భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు నిరాశ ఎదురైంది. ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్‌–750 బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రపంచ ఏడో ర్యాంకర్ సింధు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. గతవారం మలేసియా ఓపెన్ టోర్నీలోనూ సింధు తొలి రౌండ్‌లోనే ఓటమి పాలైంది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 45 నిమిషాల్లో 12–21, 20–22తో ప్రపంచ 30వ ర్యాంకర్ సుపనిద కటెథోంగ్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం పాలైంది. గత ఏడాది ఇండియా ఓపెన్‌లో సెమీఫైనల్లో సుపనిద చేతిలోనే ఓడిపోయిన సింధుకు ఈసారీ అదే ఫలితం ఎదురైంది. మరోవైపు భారత్‌కే చెందిన మరో స్టార్ సైనా నెహ్వాల్ తీవ్రంగా శ్రమించి తొలి రౌండ్ అడ్డంకిని అధిగమించింది. ప్రపంచ 24వ ర్యాంకర్ మియా బ్లిచ్‌ఫెల్ట్ (డెన్మార్క్)తో 63 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సైనా నెహ్వాల్ 21–17, 12–21, 21–19తో విజయం సాధించి ప్రీక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది.

లక్ష్య సేన్ శుభారంభం

పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ లక్ష్య సేన్ (భారత్) శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో లక్ష్య సేన్ 21–14, 21–15తో భారత్‌కే చెందిన హెచ్‌ఎస్ ప్రణయ్‌ను ఓడించి ప్రీక్వార్టర్ ఫైనల్ చేరాడు. గతవారం మలేసియా ఓపెన్ తొలి రౌండ్‌లో ప్రణయ్ చేతిలో ఎదురైన ఓటమికి ఈ విజయంతో లక్ష్య సేన్ బదులు తీర్చుకున్నాడు.

సాత్విక్ జోడీ ముందంజ

పురుషుల డబుల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ జోడీ సాత్విక్ సాయిరాజ్‌–చిరాగ్ శెట్టి (భారత్) ప్రీక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. తొలి రౌండ్‌లో సాత్విక్‌–చిరాగ్ ద్వయం 21–13, 21–15తో మాథ్యూ–క్రిస్టోఫర్ గ్రిమ్లే (స్కాట్లాండ్) జోడీపై గెలిచింది. మరో మ్యాచ్‌లో పంజాల విష్ణువర్ధన్ గౌడ్‌–గరగ కృష్ణప్రసాద్ (భారత్) జోడీ 21–11, 23–25, 21–9తో రూబెన్ జిలీ–టియెస్ వాన్ డెర్ (నెదర్లాండ్స్) ద్వయంపై నెగ్గింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) జంట 22–20, 17–21, 21–18తో మార్గోట్ లాంబర్ట్‌–ఆనీ ట్రాన్ (ఫ్రాన్స్) జోడీపై గెలుపొందగా... సిక్కి రెడ్డి–శ్రుతి మిశ్రా (భారత్) ద్వయం 17–21, 19–21తో లిండా ఎఫ్లెర్‌–ఇసాబెల్ (జర్మనీ) జోడీ చేతిలో ఓడిపోయింది.

జొకోవిచ్ అలవోకగా...



- రెండో రౌండ్‌లోకి సెర్బియా స్టార్
- చెమటోడ్చి నెగ్గిన జ్వెరెవ్

మెల్‌బోర్న్: కోవిడ్ టీకా వేసుకోనందున... గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడే అవకాశం కోల్పోయిన తొమ్మిదిసార్లు చాంపియన్, సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ ఈసారి అలవోక విజయంతో శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో నాలుగో సీడ్ జొకోవిచ్ 6–3, 6–4, 6–0తో కార్‌బెలాస్ బేనా (స్పెయిన్)పై గెలుపొందాడు. 2 గంటల 2 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ తొమ్మిది ఏస్‌లు సంధించి, కేవలం ఒక డబుల్ ఫాల్ట్ చేశాడు. కార్‌బెలాస్ సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన జొకోవిచ్ తన సర్వీస్‌లో ఒక్కసారి కూడా బ్రేక్ పాయింట్ అవకాశం ఇవ్వలేదు. నెట్ వద్దకు 26 సార్లు దూసుకొచ్చి 23 సార్లు పాయింట్లు గెలిచిన ఈ మాజీ నంబర్‌వన్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వరుసగా 22వ విజయాన్ని నమోదు చేశాడు. ఈ టోర్నీలో 2019, 2020, 2021లలో విజేతగా నిలిచిన జొకోవిచ్ గతేడాది బరిలోకి దిగలేదు.

ముర్రే మారథాన్ పోరులో...

మరోవైపు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అత్యధికంగా ఐదుసార్లు రన్నరప్‌గా నిలిచిన ప్రపంచ మాజీ నంబర్‌వన్, బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే తొలి రౌండ్‌లో అతికష్టమ్మీద విజయం అందుకున్నాడు. ప్రపంచ 14వ ర్యాంకర్ మాటియో బెరెటిని (ఇటలీ)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 49వ ర్యాంకర్ ఆండీ ముర్రే 6–3, 6–3, 4–6, 6–7 (7/9), 7–6 (10/6)తో గెలుపొందాడు. 4 గంటల 49 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ముర్రే 10 ఏస్‌లు సంధించి, 34 అనవసర తప్పిదాలు చేశాడు. మరోవైపు బెరెటిని 31 ఏస్‌లు సంధించినా, ఏకంగా 59 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు. నెట్ వద్దకు 39 సార్లు దూసుకొచ్చిన ముర్రే 23 సార్లు పాయింట్లు గెలుపొందగా... బెరెటిని 49 సార్లు నెట్ వద్దకు వచ్చి 32 సార్లు పాయింట్లు సాధించాడు. మరో మ్యాచ్‌లో 12వ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) కూడా శ్రమించి గెలుపొందాడు. ‘లక్కీ లూజర్’ యువాన్ పాబ్లో వారిలాస్ (పెరూ)తో జరిగిన తొలి రౌండ్‌లో జ్వెరెవ్ 4–6, 6–1, 5–7, 7–6 (7/3), 6–4తో గెలిచాడు. 4 గంటల 9 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జ్వెరెవ్ 21 ఏస్‌లు కొట్టాడు. 46 అనవసర తప్పిదాలు చేసిన ఈ జర్మనీ స్టార్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో రెండో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే) 6–3, 7–6 (8/6), 6–7 (5/7), 6–3తో టొమాస్ మచాచ్ (చెక్ రిపబ్లిక్)పై, ఐదో సీడ్ ఆంద్రీ రుబ్లెవ్ (రష్యా) 6–3, 6–4, 6–2తో డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా)పై, ఎనిమిదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 6–4, 6–2, 4–6, 7–5తో బాసిలాష్‌విలి (జార్జియా)పై విజయం సాధించారు.

ముగురుజాకు షాక్

మహిళల సింగిల్స్ విభాగంలో 2020 రన్నరప్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ గార్బిన్ ముగురుజా (స్పెయిన్) పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. ఎలైజ్ మెర్‌టెన్స్ (బెల్జియం) 3–6, 7–6 (7/3), 6–1తో ముగురుజాను ఓడించి రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో రెండో సీడ్ ఆన్స్ జెబర్ (ట్యునీషియా) 7–6 (10/8), 4–6, 6–1తో తామర జిదాన్‌సెక్ (స్లొవేనియా)పై, నాలుగో సీడ్ కరోలినా గార్సియా (ఫ్రాన్స్) 6–3, 6–0తో కేథరీన్ సెబోవ్ (కెనడా)పై, ఐదో సీడ్ సబలెంకా (బెలారస్) 6–1, 6–4తో తెరెజా మార్టిన్‌కోవా (చెక్ రిపబ్లిక్)పై గెలుపొందారు.

‘సిరాజ్ కీలక బౌలర్‌గా ఎదిగాడు’

హైదరాబాద్ పేసర్‌పై రోహిత్ ప్రశంసలు



సాక్షి, హైదరాబాద్: భారత పేసర్, హైదరాబాదీ మొహమ్మద్ సిరాజ్ ఇటీవల అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. 2022 జనవరి 1 నుంచి చూస్తే 18 వన్డేల్లో అతను కేవలం 19.87 సగటుతో 33 వికెట్లు పడగొట్టాడు. అసోసియేట్ జట్లను మినహాయిస్తే ఒక బౌలర్ పడగొట్టిన అత్యధిక వికెట్లు ఇవే. అదీ 4.53 ఎకానమీతో పరుగులు కూడా ఇవ్వకుండా కట్టడి చేయగలిగాడు. 42 మ్యాచ్‌ల కెరీర్ తర్వాత తన సొంత నగరంలో సిరాజ్ బుధవారం తన తొలి మ్యాచ్ ఆడనున్నాడు. ఈ నేపథ్యంలో కెప్టెన్ రోహిత్ శర్మ అతనిపై ప్రత్యేక ప్రశంసలు కురిపించాడు. జట్టులో సిరాజ్ విలువేమిటో చెబుతూ అతనికి బెస్ట్ విషెస్ చెప్పాడు. ‘సిరాజ్ గత కొంత కాలంగా మూడు ఫార్మాట్‌లలో ఎంతో మెరుగయ్యాడు. లైన్ అండ్ లెంగ్త్ ఎంతో మెరుగైంది. ముఖ్యంగా అవుట్ స్వింగ్‌లో పదును పెరిగింది. కొత్త బంతితో బంతిని స్వింగ్ చేయడం అంత సులువు కాదు. ఈ విషయంలో అతను ఎంతో నైపుణ్యం సంపాదించాడు. అలాంటి బౌలింగ్‌ను ఎదుర్కోవడం ఏ బ్యాటర్‌కైనా చాలా కష్టం. సరిగ్గా చెప్పాలంటే తన బౌలింగ్‌ను అతను అర్థం చేసుకోవడంతో పాటు జట్టు తన నుంచి ఏం ఆశిస్తుందో కూడా గుర్తించాడు. ఆరంభంలో, మధ్య ఓవర్లలో వికెట్లు తీయగల సత్తా అతనిలో ఉంది. రాన్రానూ అతని గ్రాఫ్ మరింత పైకి వెళుతోంది. సిరాజ్‌ను సరైన రీతిలో మేనేజ్ చేయడం మాకు అవసరం. వరల్డ్‌కప్, త్వరలో ఆస్ట్రేలియాతో జరిగే టెస్టు సిరీస్ కోసం అతడికి తగిన విరామాలు ఇస్తూ సరైన రీతిలో ఉపయోగించుకుంటాం. హోం గ్రౌండ్ మ్యాచ్‌లో అతనికి బెస్ట్ విషెస్’ అని రోహిత్ అన్నాడు. మరోవైపు మంచు ప్రభావాన్ని తగ్గించేందుకు భారత్‌లో జరిగే వన్డేలను (రాబోయే వరల్డ్ కప్ సహా) కాస్త ముందుగా నిర్వహించాలనే సూచనతో తానూ ఏకీభవిస్తానని... అయితే ఇది సాధ్యమా, కాదా తాను చెప్పలేనని, ప్రసారకర్తలు ఇలాంటివి నిర్ణయిస్తారని రోహిత్ అభిప్రాయపడ్డాడు.

బెల్జియం, జర్మనీ మ్యాచ్ ‘డ్రా’

ప్రపంచకప్ హాకీ టోర్నీ



భువనేశ్వర్: డిఫెండింగ్ చాంపియన్ బెల్జియం, మాజీ విజేత జర్మనీ జట్ల మధ్య మంగళవారం జరిగిన ప్రపంచకప్ హాకీ టోర్నీ లీగ్ మ్యాచ్ 2–2తో ‘డ్రా’గా ముగిసింది. పూల్ ‘బి’లో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో బెల్జియం ఓటమి అంచున నిలిచింది. అయితే ఆఖరి క్వార్టర్లో వెగ్నెజ్ (54వ ని.లో) చేసిన గోల్‌తో ‘డ్రా’తో బయటపడింది. అంతకుముందు జర్మనీ జట్టులో వెలెన్ నిక్లస్ (22వ ని.లో), టామ్ గ్రామ్‌బుష్ (52వ ని.లో) చెరో గోల్ చేయగా, సెడ్రిక్ చార్లియర్ 9వ నిమిషంలోనే బెల్జియంకు తొలి గోల్ అందించాడు. ఈ నెల 20న జరిగే ఆఖరి లీగ్‌తో క్వార్టర్స్ బెర్త్‌లు ఖరారవుతాయి. చివరి లీగ్ మ్యాచ్‌ల్లో జపాన్‌తో బెల్జియం, దక్షిణ కొరియాతో జర్మనీ తలపడతాయి. ఈ పూల్‌లో జరిగిన మొదటి మ్యాచ్‌లో దక్షిణ కొరియా 2–1తో జపాన్‌పై గెలిచింది. కొరియా తరఫున లీ జంగ్ జున్ (8వ, 23వ ని.లో) రెండు గోల్స్ చేశాడు. జపాన్ జట్టులో నగయొషి (1వ ని.లో) గోల్ సాధించాడు. అయితే జపాన్ 11 మందితో కాకుండా 12 మందితో ఆడటం వివాదం రేపింది.

అర్జున్ గేమ్ ‘డ్రా’



విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): ప్రతిష్టాత్మక టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ నిలకడగా ఆడుతున్నాడు. 14 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో అర్జున్ వరుసగా నాలుగో ‘డ్రా’ నమోదు చేశాడు. విన్సెంట్ కీమెర్ (జర్మనీ)తో మంగళవారం జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌ను అర్జున్ 45 ఎత్తుల్లో ‘డ్రా’ చేసుకున్నాడు. అంతకుముందు తొలి రౌండ్‌లో ప్రజ్ఞానంద (భారత్)తో, రెండో రౌండ్‌లో సో వెస్లీ (అమెరికా)తో, మూడో రౌండ్‌లో అరోనియన్ (అమెరికా)తో జరిగిన గేమ్‌లను అర్జున్ ‘డ్రా’గా ముగించాడు. నాలుగో రౌండ్ తర్వాత అర్జున్ రెండు పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో ఉన్నాడు. నెదర్లాండ్స్‌కు చెందిన అనీష్ గిరి మూడు పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు. భారత్‌కే చెందిన ప్రజ్ఞానంద 1.5 పాయింట్లతో 12వ ర్యాంక్‌లో, గుకేశ్ ఒక పాయింట్‌తో చివరిదైన 14వ ర్యాంక్‌లో ఉన్నారు.

మెరిసిన ధీరజ్, సురేఖ

జాతీయ ఓపెన్ ఆర్చరీ ట్రయల్స్‌లో అగ్రస్థానం


ధీరజ్


సురేఖ

కోల్‌కతా: ఈ ఏడాది జరిగే ప్రపంచకప్ టోర్నీలు, ప్రపంచ చాంపియన్‌షిప్, ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత ఆర్చరీ జట్లను ఎంపిక చేసేందుకు నిర్వహించిన ఓపెన్ సెలెక్షన్ ట్రయల్స్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు బొమ్మదేవర ధీరజ్, వెన్నం జ్యోతి సురేఖ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టారు. మంగళవారం ముగిసిన ఈ ట్రయల్స్‌లో పురుషుల రికర్వ్ విభాగంలో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఎస్‌ఎస్‌సీబీ) జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ధీరజ్ ఓవరాల్‌గా 2767 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచాడు. పార్థ్ సాలుంకే (మహారాష్ట్ర), జయంత తాలుక్‌దార్ (జార్ఖండ్), అతాను దాస్ (పీఎస్‌పీబీ), సుఖ్‌చెయిన్ సింగ్ (సర్వీసెస్), తరుణ్‌దీప్ రాయ్ (సర్వీసెస్), సుఖ్‌మణి (మహారాష్ట్ర), నీరజ్ చౌహాన్ వరుసగా రెండు నుంచి ఎనిమిది ర్యాంక్‌ల్లో నిలిచారు. తద్వారా ఈ ఏడాది జరిగే అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనే భారత జట్టులో చోటు సంపాదించేందుకు అర్హత పొందారు.

మరోవైపు మహిళల కాంపౌండ్ విభాగంలో జ్యోతి సురేఖ ఓవరాల్‌గా 2828 పాయింట్లు సాధించి టాప్ ర్యాంక్‌లో నిలిచింది. సురేఖతోపాటు పర్ణీత్ కౌర్, అదితి, ప్రగతి, సాక్షి చౌదరీ, ముస్కాన్, ఐశ్వర్య శర్మ, సృష్టి సింగ్ కూడా ఈ ఏడాది జరిగే మెగా ఈవెంట్స్‌లో పాల్గొనే టీమిండియా సెలెక్షన్స్‌కు అర్హత పొందారు. మహిళల రికర్వ్ విభాగం ట్రయల్స్‌లో ‘ట్రిపుల్ ఒలింపియన్’ దీపిక కుమారి ఏడో ర్యాంక్‌లో నిలిచి భారత జట్టులో పునరాగమనం చేయడానికి అర్హత సాధించింది.

ఆంధ్ర 256/5

- రికీ భుయ్ అర్ధ సెంచరీ
- సౌరాష్ట్రతో రంజీ పోరు


రికీ భుయ్

రాజ్‌కోట్: ఆంధ్ర బ్యాటర్ రికీ భుయ్ (155 బంతుల్లో 80; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. దీంతో రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ ‘బి’లో సౌరాష్ట్రతో జరుగుతున్న మ్యాచ్‌లో తొలిరోజు ఆట నిలిచే సమయానికి ఆంధ్ర జట్టు 90 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. ముందుగా ఓపెనర్లు జ్ఞానేశ్వర్ (34; 6 ఫోర్లు), అభిషేక్ రెడ్డి (46; 8 ఫోర్లు) తొలి వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యంతో శుభారంభమే ఇచ్చారు. అయితే సౌరాష్ట్ర స్పిన్నర్ ధర్మేంద్ర సింగ్ జడేజా (3/80) తన వరుస ఓవర్లలో అభిషేక్, జ్ఞానేశ్వర్‌లను పెవిలియన్ చేర్చాడు. అనంతరం కెప్టెన్ హనుమ విహారి (38; 7 ఫోర్లు), రికీ భుయ్ మూడో వికెట్‌కు 70 పరుగులు జోడించి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈ దశలో విహారిని కూడా జడేజా బౌల్డ్ చేశాడు. తర్వాత కరణ్ షిండే (31; 5 ఫోర్లు) అండతో రికీ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆట ముగిసే దశలో చేతన్ సకారియా బౌలింగ్‌లో రికీ భుయ్ వెనుదిరిగాడు.

‘టాప్’లోకి శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఫుట్‌బాల్ ఐ–లీగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) మళ్లీ టాప్ ర్యాంక్‌లోకి వచ్చింది. మంగళవారం జరిగిన తమ 12వ లీగ్ మ్యాచ్‌లో శ్రీనిధి జట్టు 4–0 గోల్స్ తేడాతో రౌండ్‌గ్లాస్ పంజాబ్ ఎఫ్‌సీ జట్టును చిత్తుగా ఓడించింది. శ్రీనిధి జట్టు తరఫున కెప్టెన్ డేవిడ్ కాస్టెనెడా మునోజ్ రెండు గోల్స్ (30వ, 88వ ని.లో) చేయగా... షహబాజ్ (12వ ని.లో), సొరైషామ్ దినేశ్ సింగ్ (62వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. 12 జట్లు పాల్గొంటున్న ఈ లీగ్‌లో శ్రీనిధి జట్టు 12 లీగ్ మ్యాచ్‌లు పూర్తి చేసుకొని 8 విజయాలు, ఒక ‘డ్రా’, మూడు పరాజయాలతో మొత్తం 25 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో ఉంది. తదుపరి మ్యాచ్‌లో ఈనెల 23న ముంబైకి చెందిన కెన్‌క్రె ఎఫ్‌సీ జట్టుతో శ్రీనిధి జట్టు ఆడుతుంది.


దినేష్

మహారాష్ట్ర భారీ స్కోరు

- నౌషాద్ షేక్ అజేయ సెంచరీ
- రాణించిన కేదార్ జాదవ్


కేదార్ నౌషాద్

పుణే: హైదరాబాద్ బౌలర్లపై మహారాష్ట్ర బ్యాటర్ నౌషాద్ షేక్ (145 బ్యాటింగ్; 20 ఫోర్లు) అజేయ సెంచరీతో కదంతొక్కాడు. టీమిండియా మాజీ ప్లేయర్ కేదార్ జాదవ్ (71; 9 ఫోర్లు, 1 సిక్స్), ఆశయ్ పాల్కర్ (61 బ్యాటింగ్; 9 ఫోర్లు) అర్ధసెంచరీలతో రాణించారు. దీంతో ఎలైట్ గ్రూప్ ‘బి’లో మంగళవారం ఇక్కడ మొదలైన రంజీ మ్యాచ్‌లో మహారాష్ట్ర భారీస్కోరు దిశగా సాగుతోంది. తొలి రోజు ఆట నిలిచే సమయానికి 85 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 353 పరుగులు చేసింది. ఓపెనర్లు రుతురాజ్ (8)ను రవితేజ, సౌరభ్ నవాలే (29)ను కార్తికేయ తక్కువ స్కోర్లకే అవుట్ చేశారు. హైదరాబాద్ బౌలర్లలో కార్తికేయ 3, రవితేజ 2 వికెట్లు తీశారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	563	60,656
నిఫ్టీ ▲	158	18,053

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	11,078	▼	4
డోజోన్స్	33,951	▼	351
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,851	▼	9
డాక్స్	15,187	▲	53
షాంఘై	3,224	▼	3
నికాయ్	26,139	▲	316

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత) 56,752	▼	131
బంగారం (99.5 స్వచ్ఛత) 56,525	▼	130
వెండి (కిలో) 68,661	▼	506

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.03	82.70
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	98.16	101.50
€	యూరో	ఒకటి	87.10	90.16
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	62.51	64.57
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.94	58.36
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.92	62.93
SAR	సౌదీ రియాల్	పదిహేను	20.81	22.48
UAE D	యూఏఈ దిర్హామ్	పదిహేను	21.36	23.16
¥	చైనా యువాన్	పదిహేను	13.01	10.94

134 నగరాల్లో జియో 5జీ

- తెలుగు రాష్ట్రాల్లో 14 కేంద్రాలు
- డిసెంబర్‌కల్లా దేశవ్యాప్తంగా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెలికం రంగ దిగ్గజం రిలయన్స్ జియో 5జీ సేవలను భారత్‌లో క్రమంగా విస్తరిస్తోంది. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు, కాకినాడ, తెలంగాణలో నిజామాబాద్, ఖమ్మంతో సహా మొత్తం ఏడు రాష్ట్రాల్లోని 16 నగరాల్లో సేవలను పరిచయం చేసింది. ఈ నగరాల్లో ప్రస్తుతం జియో మాత్రమే 5జీ సేవలను అందిస్తోంది. పర్యాటకం, వాణిజ్యం, విద్య పరంగా ఈ కేంద్రాలు ప్రధానమైనవని కంపెనీ తెలిపింది. నూతన నగరాల చేరికతో తెలుగు రాష్ట్రాల్లో జియో సేవలు అందుకుంటున్న నగరాల సంఖ్య 14కు పెరిగింది. జియో వెల్కమ్ ఆఫర్ కింద కస్టమర్లు అపరిమిత డేటాను 1 జీబీపీఎస్ కంటే అధిక స్పీడ్‌తో ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా ఎంజాయ్ చేయవచ్చు.

డిసెంబర్ చివరినాటికి..

కొత్త కేంద్రాలతో కలిపి భారత్‌లో రిలయన్స్ జియో 5జీ సర్వీసులున్న నగరాలు, పట్టణాల సంఖ్య 134కు చేరుకుంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం, విజయవాడ, తిరుమల, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, ఏలూరు, తెలంగాణలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్‌లో జియో వినియోగదార్లు నూతనతరం టెలికం సేవలను వినియోగించుకుంటున్నారు. దేశవ్యాప్తంగా 2023 డిసెంబర్ చివరినాటికి 5జీ సేవలను మారుమూల పల్లెలకూ చేర్చాలని రిలయన్స్ జియో కృతనిశ్చయంతో ఉంది.


కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-1-2023	
విశాఖ	575-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	567-00
విజయవాడ	567-00
రిటైల్ ధర (డజను)	84.00
17-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	563-00
వరంగల్	565-00
రిటైల్ ధర	6.20

2022లో చైనా జీడీపీ 3 శాతమే!

- 50 ఏళ్లలో రెండో కనిష్ట స్థాయి
- కరోనా సవాళ్లు, రియల్టీ కష్టాలు కారణం

బీజింగ్: కరోనా తెచ్చిపెట్టిన కష్టాలు, రియల్ ఎస్టేట్ మార్కెట్ దెబ్బతినడం చైనా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. అమెరికా తర్వాత ప్రపంచ రెండవ అతిపెద్ద ఎకానమీ 2022లో కేవలం 3 శాతం పురోగతి సాధించింది. మంగళవారం విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం, వార్షిక జీడీపీ విలువ 121.02 ట్రిలియన్ యువాన్ (17.94 ట్రిలియన్ డాలర్లు). 2021 విలువతో (114.37 ట్రిలియన్ యువాన్‌లు) పోలిస్తే ఈ గణాంకాలు కేవలం 3 శాతం అధికం. కనీసం 5.5 శాతం వృద్ధి నమోదవుతుందన్న అంచనాలకన్నా... గణాంకాలు తగ్గినట్లు నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటస్టిక్స్ (ఎన్‌బీఎస్) పేర్కొంది. 1974లో



చైనా జీడీపీ వృద్ధి రేటు 2.3 శాతం. అటు తర్వాత ఈ స్థాయి వృద్ధి నమోదుకావడం ఇదే తొలిసారి. అమెరికా డాలర్లతో పోల్చితే జీడీపీ విలువ 2021లో 18 ట్రిలియన్ డాలర్లుకాగా, తాజాగా 17.94 ట్రిలియన్ డాలర్లకు తగ్గడం గమనార్హం. డాలర్‌లో చైనా కరెన్సీ ఆర్‌ఎంబీ బలహీనపడ్డమే దీనికి కారణం. ఎన్‌బీఎస్ డేటా ప్రకారం, చైనా జాబ్ మార్కెట్ 2022లో స్థిరంగా ఉంది. పట్టణ వార్షిక ఉపాధి కల్పనా లక్ష్యం 11 మిలియన్‌లుకాగా, 12.06 మిలియన్ల కొత్త ఉద్యోగాల సృష్టి జరిగింది. 2021లో చైనా ఎకానమీ వృద్ధి రేటు 8.4 శాతం.

సాగర్ సిమెంట్స్ చేతికి ఆంధ్రా సిమెంట్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రుణ భారంతో ఉన్న ఆంధ్రా సిమెంట్స్ ఇక సాగర్ సిమెంట్స్ పరం కానుంది. ఈ మేరకు విజయవంతమైన బిడ్డర్‌గా నిలిచింది. జేపీ గ్రూప్ కంపెనీ అయిన ఆంధ్రా సిమెంట్స్ ప్రస్తుతం కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియలో ఉంది. సాగర్ సిమెంట్స్ దాఖలు చేసిన పరిష్కార ప్రణాళికకు అనుకూలంగా ఆంధ్రా సిమెంట్స్‌కు చెందిన కమిటీ ఆఫ్ క్రెడిటార్స్ (సీవోసీ) మెజారిటీతో ఓటు



వేసింది. సాగర్ సిమెంట్స్ ప్రణాళికను సీవోసీ ఆమోదించింది. పృథ్వీ అసెట్ రీకన్‌స్ట్రక్షన్, సెక్యూరిటైజేషన్ కంపెనీ లిమిటెడ్ పిటిషన్ ఆధారంగా ఆంధ్రా సిమెంట్స్‌పై దివాలా ప్రక్రియను ప్రారంభించాలని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ హైదరాబాద్ బెంచ్ గతేడాది ఏప్రిల్‌లో ఆదేశించింది. ఆంధ్రా సిమెంట్స్‌కు దాచేపల్లి సమీపంలో, అలాగే విశాఖపట్నం వద్ద ఒక్కో ప్లాంటు ఉంది.

మార్కెట్ బౌన్స్‌బ్యాక్

- సెన్సెక్స్ 563 పాయింట్లు అప్
- నిఫ్టీ 158 పాయింట్లు జూమ్
- 60,656- 18,053 వద్ద ముగింపు
- ఎఫ్‌ఎంసీజీ, ఆయిల్, రియల్టీ ప్లస్



ముంబై: ముందురోజు నష్టాల నుంచి దేశీ స్టాక్ మార్కెట్లు బౌన్స్‌బ్యాక్ అయ్యాయి. సెన్సెక్స్ 563 పాయింట్లు జంప్‌చేసి 60,656 వద్ద నిలిచింది. నిఫ్టీ సైతం 158 పాయింట్లు ఎగసి 18,053 వద్ద ముగిసింది. ప్రధానంగా ఇండెక్స్ హెవీవెయిట్స్‌కు డిమాండ్ పెరగడంతో మార్కెట్లు ప్రస్తావించదగ్గ స్థాయిలో లాభపడ్డాయి. ప్రపంచ మార్కెట్ల సానుకూలతలు సైతం సెంటిమెంటుకు బలాన్నిచ్చినట్లు మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఐటీ, బ్యాంకింగ్ సంస్థలు పటిష్ట ఫలితాలు సాధిస్తుండటంతో ఇన్వెస్టర్లకు ప్రోత్సాహం లభించినట్లు విశ్లేషించారు. ఇంట్రాడేలో సెన్సెక్స్ 60,704- 60,072 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. ఈ బాటలో నిఫ్టీ 18,072-17,887 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులు చవిచూసింది.

పీఎస్‌యూ బ్యాంక్స్ డీలా

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా ఎఫ్‌ఎంసీజీ, రియల్టీ, ఆయిల్, ఐటీ, ఆటో రంగాలు 1.2-0.6 శాతం మధ్య పుంజుకున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు దాదాపు 2 శాతం పతనమయ్యాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఎల్‌అండ్‌టీ, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఆర్‌ఐఎల్, బ్రిటానియా, అల్ట్రాటెక్, మారుతీ 3.7-1.2 శాతం మధ్య ఎగశాయి. అయితే ఎస్‌బీఐ, బజాజ్ ఫిన్, ఇండస్‌ఇండ్, విప్రో, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, జేఎస్‌డబ్ల్యూ 1.6-0.4 శాతం మధ్య నీరసించాయి.

రూపాయి వీక్

డాలరుతో మారకంలో రూపాయి 12 పైసలు క్షీణించింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో 81.70 వద్ద ముగిసింది. సోమవారం ముగింపు 81.58కాగా.. మంగళవారం(17న) ట్రేడింగ్‌లో 81.79 వద్ద ప్రారంభమైంది. తదుపరి 81.89 వరకూ నీరసించింది. ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు 0.2 శాతం పుంజుకుని 102.4కు బలపడటం దేశీ కరెన్సీని దెబ్బ తీసినట్లు ఫారెక్స్ వర్గాలు తెలియజేశాయి. కాగా.. మంగళవారం ట్రేడింగ్‌లో చిన్న షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. బీఎస్‌ఈలో ట్రేడైన షేర్లలో 1,890 నష్టపోగా, 1,621 లాభపడ్డాయి. గత రెండు రోజుల్లో రూ. 3,173 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించిన ఎఫ్‌పీఐలు తాజాగా రూ. 211 కోట్లు ఇన్వెస్ట్ చేయడం గమనార్హం!

స్టాక్ హైలైట్స్

- హైదరాబాద్‌లో వాణిజ్య నిర్మాణాలకుగాను రూ. 1,000-2,500 కోట్ల విలువైన ఆర్డర్ లభించినట్లు వెల్లడించడంతో ఎల్‌అండ్‌టీ కౌంటర్ 4 శాతం జంప్‌చేసింది. రూ. 2217 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ. 2,218 వద్ద సరికొత్త గరిష్టాన్ని చేరింది.
- నేడు(18న) వాటాదారుల అత్యవసర సమావేశం(ఈజీఎం) నిర్వహించనున్న నేపథ్యంలో స్పెషాలిటీ రెస్టారెంట్స్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 9 శాతంపైగా జంప్‌చేసింది. రూ. 273 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సరికొత్త గరిష్టం రూ. 283 వరకూ దూసుకెళ్లింది.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర లాభం జూమ్

క్యూ3లో రూ. 775 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 775 కోట్లను తాకింది. నికర వడ్డీ ఆదాయం, మొండి రుణాలు తగ్గడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 325 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 3,893 కోట్ల నుంచి రూ. 4,770 కోట్లకు ఎగసింది.



నికర వడ్డీ ఆదాయం 30% జంప్ చేసి రూ. 1,980 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 1,527 కోట్ల వడ్డీ ఆదాయం నమోదైంది. స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) 4.73% నుంచి 2.94%కి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు 1.24% నుంచి 0.47%కి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 14.85% నుంచి 17.53%కి మెరుగుపడింది.

ఫలితాల నేపథ్యంలో బీవోఎం షేరు ఎన్ఎస్ఈలో 2 శాతం క్షీణించి రూ. 32.5 వద్ద ముగిసింది.

బీవోఐ లాభం అప్

క్యూ3లో రూ. 1,151 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ) ఈ ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 12 శాతం వృద్ధితో రూ. 1,151 కోట్లను తాకింది. మొండి రుణాలు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 1,027 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 11,211 కోట్ల నుంచి రూ. 14,160 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 64 శాతం జంప్‌చేసి రూ. 5,596 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 3,408 కోట్ల వడ్డీ ఆదాయం నమోదైంది. నికర వడ్డీ మార్జిన్లు 1.21 శాతం మెరుగై 3.72 శాతాన్ని తాకాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 10.46 శాతం నుంచి 7.66 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు సైతం 2.66% నుంచి 1.61%కి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 15.6%కి చేరింది.

ఫలితాల నేపథ్యంలో బీవోఐ షేరు 5 శాతం పతనమై రూ. 93 వద్ద ముగిసింది.

దేశీయంగా తయారీపై ఎల్‌జీ మరింత దృష్టి

పుణెలో 200 కోట్లతో కొత్త యూనిట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్‌జీ మేకిన్ ఇండియా నినాదంపై మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా పుణెలో సైడ్ బై సైడ్ (ఎస్ బీ ఎస్) ఫ్రిజ్ ల తయారీ కోసం కొత్త యూనిట్ ప్రారంభించింది. రూ. 200 కోట్లతో దీన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ భారత విభాగం ఎండీ హాంగ్ జు జియోన్ తెలిపారు. దీని వార్షిక తయారీ సామర్థ్యం 2 లక్షల యూనిట్లుగా ఉంటుందని వివరించారు. తాజాగా దేశీయంగానే వీటిని తయారు చేయడం వల్ల ధరలు కూడా కొంత తగ్గే అవకాశం ఉంది. గతేడాదే దేశీయంగా విండో ఏసీల తయారీని ప్రారంభించినట్లు జియోన్ చెప్పారు. భారత్ లో ఎస్ బీ ఎస్ ఫ్రిజ్ ల విభాగంలో తమకు 50 శాతం మార్కెట్ వాటా ఉన్నట్లు ఆయన చెప్పారు. దేశీయంగా ఫ్రిజ్ ల విభాగంలో తమకు 34 శాతం, వాషింగ్ మెషీన్ల విభాగంలో 37 శాతం వాటా ఉండగా అన్ని విభాగాల్లోనూ మార్కెట్ వాటాను మరింతగా పెంచుకోవడంపై దృష్టి పెడుతున్నట్లు జియోన్ చెప్పారు. ఎల్‌జీకి దేశీయంగా



పుణె, గ్రేటర్ నోయిడాల్లో ప్లాంట్లు ఉన్నాయి. పుణె ప్లాంటుపై 2004 నుంచి గతేడాది వరకూ రూ. 1,619 కోట్లు, నోయిడా ప్లాంటుపై 1997 నుంచి గతేడాది వరకు రూ. 1,778 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు తెలిపారు.

కొత్త ఫ్రిజ్ ల శ్రేణి..

2023కి సంబంధించి ఎల్‌జీ కొత్త ఎస్ బీ ఎస్ ఫ్రిజ్ ల శ్రేణిని ఆవిష్కరించింది. ఎల్‌జీ థింక్యూ టెక్నాలజీతో వీటిలో టెంపరేచర్ సెట్టింగ్ వంటి ఫీచర్లను ఎక్కడ నుంచైనా ఆపరేట్ చేయొచ్చని సంస్థ తెలిపింది. ఎస్ బీ ఎస్ ఫ్రిజ్ లలో 15 మోడల్స్ ఉండగా ధరలు రూ. 1,20,699 నుంచి రూ. 2,29,099గా ఉంటాయని వివరించింది.

జాబ్ పాయింట్

ఎల్ఐసీలో 300 ఏఏఓఉద్యోగాలు

ముంబయి ప్రధాన కేంద్రంగా ఉన్న లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ)ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను కోరుతుంది.దీనిలో భాగంగా అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(జనరలిస్ట్) 300పోస్టులను భర్తీ చేయనుంది.డిగ్రీ పూర్తిచేసినవారు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. రాతపరీక్షలు, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 300
- **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఏఓ)
- **అర్హత:** ఏదైనా గ్రాడ్యుయేషన్/బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 01.01.2023 వరకు 21-30 ఏళ్లు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాలకు వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
- **వేతనాలు:** నెలకు రూ.53,600 -రూ.1,02,090 చెల్లిస్తారు.

ఎంపిక విధానం

- ఆన్‌లైన్ ప్రిలిమినరీ, మెయిన్ పరీక్ష, ఇంటర్వ్యూలో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను తుది ఎంపిక చేస్తారు.
- **ప్రిలిమినరీ:** ఈ పరీక్ష 100ప్రశ్నలకు-70 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 60 నిమిషాలు. రీజనింగ్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ నుంచి ప్రశ్నలుంటాయి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది.
- **మెయిన్:** ఈ పరీక్ష 120 ప్రశ్నలకు-300 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 2 గంటల 30 నిమిషాలు. ఇందులో రీజనింగ్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్, డేటా అనాలసిస్, ఇన్సూరెన్స్ సంబంధిత ప్రశ్నలు, ఫైనాన్షియల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్(లెటర్ రైటింగ్, ఎస్సే) నుంచి ప్రశ్నలు వస్తాయి.
- ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షల్లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అనేది అర్హత పరీక్ష మాత్రమే.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 31.01.2023
- **హాల్‌టికెట్ డౌన్‌లోడ్:** పరీక్షకు పదిరోజుల ముందు నుంచి
- **పరీక్ష తేదీ(ప్రిలిమినరీ):** 2023 ఫిబ్రవరి 17, 20 తేదీల్లో
- **పరీక్ష తేదీ(మెయిన్స్):** మార్చి 18, 2023
- **వెబ్‌సైట్:** www.licindia.in

విశాఖపట్నం జిల్లాలో డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టులు

విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ శాఖ,ఎన్నికల విభాగంలో.. అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 07
- **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీతోపాటు కంప్యూటర్ ఎంఎస్ ఆఫీస్‌లో డిప్లొమా/పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. పని అనుభవానికి ప్రాధాన్యత ఉంటుంది. **వయసు:** 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.18,500 చెల్లిస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఉంచిన బాక్సులో వేయాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 19.01.2023.
- **వెబ్‌సైట్:** visakhapatnam.ap.gov.in

తెలంగాణ హైకోర్టులో 50 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు

తెలంగాణ హైకోర్టులో ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 50
- **అర్హత:** ఏడో తరగతి నుంచి పదో తరగతి మధ్య ఏదైనా పరీక్ష లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి కంటే ఎక్కువ విద్యార్హత ఉంటే అనర్హులు. అభ్యర్థులు దరఖాస్తులో వృత్తిపరమైన నైపుణ్యాలను దరఖాస్తులో పేర్కొనాలి.
- **వయసు:** 11.01.2023 నాటికి 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఆదిమ తెగలు/బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.19,000 నుంచి రూ.58,650 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** సీబీటీ/ఓఎమ్మార్ పరీక్ష, ఇంటర్వ్యూ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 21.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.02.2023.
- **హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:** 20.02.2023.
- **పరీక్షతేది:** మార్చి 2023.
- **వెబ్‌సైట్:** tshc.gov.in

బ్యాంక్ ఆఫ్ బరోడా, ముంబైలో 15 సీనియర్ మేనేజర్ పోస్టులు

ముంబైలోని బ్యాంక్ ఆఫ్ బరోడా..రిస్క్ మేనేజ్‌మెంట్ విభాగంలో రెగ్యులర్ ప్రాతిపదికన సీనియర్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 15
- » **అర్హత:** సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏ,ఎంబీఏ, పీజీడీఎం ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**24.01.2023.
- » **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

సొంత నోట్సు.. సక్సెస్‌కు రూటు

తెలుగు రాష్ట్రాల్లో గ్రూప్1, 2, 3, 4 సర్వీసులంటే ఎంతో క్రేజ్. వీటికోసం లక్షల మంది పోటీపడుతుంటారు. పోటీలో ముందుండేందుకు నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతుంటారు. కానీ సిలబస్ విస్తృతం. సమయం పరిమితం. సమాచారం అపరిమితం. వివిధ పుస్తకాల్లో చదివిన విషయాలు గుర్తుపెట్టుకోవాలి. ఇక్కడే చాలా మంది అభ్యర్థులకు సమస్య ఎదురవుతోంది. ఈ సమస్యకు చక్కటి పరిష్కారం.. సెల్ఫ్ స్టడీ నోట్స్ అంటున్నారు నిపుణులు. మరి ఈ స్టడీ నోట్స్ రాసుకోవడం ఎలా ? అనేది మరో సందేహం!! ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో గ్రూప్ -1,2,3,4తోపాటు మరెన్నో ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు లక్షల మంది సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో.. సొంత స్టడీ నోట్స్‌తో ప్రయోజనాలు, దీన్ని సిద్ధం చేసుకోవడం ఎలాగో తెలుసుకుందాం...

» గ్రూప్ 1,2,3,4 పరీక్షల గెలుపులో కీలకంగా స్టడీ నోట్స్
» ర్యాపిడ్ రివిజన్‌కు దోహదపడే చక్కటి మార్గం
» స్టడీ నోట్స్ రాసేందుకు పలు పద్ధతులు
» సెల్ఫ్ నోట్స్‌తో ఎంతో మేలంటున్న నిపుణులు

• 'పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు సొంతంగా స్టడీ నోట్స్ రాసుకుంటే.. పునశ్చరణకు ఉపయుక్తంగా ఉంటుంది. లాస్ట్ మినిట్ ప్రిపరేషన్ కోణంలో ఎంతో విలువైన సమయం ఆదా అవుతుంది.'-స్టడీ నోట్స్ ప్రాధాన్యతపై సబ్జెక్ట్ నిపుణుల అభిప్రాయం ఇది.

• 'ప్రిపరేషన్ సమయంలో నోట్స్ రాసుకుంటూ అధ్యయనం సాగించాం. దీనివల్ల ఎంతో మేలు జరిగింది. అభ్యర్థులు ఈ విధానాన్ని పాటిస్తే తమ గమ్యం దిశగా అడుగులు వేయొచ్చు' -ఇవి విజేతలు చెబుతున్న మాటలు.

• పై అభిప్రాయాలను చూస్తే.. స్టడీ నోట్స్ అనేది పోటీ పరీక్షలు, ముఖ్యంగా గ్రూప్స్ విజయంలో ఎంత కీలకమో అర్థం అవుతుంది.

స్టడీ నోట్స్ అంటే

స్టడీ నోట్స్ లేదా సొంత నోట్స్ అంటే ఏంటి? పోటీ పరీక్షల అభ్యర్థులకు కలిగే మొట్ట మొదటి సందేహం. వాస్తవానికి స్టడీ నోట్స్ అనేది ఏదైనా ఒక పుస్తకం చదివేటప్పుడు ముఖ్యమైన అంశాలను పాయింట్స్ రూపంలో సంక్షిప్తంగా రాసుకోవడంగా చెప్పొచ్చు. వీటిల్లో కాన్సెప్ట్‌లు, నిర్వచనాలు, సమకాలీన అంశాలను జోడించి సినాప్సిస్ రూపంలో షార్ట్ నోట్స్‌లో పొందుపర్చుకుంటారు. దీనివల్ల ఏదైనా ఒక టాపిక్ ప్రిపరేషన్ పూర్తయిన తర్వాత మళ్లీ దాన్ని చదవాలనుకుంటే.. మొత్తం పుస్తకాన్ని చదవాల్సిన అవసరం లేకుండా.. స్టడీ నోట్స్‌ను చదివితే సరిపోతుంది. ముఖ్యమైన పాయింట్లు ఒక సారి చూసుకుంటే.. మొత్తం విషయమంతా స్ఫురణకు వస్తుంది. దీనివల్ల ఎంతో విలువైన సమయం ఆదా అవుతుందని చెబుతున్నారు.

క్లాస్ రూమ్ స్టడీ నోట్స్

స్టడీ నోట్స్ రూపొందించుకోవడంలో మరో ముఖ్యమైన విధానం.. క్లాస్ రూమ్ స్టడీ నోట్స్. అంటే.. అభ్యర్థులు ఒక సబ్జెక్ట్‌కు సంబంధించి క్లాస్ రూమ్‌లో లెక్చర్ వింటున్న సమయంలో.. సదరు సబ్జెక్ట్ నిపుణులు 'ముఖ్యమైనవి' అని పేర్కొన్న అంశాలను తమ నోట్స్‌లో రాసుకోవడం. సదరు లెక్చరర్.. ఆయా అంశాలకు సంబంధించి గణాంక సహిత బోధన సాగిస్తున్న సమయంలో.. సదరు గణాంకాలను తమకు గుర్తుండే రీతిలో స్టడీ నోట్స్‌లో రాసుకోవచ్చు. పోటీ పరీక్షల కోణంలో క్లాస్ రూమ్ స్టడీ నోట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది.

ప్రిపరేషన్ టైమ్‌లో స్టడీ నోట్స్

స్వీయ ప్రిపరేషన్ సాగించే అభ్యర్థులు.. పలు పుస్తకాల ద్వారా సేకరించే సమాచారం స్టడీ నోట్స్‌లో రాసుకోవచ్చు. అభ్యర్థులు ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించిన ప్రామాణిక పుస్తకాల్ని చదువుతున్న సమయంలో రన్నింగ్ నోట్సులా స్టడీ నోట్స్‌ను రాసుకోవడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. స్టడీ నోట్స్‌లో.. ఆయా టాపిక్‌లకు సంబంధించి నిర్వచనం, ఫార్ములాలు, భావనలు రాసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

కలరింగ్ మెథడ్

అభ్యర్థులు స్టడీ నోట్స్‌లో ముఖ్యమైన అంశాలను కలర్ పెన్స్ ఉపయోగించి హైలైట్ చేసుకోవాలి. ఫలితంగా రివిజన్ సమయంలో మరింత వేగంగా ఆయా అంశాలకు సంబంధించిన విషయాలను స్ఫురణకు తెచ్చుకునే అవకాశం ఉంటుంది. ఈ కలర్ కోడింగ్ విధానంలో.. రెండు లేదా మూడు కలర్స్‌కే పరిమితమవడం మేలని నిపుణులు సలహా ఇస్తున్నారు. ఉదాహరణకు.. ఏదైనా ఒక కీలకమైన పాయింట్‌ను గ్రీన్ కలర్‌తో, గణాంక సమాచారాన్ని రెడ్ కలర్‌తో, నిర్వచనాన్ని పింక్ కలర్‌తో.. ఇలా సంక్షిప్త నోట్స్ తయారు చేసుకోవాలి.

మైండ్ మ్యాపింగ్

స్టడీ నోట్స్ రాసే విషయంలో మరో ముఖ్యమైన విధానం.. మైండ్ మ్యాపింగ్ మెథడ్. ఈ విధానంలో.. ఆయా అంశానికి సంబంధించి విజువలైజేషన్ టెక్నిక్‌ను అనుసరించాలి. అంటే..సదరు టాపిక్‌కు సంబంధించి తమకు అనువైన రీతిలో సింబల్స్, లైన్స్, గ్రాఫ్స్‌ను రూపొందించుకోవాలి. అదే విధంగా ఏదైనా ఒక అంశాన్ని తమ నిత్య జీవితంలోని విషయాలతో ముడిపెట్టి గుర్తుంచుకునే విధానం కూడా మైండ్ మ్యాపింగ్ విధానంలోకి వస్తుంది.

టేబుల్ ఫార్మట్

• పోటీ పరీక్షలకు స్టడీ నోట్స్ కోణంలో టేబుల్ ఫార్మట్ కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.



ముఖ్యంగా విస్తృతమైన సమాచారం ఉండే అంశాల విషయంలో ఈ విధానం అభ్యర్థులకు పునశ్చరణ, జ్ఞప్తికి ఎంతో ప్రయోజనం చేకూర్చుతుంది. ఉదాహరణకు.. ముఖ్యమైన ప్రదేశాలు లేదా సంవత్సరాల విషయంలో ఒక వరుస క్రమంలో సంవత్సరాన్ని..దాని పక్కనే ఆ సంవత్సరంలో జరిగిన ఘటనలు క్లుప్తంగా రాసుకోవడం వంటివి చేయాలి.

• ఒక టాపిక్‌కు సంబంధించి అన్ని అంశాలు ఒకేసారి జ్ఞప్తికి తెచ్చుకునే విధానం లేదా పునశ్చరణకు ఉపయోగపడే విధానం.. ప్యాట్రన్ మెథడ్. ఈ పద్ధతిలో స్టడీ నోట్స్ రాసుకునేందుకు.. నిర్దిష్ట అంశాన్ని పేపర్ మధ్యలో ఒక వృత్తంలో రాసుకోవాలి. ఆ తర్వాత ఆ అంశానికి సంబంధించిన అనుబంధ పాయింట్లను లైన్స్‌లో రాసుకోవాలి.

చార్ట్‌ల రూపం

స్టడీ నోట్స్ రాసుకునే సమయంలో అభ్యర్థులు చార్ట్‌ల రూపంలోనూ ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి ముఖ్యాంశాలను పొందుపర్చుకోవచ్చు.ఒక పేజీలో రెండు లేదా మూడు వరుసల్లో.. ఒక టాపిక్‌కు సంబంధించిన ముఖ్యాంశాలను మొదటి వరుసలో.. దానికి సంబంధించిన కాన్సెప్ట్‌లు,ఫార్ములాలను రెండో వరుసలో.. సదరు టాపిక్‌కు సంబంధించిన తాజా పరిణామాలను మూడో వరుసలో రాసుకోవాలి. ఫలితంగా రివిజన్ సమయంలో టాపిక్ ఉద్దేశం మొదలు సమకాలీన పరిస్థితుల వరకూ.. అన్నింటినీ వేగంగా గుర్తుకు తెచ్చుకునే వీలుంటుంది.

దయాగ్రమ్స్-అబ్రివేషన్స్

• స్టడీ నోట్స్ విషయంలో డయాగ్రమ్ మెథడ్ కూడా ఉపయుక్తంగా ఉంటుంది. ఒక టాపిక్‌కు సంబంధించి తమకు అనువైన, సులువుగా స్ఫురించేలా ఒక డయాగ్రమ్‌ను రూపొందించుకోవాలి. ఆ తర్వాత.. అందులో ముఖ్య భాగాల రూపంలో సదరు టాపిక్‌కు సంబంధించి ముఖ్య అంశాన్ని, దాని సబ్ టాపిక్స్‌ను రాసుకోవాలి.

• స్టడీ నోట్స్ రాసుకునేటప్పుడు అభ్యర్థులు గుర్తుంచుకోవాల్సిన మరో విషయం.. అబ్రివేషన్స్ రాసుకోవడం. ఉదాహరణకు.. ఐక్యరాజ్య సమితి అని రాసుకునే బదులు యూఎన్‌ఓ అని రాసుకుంటే.. సమయం ఆదా అవుతుంది. నోట్స్ కూడా గజిబిజిగా లేకుండా.. సులువుగా ఆయా అంశాలపై తమ దృష్టిని కేంద్రీకరించేలా ఉంటుంది.

సాంకేతిక పదాలు

స్టడీ నోట్స్‌లో అభ్యర్థులు ముఖ్యమైన సాంకేతిక పదాలను రాసుకోవాలి. వీటినే టెక్నికల్ జార్గాన్స్ అని కూడా అంటారు. ప్రతి సబ్జెక్ట్‌కు సంబంధించి నిర్దిష్టంగా కొన్ని పదాలు ఉంటాయి. ఉదాహరణకు ఎకానమీలో.. 'రెపో' రేటు, రివర్స్ రెపోరేట్; అదే విధంగా జాగ్రఫీలో గ్లేసియర్స్, బ్యాడ్ ల్యాండ్స్ వంటివి. వీటిని స్టడీ నోట్స్‌లో పొందుపర్చుకోవడంతో పాటు క్లుప్తంగా ఒకటి రెండు వాక్యాల్లో వాటి అర్థాన్ని, నిర్వచనాన్ని కూడా రాసుకుంటే ప్రాథమిక అవగాహన ఏర్పడుతుంది.

చదువుతున్నపుడే

ఏదైనా ఒక టాపిక్‌కు సంబంధించి ప్రామాణిక పుస్తకం చదువుతున్నప్పుడే సొంత నోట్స్‌లో రాసుకోవాలి. అలాకాకుండా చదవడం పూర్తయిన తర్వాత నోట్స్ రాయొచ్చులే అనుకుంటే.. ఆ టాపిక్ పూర్తయ్యాక మళ్లీ మొదటి నుంచి చదవాల్సి ఉంటుంది. దీంతో సమయం వృథా అవుతుంది. కొన్నిసార్లు తర్వాత రాసుకుందాం అనే ఆలోచన చేయడంతో సదరు అంశంపై స్టడీ నోట్స్ రాయలేని పరిస్థితి కూడా ఏర్పడొచ్చు.

సినాప్సిస్‌లకే పరిమితం

అభ్యర్థులు స్టడీ నోట్స్ రాసుకునే విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా.. అన్ని అంశాలను వీలైనంత క్లుప్తంగా రాసుకోవాలి. నిర్వచనాలు, భావనలను రాసుకునేటప్పుడు ఇది ఎంతో ముఖ్యం. ఆయా టాపిక్స్‌కు సంబంధించి సినాప్సిస్(సంక్షిప్త వివరణ)కు పరిమితమవ్వాలి. ముఖ్యంగా జనరల్ ఎస్సే, జనరల్ స్టడీస్, డిస్క్రిప్టివ్ కొశ్చన్ అండ్ ఆన్సర్స్ విషయంలో ఇది ఎంతో ప్రధానమని గుర్తించాలి.

నిడివితోపాటు నీట్‌గా

• స్టడీ నోట్స్‌లో ప్రతి పేజీలో నిడివి బాగుండేలా, రైటింగ్ కూడా చక్కగా ఉండేలా చూసుకోవాలి. ప్రతి పేజీలో ఒక అంశానికి, మరో అంశానికి మధ్య కొంత గ్యాప్(నిడివి) విడిచిపెడితే.. సదరు టాపిక్‌కు సంబంధించి తర్వాత దశలో ఏదైనా కొత్త విషయం చదివినప్పుడు లేదా స్ఫురించినప్పుడు.. దాని కిందనే రాసుకోవడానికి వీలవుతుంది. అదే విధంగా రైటింగ్ కూడా నీట్‌గా ఉంటే రివిజన్ సమయంలో గందరగోళానికి గురవకుండా.. వేగంగా సదరు టాపిక్స్‌ను రివిజన్ చేసుకునే అవకాశం ఉంటుంది. • ఇలా.. స్టడీ నోట్స్ రాసుకుంటూ అంకిత భావంతో ప్రిపరేషన్ సాగిస్తే.. పోటీ పరీక్షల్లో విజయావకాశాలు మెరుగవుతాయి.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 69,804 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 29,615 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ. 3.54 కోట్లు వేశారు. టైం స్లాట్ దర్శన టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టికెట్లు లేని భక్తులకు 16 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు రెండు గంటల్లో స్వామివారి దర్శనం అవుతోంది. శ్రీవారిని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర, సెంట్రల్ ఫారెస్ట్ ఐజీ మురళి నందవరం సుబ్బారావు మంగళవారం దర్శించుకున్నారు. కాగా, తిరుమలలో చలి తీవ్రంగా ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్‌పై అసత్య ప్రచారం

- క్షేత్రస్థాయిలో మహిళా డాక్టర్లకు ఎలాంటి ఇబ్బంది లేదు
- ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి వెల్లడి

సాక్షి, అమరావతి: ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన తమకు ప్రమాదకరంగా మారుతోందంటూ మహిళా డాక్టర్లు చెప్పినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంతో గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు నాణ్యమైన వైద్య సేవలందిస్తోందని పేర్కొన్నారు. ఈ విధానంపై వైద్యులందరూ సానుకూల దృక్పథంతో ఉన్నట్లు తెలిపారు. దీన్ని దెబ్బతీసేందుకు కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వైద్యాధికారి ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లతో కలిసి మంచానపడిన, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇళ్లను మాత్రమే సందర్శిస్తారని, అటువంటి రోగులకు మానసిక స్థైర్యాన్ని కల్పించి త్వరగా కోలుకునేలా కృషిచేస్తారని తెలిపారు. ఈ క్రమంలో మహిళా డాక్టర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని, ఎక్కడైనా ఇబ్బందికర ఘటనలు జరిగితే విచారించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

విశాఖ బీచ్‌లో విషాదాలు ఉండవిక

- బీచ్‌ల వద్ద రిప్ కరెంట్‌పై పోలీసులకు ముందస్తు సమాచార వ్యవస్థ
- తద్వారా సందర్శకులకు హెచ్చరికలు
- పోలీసు కంట్రోల్ రూం నుంచి నిత్యం పర్యవేక్షణ
- పర్యాటకుల్ని కాపాడేలా పోలీస్ శాఖ చర్యలు



సముద్రంలో రిప్‌కరెంట్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: సాగర తీరంలో కవ్వించే అలలతో పోటీ పడుతూ.. సరదాల్లో మునిగి తేలే పర్యాటకుల్ని అమాంతం పొట్టన పెట్టుకుంటున్నాయి రాకాసి అలలు. రిప్ కరెంట్‌గా పిలిచే ఇలాంటి రాకాసి అలలు కడలి మాటున దాగి ఉంటూ వేటు వేస్తుంటాయి. చీలిక ప్రవాహాలుగా పేర్కొనే వీటినుంచి సందర్శకుల్ని రక్షించేందుకు విశాఖ పోలీసులు సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారు. రిప్ కరెంట్‌పై ముందస్తు సమాచారం అందించే వెబ్‌సైట్ ద్వారా ఆయా బీచ్‌లలో హెచ్చరికలు జారీ చేసి, సందర్శకుల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ముందస్తు ఏర్పాట్లు చేసే దిశగా అడుగులు పడుతున్నాయి.

రిప్ కరెంట్ అంటే..

బలమైన అలల మధ్య ఇరుకైన ప్రవాహాన్ని రిప్ కరెంట్ అంటారు. ఇవి మనిషిని ఒక్కసారిగా లోతైన ప్రవాహంలోకి లాగేస్తాయి. సముద్ర గర్భంలోని సుదూర ప్రాంతంలో గాలి ద్వారా ఏర్పడిన అలలు.. నీటి అడుగున బలమైన ప్రవాహంగా తీరం వైపు దూసుకొస్తాయి. తీరానికి వచ్చేసరికి అవి రాకాసి అలలుగా మారిపోతాయి. అల ఒక్కసారిగా తీరాన్ని తాకినప్పుడు సముద్రం అడుగున అత్యంత బలమైన ప్రవాహం ఏర్పడుతుంది. ఈ కెరటాలు తిరిగి వెళ్లేటప్పుడు తీరానికి వచ్చే కొద్దీ వేగం అధికమై తరంగాలు ఏర్పడుతుంటాయి. రిప్ కరెంట్ వేగం సెకనుకు 2 నుంచి 8 అడుగుల వరకూ ఉంటుంది. ఇలాంటి అల చీలికతో ఒడ్డుకు సమాంతరంగా 10 నుంచి 290 అడుగుల వెడల్పుతో ఏర్పడుతుంది. ఈ ప్రవాహంలో ఎవరు ఉన్నా.. రెప్పపాటులో సముద్రంలోపలికి వెళ్లిపోతారు. కొన్ని సందర్భాల్లో గజ ఈతగాళ్లు కూడా దీని నుంచి తప్పించుకోవడం అసాధ్యం.

విశాఖ తీరంలో ఎన్నో విషాదాలు

విశాఖ సాగర తీరంలో 2018లో 55 మంది, 2019లో 51 మంది, 2020లో 64 మంది, 2021లో 63 మంది మృత్యువాత పడగా.. గతేడాది 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. విశాఖ వచ్చే పర్యాటకులు యారాడ బీచ్, ఆర్కే బీచ్, తెన్నేటి పార్క్, సాగర నగర్, రుషికొండ బీచ్, ఐటీ హిల్స్, భీమిలి బీచ్ ప్రాంతాలను ఎక్కువగా సందర్శిస్తుంటారు. ఇక్కడి తీరంలో పెద్దపెద్ద రాళ్లు ఉండటంతో వాటిపై నిలబడి సాగర అందాలను వీక్షిస్తుంటారు. కొంతమంది అక్కడే సరదాగా స్నానాలు చేసేందుకు దిగడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా తీరం నుంచి ఎక్కువ దూరం సముద్రంలోకి వెళ్లడంతో అకస్మాత్తుగా వచ్చే అలలకు బలైపోతున్నారు. విశాఖ తీరం చుట్టూ కొండలు ఉండటంతో వాతావరణంలో వచ్చే మార్పుల కారణంగా రిప్ కరెంట్ వల్ల ఒక్కొక్కసారి భారీ అలలు వస్తుంటాయి. ఇలా రిప్ కరెంట్ వల్ల అలలు కొన్ని మీటర్ల ఎత్తు వరకు వస్తుంటాయి. ఆ సమయంలో తీరంలో ఉన్నవారు వాటికి చిక్కితే క్షణాల్లో కొన్ని కిలోమీటర్ల లోనికి వెళ్లిపోతుంటారు. సాధారణంగా అలలు ఎవరినైనా లోనికి లాగితే కొద్ది దూరంలోనే విడిచిపెట్టేస్తాయి. అటువంటి వారిని లైఫ్‌గార్డ్స్ రక్షించే అవకాశం ఉంటుంది. ఈ రిప్ కరెంట్ వల్ల వచ్చే కెరటాలకు చిక్కితే మాత్రం సురక్షితంగా బయటపడటం అసాధ్యం.

సందర్శకుల భద్రతకు పెద్దపీట



ఎంవోఎస్‌డీఏసీ డాట్ జీవోవీ డాట్ ఐఎన్ అనే వెబ్‌సైట్‌లో రిప్ కరెంట్ సమాచారం ఎప్పటికప్పుడు ముందస్తు హెచ్చరికలతో లభిస్తుంది. ఇలా వచ్చే ముందస్తు సమాచారం ద్వారా రిప్ కరెంట్ ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో సముద్రంలోకి ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. ఒకవేళ రిప్ కరెంట్ ప్రభావం లేనిపక్షంలో సముద్రంలోకి వెళ్లేందుకు అనుమతిస్తాం. త్వరలోనే ఈ విధానాన్ని అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. విశాఖ నగరానికి వచ్చే ప్రతి పర్యాటకుడి భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం.

– సీహెచ్ శ్రీకాంత్, నగర పోలీస్ కమిషనర్

25న పోలవరం బ్యాక్ వాటర్‌పై సాంకేతిక కమిటీ భేటీ

- 4 రాష్ట్రాల ఈఎన్‌సీలకు సీడబ్ల్యూసీ లేఖ
- అనంతరం ఆయా రాష్ట్రాల సీఎంల సమావేశం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ (నిల్వ నీరు) ప్రభావంపై సాంకేతిక కమిటీ సమావేశాన్ని ఈ నెల 25వ తేదీన ఏర్పాటు చేశామని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఈఎన్‌సీలకు సీడబ్ల్యూసీ (కేంద్ర జల సంఘం) డైరెక్టర్ సంజయ్‌కుమార్ మంగళవారం లేఖ రాశారు. ఈ నెల 13న జరగాల్సిన ఈ భేటీని ఒడిశా ప్రభుత్వం వినతి మేరకు సీడబ్ల్యూసీ వాయిదా వేసింది. ఆ సమావేశాన్ని 25న నిర్వహిస్తోంది. పోలవరం బ్యాక్ వాటర్ వల్ల తమ రాష్ట్రాల్లో భూమి ముంపునకు గురవుతోందని ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశాయి. నాలుగు రాష్ట్రాలతో సమావేశం నిర్వహించి, అనుమానాలను నివృత్తి చేసి డిసెంబర్‌లోగా నివేదిక ఇవ్వాలని గత ఏడాది సెప్టెంబర్ 6న సుప్రీంకోర్టు ఆదేశించింది. గత ఏడాది సెప్టెంబర్ 29న నాలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో కేంద్ర జల్ శక్తి శాఖ సమావేశం నిర్వహించి, అనుమానాలను నివృత్తి చేయడానికి ప్రయత్నించింది. ఆ సమావేశంలో లేవనెత్తిన అనుమానాలను సాంకేతికంగా నివృత్తి చేయడానికి అక్టోబర్ 6న ఈఎన్‌సీలు, సీడబ్ల్యూసీ చైర్మన్‌తో కూడిన సాంకేతిక కమిటీ సమగ్రంగా చర్చించింది. కానీ.. ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు సంతృప్తి చెందకపోవడంతో సుప్రీం కోర్టుకు కేంద్రం నివేదిక ఇవ్వలేకపోయింది. దీంతో నివేదిక గడువును సుప్రీంకోర్టు ఫిబ్రవరి 29కి పొడిగించింది. ఈ నేపథ్యంలో మరోసారి సాంకేతిక కమిటీ సమావేశమవుతోంది. సాంకేతిక కమిటీ సమావేశాల్లో ఇదే ఆఖరిది. ఈ భేటీలో చర్చించిన అంశాల ఆధారంగా రూపొందించిన నివేదిక మేరకు కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఫిబ్రవరి మొదటి లేదా రెండో వారంలో సమావేశం నిర్వహిస్తారు. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాల ఆధారంగా సుప్రీం కోర్టుకు కేంద్రం నివేదిక ఇవ్వనుంది.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి

సరదా కోసం వచ్చి ప్రమాదంలో దుర్మరణం



మృతి చెందిన నిత్యశ్రీ

వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): పండుగ వేళ సరదా కోసం స్నేహితులతో కలసి ఉబ్బలమడుగు పర్యాటక కేంద్రంకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో తమిళనాడుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని దుర్మరణం చెందిన ఘటన మండలంలోని వరదయ్యపాళెం అవంతి రోడ్డు మార్గంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ షణ్ముగం తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నై సిటీకి చెందిన కిషోర్ కుమార్తె నిత్యశ్రీ ఓ ప్రైవేటు సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. సంక్రాంతి సెలవులు కావడంతో స్నేహితులతో సరదాగా గడపడానికి ద్విచక్ర వాహనంలో వరదయ్యపాళెం సమీపంలోని ఉబ్బలమడుగు పర్యాటక కేంద్రానికి మంగళవారం బయలుదేరారు. వరదయ్యపాళెం అవంతి రోడ్డు మార్గంలోని సంతోష్‌పురం సమీపంలో ఉన్న స్పీడ్ బ్రేకర్‌ను అధిగమించడానికి మోటారు బైకును వేగం తగ్గించేసరికి వెనుకనే వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న కిషోర్ వెనుక కుర్చొని ఉన్న నిత్యశ్రీకి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం శ్రీసిటీలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే తీవ్ర గాయాలైన నిత్యశ్రీ దుర్మరణం పాలైంది. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. సత్యవేడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిత్యశ్రీ మృతదేహానికి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వినూత్న విధానాలతో ఆత్మనిర్భర్ భారత్ బలోపేతం

- కేంద్ర రక్షణశాఖ సలహాదారు సతీష్‌రెడ్డి
- శ్రీసిటీలో పరిశ్రమల ప్రతినిధులతో భేటీ

వరదయ్యపాళెం: వినూత్న పద్ధతుల ద్వారా తయారీ రంగాన్ని మెరుగుపరిచేందుకు, తద్వారా ఆత్మనిర్భర్ భారత్ పథకాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని కేంద్ర రక్షణశాఖ శాస్త్రీయ సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి చెప్పారు. ఆయన మంగళవారం తిరుపతి జిల్లా శ్రీసిటీలో పర్యటించారు. స్థానిక పరిశ్రమల సీనియర్ మేనేజర్లతో సమావేశమయ్యారు. వినూత్న తయారీ–ఆత్మనిర్భర్ భారత్ అంశంపై ఆయన మాట్లాడుతూ ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యసాధనలో సత్తా చాటేందుకు పరిశ్రమలకు ఇది సరైన అవకాశంగా భావిస్తున్నట్లు చెప్పారు. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ పథకాల ద్వారా చురుకైన విధానాలతో స్వదేశీ సాంకేతిక అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

విద్యాసంస్థల సహకారంతో కేంద్రీకృత పరిశోధనలు

దేశంలో స్వయం సమృద్ధి సాధనకు.. గుర్తించిన రంగాల్లో కేంద్రీకృత పరిశోధనల కోసం విద్యాసంస్థలతో చేతులు కలపాల్సిన అవసరం ఉందని చెప్పారు. వివిధ విధానాల రూపకల్పనలు, నిరంతర చర్యలు, సాంకేతిక బదిలీల ద్వారా దేశీయ పరిశ్రమ సాంకేతిక సామర్థ్యాలను గణనీయంగా పెంచడానికి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. శ్రీసిటీలో వేగవంతమైన పారిశ్రామిక పురోగతిని అభినందించారు. కొన్ని పరిశ్రమలు దిగుమతులకు ప్రత్యామ్నాయంగా ఉత్పత్తులు చేపట్టడంతోపాటు గణనీయంగా ఎగుమతులు కూడా చేస్తూ మేక్ ఇన్ ఇండియా ప్రచారాన్ని ప్రోత్సహించడంపై సంతోషం వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పాల్గొన్నారు. ఈ పర్యటనలో శ్రీసిటీ పరిసరాలు చూసిన డాక్టర్ సతీష్‌రెడ్డి బ్యూరోలెక్స్ పరిశ్రమను సందర్శించి ఉత్పత్తుల తీరును పరిశీలించారు.



‘మౌలిక’ ప్రాజెక్టులకు జీఐఎస్ మ్యాపింగ్

రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు కేంద్రం మార్గనిర్దేశం

సాక్షి, అమరావతి: దేశంలో రహదారులు, లాజిస్టిక్ మౌలిక వసతుల అభివృద్ధికి దీర్ఘకాలిక రూట్ మ్యాప్‌ను కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తోంది. పీఎం గతిశక్తి ప్రాజెక్టు కింద 29 అంశాలతో జియో ఇన్ఫర్మేషన్ సిస్టమ్(జీఐఎస్)కు రూపకల్పన చేయాలని నిర్ణయించింది. అందుకోసం ఏకంగా రూ.లక్ష కోట్లతో ప్రాజెక్టు చేపడుతోంది. కేంద్రం దశలవారీగా ఈ నిధులు విడుదల చేస్తుంది. రహదారులు, అభయారణ్యాలు, వన్య ప్రాణి సంరక్షణ, ఎకో టూరిజం, తీరప్రాంత నియంత్రణ– పరిరక్షణ ప్రాంతాలతోపాటు గనులు, నీటి వనరులు, విద్యుత్తు పంపిణీ మార్గాలు, సివరేజ్ లైన్లు ఉన్న ప్రాంతాలు మొదలైన వాటిని ఒకే డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా మ్యాపింగ్ చేస్తారు. భవిష్యత్‌లో రహదారుల, లాజిస్టిక్ రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టుల ప్రణాళికకు ఈ మ్యాపింగ్ మార్గనిర్దేశం చేస్తుంది. అందుకోసం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఉన్నతాధికారులు సభ్యులుగా ఓ ఉన్నతస్థాయి నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ (ఎన్‌పీజీ)ని ఏర్పాటు చేశారు. జీఐఎస్ మ్యాపింగ్‌కు అనుబంధంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు మాస్టర్ ప్లాన్ రూపొందించుకోవాలి. అందుకోసం ప్రత్యేక వెబ్ పోర్టళ్లను ఏర్పాటు చేయాలి. జీఐఎస్ సమాచారాన్ని ఆ వెబ్ పోర్టళ్లతో అనుసంధానిస్తారు. ఈ ప్రాజెక్టు కోసం కేంద్రం తాజాగా రూ.5వేల కోట్లు విడుదల చేసింది.

బిందు సేద్యం.. సాగునీటి కొరతకు కళ్లెం

రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా గ్రామ స్థాయిలోనే రైతులకు అనేక సేవలు అందిస్తోంది. అయితే సాగునీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ సమస్యను అధిగమించేందుకు సూక్ష్మ సేద్యం రైతులు చేపట్టేలా ప్రోత్సహిస్తోంది. ఈ విధానంలో సాగు చేసేందుకు అవసరమైన మైక్రో పరికరాలు (బిందు సేద్య) పరికరాలను ప్రభుత్వం రాయితీపై అందిస్తోంది. ఈ ప్రక్రియ మార్చి వరకు కొనసాగనుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,431 మంది రైతులు సబ్సిడీ పరికరాల కోసం దరఖాస్తు చేయగా, వాటి పంపిణీకి పరిపాలనా ఆమోదం సైతం లభించింది.



తుంపర సేద్యం సాగును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ (ఫైల్)

- బిందు సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం
- సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యం
- పరికరాలపై 50 నుంచి 90 శాతం రాయితీ
- సాగునీటి కొరత అధిగమించడమే లక్ష్యం
- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో లక్ష్యసాధనకు కార్యాచరణ

ఏలూరు (మెట్రో): సూక్ష్మ సేద్య పద్ధతిని అవలంబించే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోంది. రైతులకు అవసరమైన ఆధునిక పరికరాలను రాయితీపై పంపిణీ చేయనుంది. జిల్లాలో 15 మెట్ట ప్రాంతాల్లో బిందు, తుంపర సేద్య పరికరాలను రైతు భరోసా కేంద్రాల్లో ఇప్పటికే 10,431 మంది రైతులు నమోదు చేసుకోగా, వీరందరికీ డ్రిప్ పరికరాలను 50 నుంచి 90 శాతం వరకు రాయితీతో అందించనుంది. అలాగే తక్కువ వ్యయంతో అధిక దిగుబడి సాధించే ప్రక్రియపై సూక్ష్మసేద్య పథకంతో ఉద్యానవన శాఖాధికారుల ద్వారా అవగాహన కల్పిస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఉద్యాన పంటల సాగుకు జిల్లా కలెక్టర్లు వె.ప్రసన్న వెంకటేష్, పి.ప్రశాంతి రైతులను ప్రోత్సహించే దిశగా కార్యాచరణ నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లాలో 6 వేల హెక్టార్లు, పశ్చిమగోదావరి జిల్లాలో వెయ్యి హెక్టార్లు, భౌతికలక్ష్యం రూ.60 కోట్లను ఆర్థిక లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటివరకు ఏలూరు జిల్లాలో 2418.45 హెక్టార్లల్లో, పశ్చిమగోదావరి జిల్లాలో 300 హెక్టార్లల్లో బిందు, తుంపర సేద్యం కోసం రూ.20 కోట్లతో పరిపాలనామోదం సైతం లభించింది. మార్చి నాటికి జిల్లాకు ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోనున్నారు.

ఎన్ని ఎకరాలకు ఎంత రాయితీ

ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు పొందవచ్చు. ఒక్కొక్క రైతుకు గరిష్ఠంగా రూ.2.18 లక్షల వరకు రాయితీ వస్తుంది. 5 నుంచి 12.5 ఎకరాలోపు ఉన్న భూమి గల రైతులకు 55 శాతం రాయితీతో బిందు పరికరాలు పొందవచ్చు. అలాగే 5 ఎకరాలలోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 55 శాతం రాయితీ, 5 ఎకరాలకు మించి 12.5 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులు 45 శాతం రాయితీపై స్ప్రింక్లర్లను పొందవచ్చు. రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు తీసుకున్న రైతులు ఏడేళ్ల తరువాత రెండోసారి సబ్సిడీపై పరికరాలు పొందే వెసులబాటును ప్రభుత్వం కల్పించింది.

దరఖాస్తు చేసే విధానం

బిందు, తుంపర్ల సేద్య పరికరాలను ప్రభుత్వ రాయితీపై పొందాలనుకునే రైతులు ఆధార్‌కార్డు, భూమి యాజమాన్య పత్రం జత చేసి సంబంధిత వీహెచ్ఎ, వీఏఏ, వీఎస్ సంబంధిత గ్రామ ఆర్‌బీకే, జిల్లా మైక్రో ఇరిగేషన్ జిల్లా కార్యాలయంలో బయోమెట్రిక్ దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులో తప్పనిసరిగా సెల్‌ఫోన్ నంబర్ నమోదు చేయాలి. సబ్సిడీ, నాన్ సబ్సిడీ వివరాలు నేరుగా రైతు ఫోన్‌కే మెసెజ్ ద్వారా తెలియజేస్తారు. వెబ్‌ల్యాండ్ పోర్టల్‌లో చేర్చిన పొలం విస్తీర్ణం ఆధారంగా సబ్సిడీ అర్హత నిర్ణయిస్తారు. రైతు చెల్లించాల్సిన వాటాను ప్రాజెక్టు ఆఫీసర్, ఏపీఎంఐపీ గుంటూరుకు చలానా చెల్లించిన తరువాత దరఖాస్తులను పరిశీలించి కలెక్టర్ నుంచి పరిపాలన ఆమోదం కోసం పంపిస్తారు.

పంటలు.. పరికరాలతో ప్రయోజనాలు

బిందు సేద్యంతో ఆయిల్‌పామ్, కొబ్బరి, కోకో, జామ, మామిడి, బత్తాయి, నిమ్మ, సపోటా, అరటి, కూరగాయలు, మొక్కజొన్న, మిరప, చెరకు, స్ప్రింక్లర్ల విధానం ద్వారా వేరుశెనగ, మినుము పంటలకు ప్రయోజనాలు వర్తిస్తాయి. బిందు, స్ప్రింకర్ల సేద్యం ద్వారా నీటిని, విద్యుత్‌ను పొదుపు చేయవచ్చు. బిందు సేద్యంతో కూలీల ఖర్చు తగ్గుతుంది. నీటిలో కలిపే ఎరువులు, ఫెర్టిగేషన్ విధానం ద్వారా అందించడంతో ఖర్చు తగ్గుతుంది. ఎరువుల వినియోగం సామర్థ్యం పెరిగి పంట దిగుబడి నాణ్యత పెరుగుతుంది. పురుగులు, తెగుళ్ల తీవ్రత తగ్గి, కలుపు తీవ్రత ఉండదు.

రైతులందరికీ పరికరాలు అందిస్తాం



సూక్ష్మ సేద్య పరికరాలను తయారు చేస్తున్న 13 కంపెనీల ద్వారా వీటిని రైతులకు అందిస్తున్నా. 15 మెట్ట ప్రాంత మండలాల్లో రైతులు బిందు, తుంపర సేద్య పరికరాలు సబ్సిడీపై కావాలనుకునే రైతులు తమ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. డ్రిప్ స్ప్రింక్లర్ల పరికరాలు అమర్చిన తరువాత రైతులకు పరికరాల వాడకంపై, డ్రిప్ ద్వారా ఎరువులు అందించే విధానాలపై కంపెనీ ప్రతినిధులు, ఉద్యానశాఖాధికారులు అవగాహన కల్పిస్తారు.

– వీపీఎస్ రవికుమార్, ఏలూరు జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి

రైతుకు భరోసా.. పంటకు భద్రత

కొరిటిపాడు(గుంటూరు): ఎండనక, వాననక ఆరుగాలం శ్రమించే రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు విత్తు నుంచి దిగుబడి వరకు కావాల్సిన అన్ని రకాల సేవలు అందిస్తోంది. పెట్టుబడి సాయం కింద ప్రతి ఏటా రైతు భరోసా కింద రైతు ఖాతాలకు నగదు జమ చేస్తోంది. తాజాగా రైతులు పండించిన పంట దిగుబడులను గిట్టుబాటు ధర వచ్చే వరకు భద్రంగా దాచుకునేందుకు వీలుగా మల్టీ పర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్లను నిర్మించి రైతులకు అండగా నిలుస్తోంది. ఎలాంటి ఆందోళన లేకుండా నిశ్చింతగా పంటలను గోడౌన్లలో భద్రపరచుకుని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకునేందుకు వీలవుతుంది. ఒక్కో మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్‌కు రూ.40 లక్షల పెట్టుబడితో 500 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు నిల్వ చేసుకుందుకు వీలుగా రూ.11.60 కోట్లతో 14,500 మెట్రిక్ టన్నుల కెపాసిటీతో వాటిని నిర్మిస్తున్నారు.

జిల్లాకు 29 మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు

గుంటూరు జిల్లా వ్యాప్తంగా 29 మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటి నిర్మాణానికి సంబంధించిన పనులను ప్రారంభించారు. ఇందులో ఒక్కో మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్‌ను రూ.40 లక్షలతో 50 సెంట్ల స్థలంలో నిర్మిస్తున్నారు. వీటిని రైతు భరోసా కేంద్రాల పరిధిలో సహకార సంఘాల ఆధ్వర్యంలో మార్కెటింగ్‌శాఖ అధికారులు నిర్మిస్తున్నారు.

ఎక్కడెక్కడ నిర్మిస్తున్నారంటే..

గుంటూరు జిల్లాలోని గుండ్లపాడు, పెనుమూలి, పెదపాలెం, కాజ, వడ్డేశ్వరం, కొలకలూరు, బుర్రిపాలెం, వల్లభాపురం, దావులూరు, కొల్లిపర, వెల్లలూరు, రేటూరు, కె.బి.పాలెం, చినలింగాయపాలెం, కారంపూడిపాడు, పుసులూరు, జొన్నలగడ్డ, వేములూరిపాడు, మేడికొండూరు, శిరిపురం, ఈమని, పెదరావూరు, తాళ్లపాలెం, ఉప్పరపాలెం, కసుక్రు, నండూరు, సుద్దపల్లి, పెదకాకాని, అనంతవరప్పాడులలో మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్‌లు నిర్మిస్తున్నారు. ఇందులో గుండ్లపాడు, పెదపాలెం, కాజ, కొలకలూరు, బుర్రిపాలెం, దావులూరు, కొల్లిపర, ఈమని, ఉప్పరపాలెం, పెదకాకాని, అనంతవరప్పాడులలో నిర్మించే గోడౌన్‌ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. వల్లభాపురం, వెల్లలూరు, పుసులూరు, శిరిపురం, తాళ్లపాలెం, కసుమర్రు, సుద్దపల్లిలలో నిర్మించే గోడౌన్ల పనులు బేస్‌మట్టం దశలో ఉన్నాయి. జొన్నలగడ్డ, వేములూరిపాడు, మేడికొండూరులలో నిర్మించే గోడౌన్ల పనులు ప్లాస్టింగ్ దశలో ఉన్నాయి. మిగతా గోడౌన్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మార్చి మాసం చివరికంతా పనులను పూర్తిచేసే దిశగా పనులు జరుగుతున్నాయి.

వ్యాధి నిర్ధారణ ఇక సులభతరం

రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజారోగ్యానికి తొలి ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా నాడు – నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునీకరించడంతో పాటు అవసరమైన సిబ్బందిని నియమించింది. అదే సమయంలో ఆస్పత్రులకు కావాల్సిన పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. దీంతో రోగులకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందుతున్నాయి.



- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎఫ్ఎన్ఏసీ, పాప్స్మీర్ సేవలు
- కేన్సర్, క్షయ, ఇన్‌ఫెక్షన్ నిర్ధారణ
- వైద్య కళాశాల మంజూరుతో అందుబాటులోకి సేవలు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మరిన్ని సేవలు రోగులు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రోగులకు ఆర్థిక పరంగా లాభం చేకూరడమే కాకుండా వేగవంతంగా సేవలు అందుతున్నాయి. కేన్సర్, క్షయ, శరీరంలో ఏదైనా ఇన్‌ఫెక్షన్ సోకితే దానికి సంబంధించిన నిర్ధారణ పరీక్షలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. గతంలో ఈ తరహా వ్యాధి నిర్ధారణకు రోగులు ప్రైవేటు లేబొరేటరీలను ఆశ్రయించేవారు. దీనికి రూ.500 నుంచి 800 వరకు ఖర్చు చేసేవారు. ఇప్పుడు వ్యాధి నిర్ధారణ సేవలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పూర్తిగా ఉచితంగా అందుతున్నాయి. ఇందుకు అవసరమైన పరికరాలు, సిబ్బందిని ప్రభుత్వం నియమించింది.

ఎఫ్ఎన్ఏసీ, పాప్స్మీర్ సేవలు

ఎఫ్ఎన్ఏసీ (ఫైన నీడిల్ యాస్పరేషన్ సైటాలజీ), పాప్స్మీర్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. శరీరంలో ఉండే వివిధ రకాల కేన్సర్ నిర్ధారణకు ఎఫ్ఎన్ఏసీ పరీక్ష చేస్తారు. క్షయ వ్యాధి నిర్ధారణకు, వివిధ రకాల ఇన్‌ఫెక్షన్స్ నిర్ధారణను ఎఫ్ఎన్ఏసీ పరీక్ష ద్వారా నిర్ధారణ చేస్తారు. తల నుంచి గోటి వరకు వచ్చే కేన్సర్‌లను ఎఫ్ఎన్ఏసీ ద్వారా నిర్ధారించవచ్చు. బయటకు కనబడే వాటిని ఎఫ్ఎన్ఏసీ ద్వారా నిర్ధారిస్తారు. బయటకు కనబడని కేన్సర్లను స్కానింగ్ ద్వారా నిర్ధారించవచ్చు. గర్భాశయంలో ఉన్న ఇన్‌ఫెక్షన్స్, కేన్సర్ నిర్ధారణ కోసం పాప్స్మీర్ పరీక్ష చేస్తారు.

అందుబాటులోకి అన్ని రకాల వైద్య సేవలు

జిల్లా ఆస్పత్రిగా ఉన్నప్పుడు కొన్ని రకాల వైద్య సేవలు మాత్రమే రోగులకు అందేవి. జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరు కావడంతో జిల్లా ఆస్పత్రి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మారింది. దీంతో అవసరం మేరకు వైద్యులు, సిబ్బంది వచ్చారు. సౌకర్యాలుకూడా గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా వైద్య పరీక్షలు పెరిగాయి. ల్యాబ్ టెక్నీషియన్స్ పెరిగారు. ఆధునాతన ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి వచ్చింది. ఆధునాతన ఐసీయూ, ఫీమేల్ మెడికల్ వార్డు, ఉపన్యాస గ్యాలరీ, సెంట్రల్ ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్లను అందుబాటులోకి తెచ్చారు. కంప్లీట్ బ్లడ్ పిక్చర్, సీరమ్ క్రియేటిన్ వంటి వైద్య పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. తాజాగా పాప్స్మీర్, ఎఫ్ఎన్ఏసీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రోగులకు ఉచితంగా వ్యాధి నిర్ధారణ సేవలు అందనున్నాయి. రోగులు ప్రైవేటు లేబొరేటరీలకు వెళ్లాల్సిన పరిస్థితి తప్పింది.

రోగులకు ఉపయోగకరం

ఎఫ్ఎన్ఏసీ, పాప్స్మీర్ సేవలు సర్వజన ఆస్పత్రిలో అందుబాటులోకి రావడంతో పేద, మధ్య తరగతి రోగులకు ఉచితంగా సేవలు అందుతున్నాయి. కేన్సర్ నిర్ధారణ కూడ ఇక్కడే నిర్ధారించనున్నాం.

– డాక్టర్ కె.సునీల్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943